# వ్యాసములు - 4

## స్వామి ఓంకార్


**శ్రీ శాంతి ఆశ్రమం**

శాంతి ఆశ్రమం పోస్ట్
(వయా) శంఖవరం - 533 446
తూర్పుగోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్
(మొ) 7382009962

ewmail : srisanthiashram@gmail.com
www.srisantiashram.org.in

# విషయసూచిక


1. యాత్రలు 2
2. యాచన 4
3. రాబోయెడి జన్మదినము 10
4. రామనామము 17
5. రాతిగోడలో పువ్వుల మొక్క 20
6. రెండు మహోన్నత ఘడియలు 24
7. రాధ నిద్ర 25
8. వర్షము 27
9. వేలంగి భక్తుడు 30
10. విశ్వపూజ 34
11. వాక్శుద్ధి 37
12. వచ్చియుంటివి యోయి! నా స్వామి నీవు 39
13. విమర్శ 41
14. విశ్వశాంతిమాల 46
15. శ్రీసాయి భక్తులు 48
16. శ్రీ శాంతి బాలికా గురుకులము 56
17. శ్రీకృష్ణ దర్శనము 65
18. శాంతి సహితమగు సహనశక్తి 70
19. శాంతి 72
20. శాంతి ప్రార్థన 76
21. శ్వేతగిరి పిలుపు 79
22. శాంతి పాఠకులకు శ్రీ స్వామీజీ ప్రార్థన 90
23. శాంతి కేంద్రము 95
24. శివుని ఆజ్ఞ 96
25. శ్రీ వి.వి.గిరిగారికి స్వామీజీ స్వాగతము 103
26. శ్రీ వివేకానందుని వేదాంతము 105
27. శ్రమ 108
28. శాశ్వతమైన సవాలు 110
29. శాంతి పూదోట 112
30. శాంతి పాఠకులకు ప్రేమలేఖ 114
31. శాంతి ప్రార్థన 117
32. శాంతి ప్రార్థన-ప్రపంచ శాంతి 120
33. శివుడు-శివోహం 128
34. శాంతి పాఠకులకు శాంతి సందేశము 131
35. శ్రీశైల యాత్ర 132
36. సమాధిలో పలుకబడిన ఉపదేశ వాక్యములు 139
37. స్వభావము 155
38. సుందర దృశ్యము 157
39. భౌద్ధమత సందేశం 160
40. సంచార వైద్యసేవా దళము 168
41. స్వకీయము 163
42. సంకల్పమే బంధము 170
43. సోదరి సుశీలాదేవి ధనరాశులు 173
44. స్వభావము 176
45. స్థలాంతర మార్పులు 181
46. స్వార్థపరులు 187
47. స్వర్ణోత్సవ సందేశము 189
48. స్వర్ణోత్సవ కృత నిశ్చయము 192
49. సహజ సమాధి 194
50. స్వప్న భ్రాంతులు 198
51. సాధనలు-మంత్రములు 201
52. సిరాబుడ్డిలో సిరా పోయుట 204
53. సూక్ష్మములో - మోక్షము 205
54. హింసాకాండ 207

# 1. యాత్రలు

ఒక భక్తురాలు, యీ సంవత్సరము, దక్షిణయాత్ర జేయుదునని వచ్చే సంవత్సరము వుత్తరయాత్ర ముగించెదనని, ఇంకను రాబోయెడి సంవత్సరము మిగిలియున్న యాత్రలు పూర్తి చేయుదునని తలచుచుందును. ఈ భక్తురాలేకాదు అనేకమంది భక్తులు ఇటులనే తలచు చుండుట మనము తరచు వినుచునేయుందుము. కొందరు భక్తులు, అన్ని యాత్రలు పూర్తి చేసితిమిగాని, నీలగిరియాత్ర మిగిలియున్నదని చింతించుచుందురు.

ఈ వందలాది భక్తులలో, వందలేగాదు వేలానవేల భక్తులలో అందరూ వ్యయప్రయా సలతో, జేయబడు బాహ్యయాత్రల గురించియే తాపత్రయపడుచున్నవారేగాని ఇందులో మచ్చునకు ఒక్కరైనను వైకుంఠ యాత్ర గురించి యేల ఆలోచించుటలేదని, నేనుతరచు విచారించుచుందును. మనము దక్షిణయాత్ర, ఉత్తరయాత్ర, నీలగిరి యాత్రలకు వెళ్ళిన వెళ్ళవచ్చును. సావకాశము లేనియెడల మానివేయవచ్చును. కాని యీ వైకుంఠయాత్ర యెవ్వరికిని తప్పదుగదా! ఇది సాధువులను సన్యాసులను, గృహస్థులను ప్రవృత్తిపరులను, నివృత్తిపరులను యెవ్వరిని విడువదు. ఎప్పటికో ఒకప్పటికి, మనమందరమును వైకుంఠం బునకు వెళ్ళనున్న వారమే!

బాహ్యయాత్రలకు బట్టలు, వెచ్చని దుస్తులు దారిలో వాడుటకు తినుబండారములు, పచ్చళ్ళు ముఖ్యముగ ధనము వగైరాలతో సిద్ధమగుచున్నవారు, ఈ వైకుంఠ యాత్రకుగూడ సిద్ధమగుట ముఖ్యముగదా.

బాహ్యయాత్రలలో జబ్బులు రాకుండ మంచి మంచి మందులు గూడ తీసుకొని వెళ్ళుచుందురు. అజీర్తికి, విరోచనములు కట్టుటకు జ్వరములు వగైరాలు తగ్గుటకు మందు లతో వెళ్ళుచున్నవారు గలరు.

కాశీ, రామేశ్వరయాత్రలకే ఇన్ని వ్యయప్రయాసలను భరించుచు అనేకమైన సామానులతో యేర్పాట్లు జేసుకొని వెళ్ళుచుండ ఇక తప్పనిసరియైన వైకుంఠయాత్రకు ఏఏ నియమములు, వస్తువులు కావలెనో, దైవపరితాపనతో నిండియున్న సాధకులు, దీపముండగనే ఆలోచించుకొనవలెను. యాత్రకు వెళ్ళేవారిలో వారి దురదృష్టవశమున కొందరు మరల తిరిగి రాజాలరు. యాత్రలోనే, తలవనితలంపుగా, వారు సిద్ధముగా నున్నను లేకున్నను అచ్చట నుండియే వైకుంఠమునకు వెళ్ళుచుందురు.

ఏ కాశీ గయలోనో వారు చనిపోయిన పుణ్యాత్ములని అట్టి వారి బంధువులు స్నేహితులు హర్షించెదరు.

ఒక భక్తురాలు విలువైన వస్తువులను గూడ తీసికొని యాత్రకు వెళ్ళెనని యు,

ఆమెను రైలులోనే ఆమె వస్తువులకై క్రూరులైన కొందరు యాత్రికులు హత్యజేసిరని యాత్ర నడుపుచున్న ఒక స్వామీజీ చెప్పగా చాల విచారించితిని. యాత్రికులలోగూడ ఇట్టి దుర్మార్గులుందురాయని విస్మయము జెందితిని.

యాత్రలు చేయవలదని నేను చెప్పుటలేదు. యాత్రలు జేయుచున్న భక్తులకు నిరుత్సాహము గల్గించుటకు కోరుటలేదు. కాని అసలు యాత్రను మరువవలదనియు దానికిగూడ సదా మనమందరమును మీరేగాక నేనుగూడ సిద్ధమైయుండవలెనని హెచ్చరించుచుంటిని.

శరీరములు క్షణభంగురములు. జీవితము తామరాకుమీద నీటిబొట్టు వంటిదని మహనీయులు జెప్పియుండిరి. మీకును నాకునుగూడ ఏరోజు ఆ దైవ పిలుపు వైకుంఠ యాత్రకు రమ్మనమని వచ్చునో ఇప్పుడెవ్వరు చెప్పగలరు?

పిలుపుమాత్రము తప్పదు. కాని, ఆ దైవపిలుపు రాకుండనే సిద్ధముగా నున్నవారు అదృష్టవంతులు. ఆ దైవయాత్రకు సిద్ధముగా నుండుటకు, పచ్చళ్ళు, మందులు, దుస్తులు, డబ్బు వగైరాలతో సిద్ధపడనవసరములేదు. వైకుంఠ యాత్రకు ముఖ్యముగా కావలసిన సాధక వస్తువులు యీ క్రింది యెనిమిది వస్తువులును, వీటినే అష్టాంగ యోగమందురు.

1. యమము 2. నియమము 3. ఆసనము 4. ప్రాణాయామము 5. ప్రత్యాహారము 6. ధారణ 7. ధ్యానము 8. సమాధి

ఏసుప్రభువు వద్దకు ఒక భక్తుడు వచ్చి తనకు వెంటనే మోక్షము నివ్వమని కోరగా, ఆయన యీ క్రింది రీతిగా జెప్పెనట. "నీకున్నదంతయు అమ్మివేసి బీదలకు పంచిపెట్టి రమ్ము." ఈ మాటలు విని, ఆ భక్తునకు చాల డబ్బుండుటచేతను ప్రవృత్తిపరుడై యున్నందునను వచ్చినదారినే పోయెనట.

## BE DEAD THAT YE MAY LIVE

**"నీకు జీవించవలెననియున్న చనిపోవుము."** అని పెద్దలు నుడివియుండిరి. ప్రవృత్తిగా, నామరూపములకు బానిసలై జీవించుట చాల సులభము, దైవపరితాపనతో నిండి నామరూప రహితమైన పరమాత్మను ధ్యానించుచు, వృత్తిరహితముగా జీవించుట దుర్లభము. తేలికయైనను కఠినమైనను అదియే మోక్షము. పూర్ణశాంతిని, జన్మరాహిత్యమును గల్గించును.

ప్రియమైన శాంతిపాఠకులారా! మీ పూర్వజన్మ సుకృతముచే దైవము మీకీ దుర్లభమైన మానవజన్మ నొసంగెనుగాన మీరెచ్చటకు వెళ్ళినను, ఏఏ యాత్రలలో పాల్గొనుచున్నను అసలు యాత్రను, మీ జన్మకాధారమైన, శాంతిని ముక్తిని నొసంగెడి, మీకు తప్పనిసరియైన వైకుంఠయాత్రను మాత్రము మరువవలదు.

ఈ వైకుంఠయాత్ర, పంచపాండవులకు కూడ తప్పలేదు. సత్యమూర్తియైన ధర్మరాజు యీ యాత్రలో తన్ను అనుసరించిన కుక్కనుగూడ, స్వర్గమునకు జేర్చెనని జెప్పబడియున్నది.

అటులనే దైవపరితాపనతో నిండి మనలను నమ్మి మనలననుసరించు భక్తవరేణ్యులందరను, మనముగూడ, స్వర్గమును జేర్చుచు, వారిని తరింపజేయుటకు తోడ్పడుచు తరించెదముగాక!

మానవసేవయే దైవసేవ, మానవుని ప్రేమించుటయే దైవమును ప్రేమించుట! ప్రేమయే దైవము. దైవమే ప్రేమ. కృపామయుండైన దైవము, అనన్య భక్తితో నిండి జీవయాత్ర జేయుచున్న తన బిడ్డలైన యాత్రికులనందరను శాంతితో బ్రోచుగాక!

సర్వేజనా స్సుఖినోభవన్తు

ఓం! ఓం! ఓం!

(శాంతి మే & జూన్ 1963)

## ౨. యాచన (BEGGING)

శ్రీగాంధీగారు యాచకులలోకెల్ల రాజని ప్రసిద్ధికెక్కెను. తమకొరకు తామెన్నడును యాచించలేదు–ఎల్లపుడును అన్యుల కొరకే యాచించిరి. పండిట్ మాలవ్యాజీకూడ ప్రసిద్ధికెక్కిన హిందూయూనివర్సిటీని యేర్పర్చిన, గొప్పబిచ్చగాడే. కవిసార్వభౌముడు రవీంద్రనాథ్ ఠాగూర్‌ను గురించి ఏమి చెప్పవలెను? ఆయన కూడ యాచించుటలో తమ జీవితము త్యాగము చేసెను. శాంతినికేతనం వారి జీవిత కార్యక్రమం అది సజీవముతో నుండుటకు శాశ్వతముగా నిలిచియుండుటకు ఆయన గొప్ప జీవిత త్యాగము చేసెను. మొట్ట మొదట న్యూయార్కు పట్టణములో, ఒక బ్రహ్మాండమైన సభలో రవీంద్రనాధ్ ఠాగోర్‌గారిని, వేలకొలది సభికుల సమక్షమందు నేను సందర్శించితిని తమ జీవిత కార్యక్రమమును తెలియజేయుచు తాము స్థాపించిన శాంతినికేతనం కొరకు యాచించుటలో నిమగ్నులై యుండిరి. ఒక దేశమునకుగాని లేక ప్రపంచ శాంతికిగాని ఏవిధముగానైనను ఉపకారం చేసిన గొప్ప ప్రముఖులు యాచకులే అయి యుండిరి. తాము నడిపించుచున్న కార్యక్రమ మును పోషించుటకు ఇతరులను యాచించుట తప్పలేదు.

ఈ మధ్య నాకు సంభవించిన ప్రమాదమైన జబ్బునుండి బ్రతికి బైటపడుట అది నిజంగా పునర్జన్మయే! ఆసుపత్రిలో నున్నపుడు–ఠాగూరుగారి తాలూకు ఒక భక్తుడు, నన్ను సందర్శించుటకు వచ్చి, నాతో సంభాషించుటలో, ఠాగూరుగారు స్థాపించిన శాంతి

నికేతనం యొక్క దివ్యమైన భావిస్థితి ఎటుల ఉండబోవునో అనెడి చింతతోనే-ఠాగూర్‌గారి అంత్యదినములు చాల విచారగ్రస్తమైనవని నాతో చెప్పెను. నేనుకూడ ఠాగూర్‌గారివలె, నేను స్థాపించిన శాంతి ఆశ్రమం యొక్క భావిస్థితిని గురించి, వారివలె తాపత్రయపడుచు చింతతో నా కడపటిదినములు గడుపకూడదని, ఈ విచారవార్త నేను వినినప్పటి నుండియు, స్వభావసిద్ధముగా నా మనస్సు తలపోయనారంభించెను. ఆశ్రమమును సృష్టించిన సర్వ జ్ఞుడైన దైవము, ఇంతవరకు దాని భారమును భరించుచున్నవాడే గనుక, ఆశ్రమముయొక్క పురోభివృద్ధిని గురించి, యికముందుగూడ, ఆయన మాత్రమే జాగ్రత్తగా కనిపెట్టి చూచు చుండును. దైవమే దానిని సంరక్షించుచుండును. మనసంబంధం ఎంతవరకనగా, వాని చేతిలోని పనిముట్లమైయుండి, ఇంతకుముందుకంటె ఇప్పుడు అధికముగా దైవమును పట్టుకుని వ్రేలాడుచుండవలెను. మనవంతు నిష్కామ కర్మ చేసికొనుచు పోవుటయే మనపని. నేను జబ్బుస్థితిలోనున్న దినములలో-పూర్తిగా స్మృహలేకుండ-సగం సగం జ్ఞప్తితో, కొంతకాలం, ఉన్నదినములలో, నన్ను కనిపెట్టుకుని సందర్శించుచుండే ఆశ్రమ మెంబర్లు, భక్తులు, నాతో చెప్పినదేమనగా నేను జబ్బుస్థితిలో నున్నప్పటికిని-ఎల్లప్పుడును దైవప్రార్ధన, ధ్యానాదులను గురించియే మాట్లాడువాడననియు, శూన్యమైన మాటలతో, అమూల్యమైన వారి కాలమును వృధాపుచ్చ వద్దనియు, సోమరి తలంపులు తలవవద్దనియు, దైవప్రార్ధన ధ్యానాదులు చేయుచుండుమనియు చెప్పి సందర్శకులను ప్రోత్సాహపరచేవాడనని, వారు నాతో చెప్పగా నేను వినుటకు చాలసంతోషించితిని. ఆశ్రమమును గురించిగాని, 250 మంది ఆశ్రమవాసుల విషయంలోగాని, గురుకుల బాలబాలికల విషయంలోగాని, ఆశ్రమ పనివాండ్ర విషయంలోగాని, నిత్యము ఆశ్రమమునకు వచ్చుచు పోవుచుండెడి, సందర్శకుల విషయంలోగాని మూగజంతువుల విషయంలోగాని నా హృదయమునకు ఎక్కువ ప్రియమైన ఆశ్రమంలోని వేలకొలది చెట్లు, చేమలు, మొక్కలు విషయంలోగాని నేను లేకపోయి నట్లయితే, వీటినన్నిటినీ, వీరందరినీ, ఎవరైనను కనిపెట్టెదరో, లేదో గదా అని ఏ విధమైన సంకోచం, అనుమానం, బెంగ, నేను పెట్టుకొనలేదు. ఆశ్రమం పేరు మీద, నేను ఎల్లప్పుడును జ్యోతిని-జీవమును-ప్రేమను శాంతిని సర్వులకు పంచిపెట్టువాడనేగాని, ఎన్నడును బిచ్చగాడను కాబోవను. నేను 13-19 సంవత్సరముల నడిమి వయస్సులో నున్నపుడు, ఒక మనోహరమైన, సూక్ష్మమైన పద్యం కంఠస్థం చేసితిని. దాని సారాంశము ఏమనగా "దైవమా, నేను జీవించియుండునంతకాలం-నిన్ను నేనెన్నడును మరువను. నిన్ను ఆరాధించుచునే యుందును. కాని, మరణకాలమాసన్నమైనపుడు-బాధలుపడుచు ఆవేదనలు పడుచు ఈ దేహమును నేను విడిచిపెట్టబోవు సమయమున-నేను నిన్ను మరతునేమో! అందుచే, నీ మధుర నామమును స్మరించుచు, జీవించుటకును-పనులు

చక్కబెట్టుట కును-ఇంతకు ముందుకంటె ఇప్పుడు అధికముగా స్మరించుటకు తీర్మానిం చుకున్నాను." ఈ సూక్ష్మమైన తీర్మానం-నేను ఆరోగ్యముగానున్నను-అనారోగ్యముగా నున్నను-అన్ని జీవితావస్థలలోను-నాకు శక్తిని-ఆనందమును ఇచ్చుచున్నది. దేశకాల నిమిత్తములకు అతీతముగాయుండి, ఒకే అభేద్యమైన, దైవం యొక్క సజీవ ప్రతిబింబము లైనట్టు దైవసంతతికి ఎల్లపుడు సేవచేయుచు నా హృదయము ఎల్లప్పుడు దైవంతో సంసర్గం కలిగియుండుటకు అభీష్టపడుచున్నది.

బ్రతికినన్నాళ్లు నీ భజనఁ చేసెదగాని
మరణకాలమున నిన్మరతునేమొ,
యావేళ యమదూత లాగ్రాహంబున వచ్చి
ప్రాణముల్ పెకలించి పట్టునపుడు
కఫ వాత పైత్యముల్ గప్ప గాబరచేతఁ
గంపఁ ముద్భవమొందఁ గష్టపడుచు
నా నోటితో నిన్ను నారాయణా! యంచుఁ
బిలుతునో? శ్రమచేతఁ బిలువలేనో?
నాఁటి కిప్పుడే భక్తి నీ నామ మహిమఁ
దలఁచెదను చెవి వినవయ్య ధైర్యముగను. భూ.

నిశ్చయంగా ఏకొద్దిపాటు దైవసంతతికి మనము సేవచేసినను, మనము దేవునికే సేవ చేయుచున్నాము. ఏలననగా దైవమేతప్ప ఉనికిలో ఇతరులెవ్వరునులేరు. అంతా రామ మయం ఈ జగమంతా రామమయం. ఇది అంతయు దైవమే ఈ ప్రపంచమంతయు దైవమే. అభేద్యమైన విడదీయుటకు వీలులేని ఒకే దైవమునకు ఘనత చెందునుగాక.

ఈ గొప్ప దేశోద్ధారకుల జీవితములలోని ఘనత ఎక్కడ ఉన్నదనగా ఇతరుల మంచికొరకే సత్కార్యములు చేయుటకొరకే, వారెల్లపుడను యాచించిరిగాని వారికొరకు కాదు.

ఒక మనోహరమైన ఆవేశము గొలుపు చారిత్ర మనకు తెలియజేయునది ఏమనగా ఒకప్పుడు, ఒకానొకచోట గొప్ప పండిత సభ జరిగినదనియు ఆ సభకు ఆహ్వానింపబడిన వారు ఋషులు, యోగిపుంగవులు, త్యాగమూర్తులు, అయి యుండిరనియు వారికిగల ఆస్థిపాస్తులన్నియు ఒక ఆశ్రమములోని ఒక కుటీరము మాత్రమే అనియు, వారు ధరించినది కౌపీనము లేక నడుముకు కట్టుకున్న వస్త్రమే అనియు, చెప్పబడెను. ఆ గొప్ప పండిత

సభలో, ఆ దేశపు జనకమహారాజు నిలవబడి ఈ విధంగా చెప్పిరి. ఓ! త్యాగమూర్తులారా! జ్ఞానమూర్తులుకూడ మీరే అయియున్నారు! ఇవిగో! ఇచ్చట వెయ్యి ఆవులు గలవు. వాటిని బంగారముతో అలంకరించిరి. వాటి వీపుమీద వజ్రములను అన్ని విధములైన మహదైశ్వర్యమును అవి మోయుచున్నవి. మీలో ఎవరైనను బ్రహ్మవేత్తలు కోరికలు లేనివారు ఈ భాగ్యవంతమైన బహుమతిని పొందుటకు హక్కుయున్న ఈ గోవుల నన్నిటిని మీ ఆశ్రమమునకు తోలించుకొనిపోవుమనియు మిమ్ములను ప్రార్థించుచున్నాను అని చెప్పిరి.

ఆ సాధువులందరును ఔదార్యమైన ఆ దానంయొక్క షరతులను విని దిగ్భ్రమ జెంది, చాల తొట్రుపాటుపడి, ముఖాముఖములు చూచుకొనిరి. వారిలో ఏ కోరికలులేని బ్రహ్మవేత్తలు వారే ముందునకు వచ్చి, పుచ్చుకొనుమంటున్నారు. ఒకనికి ఏ కోరికలు లేనపుడు ఇతరుల నుండి ఏ వస్తువును ఆశించదుగదా! అందుచే ఏ ఒక్కరునుగూడ ఆ విలువైన దానమును స్వీకరించుటకు ముందుకు రాలేదు.

ఆ వేలకు వేల మునులమధ్య నుండి యోగులలోకెల్ల రాజైన యాజ్ఞవల్క్యుడు లేచి, నిలబడి బంగారముతోను, వజ్రములతోను వున్న ఆ ఆవులనన్నిటిని ఇంకను అందున్న ఎక్కువ విలువైన ఐశ్వర్యమునంతను, తీసికొని వెళ్ళమని, తన శిష్యుల కాజ్ఞాపించెను. అప్పుడా సభలో గొప్ప గలాబా చెలరేగినది. సాధువులందరు ఆగ్రహపడి, ముందునకు విజృంభించిరి. వారిట్లనిరి "నీవు కోరికలు లేనివాడవే అయినట్లయిన బంగారమును వజ్రములను మోయుచున్న ఆ గోవులను ఎందుకు నీకిమ్మని కోరుచున్నావు?" అనిరి. ఆ యాజ్ఞవల్క్య మహనీయుడు గొప్ప త్యాగమూర్తి నిలబడి కొద్దిమాటలలో ఇట్లని జవాబు చెప్పెను ఈ దానము నాకు కాదండీ! ఆశ్రమోపయోగం కొరకు ఇతరులకు సేవచేయుటకు ఇదియే నా జీవితాశయము" అని చెప్పిరి.

ఆ విధముగా విశ్వాసపాత్రులైన ఆ శిష్యులు యాజ్ఞవల్క్య ఋషికి చెందిన, పవిత్రమైన, ఋష్యాశ్రమంవైపు ఆవులనన్నిటిని తోలుకొనిపోయిరి. ఆ భాగ్యవంతమైన దానం, బీదల సేవచేయుటకు రోగులకు వినియోగించిరి. తీవ్రమైన పట్టుదల కలిగినటు వంటి, నా ఆశ్రమ దైనందిన కార్యకలాపములయొక్క, సుదీర్ఘమైన నా జీవితంలో, తూర్పు పడమర దేశములలో సర్వత్ర యాచించుచున్నాను. కాబట్టి ఇంకను దూర దగ్గర ప్రాంతము లలో ప్రపంచమంతటను నా జీవితమంతయు ఇంటింటను తిరిగి యాచించే నన్ను సమర్థించుటలో ఈ ఆవేశము గొలుపు యాజ్ఞవల్క్యుని చక్కని ఉదాహరణ నా ఆనందమే నా సత్తువే నా ఓదార్పే అయియున్నది. సత్యపథమేయైనను సేవాతత్పరతయే యైనను ఎల్లపుడు మృదువుగాను మాధుర్యముగా ఉండబోదు. అందులోను ప్రత్యేకముగా అలసి

పోయినపుడు దాహం వేసినపుడు కొన్ని ప్రదేశములలో గౌరవంలేని ప్రదేశములలో తిరుగులాడుచున్నపుడు ఇతరులకు చేయు సేవ చెప్పుకొనేటంతటి సౌలభ్యంగానుండదు.

ఆసుపత్రిలోని పనులు చక్కగా నెరవేరుటకు గురుకుల నివాసం, పాఠశాల, వృద్ధుల గృహం, అచ్చుపనులు, సజీవముతో సాగిపోవుటకు తమ వంతుకు వచ్చిన ప్రతీపని, తమశక్తి సామర్థ్యములు ఉపయోగపరచి, చక్కబెట్టుట కొరకై ఆశ్రమ పోషణకు ప్రయాసపడిన దినములలో బాధచే అవస్థపడుచున్న దినములలో నమ్మెదరోలేదో ఒక చిన్న కొబ్బరికాయ ఇమ్మని అడిగితే కొందరు ఇయ్యలేదు. ఈ 56 సంవత్సముల నుండియు, అన్ని పరిశోధ నలలోను అన్ని పరీక్షలలోను దైవము మంచి జాగ్రత్త తీసికొనుచున్నాడు. ఎక్కువ అవసరము వచ్చినపుడు, ఆశ్రమమునకు కష్టములు ఆపదలు ఎదుర్కొన్నప్పుడు ప్రతి సంవత్సరం ఆశ్రమమునకు సహాయం చేయుచున్న పాతభక్తులకు, విశ్వాసపాత్రులకు, పాత, క్రొత్త భక్తులకు, నేను కృతజ్ఞతాభివందనములు అర్పించుచున్నాను. దైవ కటాక్షంచేత నేను అంతకంతకు నివృత్తిగా గడుపుచున్నాను కాబట్టి ఆశ్రమమునకు ఎంతగా ముఖ్యావసరం ఏర్పడినప్పటికి, ఎంత బాధపడుచున్నప్పటికి ఈ 250 మంది బాలబాలికలను, సభ్యులను పనివాండ్రను, మంచి స్థితిలో నుంచుటకు నేను నోరుతెరచి, ఎవరిని యాచించుటకైనను, ఏమి ఇమ్మని అడుగుటకైనను అయిష్టత గలుగుచున్నది. గొప్ప ఆశ్చర్యం! అద్భుతం! లేదా దేవుని ఆశీర్వాదమే అనుకొనుడు. వందమంది బాలబాలికలకు, వంద మూగ జంతువులకు, సందర్శకులకు, మిత్రులకు మరుసటి దినము భోజనం ఎచ్చట నుండి వారికి వచ్చుచున్నదో తెలిసికోనక్కర లేకుండా మానవులనేకాదు, పుష్పములు పూసే మొక్కలు, పండ్లుపండే వృక్షములు అవి వాటి పోషణకు మనపై ఆధారపడియున్నపుడు, వీటినన్నిటిని దైవమే కాకపోయిన మరెవ్వరు జాగ్రత్తగా పోషించి కాపాడుచున్నారు? ఆలోచించుడు. ఆ దినములలో యాచన చేయవలదు అనెడి ప్రేరేపణ నాలో చాల తీవ్రముగా నున్నది. యాచించుటకు అనువైన యాచనలన్నియు ఇదివరకే చేసివేసితి నన్న భావంతో ఆశ్రమం పేరుమీదనైనను, ఇకముందు యాచించవలదని, నిశ్చయించుకున్నాను. నేను ప్రతిదినము భక్తులకు వ్రాసే వుత్తరములలో "మా వినయపూర్వకమైన ప్రార్ధన" అని వ్రాయబడిన కాపీలు కొన్ని నావద్ద వుంచుకున్నాను. నేను ఇతరులను నిర్భంధించి అడిగి, ఎవరి మన స్సును బాధపెట్టుటకు అంగీకరించను. ఇంతటినుండి బిక్షగానినగుటకు ఇష్టపడను. కాని నా ప్రాణము, నా రక్తము, నా ఎముకలు ఇతరుల శ్రేయస్సుకు ధారపోయుటకే కోరుచున్నవి. నా కాలి ఎముకలోని, ఒక చిన్న తునకను తీసి బాధపడుచున్న ఒకానొక బాలిక కాలిలో అతికించుకొనుటకు నేను దానం ఇచ్చినందుకు నేను పొందిన ఆనందము నా జీవితంలో నాకు సౌఖ్యవంతమైన క్షణములలో అది యెకటియై యున్నది.

ప్రియమైన దైవమా! ఈ జన్మలో కాకపోయినను మరుజన్మలోనైనను, నేను ముక్తిని పొందగలిగినచో పొందవచ్చును కాని ఈ జన్మలో ఏవిధమైన ముష్టినైనను నేను ఎత్త కుండునట్లు నన్ను ఆశీర్వదించుము.

నాకున్నదంతయు తూర్పుపడమర దేశములలో యావన్మంది దైవసంతతికిని, నన్ను పంచిపెట్టనిమ్ము! బాధపడెడివారికిని జబ్బు స్థితిలోనున్న జనులందరకును ఉపశమనము, ఆరోగ్యము కలుగజేయుటకొరకై నా కడపటి ప్రస్తుత భ్రమ రోగములను మాన్పెడి ఆధ్యాత్మిక ప్రార్థనా కేంద్రము నొకదానిని స్థాపింపవలెనని ఉన్నది. SPRITITUAL HEALING CENTRE రోగిగాని, బీదవాడుగాని స్వయముగా వచ్చిగాని, ఉత్తరం ద్వారా గాని, టెలిగ్రాంద్వారాగాని, ఫోను పిలుపువల్లగాని మమ్ములను పిలువవచ్చును. భక్తులైన ఆశ్రమ సభ్యులు, పనివాండ్రు, వారి ఆరోగ్యం చక్కబడుటకొర్కైనను వారికి జయం కలుగుట కైనను దైవప్రార్థనలు చేయుటకు సంతోషంతో సమ్మతించెదరు. పిమ్మట శాంతి అనెడి లోకశాంతి ప్రార్థనను కంఠస్థం చేసి నిత్యం పఠించుమని ఆ రోగులను, ఆ బీదవారిని కోరెదరు. వ్యక్తిగత శాంతియే లోకశాంతికి తోడ్పడును కాబట్టి మీ ప్రార్థనల కొరకు మీ దయకొరకు మాత్రమే కాకుండ నూతన జీవముతో, జ్యోతితో, ప్రేమతో మీ దేహములను నిండింప జేసికొనుమనియు, వాటిని మీ బంధుమిత్రులకు వ్యాపింప జేయుమనియు, ప్రతీ మతములోని భక్తులకు, ప్రతీ దేశములోని జనులకు వ్యాపింపజేయుమనియు, మిమ్ములను ప్రార్థించుచున్నాము.

మానవుని–పక్షిని–పశువును కూడ బాగుగా ప్రేమించువాడే దైవప్రార్థనలు చక్కగా చేయగలడు. చిన్నలను, పెద్దలను సరిసమానముగా బాగుగా ప్రేమించువాడే, దైవప్రార్థనలు చక్కగా చేయగలడు. ఏలననగా, ప్రియమైన దైవము, మనలను ప్రేమించువాడు, అందరినీ సృష్టించి, అందరినీ సరిసమానంగా ప్రేమించుచుండెను.

హరిః ఓమ్ తత్ సత్ ఓమ్ లోకాస్సమస్తా స్సుఖినో భవంతు

ఓం ఓం ఓం

## : సమర్పణ :

**ప్రియమైన భక్తులందరకు సోదరి సుశేన, కుమారి జ్ఞానేశ్వరి మొదలైనవారికి అర్పణ. వీరు ఇతరులకు ఇచ్చువారే, స్వార్థమును మరచి, దాన ధర్మములు సేయువారే, భక్తులైన, త్యాగమూర్తులకు వారి ఆరోగ్యము కొరకు పరమ శాంతి కొఱకు చిరకాలము జీవించి సేవ చేయుటకును, ప్రార్థనలు సలుపుచు సమర్పించబడెను.**

– ఓం –

(శాంతి ఆగస్టు 1972)

# 3. రాబోయెడి జన్మదినము

ఏరోజున కారోజే జన్మదినమై యుండ, ఇంకెప్పుడో, ఆరు నెలలకు రాబోయెడి జన్మ దినమును గురించి ఇప్పటి నుండియు నాలోచింపనేల? గడచిన జన్మదినములలో జరిగిన కొన్ని సంఘటనలు ప్రస్తుతపు టాశ్రమపు రోజులకు అవస్థలకు కారణమై యున్నవి కాన, ముందు జాగ్రత్తకయి 1958లో రానున్న జన్మదినమును గురించి, ఇప్పటి నుండియు తలవని తలంపుగా ఆలోచనలు వచ్చుచున్నవి.

షష్ఠిపూర్తి మహావైభవముగా, దేవుని పెండ్లివలె పది రోజులు జరిగెను. లక్షమంది పైగా, ప్రేక్షకులు, ఇతరులు, భక్తులు వచ్చిరి. ఇక క్రిందటి జన్మదినము మూడు రోజులు మాత్రమే సామాన్యమైన పెండ్లివలె జరిగెను. దీనికి గూడ పదివేలమంది జనము వరకు వచ్చిరి. కాని యీ జన్మదినమునకు ఆశ్రమ భక్తులు చాలమంది వారివారి శక్తికొలది, చేయ వలసిన సహాయములు చేయనందున అప్పుడు చాల చిక్కులు పడవలసి వచ్చుటయేగాక, ఇప్పుడు ఆశ్రమములో నున్న యేబదిమంది బాలబాలికలకు, సోదరీ సోదరులకు నిత్యము వాడుటకు, బియ్యపు గింజలయినను లేకుండుటచే కష్టపడవలసిన రోజులే మిగిలి యున్నవి.

కొందరు భక్తులు, భక్తి శ్రద్ధలతో, ఆశ్రమమునకు వచ్చియు మూడు రోజుల కార్యక్రమములో కుటుంబ సహితముగా పాల్గొనియు జన్మదినమునకు విరాళము లిచ్చి తోడ్పడుటకు బదులు వారు లోగడ వాగ్దానము చేసిన, వార్షిక విరాళములనే, జన్మదినము నకు ముడిపెట్టి, ఆశ్రమవాసుల కండ్లను తుడిచిరి. కొందరు పాత భక్తులు మాసవిరాళము లను, వార్షికపు చందాలను, వారు ప్రేమతో యిచ్చెడి ధాన్యముతో సంవత్సరమంతయు ఆశ్రమవాసులకు, నిత్యము వచ్చుచుండెడి బీదసాదల సేవలో వినియోగించుటకు నేర్పరు పబడి యున్న వానితో, జన్మదినపు ఖర్చులలో వినియోగించిన, ఇక సంవత్సరమంతయు ఆశ్రమ పోషణజేయుట యెటుల జరుగునో యూహించలేకపోయిరి. సంవత్సర వార్షికములే గాక, ఒక అమెరికా సోదరి ప్రతి మాసము పంపెడి 125 రూపాయలను కూడా ఆశ్రమము నందలి అవస్థలచే జన్మదినము పేరున ఆమెను కోరగా, సాలు చందానంతయు 1500 రూపాయలు ప్రేమతో పంపినది. ఆ డబ్బు అంతయుగూడ జన్మదినోత్సవము పేరున పందిళ్లు పాకలు ఉపయోగార్థము వేయించుటలోను, బీదలకు సంతర్పణ జేయుటలోను, వినియోగింపబడినది. ఇంత డబ్బు వాడినను, జమాఖర్చులు చూడగా, అప్పులే మిగిలియుం డెను. సంవత్సరము పొడుగునను వాడవలసిన ధాన్యము చాల భాగము పూర్తి అయ్యెను. ఇప్పుడు ఆశ్రమములోని బియ్యము అయిపోయెనన్న విషాదకరమైన వార్తను వినవలసి వచ్చెను. ఈ వార్తను వినినప్పటి నుండియు రాబోయెడి జన్మ దినము పేరున, గడచిన జన్మదినములో జేసిన తప్పులు చేయరాదనెడి సంకల్పమే యీ వ్యాసమునకు మూల కారణ మయ్యెను.

గృహస్థ భక్తులు, ధనికులైనవారు ఆశ్రమవృద్ధికి, బీదసాదలను పోషించుటకు, రోగుల సేవ జేయుటకు, తోడ్పడనియెడల ఆశ్రమము యెటుల వృద్ధి యగును. మహాభక్తులు, త్యాగశీలురు లోకములో లేకపోలేదు. కొందరు కండ్లుండియు చూడజాలరు. కొందరు పేరు ప్రతిష్ఠలకు, వారి నామధేయములు పేపరులో పడుననియు అందరు చదివి ఆనందించె దరనియు, దాన, ధర్మములు చేయుదురు. కొందరు బలవంతముచే తప్పనిసరిగా, ఇతరు లేమనుకొందురో అని చందా లిచ్చెదరు. పరమపావనమైన హిందూ జనని గర్భమున దాన కర్ణులు గూడ జన్మించియుండుట ఆశ్రమముల యొక్క, దేశముయొక్క అదృష్టమనియు చెప్పవలెను.

మొన్న జన్మ దినమునకే, చిన్న చిన్న విరాళము లిచ్చిన కొందరు, వారి పేరు సభలోనేల చదువలేదని ప్రశ్నించిరి. మరికొందరు గుప్తదాతలు, వారి పేరు చదువవద్దు అని కోరిరి. కుడిచెయ్యి జేసిన దానము, ఎడమ చేతికి తెలియనీయకుండ ధర్మము జేయుచున్నవారే నిజమైన భక్తులు గదా! ఒక మహనీయుడు చాల దూరప్రదేశమునుండి కుటుంబ సహితముగా వచ్చి ఆశ్రమ పరిస్థితులు, అవస్థలు గ్రహించి, తానిదివరలో సంవత్సరమునకు 60 రూపాయ లిచ్చుచున్న విరాళమును 120 రుపాయలుగా జేసెను. తాను ఆశ్రమములో జన్మదిన కార్యక్రమములలో పాల్గొన్నందుకు ప్రత్యేకముగా 100 రూపాయలిచ్చెను. ప్రార్థన, ధ్యానాదులు జేసికొనుటకు కొండవార భవన నిర్మాణమునకై మరియొక 100 రూ॥లు విరాళము నిచ్చెను. ఇట్టి మహనీయులేగదా వారికి దైవమిచ్చిన ధనమును దైవపు బిడ్డల సేవలో సద్వినియోగము జేయుచుందురు. మరికొందరు 5, 10 నెల చందాలిచ్చెడివారు, బస్తా, రెండు, మూడు, నాలుగు బస్తాల ధాన్యము వార్షికములు ప్రతి సంవత్సరం యిచ్చి ఆశ్రమమును పోషించుచున్నవారు, వారి సంవత్సరపు చందాలనే జన్మదినము విరాళములుగా మీటింగులో చదివించి, తృప్తిని చెందిరి. కొందరు జన్మదినము పేరున వాగ్దానము చేసినవి జన్మదినము కాగానే, ఆశ్రమమును, వారి వాగ్దానములను గూడ పూర్తిగా మరచిపోయిరి.

తెలిసియో, తెలియకో తొందరపడి, జన్మదినోత్సాహముచే జేసిన వాగ్దానములను తగ్గించుమనియు, సగముగానైన చేయుమనియు కొందరు కోరి యుండిరి. మరికొందరుత్సా హముతో నెల చందాలు వేసి పూర్తిగా మరచిపోయిరి. కొందరు వాగ్దానము చేసియు, షష్ఠిపూర్తి కిచ్చితిమిగాని, జన్మదినమున కిచ్చెదమంటిమా? యనిరి. కొందరు “ఇది బాకీయా” అని నిర్మొహమాటముగా వారిచ్చెదనన్న చందాలకు త్రిప్పి, త్రిప్పి చివరకు లేదనిరి.

ఇప్పుడు ముఖ్యముగా ఆశ్రమములో వృద్ధి యగుచున్న ఇరువది మంది బీద బాలబాలికల ముఖములు జూచిన నాకు చింతగా నుండును. అయినను, నారు పోసినవాడు నీరుపోయడా? ఏ దైవము ఆశ్రమ స్థాపన జేయించెనో, ఏ దైవము ఈ నలుబది

సంవత్సరముల నుండియు అహర్నిశము, ఆశ్రమవాసులను కంటికి రెప్పవలె కాపాడు చుండెనో ఆ దైవమే యిప్పుడును, ఇకముందును గూడ తోడ్పడునని నా దృఢమైన నమ్మకము. ఒక గ్రామములో చందాలు వేసిన వారందరును మొన్న జన్మదినమునకు వారి ధాన్యము నీయనందున, ఆ రోజు బీదల సమారాధనమాగిపోయెడి అవస్థ రాగా, ఒక మహా భక్తుడు ఆ గ్రామములో పాతర వేసిన వారి ధాన్యమునంతయును తానే యిచ్చి వాటిని మిల్లులో ఆడించి ఆ బియ్యమును తన బండిమీద వేసికొని తెచ్చి ఆ రోజు బీదల సమారాధనను, నిర్విఘ్నముగా జరిపించెను. దైవమెంత కృపామయుడు? మన శక్తిని, సహనమును, పరీక్షించుటకు అనేకమైన కఠినమైన సమస్యలను, గడ్డు పరీక్షల నిచ్చుచుండెను. చివరకు తానే యేదో ఒక హస్తము ద్వారా తోడ్పడుచుండును.

సంచార వైద్య సేవా దళముద్వారా గ్రామ గ్రామములకు వెళ్ళి అచ్చట జీర్ణించిన రోగముల బాధతో అవస్థలు పడుచున్న బీదరోగులను ఆశ్రమమునకు తీసికొని వచ్చి, ఆశ్రమములోనే వారికి చికిత్స జేసి అన్ని విధముల రోగవిముక్తి గల్పించి వారిని పంపుటకు సంకల్పించి, 12 మంచములతో (Indoor Hospital) ఒక ఆసుపత్రిని, 12 మంది రోగులుండుటకును, ప్రసూతి శిశు ధర్మ వైద్యాలయమును కట్టించుటకు, సంకల్పించి చాలమంది ఆశ్రమ భక్తులను, ధనికులైన వారిని పాతవారిని, కొత్తవారిని గూడ సహాయపడ గోరియుంటిమి. తాము ప్రేమించెడి కీర్తిశేషులయిన వారి పిల్లల పేరుననో, భర్తల పేరుననో, తల్లితండ్రుల పేరుననో, ఒక్క మంచమైనను, తమ నామము ఆచంద్రార్కముగా నుండుట కేర్పరచుడని ఎన్నో యుత్తరములు వ్రాసి, యెంత ప్రార్థించినను, మన హిందూదేశములో మాత్రము ఇంతవరకు ఫలితము గలుగలేదని వ్రాయుటకు చాల చింతగా నున్నది.

కీర్తిశేషులయిన మన సన్నిహితులయందు మనకున్న ప్రేమను, నిరుపేదల, రోగుల సేవలో వారి పేరున వారికి శాంతిని కోరుచు స్థిరమైన, శాశ్వతమైన పనులు చేయవలెను. కాని నిరంతరము చనిపోయిన వారిని తలచుకొని కాలవల కొలది నీటిని కార్చినను, మనకుగాని, గతించిన వారికి గాని లాభముండదుగదా! దుఃఖించుటకు కన్నీటిని మనము కొని తేవలసిన అవసరములేదు. కన్నుల నీరు కార్చుట సులభము; కాని దానధర్మముల జేయుట కష్టము. కష్టార్జితమును దైవము పేరుననైన వాడుటకు చేతులు రావు. కాని ఏ పెండ్లికో, పేరంటమునకో యైన పేరునకు, ప్రతిష్ఠకు, వేలకు వేలు, ధనికులయిన లక్షలుకూడ నీటిని వాడినట్లు ధనమును ధారాళముగా ఖర్చు పెట్టెదరు. కక్షలు, దావాలు పేరునను, దీర్ఘ వ్యాధులు, జబ్బులు పేరునను వేలకువేలెట్లు ఖర్చు అగుచున్నవో, కోర్టులను ఆసుపత్రులను, జూచిన వారికి విశదమే. మన శాస్త్రములు గూడ నాలుగవవంతు నైన ధర్మము చేయుడని చెప్పుచున్నవి. పాశ్చాత్యులు పదవ వంతు దాన ధర్మములకు ప్రత్యేకింతుమని చెప్పుదురు. కాని ఆచరణలో కొంతమంది నూటికొక్క పాలయినను బీదలగు రోగుల సేవలో వాడజాలకుండుట చాల విషాదకరము. “పరోపకారార్థ మిదం శరీరం” ఈ

శరీరములు ఇతరుల సేవకొరకే యివ్వబడినవని చెప్పుట చాల సులభము. ఆచరణలో ఈ శరీరములు తమ శ్రేయస్సుకొరకే, తన తిండి, తన బట్టలు, ఆభరణములు, వీనికే కేవలము ఈయబడినట్లు వారి ధనమును, జీవితమును, దుర్వినియోగము జేయుచుండుట పెక్కుమంది జీవితములలో ప్రత్యక్షముగా మనము జూచుచునే యుంటిమి. ఈ సందర్భములో నరసింహ శతకములో వ్రాయబడిన చక్కనైన ఈ క్రింది పద్యము నాకు జ్ఞప్తికి వచ్చుచున్నది.

సీ॥ తల్లి గర్భము నుండి । ధనము తే డెవ్వడు
వెళ్ళిపోయెడి నాడు । వెంట గొనఁడు ।
లక్షాధికారైన । లవణ మన్నమె గాని
మెఱుగు బంగారంబు । మ్రింగబోడు
విత్త మార్జనజేసి । విఱ్ఱ వీగుటె గాని
కూడ బెట్టిన సొమ్ము । కుడువబోడు
పొందుగా మఱుగైన । భూమిలోపల బెట్టి
దాన ధర్మము లేక । దాచి, దాచి

తే॥ తుదకు దొంగల కిత్తురో । దొరల కవునో
తేనె జుంటీగ లియ్యవా । తెఱవరులకు ?
భూషణవికాశ । శ్రీధర్మ । పురనివాస ।
దుష్ట సంహార । నరసింహ । దురితదూర ।

ప్రియమైన ఆశ్రమ భక్తులారా! ఆత్మ సోదరీ, సోదర స్వరూపములారా! నేనీ వ్యాస మును నా భావనలను, మీలో నెవ్వరికి శ్రమ గలిగించుటకు వ్రాయుట లేదు. ఆశ్రమము యొక్క ప్రస్తుతపు అవస్థలను జూచియు, ఇకముందు చేయబోయెడి సంచార వైద్య సేవాదళముయొక్క సేవను తలచియు, మీ ప్రేమను సానుభూతిని కోరియు వ్రాయుచుంటిని. “సోషల్ వెల్‌ఫేరు బోర్డు” వారు 15,000 రూపాయలు ఒక కారుతో వైద్యసేవ గ్రామగ్రామ ములకు వెళ్ళి రోగులను ఆశ్రమమునకు తీసికొనివచ్చి చికిత్స జేయుటకయి యొసంగిరి. ఆ ధనముతో "Van" కొనుటయైనది. అది ఆశ్రమమునకు వచ్చియున్నది. దానికి బాడీ, వెంటనే రోగులకు స్ట్రెచరు వగైరాలతో కట్టించవలసియున్నది. దాని బాడీ కట్టుటకయి 5,500 రూపాయలకు, ఆశ్రమమునకు దైవపు పనికి రోగుల సేవజేయుటకుగాన, తగ్గించి ఎస్టిమేటు వేసితిమని ఆశ్రమ మిత్రులు కొందరు వ్రాసిరి. డాక్టరు, కాంపౌండరు, నర్సు, డ్రైవరు, క్లీనరు, రోగుల సేవ జేయువారిని పోషించుటకు ముఖ్యముగా మందులకు ఆశ్ర మాభిమానుల సానుభూతి ముఖ్యావసరము.

హిందూదేశములో, ఆసుపత్రి గదులకు, బెడ్లకు వాగ్దానము చేసిన వారుగూడ, ముందుకు రాజాలకున్నను, ఆమెరికాలో ఒక సోదరికి వ్రాయగా, ఆమె ఒక మంచమునకై 1500 రూ॥లు పంపి యుండెను. చైనాలో నున్న ఆశ్రమాభిమానురాలైన యొక జననికి ఒక బెడ్డు నైనను స్వర్గస్తురాలైన మీ కుమార్తె పేరున నేర్పరచిన నాకు ఆనందముగా నుండునని, నేను సూచనగా వ్రాయగా, ఒక బెడ్డుగాదు, రెండు బెడ్లు మంచములు కీర్తిశేషులైన ఆమెయిద్దరి కుమార్తెల పేరున నేర్పరుచుమని 3000 రూ॥లు పంపి యుండెను. ధనికురాలయిన ఒక్క భక్తురాలి సహాయమును ఆసుపత్రిలో ఆమె ప్రేమించిన తల్లి తండ్రుల పేరున ఒక్క మంచము, రోగుల కేర్పరుచుమని కోరినను, ఆమె ధనమునంతను, చెవులకు, ముక్కులకు, క్రొత్త క్రొత్త రకముల వస్తువులు, వజ్రములతో జేయించుకొని ఆనందించు చుండెనే కాని నా యభ్యర్ధనను నాదరించలేదు.

కొందరు మనుజుల జూచినదంతయు కావలెనని కోరుచుందురు. అవి లభ్యము కాని యెడల బాధపడుచుందురు. ముఖ్యముగా కొందరు స్త్రీలు ఏ క్రొత్త చీరలు జూచినను ఏక్రొత్త వస్తువులు జూచినను వానిని కొనెడివరకు తమ భర్తలను వేధించుచుందురు. కొందరు స్త్రీలకెన్ని దుస్తులు వస్తువులుండుననగా వాని నన్నింటిని బజారులో నుంచిన అవి చిన్న చిన్న దుకాణములవలె నుండునని యెవ్వరో అనుకొనుచుండ వినియుంటిని.

ఇంతకు నేను వ్రాయునది యెద్ది అనగా మనకు దైవమిచ్చిన దానితో తృప్తి బొందుచు మనకంటె దురదృష్టులయిన, బీదసాదల లోటుపాటులను జూచుచు మన శక్తికొలదితోడ్పడు చుండవలెను. ఇంతకు మనము తెలిసియో తెలియకో, నిర్బంధము చేతనో, ప్రేమ చేతనో, నిరుపేదల సేవలో, ఏ దిక్కు ఏదక్షతయు లేనివారికి సహాయము జేయుటలో వాడినధనమే, వస్తువులే మన కెప్పటికయినను, మన ముందుగతికి మన జన్మరాహిత్య మునకు తోడ్పడును.

ఒకామె, ఆమె జీవితములో నెన్నడును దాన ధర్మములు చేసి యెరుంగదట, ఆమెకు అంత్యకాలము రాగానే, యమదూతలు ఆమె ముందు ప్రత్యక్షమైరి. "నీ వెప్పుడైన నే ధర్మమైన జేసితివేమో జ్ఞప్తికి తెచ్చుకొనుము" అనగా ఆమె దొడ్డిలో పండుచున్న పొట్లకాయ నొక్కటి ఎవ్వరికో దానము జెసెనట. దానము చేసిన ఆ పొట్లకాయే ఆమె ముందు రాగా దానిని పట్టుకొని స్వర్గమువైపు వెళ్ళసాగెనట, గాన ఏ చిన్న దానమైనను మనకు తోడ్పడి తీరును. ఏ విత్తులు ఎంత హెచ్చుగా మనము నాటిన ఆ విత్తుల ఫలితమునే మనము విరివిగా అనుభవించెదము. మనము దైవము దగ్గరకు వెళ్ళినప్పుడు, "నీవు వజ్రవైఢూర్య ములు, నెక్కులేసులు, వస్తువాహనములు ధరించితివా? పట్టుచీరలను పీతాంబరములను

వాడితివా?” యని అడుగడు. “నీకున్నదాని నెంత మంది నిరుపేదలతో, రోగులతో పంచుకొంటివి. మానవ సేవ స్వార్ధరహితముగా ఎంత జేసితివి, అని అడుగు” నని నా నమ్మకము.

మన హిందూదేశములోని భక్తులు, ఆసుపత్రి కట్టుటలో తోడ్పడినను, తోడ్పడ కున్నను, అమెరికా సోదరి, చైనా జనని డబ్బు పంపిరిగాన, వారి విరాళములతో ఆశ్రమ ములో రోగులుండుటకు ధర్మాసుపత్రిని వెంటనే కట్టుటకు ప్రారంభించ వలెను. దీనదయాళు డైన దైవము, తన బిడ్డల హృదయములలో ప్రవేశించి, అదృష్టహీను లైనను తన ఆకారములేయైన బీదనారాయణులయిన రోగులసేవ జేయుటలో వారి మనస్సు లను, సానుభూతితో, ప్రేమతో నింపి, మృదువుగా జేసి, దైవకార్యమునకు సహాయమును పంపునని పూర్తిగా నమ్మి యుంటిమి.

రాబోయెడి జన్మదినము గురించి, కొద్దిగా విమర్శించి ఈ పెద్ద వ్యాసమును ముగింప గోరుచుంటిని. రాబోయెడి జన్మదిన మెటుల జరుపబడునని ఇప్పటి నుండియు నాలోచించు చుంటిని. అన్నదానములు, పెద్దపెద్ద సమావేశములు పెట్టుకొన్నప్పుడే గదా దాతలకు, ఆశ్రమ భక్తులకు, శ్రమ గలిగించి వారి విరాళములను, చందాలను కోరవలసి యుండును. కాన రాబోయెడి జన్మదినమునకు అన్నదానము లుండవు, సమావేశము లుండవు. కాని మూడు రోజులును క్రిందటి జన్మదినమువలె, జన్మదినము జయప్రదముగా జరుపబడును. ఈ జన్మ దినమునకు కేవలము, ఆధ్యాత్మిక వృద్ధియే ఆశ్రమ భక్తుల వృద్ధికి తోడ్పడుటయే, ప్రాముఖ్య మీయబడును. నేను ఆ మూడు రోజులు వీలైన మౌనముగా నుండి సాధ్యమైనంత వరకు మాటలు తగ్గించి, ప్రవృత్తి పరులకు దూరముగా నుండి, దైవ పరితాపనతో నిండి యున్న భక్తులను నాచెంతనే ధ్యానము జేయించి, వారి ఆత్మవృద్ధికి తోడ్పడుటకు కోరు చుంటిని. ఆ మూడు రోజులు, ఉపవాసముతో శాంతి ప్రార్ధన స్మరణతో నిరంతర ప్రార్ధనధ్యానాదులతో నివృత్తిగా గడుపబడును. దైవ పరితాపనతో నిండియున్న ఆశ్రమ భక్తులందరకూ, ఆధ్యాత్మికముగా, అనుభవముగా వృద్ధి అగుటకు ఇదియే ఆహ్వానము.

దుర్లభమైన మానవజన్మ దొరికినందుకు తాను తరించవలెను. తన తోడి సోదరీ సోదరుల తరింపునకు తోడ్పడవలెను. అమూల్యమైన కాలమును, విలువైన జీవితమును, దైవసేవలో మానవ సేవలో వాడెడివారి జీవితములే అదృష్టవంతములు. మానవ సేవయే మాధవ సేవగా భావించి, స్వార్ధరహితములయిన జీవితమును గడుపుచున్న వారికి ధన్య వాదములు.

దేహమే దేవాలయము. ఒక్క దేహమే దేవాలయముగాదు. అన్ని దేహములు దేవాల

యములే. అన్ని దేవాలయములలో ఒకే దైవము విలసిల్లి ఉండును. ఎవ్వరిని ప్రేమించినా దైవమునే ప్రేమించుచుంటిమి. ఎవ్వరిని పూజించినా, దైవమునే పూజించుచుంటిమి. ఎవ్వరిని బేధముగా జూచినను, దైవమునే బేధముగా జూచుచుంటిమి. దైవమే రోగిగా, నిరుపేదగా, అనేకమైన నామరూపములలో మనమాయన సేవజేసి తరించుటకు మన వద్దకు వచ్చుచుండును. వివిధ నామరూపములలో అద్వితీయుడైన ఆ ప్రేమమూర్తి సేవ జేయుచు, తరించుచున్నవారే ధన్యజీవులు.

శ్లో॥ త్వమేకం శరణ్యం త్వమేకం వరేణ్యం
త్వమేకం జగత్పాలకం స్వప్రకాశం
త్వమేకం జగత్కర్తృ ప్రహర్తృ
త్వమేకం పరం నిశ్చలం నిర్వికల్పమ్॥

తా॥ నీవు ఒక్కడవే శరణ్యుడవు. నీవు ఒక్కడవే శ్రేష్ఠుడవు. నీవు ఒక్కడవే జగమును కాపాడు వాడవు. స్వప్రకాశుడవు. నీవు ఒక్కడవే జగత్తును సృజింప, రక్షింప, వినాశముచేయు శక్తి గలవాడవు. నీవు ఒక్కడవే అన్నిటి కంటెను ఉత్కృష్ఠుడవు. నిశ్చలుడవు. వికల్పములు లేనివాడవు.

శ్లో॥ వయం త్వాం స్మరామో వయం త్వాం భజామో ।
వయం త్వాం జగత్సాక్షి రూపం నమామః ॥
సదేకం నిదానం నిరాలంబ మీశం
తవాంబోధి పోతం శరణ్యం ప్రజామః ॥

తా॥ మేము నిన్ను స్మరించెదము. మేము నిన్ను భజించెదము. జగత్తునకు సాక్షిరూపుడవగు నిన్ను నమస్కరించెదము. సత్వస్వరూపుడవును. ఆది కారణుడవును. ఏ రూపు ఆధారము అవసరము లేనివాడవు ప్రభువును, సంసార సముద్రమునకు నావవు అగు ఒక్క నిన్ను మేము శరణు జొచ్చెదము.

శ్లో॥ త్వమేవ మాతా చ పితా త్వమేవ
త్వమేవ బంధుశ్చ సఖా త్వమేవ
త్వమేవ విద్యా ద్రవిణం త్వమేవ
త్వమేవ సర్వం మమ దేవ దేవ ॥

తా॥ నాకు తల్లి, తండ్రి. స్నేహితుడు, బంధువు, విద్య, ధనము, దైవము, అన్నియు నీవే కావున నీకే నమస్కరించెదను.

లోకా స్సమస్తా స్సుఖినో భవంతు

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

**: అర్పణ :**

**ఏ రోజున కారోజే జన్మదినముగా భావించి మానవ సేవయే దైవ సేవగా జీవితావధిగా జేసికొని ప్రతి క్షణమును ఆత్మానుభవములో గడపుచున్న భక్త వరేణ్యులకు శాంతి పాఠకులకు ప్రేమ పూర్వకమైన అర్పణ.**

సర్వే జనా స్సుఖినో భవంతు.

ఓం తత్ సత్ ఓం.    ఓం.

(శాంతి ఆగస్టు 1957)

# 4. రా మ నా మ ము

అప్పుడప్పుడు ప్రణవగానము జేయుట, రామనామము పాడుట-లోలోన రాగములు దీయుట నా జీవితములో అలవాటై యున్నను, డాక్టర్ల నిబంధనలచే ఆసుపత్రిలో నున్నందున, ఇంతకాలము వరకు లోలోననే పాడుకొనుచుంటిని. 15 ఫిబ్రవరి ఒక పవిత్రమైన దినము. ఆరోజు ఉదయమే దైవనామస్మరణ ప్రారంభించితిని. 16 ఉదయం సోదరి డాక్టరు రమణి వూరికి వెళ్ళినందున బాగా పాడితిని. నా కెంతయో ఆనందము. నూతన శక్తిని గల్గించసాగెను. నేను పాడుచుంటినని పిచ్చుకలుగూడ తెల్లవారకుండానే వచ్చి నాతో కలసి రామనామమును గానము చేయసాగెను.

"ఎంతకాలమునకు నీవు జబ్బును విడచి, మాతో కలసి ఆనందముగా పాడుచుంటి వోగదా" అని అవి నాతో జెప్పుచున్నట్లుండెను. ఇంకను పిచ్చుకలు "నీ గుండె జబ్బును, ఆశ్రమ తాపత్రయములను, నీ వ్రాత కోతలను వదలి మాతో ఇప్పుడైనను కలసి ఆనం దముగా పాడుచు మాతో ఎగురుచుండుము" అన్నట్లు జెప్పుచుండెను. పిచ్చుకలతో కలసి పాడగలను, వాటివలె స్వేచ్ఛగా, ఆనందముగా నుండగలను. వాటివలె నిరంతర కృషి చేయుచు పాడుచుండగలను. గాని వాటితో కలసి ఆకాశములో యెగురుట యెటుల?

నా గదిలో పిచ్చుకలు రెండు గూళ్లు పెట్టినవి, అవి ఏదో గడ్డియో, గాసరమో నిరంతరము ఆ గూడులను బలపరచుటకు సదా తెచ్చుచుండును. ఒక్కనాడు దారపుబండిని గదిలో నుంచగా ఆ దారము చివర భాగమును తీసుకొని వాటి గూటివైపు లాగుకొని పోవు

చుండెను. ఆ దారమునంతయు తీసుకొని పోవుచుండ, దానిని త్రెంచి వేయుమని జెప్పితిని. అప్పుడు ఆ దారపు బండి సగము మిగిలెను. కొంత దారమును పిచ్చుకలు తమ గూడువద్ద దూలమునకు చుట్టినవి. మీరుగూడ ఇచ్చటకు వచ్చిన ఆ దారమును, గూళ్ళను చూడ వచ్చును. పిచ్చుకల నిరంతర కృషి, నేను ఆశ్రమ వృద్ధిని కోరుచు దగ్గర దగ్గరగా యీ 50 సం॥లు నుండి ప్రాక్ పశ్చిమములలో నున్న ఆశ్రమ భక్తులందరి నుండియు, ఏ తృణమో అనేక రీతులైన సహాయమును, యెన్నో అవస్థలు పడి తెచ్చి శాంత్యాశ్రమం అనే గూటిని స్థిరముగా, భక్తుల ఉపయోగార్ధము, దైవ పరితాపనతో నున్న సందర్శకులందరకు శాంతి నిలయముగా చేయగలిగితినని, పిచ్చుకలవలె నేనుగూడ తృప్తి పడుచు, ఇంకను మంచము మీద నుండియు రామనామమును గానము చేయుటకు శక్తి నొసంగుచున్న ఆ కృపామయు నకు నా కృతజ్ఞతా వందనములు అర్పించుచుందును. నేను రామనామమును గానము జేయుటను గురించి నా ప్రియమైన శాంతి పాఠకులు శాంతి ఆశ్రమ భక్తులతో, పంచుకొనుట కీ వ్యాసమును ప్రారంభించితిని. నేను రామ అనగా, ఒక వ్యక్తిని నామరూపమున పిలు చుట లేదు. సృష్టికి ఆధారమైన, మూలవిరాట్టును, అద్వితీయమైన ఆ సచ్చిదానందమూర్తిని పిలుచుచుందును. మూడుసార్లు రామనామమును స్మరించగనే, భూత, భవిష్యత్ వర్తమాన కాలములు రాముని తేజస్సులో అఖండమైన, అద్వితీయమైన శక్తితో నిండియున్నట్లుండును. భూతభవిష్యత్ వర్తమాన కాలములు, దైవ తేజస్సుతో నిండిన తర్వాత, మరల మూడు సార్లు స్మరించగా, ఒక్క రామనామముతో, ఆపాదమస్తకము, (కాలిగోరు మొదలు శిరస్సు) వరకు దివ్యతేజస్సుతో నిండియుండును. రెండవమారు రామనామమును స్మరించగనే అణువు మొదలు బ్రహ్మాండము వరకు మీరందరూగూడ అద్వితీయమైన దైవ తేజస్సుతో నిబిడీకృతమై యుందురు. ఇక మూడవ నామముతో సృష్టి అంతయు నీటిబుడగవలె అఖండమైన సచ్చిదానంద మహాసముద్రములో లీనమగుచుండును.

**అంతా రామమయం, బీ జగమంతా రామమయం కన్ను మూసినా కృష్ణమయం, కన్ను తెరచినా కృష్ణమయం.** ఈ నా భావనలను, అనుభవములను, ఆనందమును, యీ ఖండమైన చిన్న మాటలతో మీకు యెటుల బోధపర్చగలను? తరుచు ఒక్క రామనామముతో వ్యక్తమైన ప్రపంచము నంతను నింపుచుందును, రెండవ నామముతో అవ్యక్తమంతయు నిండియున్నట్లుండును. ఇంక మూడవమారు స్మరింపబోయెడి రామనామమును, ఏమి జేయుదునని తలంచుచుందును. ఈ మూడవ నామమును యెచ్చట వుంచుటకు తావుగానక దానిని నాలో మిగిలియున్న అహం మీద పడవేయుచుండగా, ఈ ఖండమైన అహం, అఖండమైన కోటిసూర్య ప్రకాశవంతమైన తేజస్సులో కాలిపోవుచున్నట్లు ఆనందించు చుందును. ఈ స్థితిలో బలిచక్రవర్తి వామనమూర్తికి మూడు అడుగుల భూమిని దానము చేసిన దృశ్యము గానవచ్చుచుండును.

ఒక్కొక్కమారు రామనామమును, ఇన్నిసార్లు స్మరించవలెనా అని ప్రశ్నవచ్చునపుడు, ఒకచిన్న గురుశిష్యుల దృష్టాంతము–కథ–జ్ఞప్తికి వచ్చుచు, రామ నామ మహత్మ్యమును ఇంకను వ్యక్తము జేయుచుండును.

గురుశిష్యులు ఆదర్శనీయమైనవారు గురూజీ యెట్టి జబ్బులనైనను–రోగములనైనను, దైవ నామముతో కుదుర్చుచుండెడివారు. ఒక్కరోజున గురువుగారు గ్రామాంతరము వెళ్ళగా, శిష్యునివద్దకు సర్పముచే కరువబడి చనిపోయెడి అవస్థలో బాధపడుచున్న ఒక వ్యక్తిని తీసుకొని వచ్చిరి. అప్పుడు శిష్యుడు దైవనామ ప్రభావముచే ఆ వ్యక్తికి శాంతి గల్గించెను. గురుమూర్తి రాగానే, ఆనందముచే తాను, నాలుగుమార్లు రామనామము స్మరించుచు సర్పదష్టుడైన రోగిని బ్రతికించితినని చెప్పగా, గురువు నాయనా! అఖండమైన రామనామ ప్రభావమును నీవు పూర్తిగా యెరింగియుండియు చిన్న పాముకాటును కుదుర్చుటకై నాలుగుసార్లు స్మరించవలెనా? ఒక్కమారు రామనామ స్మరణ చేసిన చాలదా? అని గురు మూర్తి చెప్పగా–శిష్యుడు ఇంకను హెచ్చుగా రామనామ ప్రభావమును గ్రహించెను.

అహంకార మమకారములతో నిండి, సహనము, శాంతి, విశ్వప్రేమ లేకుండ, కోటిసార్లు రామనామమును స్మరించినను, లిఖించినను ఫలితము శూన్యమైయుండును. అట్టివారు బాహ్యమునకే భక్తులుగా బరంగుదురు. ఎన్నటికీని ఆంతర్యమైన రామభక్తులు కాజాలరు. రామనామమునకు, **విశ్వప్రేమ ప్రాణతుల్యము. అవ్యాజమైన భక్తి శ్రద్ధలు** నిస్వార్థత కల్గిన వారిదే రామ సామ్రాజ్యము.

ప్రియమైన శాంతి పాఠకులారా! దైవపరితాపనతో నిండియున్న రామభక్తులకు వెయ్యి మాటలు, బోధలు అవసరముండదు. నిజమైన దైవభక్తులకు ఒక్క మాట చాలును. గాన ఇప్పుడు మీకు సహాయము జేయుటకు ఇంకను నేనేమి వ్రాయగలననే యీ మనస్సు ఆలోచించుచున్నది. మీ మనస్సు పరిపక్వమైన కొలదీ మీరు వాక్కుతోనే రామనామమును ఉచ్ఛరించుటకు బదులు, మనస్సుతో ఆంతర్యమున స్మరింపవచ్చును. ఇంకను దైవసన్నిధిని అనుభవించుచుండ, మనస్సుతోగూడ రామనామమును స్మరించనవసరముండదు. ఏలనన, రాముడు మీ శ్వాసలోనే యుండెను. అఖండమైన దైవశక్తి మీ ఉచ్ఛ్వాస నిశ్వాసలలో, నిరంతరము, రాత్రింబగళ్ళు ఆడుచున్నది. సోహం జపమే రామ జపము. ఇక వెయ్యి వ్రాతలేల? ప్రతీ ఉచ్ఛ్వాస, నిశ్వాసలో సోహం భావనతో, రామనామమును అనుభవించుచు తరించెదరుగాక!

లోకా స్సమస్తా స్సుఖినోభవంతు    ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

(శాంతి ఏప్రిల్ 1964)

# 5. రాతి గోడలో పువ్వుల మొక్క

దైవమెంత కృపామయుడు! కండ్లున్నవారు దైవకృపను చూడవచ్చును. దైవసన్నిధిని చిన్న పుష్పములలోగూడ అనుభవింపవచ్చును.

తోటపల్లి ఆశ్రమములో నేను పరుండెడి తావులో, ఒక మల్లి అంటు దానంతట అదియే మొలచెను. వాల్తేరు ఆశ్రమం రాగానే, అచ్చటగూడ నేను పరుండెడి తావున మల్లి పొదలు వుండి, చక్కని సువాసనను రాత్రింబగళ్ళు యిచ్చుచుండ, దైవమెంతయో సన్నిహితముగా నున్నట్లు ఆనందించుచుండెడివాడను.

కైలాసము వచ్చిన తరువాత, యీ పర్వతముమీద నీరైనను లేదుగదా, యిచ్చట పూలమొక్క ఎటుల వచ్చును? రోజులిటుల గడుచుచుండ నేనుండెడి భవనములో రోజూ కిటికీ వద్ద ముఖము కడుక్కొనెడి తావున బైటకు చూడగా, అక్కడ ఒక చిన్న మొక్క ఒకే ఒక తెల్లని పుష్పమును గలిగి నాకు గాన వచ్చెను.

రాతిగోడలో పూలమొక్క యెచ్చటినుండి వచ్చెను? అది యొక్కటే పుష్పము గలిగి నావైపు చూచుచుండుట నాకు అపరిమితానందము గలిగెను. దైవకృపకు కృతజ్ఞతతో నాకానందభాష్పములు రాలదొడంగెను. ఆ చిన్న పుష్పముద్వారా నేను నీతోనే వచ్చుచుంటిని. నేను సదా నీ సామీప్యముననే ఉంటిని అన్నట్లు; దైవము నిశ్శబ్దములో నాతో మాట్లాడ దొడంగెను.

ఈ చిన్న పుష్పముయొక్క చరిత్ర ఒక అతిశయోక్తిగా గానవచ్చును. గాని, దానిని మీరు చూచినచో, మీరుగూడ ఆనందముతో విస్మయమొందెదరు. నాకు పుష్పములన్న చాల ప్రీతియే ప్రీతియున్నదిగదా యని పువ్వులను త్రుంచి దైవ విగ్రహములముందు, దేవతా పటముల ముందును అర్పించను నే నెన్నడు; శ్రీశంకరాచార్యులు వ్రాసిన యీ దిగువ శ్లోకమును మరువను.

గభీరేకాసారే విశతి నిజనేఘోర విపినే
విశాలే శైలేచ భ్రమతి కుసుమార్థం జడమతిః
సమర్ప్యైకం చేతస్సరసిజముమానాధ భవతే
సుఖేనావస్థాతుంజన ఇహనజనాతి కిమహో!

వెఱ్ఱి మానవులు, తమ మనస్సను పద్మమును పరమాత్మ పాదములకు అర్పించలేక, పుష్పముల కొరకు అనవసర శ్రమ పడుచున్నారు.

చాలమంది వారి గదులలోను, వ్రాసుకొను బల్లలమీదను (Vases) వేసులలోను, గ్లాసులలోను నీళ్ళు పోసి, పువ్వుల కొమ్మలను అందము కొరకు వుంచుకొందురు.

బెర్నార్డుషా, అనెడి గొప్ప కవీశ్వరుడు పువ్వులయందు ప్రేమగలవాడు, తన గదిలో ఏ పుష్పములు లేనందున ఆయనను దర్శించుటకు వచ్చిన ఒక సోదరి "అయ్యా! మీకు పెద్ద పువ్వుల తోట యున్నను, మీ గదిలో, ఏ ఒక్క వేసులోనైనా కొన్ని పుష్పముల నుంచి యేల అలంకరింపచేయలేదు? అని అడుగగా, ఆయన యిటుల సమాధానము చెప్పెను.

పూలచెట్లుగూడ దైవ సృష్టియే. వాటి అన్నింటిలో ప్రాణముండును. నా ఆనందమునకై పిల్లల కంఠమును త్రుంచి నా గదిలో బల్లమీద వుంచుకొని, వాటిని జూచుచు ఆనందించగలనా? పుష్పము, చెట్టున వున్నప్పుడే దాని ఆనందము, శక్తి, సౌందర్యము, సువాసనను యిచ్చుచుండును. దాని తల్లి నుండి అనగా చెట్టునుండి మనము వేరుచేయగనే, అది యెండి పోయి కృశించును.

పిల్లల శిరస్సుల త్రుంచుటకు మనకెటుల హక్కులేదో అటులనే అమాయ కమైన, సున్నితమైన పుష్పములను త్రుంచుటకు గూడ మనకు హక్కులేదు. దైవసృష్టిని పుష్పములలోను, జంతువులలోను, పక్షులలోను, పసిబిడ్డలలోను, మానవులలోను దైవమును గాంచుచు జీవించెడివారి జీవితములు పరమ పావనమైనవి.

హృదయము ఎంత సున్నితముగానున్న – మానవులయందు, జంతు జాలమునందు, పశుపక్ష్యాది జంతువులయందేగాక చివరకు పుష్పములు, లతలు, చిన్న గడ్డిపరకవైపుగూడ అంతగా ప్రేమ పొర్లి పారుచుండును.

ఎవ్వరైనా ప్రవృత్తి పరులు నా కండ్లముందు యే పుష్పములైనను త్రుంచినచో యీరోజులలో నా శరీరము జలదరించి, నాకు హాని గల్గించినట్లే కొంత తడవు బాధపడు చుందును. విశ్వప్రేమ గల్గినవారి జీవితములు అదృష్టవంతములు.

ఈమధ్య ఎవ్వరో భక్తులు వచ్చి నిజమైన ప్రార్థన యెద్ది? అని ప్రశ్నించిరి.

మానవుని, పశువుని, జంతువుని, పక్షిని, పుష్పమును యెవ్వరు ప్రేమించుచున్నారో, అణువు మొదలు బ్రహ్మాండము వరకు నిండి నిబిడీ కృతమైయున్న దైవమును సర్వత్రా గాంచుచు, సర్వమును తమ స్వరూపముగా నెంచి ప్రేమించుచున్నారో, అదియే ప్రార్థనలకెల్ల గొప్ప ప్రార్థన. అట్టివారే, నిజమైన ప్రార్థనను చేయుచున్నారు అని చెప్పగా వారెంతయో ఆనందించిరి.

ఈ రాతిగోడలోని ఆ చిన్నమొక్క, తెల్లని చిన్న పుష్పముతో వికసించుచుండ, దానిని జూచినకొలదీ దైవసన్నిధిని దైవకృపను పరవశత్వముతో అనుభవించుచు, నా ఆనందమును మీ అందరితో పంచుకొనుటకు యీ వ్యాసమును ముఖ్యముగా, యీ

చిన్న పుష్పముద్వారా, శ్రీ పరమేశ్వరునకు నా కృతజ్ఞతను తెల్పుటకు వ్రాయుచుంటిని.

ఈ రాతిగోడలో మొలచిన పూలమొక్కను చూడగా–ఈ దిగువ రెండు పద్యములు సదా నాకు జ్ఞాపకమునకు వచ్చుచుండును.

సీ. అడవిపక్షుల కెవ్వ । డాహార మిచ్చెను
మృగజాతి కెవ్వడు । మేఁతఁబెట్టె
వనచరాదులకు భో । జన మెవ్వడిప్పించెఁ
జెట్లకెవ్వఁడు నీళ్లు । చేఁదిపోసె
స్త్రీల గర్భంబున । శిశువు నెవ్వఁడు పెంచె
ఫణులకెవ్వఁడు పోసె । బరగపాలు
మధుపాళి కెవ్వఁడు । మకరంద మొనరించె
బసులకెవ్వఁ డొసంగెఁ । బచ్చిపూరి

తే. జీవకోట్లనుఁ బోషింప । నీవెకాని
వేఱెయొకదాత లేఁడయ్య । వెదకిచూడ. భూ.

శా. నీకుం బ్రేమ సమాన మన్నిటియెడన్ ; నిక్కంబు సర్వేశ । యీ
లోకంబందు సమస్త జంతువుల కెట్లో నిత్యమాహార మీ
వే కావే దయసేయు చుండుదువు । తండ్రీ । యట్లుగాకున్న, మం
డూకం బేక్రియ రాతిలో బ్రదుకుచుండున్? భక్త చింతామణీ.

ఈ చిన్న పుష్పమును చూడగానే నాకు దైవమునే జూచుచున్నట్లుండును. నేను అల్పసంతోషిని. చిన్న చిన్న వాటికే తృప్తిపడుచు అన్నింటిలోను, దైవసన్నిధినే గాంచుచు ఆనందించుచుందును.

ఈ చిన్న పుష్పమును చూచినపుడెల్లను, అదియే ఒక దైవచిహ్నముగా దైవపీఠముమీద నున్నట్లు భావించి, నా శిరస్సును వినయ విధేయతలతో వంచుచుందును.

ఓ చిన్న పుష్పమా! ప్రేమమయీ ! నీ వెచ్చటనుండి వచ్చితివి. జలములేని యీ కైలాసములో యెటుల పెరుగుచుంటివి? ఇంకను కఠినమైన, చెమ్మలేని రాతిగోడలో యెటుల మొలచితివి? ఎవరు నిన్నిచ్చటకు పంపిరి? ఎవరి ఆజ్ఞచే నీవిచ్చట పుష్పించుచుంటివని, తలవని తలంపుగా దానిని జూచినప్పుడెల్లను ఆ పుష్పమును ప్రశ్నించుచుందును.

దైవాజ్ఞ లేనిదే గడ్డిపరకయైనను కదలజాలదన్నప్పుడు, యీ చిన్న పుష్పముగూడ దైవాజ్ఞచేతనే, కైలాసములో, రాతిగోడలో పెరుగుచున్నదిగదా!

అఖండమైన దైవము, ఖండమైన ఈ చిన్న పుష్పములో విలసిల్లియుండెను. కండ్లున్న వారు చూడవచ్చును. దైవములేని తావు సూదిమొన మోపుటకైనను లేదుగాన, సర్వములో దైవమును, అద్వితీయుండైన ఆ పరంధాముని దర్శించుచు తరించెదముగాక! సర్వాంత ర్యామియైన దైవము చిన్న పుష్పములోగూడ ప్రకాశించుచు, పరిమళము నిచ్చుచు మనకు ప్రత్యక్ష మగుచుండెను.

ఆవును వెంబడించెడి లేగదూడవలె-దైవమును నమ్మిన భక్తులను-తన బిడ్డలను దైవముగూడ నిరంతరము వారిని వెంబడించి యుండుటేగాక "నేను నీదగ్గరే యున్నాను. నీయందే యున్నాను" అని తెలియచేయుటకు ఏదో చిన్న పుష్పము రీతిగాగూడ ప్రత్యక్షమై గుణపాఠము నేర్పుచు ఉపదేశించు చుండును.

ఒక కవీశ్వరుడు నీవు నిజముగ ప్రకృతిని చూచి నేర్చుకొనే యెడల రాళ్ళు సెల యేళ్లు గూడ నీకు సదా ఉపదేశములు నిచ్చుచున్నవని వ్రాసియుండెను.

కైలాసములో, ఏకాంతములో ఏకాకిగా రాతిగోడలో నా కొరకై పుట్టించిన యీ పుష్పమును జూచినప్పుడెల్లను:-

> నీకు నేను యేమి సహాయము చేయగలను? నా కృతజ్ఞతనెటుల నీకు జూపగలనని, ఆంతర్యమున తలంచుచుందును. నీరైనను పోయుద మన్నను పోయుటకు వీలులేని తావులో నుంటివి. మానవులు పోయునీరు నీకు అవసరము లేకుండనే రాతిగోడలో పెరిగితివిగదా! యిక మానవులు పోయు జలము నీకు అవసరము లేదు. ప్రేమమయుడైన దైవమును నిరంతరము ఆంతర్య హృదయములో చూచుటే, దర్శించుటయే నేను నీకు చేయగలిగిన ప్రత్యుపకారము.
>
> రాతిగోడలో చిన్న పుష్పముగా ప్రత్యక్షమైన ఓ దైవమా! నీకు కృజ్ఞతాభి వందనములు. బాహ్యమున ప్రత్యక్షమైన యీ చిన్న పుష్పమును, ఆంతర్య మున విలసిల్లియున్న నాహృదయ పుష్పములో విలీనము చేసి పుష్పములకు పుష్పమైన, ఆత్మలకు ఆత్మయైన నీ అఖండ సచ్చిదానంద మహాసముద్ర ములో-బాహ్యపుష్పములను, ఆంతర్య పుష్పములను మరచి నీలో లీనమ య్యెదముగాక!

లోకా స్సమస్తా స్సుఖినో భవంతు ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

(శాంతి ఆగస్టు 1964)

# 6. రెండు మహోన్నత ఘడియలు

సత్యాన్వేషకుల జీవితమునందును, మహోన్నతమగు మానవ జన్మయొక్క జీవితాశయమును జేరప్రయత్నించు వారలయందును, రెండే రెండు మహోన్నతమగు విలువ కట్టలేని ఘడియలు వుండివున్నవి. అట్టి మహాత్ములు. వారు ప్రాక్పశ్చిమములలో ఏ దేశమునకు జెందినవారైనను, వారు తమకేగాక జాతికిని, మొత్తం మానవాళికిని సేవ జేయుచున్న వారలగుచున్నారు.

అట్టి మహోన్నతమగు రెండు ఘడియలు ఎట్టివి?

1. ఎచట యీ కాయము కాయము కాదో, మనస్సు మనస్సు కాదో, లోకము లోకము కాదో, ఎచట సర్వమూ స్వయంప్రకాశ కాంతిచే నిండి నిబిడీకృతమై యొప్పునో, అట్టి భగవత్ సాక్షాత్కారపు ఘడియ మొదటిది. ఇట్టి భగవదానుభవమే మానవజాతి యొక్క పరమాతిశయము.

2. ఇక స్వార్థమున కతీతమై, మానవజాతి శ్రేయస్సుకొరకు పాటుబడుచు, నిస్వార్థముకొరకు స్వార్థమును విడచి, సలుపు నిస్వార్థసేవా ఘడియ రెండవదియై యున్నది.

ఇట్టి మహోన్నతమగు రెండు ఘడియల యందునుకూడ అహంభావము యొక్క పూర్ణాహుతియగు, నిస్వార్థత, ఉభయతారకమై యుండును. మానవుడు నిస్వార్థుడై స్వార్థమును, లేక అహంభావమును అతిక్రమించినవాడై నందుననే యాతడు నిస్వార్థసేవ జేయగలుగుచున్నాడు. ఆతని సేవకు యే పారితోషికమును కోరడు. కేవలం సేవనే యాతడత్యున్నత పారితోషికముగా భావించుకొనును. స్వార్థభావం తనలో నశించినది గనుకనే, భగవద్భక్తుడుకూడా తనయందు, ఇతరులయందు, లోన, బైటా భగవత్ ప్రకాశమును ధ్యానించి గుర్తించగలడు. తనలో ప్రకాశించుచున్న ప్రజ్వలిత కాంతిని, యాతడితరులలో గూడ గాంచగలడు. అద్వితీయుడగు ఏక రూపుడగుటచే యాతడు లోనుంచి గాని బైటనుంచిగాని ఎట్టిదానిని అపేక్షింపడు.

దైవ సాక్షాత్కారమును పొందిన యాతడు, ఘనుడా లేక నిస్వార్థ సేవానిరతుడు ఘనుడా అను విషయములో ఇపుడు మనకు పనిలేదు. వారల జీవిత పరిధిలో ఉభయులును ఘనులే! సేవను ధ్యానమును రెంటినీ పునీతము చేయుచూ, ఉభయులూ మానవాళికి సేవ జేయుచున్నారు. లోకశ్రేయస్సుకొరకు ఉభయులూ వారి వారి ధర్మములను నెరవేర్చుచున్నారు. పై ఉభయ జీవితస్థాయిలోను ముఖ్యముగా కావలసినది, లెక్కకు తీసుకోవలసినది పరిపూర్ణ నిస్వార్థత. అతడు కర్మిగాని, అకర్మిగాని, స్వార్థపరుడు భూమాతకుబరువే. ఆదర్శప్రాయమగు శాంతి జీవితమును గడుపుచు, నిశ్శబ్ద తపోధ్యానములకు అంకితుడగు

జ్ఞానయోగిగాని, అనేక రూపములలో గల దైవసంతతికి సేవజేయు కర్మయోగి గానీ, నిస్వార్థ మానవుడే మానవజాతికి వరప్రసాదము.

స్నేహితులారా! మీ జీవితములను పరీక్షించుకొని, పవిత్రమగు మీ సేవా ఘడియలను, మీ నిశ్శబ్ద ఘడియలను జ్ఞప్తికి తెచ్చుకొని, దైవ సేవద్వారా చేయుచున్నారో ధ్యానము ద్వారా జేయుచున్నారో నిర్ణయించుకోవలసినది మీరు మాత్రమే! మహోన్నత దైవ సన్నిధి నుంచి పిలుపు రాకపూర్వమే, అఘాతమైన తపోనిష్ఠలోగాని, దైవసంతతియొక్క నిత్యసేవలో గాని మీ జీవిత క్షణములను సద్వినియోగము చేసికొని, మానవజన్మయొక్క మహోన్నతాశయమును జేర ప్రార్థించుచున్నాను. నిజముగా ఎవరు సేవానిశ్శబ్దతలను కలిపి నిస్స్వార్థతలో కేంద్రీకరించి లోకమంతా తన గృహముగా తలచుచూ, మానవజాతికి సేవ జేయగలవారే ఉన్నతులలో మహోన్నతులును, నిజమైన సేవకులును అయియున్నారు. అట్టివారికి ధన్యవాదములు.

అందరకు శాంతి కలుగుగాక! ఓం ఓం ఓం!

(శాంతి జూలై 1967)

## 7. రాధ నిద్ర

రాధ పన్నెండు సంవత్సరముల గురుకుల బాలిక. ఎంతపనియైనను భక్తిశ్రద్ధలతో చేయును. హెచ్చుగా మాట్లాడదు. నిశ్శబ్దముగా, మౌనముగా నుండుననియే ఆమెను మాతో నీలగిరి తీసుకువచ్చితిమి. ఏదైనను చిన్నతప్పు చేసినప్పుడు ఆమెను కోపపడినను సమాధానమైనను చెప్పదు. కాని ఏపనీ లేనప్పుడు నిద్రపోవుచుండును. ఆమె నిద్ర ఊర్మిళాదేవి నిద్రను జ్ఞప్తికి తెచ్చుచుండును.

ప్రార్థన సమావేశములు, జరుగుచున్నప్పుడు యెంతమంది జనమున్నను, యెంత బిగ్గరగా భజనలు జరుగుచున్నను ఆమె నిద్రను జూచిన కుంభకర్ణుడు జ్ఞప్తికి వచ్చుచుండును. మొన్న బుధవారము ప్రార్థన, భజన సమావేశములో, శ్రీ విభూతి స్వామి భజన చేయుచుండిరి. శ్రీ బాలబ్రహ్మానందస్వామి 96 సంవత్సరముల వయస్సు గల్గిన (కలియుగ లోకసంచారియైన నారదుడు అని పిలువబడుచున్న) వారు బిగ్గరగా ఉపన్యసించుచున్నను, మన రాధ తన పనిలో నిమగ్నయై యుండెను. అనగా నిద్ర పోవు చుండెను.

శ్రీవిభూతిస్వామి, శ్రీ బాలబ్రహ్మానందస్వాములేగాక, బ్రహ్మదేవుడు వచ్చి ఉపన్యసించుచున్నను, రాధకు ఒక్కటియే! ఆరోజున ఆశ్రమ భక్తులైన శ్రీ బొబ్బిలి రాణీగారు, శ్రీ నాగుబాయమ్మగారు, యింకను ఏనాసోదరి మరియొక క్రొత్త ఆంగ్లేయ సోదరితో వచ్చెను. సోదరి లలితాదేవి మొదలైన వారందరూ భజనలో పాల్గొనుచుండిరి. కాని రాధ

మాత్రము అటులనే నిద్రలో శివాలాడుచుండెను. రాధకు నిద్ర వచ్చినచో స్వాములు, రాజులు, రాణీలేగాక, హరిహర బ్రహ్మాదులు వచ్చినను, వారి జ్ఞప్తియే లేకుండ శివాలాడుచు నిద్రపోవుచుండును. ఒకనాడు ప్రార్థనలో ఆమె తల నేలకు తగులు లాగున ఊగుచుండ చాలమంది భక్తులు భజనలో పాల్గొనుటకు బదులు రాధ వైపే చూచుచుండిరి. కొదువ బాలబాలికలు ఆమె శివాలాడుచుండుట జూచి నవ్వుచుండిరి. అప్పుడు కొందరు భక్తులు మనస్సులు దైవములో లీనమగుటకు బదులు, నోరు పాడుచున్నను, చేతులలో తాళములు వేయుచున్నను, రాధ శివాలనే ఆనందముగా చూచుచుండుట నేను గ్రహించి రాధను నిద్రనుండి లేపి, ఆమెను ప్రార్థన హాలు, ప్రధమ గుమ్మమువద్ద కూర్చొనమని, ఆమె నిద్ర పూర్తికాగానే మరల రమ్మని పంపితిని. కాని రాధ నిద్రకు పరిమితియే లేదుగదా! కాన అప్పుడు ఆమె ఆనందముతో, ఎవ్వరూ తనవైపు చూడజాలని తావులో ఒకమూల కూర్చొని నిద్రపోవ దొడగెను.

మరియొక రోజున భజన ప్రార్థన జరుగుచుండ, స్వాములందరు కూర్చొని బోధలు చేయుచుండ, హార్మోనియం మీద పాటలు పాడుచుండ, మద్దెల మ్రోగుచుండ, తాళములతో భక్తులు లయవేయుచుండ మన రాధ తనపని పట్టుదలతో నియమముగా చేయుచుండెను. అప్పుడు కొందరు భక్తులు రాధను మొహము కడుక్కొనమని చెప్పుచుండ, ఆమె లేవబోవగా నేను "నీవు లేవనవసరములేదు. ఎచ్చట నున్నదానవు అచ్చటనే కూర్చొని నీ నిద్రను సాగించుము. నీ శివాలు జూచుచుండ నాకు ఆనందముగా నవ్వువచ్చుచున్నది. నీ నిద్రను చూచుచుండ నీ నుండి ఒక మంచి గుణపాఠమును నేర్చుకొనుచుంటిని" అని చెప్పుచు ఆమెను అచ్చటనే యుంచి, ఆమె నిద్రపోవుచుండ, ఆమె నిద్రనుండి గూడ మంచినే తీసుకొనుచు, మంచి భావములతో ఉత్సాహముతో నిండియుంటిని.

అప్పుడు రాధ నాకు ఒక గురువుగా మారెను.

శ్రీ దత్తాత్రేయులకు చాలమంది గురువు లుండిరట. ఒక వేటగాడు బాణమును గురిపెట్టి ఒక పక్షిని చంపుటకు అమ్మును వేయుచుండ అతని చెంత నుండియే ఒక పెండ్లివారు, డప్పులు, బాజాలతో వెళ్ళినను, అతని యేకాగ్రతచే, తన పనియందే నిమగ్నుడై యుండుటచే, ఆ పెండ్లివారు తన వెనుకనుండియే వెళ్ళిన సంగతి కూడ అతనికి తెలియలేదట.

మరియొక జాలరి గేలమునకు యెరను గుచ్చి చేపలకై ఏకాగ్రతతో వేచియుండ, ఆ దారిని పోవు బాటసారి ఏదో విషయమై ప్రశ్నించినను అతనికి వినిపించనే లేదట. ఒక కొంగ నది ఒడ్డున చేపను మ్రింగుటకు తదేక నిష్ఠగా వేచియుండి తన వెనుకనే

తనను చంపుటకు ప్రయత్నించుచున్న మనిషినైనను చూడలేదట. వీరందరూ శ్రీ దత్తాత్రే యులకు గురువులైరి.

అటులనే రాధ నాకిప్పుడు పెద్ద గురువుగా నుండెను. రాధ నిద్రను జూచినప్పుడెల్లను తలవని తలంపుగా యీ క్రింది చిన్న ప్రార్థన నా నోటినుండి వచ్చుచుండును.

ఓ దీనదయాళూ! కృపామయా! యెంతమంది స్వాములున్నను, భక్తులైన రాజాధి రాజులు రాణీలు వచ్చినను ఎంతగాఢముగా ప్రార్థనలు జరుగుచున్నను రాధ నిస్పృహగా, ఏకాగ్రతగా నిద్రపోవుచున్నట్లు.... ఓ దైవమా; నన్ను ఈ నామరూపములను యీ బాహ్య ప్రపంచమును, యీ ఆశ్రమములను, క్షణభంగురములైన యీ పేరు ప్రతిష్టలను మరచి, రాధవలె నన్ను గూడ నీలో నిద్రపోనిమ్ము. ఈ మనో బుద్ధి చిత్త అహంకారములను, నీ కోటిసూర్యుల తేజస్సులో శాశ్వతముగా విలీన మవనిమ్ము. ఇదియే నేను హృదయ పూర్వకముగా నిన్ను కోరెడి ప్రార్థన.

లోకాస్సమస్తా స్సుఖినోభవంతు! ఓం శాంత శ్శాంతి శ్శాంతిః

(శాంతి సెప్టెంబరు 1967)

## 8. వర్షము

కుంభవృష్టిగా వర్షము కురియుచున్నది. నేనీ వ్యాసమును వ్రాయుచుండ వర్షము కురియుచునే యున్నది. ఏలనో వర్షము కురియుచున్నప్పుడెల్ల నా మనస్సుశాంతిగా ఆనందముగానే యుండును. ఎందుచేత? వర్షము భూలోకమును స్వర్గలోకమును కలుపు చున్నందువలననా?

ఈ వర్షమెచ్చటినుండి వచ్చుచున్నది? ఆకాశములో నున్న దట్టమైన మేఘముల నుండి. ఈ దట్టమైన మేఘము లెచ్చటనుండి వచ్చుచున్నవి? ఇవి సముద్ర జలమునుండి ఆవిరిగా ఆకాశములోనికి మార్చబడి దట్టమైనప్పుడు వర్షించుచుండెనా? ఈ కఠిన సమస్యల నన్నింటిని శాస్త్రజ్ఞులైన అనుభవపరులకు వదలిపెట్టి, వర్షము గురించి దాని ఫలితమును గురించి నివృత్తి దృష్ట్యా మన వ్యాసమున పరిశీలింతము.

వర్షమువల్ల కొలదిమందికి మాత్రము కొన్ని నష్టకష్టము లుండవచ్చును. కాని మొత్తముమీద భూమి అంతయు చల్లబడి సస్యములు నాటబడి పంటలు వృద్ధియై వేనవేల ప్రజలకు ఆహారము కలుగుచుండ మనము ఆనందింపవలసినదే. ఆశ్రమములో తోట కూలీలకు కొన్ని గంటల పని తగ్గుటచే నష్టమైనదని వర్షమును నిందింపరాదు. అటులనే

వర్షము కొందరికి బాధాకరముగా నున్నను పెక్కండ్రకది ప్రాణముగా ఆధారముగా నుండి దేశవృద్ధికి తోడ్పడుచున్నదిగాన, దానిని జూచి మనము ఆనందింపవలసియే యున్నది.

ఆశ్రమములో కొన్ని ఫలవృక్షములనో పూలమొక్కలనో నాటితి మనుకొనుడు. వానికి ఉదయము సాయంకాలము బావిలోనుండి ఎంత నీరు తోడి పోసినను మొక్కలకు తృప్తి యుండదు. కొన్ని మొక్కలు వాడి కొన్ని చనిపోవుచుండును. ఇక వర్షము పడినప్పుడో–అన్ని మొక్కలకు సమృద్ధిగా జలము దొరకును. భూమి అంతయు చల్లబడిన నెండుచున్న మొక్కలు గూడ తలలనెత్తి వికసింప నారంభించును. అటులనే మనుజుడు పోయు నీటికిని దైవము వర్షించెడి జలమునకును సహస్రగుణ భేదము గలదు.

మనుజునకు స్వశక్తి ఆధారమును, గమ్యస్థానమునై యున్నను ఆ మనుజుడు చేయు ప్రార్థనలు, ధ్యానములు, యోగాభ్యాసములు, అన్నియుకూడ చెంబుతో మొక్కలకు నీరు పోయుచున్నట్లే యుండును. ఇక దైవకృప గలిగినపుడు దైవము కుంభీపాతముగా వర్షించు చున్నట్లు మానవుని మనస్సు శాంతితో ఆనందముతో నిండియుండును.

స్వార్థముతో చేయు పనులకును, స్వార్థరహితమైన సేవకును, అంధకారమునకు, దివ్యతేజస్సునకు, అజ్ఞానమునకు, జ్ఞానమునకు హస్తిమశకాంతరము కలదు. ఈ భావననే శ్రీరామకృష్ణులు మరొక చక్కనైన ఉదాహరణముతో సూక్ష్మముగా అందరకును తెలియవచ్చెడి విధానము తెలిపియుండిరి.

మండు వేసవిలో ఉక్కబెట్టుచున్నప్పుడు వేడిచే అవస్థపడుచు చెమటలు కారుచుండ, మనుజుడు విసనకఱ్ఱను తీసికొని విసరుకొనుచు కొంత తాపమును తగ్గించుకొనుటకు ప్రయత్నించుచుండును. అట్టి స్థితిలో చల్లని గాలి మలయమారుతము స్వేచ్ఛగా వీచినప్పుడు ఎంత హాయిగా, చల్లగా ఆనందముగా నుండునో మానవులకు లేశమైన విచక్షణాశక్తి గలిగియుండినచో విశదమే!

మొన్న నొకసారి కైలాసములో నుండగా వర్షము కురియ నారంభించెను. ఆ రోజుననే శ్వాసను గురించి ఒక వ్యాసమును శ్వాసనే సర్వాధారముగా ప్రాణముగా వ్యక్తమైన ప్రకృతి యంతకు మూలముగా భావించి వ్రాసితిని. వర్షములో ఇటునటు పచారు చేయుచు ప్రతి ఉచ్ఛ్వాస నిశ్శ్వాసములో అహర్నిశము మనుజుడు శ్వాసచేతనే నింపబడి జీవించుచుండును గదా! అట్టి సర్వాధారమైన శక్తి స్వరూపమును మరచుటే మరణము. దానిని అనుభవించుటే జీవితము గదాయని శ్వాసలో విలీనమైయుండి మీద బడుచున్న వర్షపు బిందువులను జూచుచుండ క్రింద ప్రశ్న తలవని తలంపుగా వచ్చెను.

ప్రశ్న : అంతయు శ్వాసమయమైయున్న యీ వర్షబిందువులకును శ్వాసకును ఏమి సంబంధము గలదు?

(వెంటనే ఆలోచింపకయే యీ క్రింది సమాధానము వచ్చెను)

జవాబు: వర్షపు బిందువు స్వర్గము నుండి వచ్చుచున్న శ్వాస!

"It is the Breath of Heaven."

ఆహా దైవమునుండి స్వర్గమునుండి వచ్చెడి శ్వాస ఎంత చల్లగా శాంతిగా నున్నది.

ప్రశ్న : మనుజుని నుండి వచ్చెడి శ్వాస వెచ్చగా నున్నదేల?

జవాబు: ఈ శ్వాస స్వార్థముతో అహంభావముతో, అహంకారముతో, మమత్వముతో నిండి యున్నదిగాన వేడిగా నున్నది.

ఇక వెయ్యి ఆలోచనలేల, ప్రియమైన శాంతిపాఠకులారా! ఈ వర్షము వర్షముగాదు. ఇది పుష్పవర్షము. పూలవాన రండు! నాతో కలసి యీ క్రింది గీతమును గానము చేయుడు.

ఇది పుష్ప వర్షమే – ఇది ప్రేమ వర్షమే
ఇది ఆరోగ్య వర్షమే – ఇది శాంతి వర్షమే
ఇదియే బ్రహ్మానందామృత వర్షము.

ఓ దైవశ్వాసా! ఓ దివ్యమైన వర్షమా! రమ్ము! రమ్ము! నీకు స్వాగతము. నీ చల్లదనముచే కామ, క్రోధ, లోభ, మోహ, మద మాత్సర్యములచే నిండియున్న మానవుల వెచ్చదనము ఉష్ణమును తగ్గించి నీ పూర్ణ శాంతితో విలీనము చేసికొనుము. ఇదియే మా ప్రార్థన.

లోకా స్సమస్తా స్సుఖినోభవంతు !

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

(శాంతి జూన్ & జూలై 1957)

# 9. వేళంగి భక్తుడు

ఒక రోజున నేను పత్రికలకు వ్యాసములు వ్రాయుచుండ, ఒక భక్తుడు నన్ను చూచుటకై వచ్చి "శ్రీ స్వాములవారు యీ యడవులలో యింత బ్రహ్మాండమైన పనిని చేయుచుండ, రిక్తహస్తములతో వారి దర్శనమెటులు చేయగలను" అని నా వద్దకు వచ్చుటకు వెనుదీయుచుండెనని ఆశ్రమస్థులు చెప్పిరి. అప్పుడు యొక బత్తాయి నారింజ పండు నిచ్చి నన్ను జూచుటకై పంపిరి. ఫలము నర్పించి అపారమైన భక్తి ప్రేమలతో వందనము లాచరించి ఆసీనుడాయెను.

"అయ్యా! మా పశువులు రెండు వందలు యీ ప్రాంతములలో మేయుచున్నవి. మీరింతపని చేయుచుంటిరని తెలియలేదు. తెలిసియుండిన కొంత ధనము నర్పించి తమ పాదపూజను చేసి తరించెడివాడను. వట్టి చేతులతో వచ్చినందులకు మన్నింపుడు" అని ప్రార్థనపూర్వకముగా జెప్పెను.

నేనాతని భక్తి కానందించి "డబ్బు యిచ్చి దైవమును మరచేవారు చాలా మంది గలరు. భక్తి యనే పుష్పముతో, ఆశ్రమమునకు వచ్చి దైవము ననుభవించుటే నా కోరిక. యిచ్చట పాదపూజ మొదలైనవి లేనందున మీరు విచారింప నవసరములేదు. మీ భక్తి ప్రేమలకు చాలా ఆనందించితిని." అని జెప్పితిని.

ఈతడు చాల అమాయకముగాను, నిరాడంబరముగాను, పసిబిడ్డవలె మృదువైన వాక్కు గల్గి, ఎటువంటివారికైనను మహాభక్తునివలె గానవచ్చుచుండును. కొంత తడవు వేదాంత విచారణ గడిపిన తర్వాత ఆతడిటులనెను.

"అయ్యా! మా వేళంగి గ్రామము ధన, ధాన్యములకు, గొప్ప ధానధర్మములకు దేశ ప్రసిద్ధి కెక్కియున్నది. మావారు చాలా పుణ్యతీర్థములలో చాలా గొప్ప గొప్ప పనులను చేసి, సమారాధనలు, సంతర్పణలు జేయుచునేయున్నారు. మా గ్రామస్తుల దురదృష్టముచే తమరు మా గ్రామమునకు దయచేసియుండలేదు. లోకశాంతికై స్థాపితమై మానవసేవ జేయుచున్న యీ విశాలమైన ఆశ్రమమును గురించి మాకు తెలియనందున, మేము లేశ మైనను సహాయము జేయజాలక పోయినందులకు మా జన్మము నిరర్ధకములు" అనెను.

"ఎప్పటెప్పటికి, ఎవరెవరిచే, యేయే పనులు జరగనున్నవో, వాని కన్నింటికిని దైవమే కారణభూతుఁడు. ఇంకను ఆశ్రమముయొక్క నిజమైన పని ప్రారంభింపలేదు. భక్తుల సహాయముచే ముమ్ముందు దేశమునకు చాలా యుపయోగముగా నుండగలదు" అని నేనంటిని.

"ఒక్క వేళంగి గ్రామములోనే ఆరువందల గడపలున్నవి. వారందరు కమ్మవారే.

చాలమంది లక్షాధికారులు గలరు. వెంటనే మా స్వగ్రామమునకు వెళ్ళి యింటికొక బస్తా బియ్యము ప్రతి సంవత్సరపు వార్షికముగాను పైఖర్చులకు యింటికి రూ. 2, 3, 4, 5 ల చొప్పున కొన్ని వేలు శాశ్వత చందాలు నేర్పాటు చేసెదను. మా గ్రామములో దాన ధర్మములకు ప్రసిద్ధికెక్కిన శ్రీ పాతూరి బుల్లివెంకమ్మగారు మా మేనత్తగారే! ఆమెనుగూడ వారం రోజులలో ఆశ్రమమునకు తీసుకునివచ్చి శాశ్వతమైన ఏర్పాటులు చేయించగలను. ఆమె ఈ మధ్యనే ఒక లక్షా ఏబదివేల రూపాయలతో యొక పెద్ద సత్రము కట్టించినది. శ్రీశ్రీశ్రీ పిఠాపురం మహారాజుగారే అందులకు శంకుస్థాపన చేసినారని తమకు తెలిసియే యుండును. యిటువంటి ధర్మకార్యములు ఆమె యెన్నియో అనేక పుణ్య క్షేత్రములలో చేయుచుండును. ఆమె యీ ఆశ్రమము జూచిన మరలి యింటికే వెళ్లక ఇచ్చటనే శాంతిగా గడుపును." అని మన భక్తుడు నుడివెను.

మరికొంత ప్రసంగమైన తరువాత నా కుటీరము నుండి వెళ్లబోవుచు "అయ్యా యీ ఆశ్రమమునకెవరు సహాయము జేసినను జేయకున్నను నేనొక్కడనే ఆశ్రమ ఖర్చులన్నింటిని భరించగలను. మా తండ్రి 60 లక్షలు నాకు నా సోదరునకు పంచిబెట్టెను. సంవత్సరమునకు 50 వేల రూపాయలు భూములవలనను, 40 వేలు వడ్డీలవలనను వచ్చును. యిటీవలనే జగన్నాధమునందు సాలుకు రూ. 600 లు శాశ్వత అన్నదానమునకై ఏర్పరచితిని" అని చెప్పెను.

తర్వాత ఆశ్రమమున యాతని బసకు వెళ్లి ఆశ్రమ పేదస్థితికి విచారించుచు అనేక విధములుగా తప్పక తోడ్పడెదననియు, యికయేవిధమైన పేదరికము ఆశ్రమమను భవించనక్కర లేదనియు, ఇంటికి వెళ్ళగనే బండి బియ్యము వెంటనే పంపెదననెను. కొండ సమీపముననున్న సాగుభూమియందు అతి ప్రయాసతో నుయ్యి త్రవ్వించి ధన లోపముచే నిలుపుచేసిన నూతికట్టును తాను స్వంతముగా కట్టించెదననియు పాతాళగంగ వచ్చువరకు బోరింగు త్రవ్వించి యిందులకు కాగల ఖర్చు అధమము పది పండ్రెండు వందలకంటె హెచ్చుగాదు గాన ఈ స్వల్ప మొత్తమును భరించి వచ్చెడి మాసములలోనే పనిని ప్రారంభించి బోరింగు వేయుటకు యీ జిల్లాయందు అనుభవశాలురు లేనందున ప్రత్యేకముగా విశాఖపట్టణము నుంచి యీ పని నిమిత్తమై పిలిపించి త్వరలోనే పూర్తి జేయించెదననియు చెప్పెను.

ప్రస్తుతము మినిష్టరుగా నున్న శ్రీశ్రీశ్రీ బొబ్బిలి రాజాగారు తన ప్రియ స్నేహితులనియు, వారినిగూడ తీసుకొనివచ్చి విశాలమైన ఏర్పాట్లు చేయించెదననియు, శ్రీశ్రీశ్రీ పిఠాపురం మహారాజవారికిన్ని, శ్రీశ్రీశ్రీ కిర్లంపూడి రాజవారికిన్ని, శ్రీశ్రీశ్రీ లక్ష్మీనరసాపురం రాజాగార్లకున్నూ, ఇంకా తదితర జమీందార్లకున్ను, అప్పుడప్పుడు, 30,

40 వేలు బదుళ్లు యిచ్చుచుందుననియు నెమ్మదిగా మాటల సందర్భమున నుడివెను.

ఇంతకాలమునకు యిటువంటి మహాభక్తుడు ఆశ్రమమును వృద్ధిచేయుటకు దైవము సంకల్పించెగదా యని ఆనందముతో ఆశ్రమవాసులు కొందరు యితనికి వేడినీళ్లు యిచ్చే వారు, కొందరు ఫలహారములు యిచ్చేవారు, అనేకమంది అనేక రీతులుగా ఆదరించసాగిరి. మనకు సహాయము చేయనున్నవార్కి, చేయజాలనివార్కి మన ప్రేమ, ఆదరణ, నౌకరీతిగా నుండుగాక!

ఆదరించినకొలది నేదో యొక కొత్త వాగ్దానము చేయుచుండెను. వాటిలో ముఖ్యమైనవేమనగా:–

(1) ఆశ్రమమున తనపేరున ఒక పెద్దవసతి గృహము త్వరలోనే నిర్మించుటకు వెంటనే పనిని ప్రారంభించుట.

(2) బీదసాదలకు వినియోగించుటకు ఒక డాక్టరునుగూడా నియమించి ఆశ్రమవైద్యశాల వృద్ధిచేయుట.

(3) ఎంతమంది వచ్చినా నిత్య అన్నదానము జరుపుటకు ఏర్పాట్లు చేయుట యిటుల చాలా వాగ్దానములు చేసెను.

ఆ రోజున ఆశ్రమ పనిమీద నేను కాకినాడ వెళ్లవలసియుండెను. కాకినాడ వెళ్లుటకు పెట్రోలును ఆశ్రమఖర్చులకు మేము పొందుచున్న యిబ్బందులను మన భక్తుడు గ్రహించి తాను వెంటనే వెళ్లి రు.100 ప్రస్తుత ఖర్చులకు పోస్టుద్వారా పంపెదననియు, లేక కాకినాడలో ఎవరికైన యివ్వమనిన యిచ్చెదననియు చెప్పెను. శ్రీ పైడా శ్రీరామ కృష్ణయ్య జమీందారుగారు ఆ మరుసటి దినము శ్రీ రామతీర్థస్వాములవారి జన్మదినో త్సవమునకు రానున్నారనియు, వారిచే పంపిన బాగుండునని నేజెప్పితిని. నాలుగు పెట్రోలు డబ్బాలుగూడా కారు యుపయోగార్థము పంపమనెదరా? యని ప్రార్థన పూర్వకముగా కోరెను.

ఆ రోజుననే శ్రీమహాత్మా గాంధీగార్కి ఒక భక్తుడు 20 లక్షలు రూప్యములు దానం చేసినట్లు ఆంధ్ర పత్రికయందు గాంచి, ఆశ్రమస్థులుకూడా యిటువంటి భక్తుని మన ఆశ్రమాభివృద్ధి నిమిత్తము దైవము పంపెనుగదా! అని చాల ఆనందించిరి.

బెండపూడిలో తన బంధువులున్నారని కారుమీద అచ్చటివరకు వచ్చెను. బెండపూడికి కారు పోనిమ్మని డ్రైవరునకు చెప్పగా "స్వామీ! ధనలోపముచే మీరింత అవస్థపడుచుండ నేను బెండపూడి నెటుల వెళ్లగలను. కాకినాడ వచ్చి మా బంధువులయొద్దగాని రూ. 100 తీసుకొని వెంటనే ఖర్చుల నిమిత్తము యిచ్చెదను" అని నేను కోరకుండగనే చెప్పెను.

సన్యాసులు నిరంతరము వారికున్న దానిని యితరులతో పంచుకొనుటయే ధర్మము. వారివద్ద నేమియు లేకున్న రక్త, ప్రాణములను మానవసేవకై వినియోగించవలెనుగాని, ఎంత అవస్థలోనైనను యితరులను యాచించరాదు. చిరకాలము నుండియు, యెన్నటికైనను దైవము ఎవ్వరినీ డబ్బు అడుగకుండా ఏ అవస్థలలోనైనను చేయిచాచకుండా నుండే రోజులెంతలో వచ్చునని యెదురుచూచుచుంటిననియు ఆశ్రమ పేరనైనా యెవ్విధమైన యాచన, తొట్రుపాటు లేకుండెడి స్థితి దైవము యిప్పటికి గల్గించనున్నందులకు కృతజ్ఞతా వందనములనియు తెల్పితిని.

నేను త్వరలో అమెరికా దేశము వెళ్లనుంటినని తెలిసినవాడై "స్టీమరు ఖర్చులకు అమెరికానుండి భక్తులు పంపెదరని తెలిసినది. అది హిందూదేశపు భక్తులకు చాల అగౌ రవము గాన ఆ స్వల్ప మొత్తమును నేనే ఏర్పరచెదను" అని వినయపూర్వకముగా నుడివెను.

"ఇంకను కొందరు రాజులను, జమీందార్లను చూచి ఆశ్రమమునకు కొంత మూలనిధిని తమరు అమెరికా దేశమునకు వెళ్లకమునుపే ఏర్పాటు చేసెదను" అని చెప్పగా" యిప్పుడేమి మూలధనమవసరము లేదు. తినుటకు బియ్యము నేర్పాటు చేసిన అదియే ప్రస్తుతమునకు చాలును" అని చెప్పితిని.

కారులో ప్రయాణము చేయునప్పుడు కాకినాడకు సమీపమున టైరు కన్నము పడుటచే, బాగచేయుటకు అరగంటకాలము ఆగవలసివచ్చెను. "ఈ కారు చాల చిన్నదిగను పాతదిగను యున్నది. త్వరలో 3000 రూపాయలు వెచ్చించి కొత్తకారును ఏర్పాటు చేసెదను." అని యా భక్తుడనగా "ఆశ్రమమునకు యిదియే చాలును. అడవులలో నుండు టచే చాల అవసరములోనే ఎప్పుడో వాడుచుందుము గాన దానిని గురించి తమరు విచారించ నవసరములేదు" అని నేను జెప్పితిని.

ఆశ్రమములో శ్రీ సూర్యనారాయణగారు యుత్తరదేశపుయాత్ర జేసివచ్చి బట్టలైనను లేకుండ చాల అవస్థ పడుచుండుట చూచితిని. వారికి కూడా పాతిక రూపాయలు యిచ్చుటకు మీరు అనుజ్ఞ యివ్వవలయు" నని కారునుండి దిగబోవు సమయమందు నన్ను కోరెను. నేనే యెవ్వరిసహాయమునైన కోరివారికి తోడ్పడవలయునని తలచుచుంటిని. మీరే ఆ పనిని చేసిన నాకు తోడ్పడినవారగుదురు" అని చెప్పితిని.

ఆశ్రమభక్తులైన శ్రీ దర్భా వెంకటశివరామదాసుగారి యింటివద్ద యుందునని తెలుసుకొని, వారు తన వకీలుగారేయనియు, అచ్చటికి రూ. 100 తీసుకొని 1 గంటలో వచ్చెదనని చెప్పి కోర్టువద్ద అనేకమగు కృతజ్ఞతా నమస్కారములతో కారు దిగెను.

శ్రీదాసుగారి యింటివద్ద పత్రికలయొక్క వ్యాసములను చదువుచు మన భక్తుని

రాకకై దగ్గర, దగ్గర, అర్ధరాత్రివరకు నిరీక్షించుచుంటిని గాని నిష్ఫలుడనైతిని, వచ్చినయెడల అతని సహాయము వెంటనే ఆశ్రమమునకు అందజేయవలెనని శ్రీ దాసుగారితో చెప్పి కాకినాడ వదలితిని.

మనభక్తుడు అతని పేరు మెర్ల సుబ్బారావుగారు అని చెప్పెను. ఆ పేరు తనదో కాదో చెప్పజాలను.

కాకినాడ రాజాలకున్నను ఒకవేళ ఆశ్రమమునకు వచ్చునేమోయని, యింకను యాతని రాకకై నిరీక్షించుచున్నాను.

మా 'శాంతి' పాఠకులలో ఎవరైనను యీ భక్తుని యెచ్చటైనను, ఎప్పుడైనను కలసికొనుట తటస్థించినచో మేము యింకను యాతని రాకకై ఆతురతతో నిరీక్షించు చున్నామని తెలిపి వెంటనే ఆశ్రమమునకు పంపుటకు యేర్పాటుచేయ ప్రార్థితులు.

లోకాస్సమస్తా స్సుఖినోభవంతు !

ఓమ్ శాంతి శ్శాంతి శ్శాంతిః

(శాంతి అక్టో & నవం 1959)

## 10. విశ్వపూజ

బాహ్యపూజ, మానసపూజ, ఆత్మపూజ అని, మనము బోధపర్చుకొనుటకు, పూజలను మూడు రీతులుగా విభజింపవచ్చును.

1. బాహ్యపూజ గురించి తెలియనివారెవ్వరును ఉండరు. ఏలనన, లోకములో ప్రతీ మానవుడు, దుర్లభమైన మానవజన్మను పొందగలిగితినని గ్రహించినచో, దైవమును, ఏదో ఒక విధమైన ఆకారములో పూజించుచు, గమ్యస్థానమును జేరుటకు ప్రయత్నించు చుండును.

2. బాహ్యపూజా పునస్కారములను, బాహ్య చిహ్నములను వదలి, మానసికముగా, తమ యిష్టదైవమును, తమ హృదయస్థానమునందో, భ్రూమధ్యముననో, నిరంతరము ధ్యానించు ఆదర్శమైన, పరమ పావనమైన జీవితములను గడిపెడి మహనీయులనుగూడ, అచ్చటచ్చట మనము గాంచుచునే యుంటిమి.

3. ఇక ఆత్మపూజ జేయు మహనీయులో, వీరు చాల అరుదు. వీరే విశ్వపూజజేయు మహాత్ములు. ఏలనన విశ్వపూజ అన్నను, ఆత్మపూజ అన్నను ఒక్కటే! ఈ పూజకు పుష్పములు ఫలములు, ధూపదీప నైవేద్యములు అవసరములేదు.

ఈ విశ్వపూజలో హృదయస్థానమును, భ్రూమధ్యస్థానమును మీరి,

ఆత్మస్థానమునందే, బ్రహ్మవిదులు నిరంతరము ఆత్మపూజను సహజముగా అహర్నిశములు జరుపుచుండిరి.

లోకములోయున్న పూజలన్నిటిలో యీ విశ్వపూజయే మహోత్కృష్టమైనది. ఈ మహా పూజయే అద్వితీయమైన భావనతో, అప్పుడిప్పుడనక నిరంతరమును జరుగుచున్నది. ఇట్టి మహాపూజను చేయువారి జీవితములు ధన్యవంతములు. ఈ దివ్యమైన విశ్వ పూజలో నేను పూజ చేయుచుంటిననెడి భావనయేలేదు. ఆ పూజ అహర్నిశములు తనకు తెలియకుండగనే నిరంతరము జరుగుచున్నది.

ప్రశ్న : ఆ దివ్యమైన పరమపావనమైన, సహజమైన విశ్వపూజయెద్ది?

జవాబు : అదియే విశ్వపూజ, ఆత్మపూజ, సోహం భావనతో నిరంతరము జరుగుచున్న మహాపూజ.

ఈ మహాపూజ, మనుజుడు నిద్రపోవుచున్నను, బాధలో వున్నను యెన్ని పని తొందర్లలో, అవస్థలలో వున్నను నిరంతరము జరుగుచునే యున్నది. ఈ మహాపూజలో ప్రతీ వ్యక్తియు, తెలిసియున్నను, తెలియకున్నను యిమడ్చబడియే యుండెను. ఏలనన, యీ సోహం పూజలో, అజపగాయత్రిపూజలో, బ్రహ్మాండములన్నియు యిమడ్చబడి యున్నవి.

జాగ్రద్‌స్వప్న, సుషుప్తి అవస్థలలోగూడ, యీ విశ్వపూజ అహర్నిశములు ప్రతీ మానవునియందును, సహజముగా జరుగుచునే యున్నది. తనకు తెలిసియున్నను, తెలియ కున్నను, సోహం మహామంత్రము సదా స్వాభావికముగా, వాక్కుతోగాక, శ్వాసతో, అనుభవింప బడుచునే యున్నది. అదే నేను, అదే నేను, ఆత్మనే నేను, నేనే ఆత్మ, సోహం, సోహం అని, ప్రతీశ్వాసయు, శబ్దరహితమైన శబ్దములో ఉచ్ఛరించుచున్నది.

మానవుడు, కండ్లు ఉండియు గ్రుడ్డిగా, చెవులు ఉండియు చెవిటిగా, మనస్సు ఉండియు జడుడుగా ప్రవర్తించుట విచారకరము. విశ్వపూజ నిరంతరము, రాత్రిం బగళ్ళు జరుగుచున్నను, మానవునకు, ఆ జ్ఞప్తి, ఆ స్పర్శ, ఆ అనుభవమే లేకుండుట చాల విషాదకరమైన అంశము. అమృతము నిరంతరము తనలో ప్రవహించుచున్నను, అమృత పానము జేసి, శాంతిని బడయుటకు బదులు, ప్రవృత్తిపరుడైన మనుజుడు, తన యింద్రియ ములను బాహ్యావిషయములవైపు, పరుగెత్తించుచు, విషమునే గ్రోలుచు, తృప్తి పొందు చుండుట, చాలా లజ్జాకరమైన, ఏహ్యామైన దుస్థితి.

అనుభవనీయులైన, యోగిపుంగవులు వారి సాధనలచే ప్రతి మానవుడును తనకు తెలిసియున్నను, తెలియకున్నను, నిత్యము రోజునకు 21,600 మార్లు ఉచ్ఛ్వాసని శ్వాసములలో మహాపూజను, సోహంభావనతో జరుపుచుండెనని వచించియుండిరి. అహర్ని శములు ఈ మహాపూజ జరుగుచున్నను ఒక్క నిమిషమైనను, ఒక్క శ్వాసనైనను, దినమునకు

ఒక్కసారియైనను అనుభవింపజాలని, మానవులను, మనుష్యమాత్రులని జెప్పుటకు సిగ్గుపడవలసియున్నది.

ఈ విశ్వపూజ, సన్నిహితులు, దూరస్థులు, స్నేహితులు, విరోధులు అనెడి భేదభావన లేకుండ అందరినీ ఒక్కటిగా జేయుచున్నది. ఎన్నటికైనను ప్రపంచములో శాంతిస్థాపన చిరస్థాయిగా జరుగవలెనన్న యీ మహాపూజయే, విశ్వపూజయే, సోహం భావనయే. కీలక ముగా, చక్కనైన, తప్పనిసరియైన రాజమార్గముగా, ప్రత్యక్షముగా, బట్టబయలుగా వెలుంగవలెను.

బాహ్యపూజలవల్ల మానవుడు, వైకుంఠమునకు వెళ్ళవచ్చును. మానసపూజవల్ల మనోశాంతిని బడయవచ్చును. గాని జన్మరాహిత్యమును బడయుటకును, లోకశాంతికి తోడ్పడుటకు, మానవ కళ్యాణమునకు యీ విశ్వపూజయే మూలకారణమైయున్నది.

ఈ విశ్వపూజలో సముద్రములో కెరటములు ప్రణవగానముతో నిరంతరము ఆరాధన జేయుచున్నవి. పక్షులు ఓంకారమును పాడుచున్నవి. గాలి వీచుచున్నది. సూర్యుడు ఆత్మ తేజస్సుతో ప్రకాశించుచుండెను. నక్షత్రములు, మిణుకు మిణుకు మనుచు సోహం భావననే చాటుచున్నవి. మనుజునిలో, కదలెడిది, మెదలెడిది, ఆలోచించెడిది వ్యక్తమైనదంతయు యీ సోహం భావనయే.

ఆత్మస్వరూపమే, నామరూపము లన్నింటిని సృష్టినంతను వ్యాపించియున్నది. చలనము అంతకును, ప్రతీ పనికిని ఆత్మయే కారణము. పాలలో వెన్న యిమిడియున్నట్లు సృష్టిలో పరబ్రహ్మము నిబిడీకృతమై యుండెనని, బ్రహ్మవిదులు పలుకుచుండిరి. గాన యీ విశ్వమంతయు నిరంతరము, విశ్వపూజలోనె ఆడుచు తేలుచున్నది.

కెరటము సముద్రమునుండి ఉద్భవించి, అందేయుండి మరల సముద్రమునందే లీనమవుచున్నట్లు యీ బ్రహ్మాండములన్నియు, అఖండమైన, సోహంనుండి వచ్చి సోహంలోనె యుండి, సోహంలోనె లీనమవుచున్నవి. ఇక వ్రాయుటకుగాని, జెప్పుటకుగాని, వర్ణించుటకుగాని ఏమియున్నది?

సోహం భావనను యెప్పుడో యెన్నడోగాక, యిప్పుడు, యిచ్చట అనుభవించుటే ముఖ్యము.

ప్రియమైన పాఠకా, ఒక్కతరి నిమీలిత నేత్రుడవై అంతర్ముఖ దృష్టిచే, నీ జన్మహక్కై నిరంతరము నీలో వెలుంగుచున్న "సోహం" మహామంత్రమును నీ ఉచ్ఛ్వాసనిశ్వాసములలో 21,600 మార్లు అజపగాయత్రిగా ప్రవహించుచున్న విశ్వమంత్రమును యీ క్షణము నుండియైనను గుర్తించుచు దానిని అనుభవించుచు గమ్యస్థానమును జేరుదుము. విశ్వపూజ నిన్ను ఆహ్వానించుచున్నది. తరించుట కిదియే సమయము.

ఈక్షణమే నీది సోహమస్మి.

లోకాస్సమస్తా స్సుఖినోభవంతు, ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః (శాంతి మార్చి 1960)

# 11. వాక్ శుద్ధి

వాక్శుద్ధి గల్గినవారు సత్యవంతులు. వారే మహాత్ములు, అవతార మూర్తులని చెప్పవలెను. వారు ఏ మాట అన్నను జరిగితీరును. జరిగెడి మాటలే వారు వచించుచుందురు. ప్రకృతి విరుద్ధమైన, విపరీతమైన జరగని మాటలు వారి నోటినుండి యెన్నడును రాజాలవు.

వాక్శుద్ధి గల్గియుండుట ఎంత అదృష్టము. అది పరమపావనమైన పవిత్రత వలననే వచ్చును. ఆంతర్యమున పవిత్రత, బాహ్యమున పవిత్రత; పవిత్రత సత్యము నుండియే వచ్చును. సత్యసంధానుభూతులదే పవిత్రత, సత్యము, ఆస్తేయము మొదలైన అష్టవిధములైన పుష్పములతో దైవము నారాధించు వారిదే వాక్శుద్ధి.

మన దినచర్యలోగూడ చిన్నచిన్న సంఘటనలలో వాక్శుద్ధి వ్యక్తపరచవచ్చును. కోటగిరి శాంతి కేంద్రములో ప్రాతఃకాలమున రాత్రి 6-30 గంటలకు నిత్యము ప్రార్థన భజన జరుగుచుండును. ప్రార్థన మందిరము విద్యుద్దీపములతోనేగాక, చిన్నచిన్న బల్బులతో అమర్చబడిన సంస్కృత ప్రణవము 'ఓం' రాత్రి ప్రార్థన చేయునపుడు ప్రకాశముగా వెలుంగుచుండును. మొన్న రాత్రి హఠాత్తుగా దీపములు ఆరిపోయెను. ఒక్క లక్ష్మీ విల్లా ప్రార్థన మందిరమందే గాదు. కోటగిరి అంతా దీపములు ఆరిపోయెను. ఎటు చూచినను అంతయు అంధకారమే ఆంతర్యమున చీకటి బాహ్యమున చీకటి, చుట్టును చీకటి, ఆ సమయములో ఒక మహనీయుడు చెప్పిన **అంధకారము నుండియే క్రొత్త వెలుతురు, ప్రకాశము వచ్చును.** అన్న మహావాక్యములు జ్ఞప్తికి వచ్చెను.

మనము చీకటిలోగూడ మార్గములోనే యుంటిమట.

దైవములేని క్షణము లేదుగదా! దైవములేని తావు సూదిమొన మోపుటకైనను లేదుగదా!

దైవము నుండి వచ్చితిమి.
ఇప్పుడు దైవములో నుంటిమి.
మరల దైవములోనే లీనమగుచుంటిమి.

దైవములేని తావు మన జీవితములో ఒక్కక్షణమైనను లేదుగదా! గాన అంధకారములోగూడ మనము దైవములోనే యుంటిమి. దీపము లారిపోయెను. దీపములు ఆర్పివేయుట సులభముగదా! ఇంకను చీకటిలోనే యుంటిమి. ఎంతసేపటికి మరల వెలుతురు రానందున, శ్రీరాజాజీ చిన్న కిరసనాయిలు దీపమును వెలిగించిరి.

ఎలక్ట్రిక్ దీపములముందు చిన్న కిర్సనాయిలు దీపము ఎంత అల్పమైనది? అదిగూడ ఏలనో ఆరిపోయెను. కండ్లు మూసినా చీకటే, కండ్లు తెరచినా చీకటియే! ఆ చీకటిలో అటులనే కూర్చొనుట కొంత ఆనందము నిచ్చుచుండెను. ఆశ్రమవాసులు, గురుకుల బాల బాలికలు, భక్తులు చీకటిలోనే ఆనందముగా, వెలుతురునకై చాల ఆతురతతో జూచుచు భజనచేయుచుండిరి. దీపములింకను వెలుగకుండెను. 5 ని॥ లయ్యెను. 10 ని॥ లయ్యెను. 15-20 ని॥ లయ్యెనుగాని ఎంతకును దీపములు వెలుగవాయెను.

కోటగిరి పట్టణమంతయు అంధకారముతో నింపబడెను. అది ఒక విచిత్రమైన అనుభవము. బ్రహ్మవలన నారదున కుపదేశింపబడి కలియుగమునకు మహామంత్రముగా తలచబడిన-

**ఓం హరేరామ హరేరామ రామరామ హరేహరే**

**హరేకృష్ణ హరేకృష్ణ కృష్ణకృష్ణ హరేహరే**

అనెడి మహామంత్రమును దీపములు వచ్చెడివరకు విడువకుండా, భక్తిశ్రద్ధలతో పాడ మంటిని. ఆంతర్యమున, బాహ్యమున దైవసన్నిధి ననుభవించుచు, హృదయపూర్వకముగా దైవపరితాపనతో గీర్తించిన తప్పక దీపములు వెలుంగునని చెప్పగనే ఆశ్రమవాసులు, బాలబాలికలు భక్తులందరూ ఆనందముతో పాడసాగిరి. ఒక్క నిమిషము గడచెను. రెండవ నిమిషము గడువకుండగనే హాలు అంతయు వెలుతురుతో ప్రకాశవంతముగా నిండి యుండెను. ఎంత ఆనందము, ఎంత అదృష్టము!

ఎటు జూచిన ప్రకాశమే! ఆంతర్యమున జ్యోతి, బాహ్యమున జ్యోతి, అన్నివైపులను జ్యోతి స్వరూపమే! దీపములు వచ్చినను ఆశ్రమభక్తులు, బాలబాలికలు, మహామంత్ర స్మరణను ఆపివేయలేదు. దైవసన్నిధిని అనుభవించుచు ఇంకను పరవశత్వముతో ఓం హరే రామ మంత్రమును కీర్తించసాగిరి.

ఈ తేజస్సు శక్తి అంతయు వాక్శుద్ధిలో నున్నదా? లేక, హరే రామ మంత్రములో నున్నదా? వాక్శుద్ధిలోనే హరేరామ యుండెను. హరేరాముడుండు చోటనే వాక్శుద్ధియు గలదు. వాక్శుద్ధి హరేరామ రెండుగావు, ఒక్కటే, వాక్శుద్ధి గల్గిన హరేరాములకు ధన్యవాదములు, వారే జ్యోతి స్వరూపులు. శాంతిధాములు.

లోకాస్సమస్తా స్సుఖినోభవంతు

ఓం శాంతిశ్శాంతిశ్శాంతిః

(శాంతి మార్చి 1963)

# 12. వచ్చియుంటివి యోయి ! నా స్వామి నీవు

అనువాదము : శ్రీ దివాకర్ల రామమూర్తిగారు

ప్ర : నీ వెన్నండు వచ్చియుంటివి?

జవాబు : ఎన్నడనియా? అడుగుచుంటివి? చాలకాలము వెనుక ఎన్నడో! నీ పుట్టుక నాటినుండి....కాదు....కాదు....ఈ పుట్టుకకును పూర్వము నుండియు..... కాదు.....మొట్టమొదట నుండియు....నీ తోడనే యుంటిని.

అయ్యో నేనెంత మూర్ఖుడను! ఎంతటి అవివేకిని...నీవెల్లప్పుడు నా స్వామి... నా తోడనేయుండ నిన్నేమరిచి, విస్మరించితినే... తల్లి ప్రక్కనేయుండ ... సముద్రతీరపు టిసుకలో బొమ్మరిండ్లు పిచ్చుకగూండ్లు కట్టి ఆడుకొను నాటలోఁ దన్మయుండై యుండు చంటి బిడ్డను నేను... ఆయాటంతయు నైన వెనుకనే 'ఆట గొల్లంచు' ఆ కట్టడాలఁ గూలదన్ని ఆ బిడ్డ తల్లి యొడిలోనికి వేగముగాఁబోయి వ్రాలును...

* * *

ఓ స్వామీ? నీవు నా తోడనే-నా ప్రక్కనే...కాదు నాలోనే యున్నావన్నది మరచి, సందేశములు ఉత్తరములు వ్రాయుటలో సర్వాత్మనా నిమగ్నుఁడనై యుండుట యెంతటి నా బానిసత్వము.

దివి సూర్య సహస్రయుగ పదుదయముతోఁ దుల్యమైన యప్రమేయమైన భవద్దివ్య ప్రకాశము చెంత నా స్వామీ! ... ఈ పరిచ్ఛిన్నములయిన యుపదేశముల నెంత? నీ ముందు ... మాటలు రావు; నేను మూగినగుదును; కొయ్యబారిపోదును; నాకు చేతులాడవు, నా మనస్సు ఆలోచింపలేక యుండును; ఇక వ్రాయవలసిన దేదియు నుండదు, ఇంక నా క్రీడయును ముగిసినది.

నీవో! నా స్వామీ! పిలవకుండగనే వచ్చి నా హృదయ గహ్వరమునఁ దిష్టవేసికొని యున్న అతిధివి! అయ్యో నేనో! నా జీవిత లక్ష్యము-నా ఆత్మ నాకు సర్వస్వము-అయిన నిన్ను మాత్రము విడిచి, మిగిలిన వన్నింటితోడను గొట్టుమిట్టాడుచు విరామము లేనియట్టి మంకుపట్టిన బిడ్డవంటివాడను.

"స్వామి నా హృదయంపు దేవాలయాన
నధివసించు : ప్రపంచకమ్మంత యింక
పూర్ణ నిశ్శబ్దమున నుండి పోవుగాక!"

అని జపింప నా హృదయ మానందమునఁ దాండవించును.

* * *

అవును ! నా స్వామీ ! నీవు వచ్చియుంటివి,
నీ వెన్నండును నాతోడనే యుండనే యుంటివి!
నిన్ను నే బాహ్యమునందంతటను సంద
ర్శింతును; నాలో నిన్ననుభవింతును; నీవు
నా చుట్టును నెల్లెడల నుంటివి; ఇంక
నేనేమి వ్రాయగలనో! ఏమి పలుకాడ గలనో!

ఓ స్వామీ నీవే మాటాడుము! నీవే మాటాడుము! నీ భృత్యుడు చెవియొగ్గి వినును; ఏలయందువా! ఇహ నాకు ఆట కట్టయినది.

త్వమేవ మమ మాతా !
త్వమసి మమ పితా !
త్వమసి మమ మిత్రం !
త్వమసి మమ సర్వస్వం.
శాశ్వతమ్ముగ నీలోన సమసిపోవ
స్వామి! నన్ను నీలోన నీ క్షణమునందు
లయము కమ్మందువా।... ... ...

“వచ్చియుంటివి యోయి ! నా స్వామి నీవు
యొడలు తెలియని ఆనంద మొందుచుంటి”
జయము నీకగు ఓస్వామి ... జయము ! జయము!

ఓం ఓం ఓం

**: అంకితం :**

**ఇది శ్రీ జ్ఞానానంద మహరాజ్ స్వామివారి భావమయ, ప్రేమమయా గమన సూచకముగా అంకిత మొనర్పఁబడినది.**

(శాంతి ఫిబ్రవరి 1964)

# 13. విమర్శ

అన్నివిధములగు విమర్శలకు దూరముగా యుండగోరిన :-

ఏమియు చెప్పవలదు,
ఏమియు చేయవలదు,
ఏమియు కాకుండ నుండుము.

అనియెంతయో అనుభవముతో విజ్ఞులు తెల్పియుండిరి.

ఇతరుల క్షేమమును, మంచినికోరి అయినను నీవేమయిన చెప్పినచో, అపుడుగూడ నిన్ను విమర్శించువారెవరో యొకరు ఉండియే యుందురు. నీవు ఏదో ఒక యున్నతిని పడయగోరితివేని, నిన్ను చూచి ఈర్ష్యపడుచు నీ ప్రయత్నములను విమర్శించు వారుందురు. లోకోపకారమునకై నీవేమైన చేయదలచినను నీ తప్పులను పట్టువారు ఎవరో ఒకరుండనే యుందురు. నీ వేమియు చెప్పకున్నను, చేయకున్నను ఎందును జోక్యము కల్పించుకొన కున్నను నీ నిశ్శబ్ద చర్యలను విమర్శించుచు, నీవు భూభారమని తప్పులు పట్టువారు సదా యుందురు.

ఈ జగతిలో ప్రతి పనికిని ఏదియో ఒక ఆక్షేపణ యుండనేయుండును. సద్విమర్శ యందెంతో అభివృద్ధి యిమిడియున్నది. శాస్త్రీయ విజ్ఞానము దినదినాభివృద్ధి గాంచుచు మహోన్నత స్థితినందుచున్నది. మతము ఆధ్యాత్మిక సమావేశములను, గీతాయజ్ఞములను, దివ్యజ్ఞాన సభలను మొదలగునవెన్నియో గావించుచు, సత్యాహింసల వ్యాప్తి గావింపవలెనని ప్రయత్నించుచున్నది. అక్కటా! ఎంత శోచనీయము? ఈ శాస్త్రీయ విజ్ఞానముగాని, ఈ మతములుగాని, ఈ దైవాంశ సంభూతులుగాని, యీ విశ్వమానవాళి నంతను తృప్తి పరచగల అమోఘమగు దివ్యౌషధమును ఇంకను గుర్తింపజాలరైరి. దివారాత్రములు నీ శక్తి సామర్థ్యములనెల్ల వ్యయించి, నీ జీవిత మంతయు మంచి చేయు టలో వ్యయింపు చుండినను నీ కార్యకలాపములందు తప్పులు కాంచువారు యుందురు. బహుముఖులైన ఈ మానవాళినంతను తృప్తిపరచుట, నీకసంభవము.

"యద్భావం తద్భవతి" అనినట్లు మనలోపల ఏమిగలదో వెలుపలగూడ దానినే చూచుచుందుము. తనదృష్టి సంకుచితమైనదై పరిమితమైనదైన, ఇతరులలోగూడ అట్టిదియే కానవచ్చును. ఈ జగత్తు దర్పణము వంటిది. క్రిందను మీదను, నల్దిశలను అద్దములచే నిండియున్న గదిలోనికి ఒక కుక్కచొరబడిన ఏమి చేయును? అనంతమగు తన ప్రతిబింబములను కాంచి భీతిచే వణకుచు, వానిపై కురక ప్రయత్నించి, మొరిగి మొరిగి అలసటచే కడకు మరణించునుగదా! కాని ఆ భవన యజమానియే అందు ప్రవేశించిన

ఏమి జరుగును? అనంతమగు తన ప్రతిరూపములను గాంచి మహదానందము నొందును గదా! అట్లే మనుజు లెట్టిరంగు కండ్ల అద్దములు ధరింతురో జగత్తంతయు ఆరంగులోనే కన్పించును. కామెర్ల రోగికి లోకమంతయు పచ్చగా కన్పించినట్లు.

మనయందు ఏయే గుణములు అంతర్లీనమైయుండునో, ఇతరులయందు వానినే కాంచుచుందుము. మనము స్వార్ధపరులమైన, అందరును స్వార్ధపరులుగనే కనిపింతురు. మనము నిస్వార్ధపరులమైనచో, ఇతరులలోగూడ అద్దానిని గాంచి మెచ్చుకొందుము. మనలో మంచియున్నచో, ఇతరులలో మంచినే గాంతుము.

ఇంక నాపై గావింపబడు విమర్శల నొక్కొక్కటే విచారించెదము. నేను గావించు కొన్ని పనులు సరిగ అర్ధము చేసుకొనజాలని వారికి నా ఉద్దేశ్యమును వ్యక్తపరతును. శాంతి ప్రార్ధనను, శాంతి సందేశములను, ఇతరులతో పంచుకొనుచుండుటకూడ, కొందరు విమర్శింతురు. నావద్ద నున్న దేదియో అది ఇతరులతో పంచుకొనుచుండుట నా బాల్యము నుండియు నాకు అలవాటు. అంతియేకాదు, 53 సంііలు కృషి ఫలితమును యీ శాంతి ఆశ్రమ మూలసిద్ధాంతముగూడ యిదియే. నీవు దైవములో వసింపుము. ఇతరులను ఆ దైవ సన్నిధి నందుటకు తోడ్పడుము.

శాంతినొందక, శాంతి ప్రార్ధన నందుకొనక, ఎవరైన ఇచ్చటనుండి, తిరిగి వెళ్ళినచో, నన్నది బాధపరచును. వివిధ భాషలలో, వేలకొలది శాంతి ప్రార్ధనలను దైవస్వరూపులగు ప్రాక్పశ్చిమవాసులతో సదాపంచుకొనటయే, నా అభిమతము. శాంతి ప్రార్ధనలను తిరిగి తిరిగి పంపుట కొందరు విమర్శకులకు తప్పుగా కన్పడవచ్చును. ఆ భక్తులు వారి ప్రేమాస్పదులగు వారితో వానిని పంచుకొని ఆనందింతురనెడి ఆశతోనే వారికవి పంపుచుందును.

వారు డాక్టరై యున్న తనవద్ద కేతెంచు రోగులతో వానిని పంచుకొనవచ్చును. న్యాయవాదియైనచో తనవద్ద కేతెంచు క్లయింట్సుతో పంచుకొనవచ్చును. గురువు అయిన తమ శిష్యులతో పంచుకొనవచ్చును. ఆ విధముగా విశ్వమున శాంతి స్థాపన చేయుటలో తన హృదయమునగూడ ప్రధమమున శాంతి నెలకొనును. కాని స్వార్ధపరుడైన మానవుడు అజ్ఞానముచే, ఇతరుల తప్పులనే వెదకుచుండును. గాని, తాను మారుట కెంతమాత్రమును ప్రయత్నింపడు. తన కంటియందు దూలములనుంచుకొని, ఇతరుల కంటి యందలి నలుసులను వెదకమెదలిడును. నేను ఎవరిని ఈ ప్రార్ధనలనుగాని, సందేశములనుగాని ముద్రించు భారము వహింపుడని సాధారణముగ కోరను. గాని వారే యిందు గురించి అభిరుచి చూపించిన యెడల వీలువెంట అచ్చువేయించి, మీ, మీ బంధు మిత్రులతో వానిని పంచుకొని క్రమక్రమముగ విశ్వమున శాంతి నెలకొల్పుటకు ప్రయత్నించుడని

కోరుచుందును. అదికూడ వారికి కష్టమా? పరిమితమైన మానవుడు, ఈ రక్తమాంస భరితమగు యీ అల్ప శరీరమే తానని భ్రమపడుచు, ఇతరుల క్షేమమునే యోచింప జాలడు. అట్టి అమాయకులనుండి ఏతెంచినవే ఇట్టి విమర్శలు, సోమరుల మానసమే సైతాను కొలువు కూటమిగదా!

మరియొక విమర్శ ఏమన, ఆశ్రమ పోషణకై నేను భక్తులను ధనము కోరుచుంటినని, వర్షములు లేక పంటలు నష్టమైనపుడు, గురుకుల బాలబాలికలను, వయోవృద్ధులను, ఆశ్రమ వాసులను ఎట్లు పోషించుటయా అని ఆశ్రమ కోశాధికారియగు శ్రీ సుబ్బారాయుడు గారు, కుమారి జ్ఞానేశ్వరి,, శతవిధముల యోచించుచు తగినంత మూలధనము లేక, మరుసటి దిన ఆహార సమస్య ఎట్లాయని తలపోయుచుండ, ఆశ్రమ భక్తులను, ఉదారతతో నేను సహాయ మర్థించుట నేరమా? జరిగినదానికై నేనేమియు విచారించుటలేదు. ఆశ్రమాభి మానులను, నా వ్యక్తిగత స్నేహితులను మాత్రమే నేను కోరుచుందును. క్షుధార్తులైన బాలబాలికల, వయోవృద్ధుల ఆకలి బాపుటకై నేను తిరిగి తిరిగి అడుగుదునుకూడను. సకాలములో, ఉదారతతో వారొసంగిన విరాళములకు, ఆశ్రమాభిమానులకు, భక్తులకు నా కృతజ్ఞత లర్పించుచుంటిని. ఒక రిద్దరు విమర్శించిన విమర్శింతురు గాక!

మరియొక విమర్శ ఏమన, నాకు ఆశ్రమముతో అవినాభావ సంబంధము గలదు. నిజము! నిజము! నాకు ఆశ్రమముతో బంధముండుటయేగాదు, ఇంకనూ ఎక్కువగా ఉండవలెననెడి కోరిక గూడ కలదు. నా అనుబంధమే, ఈనాటి యీ ఆశ్రమ రూపచిత్రణ అంతియేకాదు. నాకు సమస్త మానవకోటి తోడను అనుబంధము కలదు. సకల జంతు సంతతితోడను బంధము కలదు. సకల పుష్పలతా గుల్మములతోడను అనుబంధము కలదు. వే యేల, సర్వము నా జీవితాంతర్భూత భాగములుగా కానవచ్చును. వాస్తవమునకు, ఈ ఆశ్రమము నా అనుంగు బిడ్డ. నా రక్త మాంసములు వ్యయించి, నా జీవిత సర్వస్వము నుండి ఆవిర్భవించినది. జాతి, మత, కుల విచక్షణలు లేక తన శాంతి సందేశమును, విశ్వప్రేమ సందేశమును, ఎల్లరితో పంచుకొనుటయే దాని ఆశయమై యున్నది.

మరియొక విమర్శ ఏమన, నేను అధికముగా మాట్లాడుచుంటినని, వాస్తమునకు, నే నెన్నడును ప్రాపంచిక విషయములనుగూర్చి మాట్లాడను. వార్తాపత్రికలను కూడ చదు వను. వార్తలకై ట్రాన్సిస్టర్‌కూడ, విను అలవాటు నాకులేదు. నా అంతరంగమునుండి వెలు వడిన విషయములే నా మనస్సు నందుండును. దూరతీరములనుండి భక్తులు ఇచ్చటకు వచ్చినప్పుడు దైవసన్నిధి నిప్పుడే ఇచ్చటనే అనుభవింపుడు అని వారితో చెప్పుచుందును. అట్లొనర్చుట, నా జీవితమంతయు వ్యయమైనను, చెప్పుచునే యుందును. కన్నులు మూతలు పడువరకు, శరీరము పతనమగువరకు నిస్వార్థ సేవలో యీ జీవితము గడపవలెనని

నా హృదయము కోరుచున్నది. ఒక భక్తుని దైవసన్నిధిని జేర్చుటకైనను నా తనువు, మనువు సర్వము అర్పించుటకు నా కెట్టి సందేహమును లేదు. ఈ జీవితము పవిత్రులగు భక్తులకే అర్పణ అగుగాక!

మానవులను నమ్మిన సదా నిరాశయే, దైవమును నమ్మిన ఎన్నడును నిరుత్సాహ మునకు తావులేదు. ఈ పరిమితుడైన మానవుని వలన నిరాశనంది, కొంతకాలమునుండి మూగజంతువులతో అనుబంధము కలిగియుండుటకు ప్రారంభించితిని. దివారాత్రములు ఛాయవలె నన్ను అనుసరించి, గంటలు, గంటలు నేను ధ్యానగృహమందున్నను, నన్ను ఈ బడా రామీ, చోటా రామీ సదా నా వెన్నంటి యుండును. అవియెంత ఛాయవలె వెన్నంటి నను, అవి ఒకదానితో నొకటి పోరుచు, రక్తసిక్తమగు క్షణములలో, ఈ మూగజంతువుల యెడగూడ, నిరాశయే జనించుచ్నుది. ప్రస్తుతము సుకుమార, సుందర, సుశోభితమగు యీ పుష్పములే ఎట్టి నిరాశను, కలిగించకున్నవి. ఆ నవవికసిత పుష్పములచెంత, వాటి ఆంతర్యములలోనికి గాంచుచు అట్లే చూచుచుందును. అవి ఎట్టి విమర్శకావింపవు. ఈర్ష్యా ద్వేషములన్న నేమియో వానికి తెలియదు. మనము అడుగకున్నను, విమర్శించినను, తమ సుగంధ పరిమళము వెదజల్లక మానవుగదా! సకల జంతు సంతతిచేతను నిరుత్సాహము జనించినను, ఇచ్చుటమాత్రము ఎన్నడు నిరుత్సాహము కలిగించనిదొకటి యున్నది.

ఈ దినములలో నాకు శక్తిని, ఆనందోత్సాహముల నిచ్చునది ఈ మృదు మధుర సుందర పుష్పములే. తమను ఇనుపమడమల జోళ్ళచే త్రొక్కువారికి సహితము, ఇవి సుగంధమునే వెదజల్లునుకదా! అనాదినుండియు ప్రపంచమొక్క తీరుగనే యున్నది. ప్రేమ స్వరూపుడగు ఏసు ప్రభువును మాత్రము విమర్శకులు విడిచి పుచ్చిరా? లేదు. ఇష్టమైనట్లు విమర్శించుటయేగాక, అతని శిలువపై కెక్కించువరకును వూరుకొనలేదుగదా! ఏది జరిగినను మన మేలుకొరకేగదా! ఈ విమర్శలుగూడ మన అభివృద్ధికే జరుగును. ఆధ్యాత్మికముగ, ఆంతర్యవృద్ధికై ఎంతైన ఉపకరించును నా జీవిత సర్వస్వమగు శాంతి ఆశ్రమ కార్యకలాపములకు నష్టము వాటిల్లినను, నిశ్శబ్దముగ అన్ని బంధములనుండి స్వేచ్ఛనంది శాంతిని, శక్తిని పొందవలెనని నా హృదయము కోరుచుందును. అట్లొనర్చినను ఈ విమర్శకులు వూరుకొనరు. ఏదోవిధముగ విమర్శించుటలోనేగదా వారి యానందము! నేను నిల్చిన, ఏల నిల్చితివందరు? కూర్చుండిన, ఎందుకు కూర్చుంటివందురు? నేను మాట్లాడిన విమర్శింతురు. నేను నిశ్శబ్దముగ యుండిన, విమర్శింతురు. ఇటువంటి ద్వంద్వములలో స్థానములేదని యనిపించుచుందును. ఈ విమర్శకులందరు నాలోని భాగములే యనియు, ఈ ఏకైక ఆత్మ స్వరూపమందలి అంశములే యనిపించును. సర్వకాలసర్వావస్థలయందును ఒకే సత్య స్వరూపముగదా వెలయుచున్నది.

నేను ఎక్కువగా కట్టడములు కట్టించుచు నా శక్తి సామర్థ్యముల నందు వెచ్చించు చుంటినని మరియొక విమర్శ కలదు. దూర దూర తీరముల నుండి భక్తు లేతెంచుచు, తమకు జప ధ్యానములకై ప్రత్యేక కుటీరములు కోరుచుండ, వారిని ఆహ్వానించి, వసతి కల్పించుటకు మన విమర్శకులిచ్చుట నుండరుకదా! అప్పుడు మేము ఎట్లు శ్రమ పడవలెనో ఆ విమర్శకు లెట్లూహింతురు? ఎన్ని విమర్శలున్నను, ప్రాక్పశ్చిమ వాసులైన భక్తులెల్లరకు మేము వసతి కల్పింప ప్రయత్నించుచునే యుందుము. దైవమునుండి మనకేది లభ్యమయ్యెనో, దానిని భక్తులతోడను, అర్హులగువారితోడను పంచుకొనవలెనని నా కెల్లప్పుడు అనిపించుచుండును. అందువలన దైవప్రేరణా జనితములగు ఆధ్యాత్మిక మెఱుపులు, మున్నగునవి విక్రయించుట యనిన నా కెంతయో విషాదముగ యుండును. అమూల్యములగు ఆ ప్రచురణలు ఉచితముగా నేను స్వయంగా యిచ్చుచుండుటకూడా విమర్శలకు గురి కావచ్చును.

విషాదభరితమగు యీ జగతిని ఆనందము ఎండమావులవలె మృగ్యము. నన్ను విమర్శించుటలో ఎవరైన ఆనందము నొందితిరేని నా జీవితము ధన్యమైనదని భావింతును. ఈవిధముగనైనను యీ విమర్శకులకు నా మూలమున ఆనందము లభించెనుగదా అని ఆనందింతును.

సత్యము, ప్రేమ, సౌభ్రాతృత్వము, శాంతి, విశ్వజనీనత మొదలగునవి వ్యాప్తిచేయుటకు తోడ్పడుదని ఆశ్రమాభిమానులను, స్నేహితులనేగాక, నన్ను విమర్శించువారినిగూడ అర్థించుచుంటిని. సర్వమత సామరస్యము, విశ్వమానవ సౌభ్రాతృత్వము, అందరమొకే దైవబిడ్డలమనెడి తలంపును కలిగియుండుడు. మీ పొరుగువారిని మీవలె ప్రేమించుచు, ప్రాక్పశ్చిమ వాసులెల్లరు మీ సోదరులే యనెడి భావముతో ప్రేమింపుడు. మానవ సేవయే మాధవసేవ. ఇతరుల నానందింజేయుటయందే మీ ఆనంద మిమిడియున్నది.

శాంతి కాముకులగు ప్రియ మిత్రులారా! శాంతి ప్రార్థనలకై, శాంతి సందేశములకై శాంతి ఆశ్రమమునకు వ్రాయుడు. అవి మీకొరకే, మీకు ఉచితముగా పంపబడును. మీ ప్రియ మిత్రుల తోడను బంధువులతోడను వానిని పంచుకొని, మీ గృహమును శాంతి నివాసముగ దివ్యత్వముతో నింపుకొనుడు. మీ బిడ్డలు ప్రహ్లాదులవలె, మీరాబాయిలవలె భక్తి తత్పరులయ్యెదరుగాక! మీ ప్రేమ బంధమున ఈ విశ్వమంతయు ఇముడుగాక!

లోకాస్సమస్తా స్సుఖినోభవంతు.

(శాంతి జూన్ & జూలై 1970)

# 14. విశ్వశాంతిమాల

"శ్రీరామ జయరామ జయ జయ రామ ఓమ్ అనే ఈ పవిత్రాక్షరమాల విశ్వ శాంతిని, వికాసాన్ని, ప్రకాశాన్ని ప్రసాదించే అమూల్యమైన, తేజోవంతమైన అక్షరమాల.

ప్రశ్న : ఈ అమూల్యమైన విశ్వశాంతిమాలను ధరించడానికి అర్హులెవరు?

జవాబు : విశాల హృదయాలు కలిగి ఆత్మార్పణం గావించిన కొద్దిమందిలో ఎవరి హృదయాలు సర్వమానవకోటి కొరకు, మూగజంతువులతోసహా పరితపిస్తాయో, వారే ఈ విశ్వశాంతిమాలను ధరించటానికి అర్హులు. ఈమాల ప్రపంచ శాంతికి మార్గదర్శకులయ్యే వ్యక్తులకు హృదయ శాంతి నిస్తుంది.

ఒక "శ్రీరామ"తో మనము ఆపాదమస్తకము శాంతి వెల్లువను నింపేవాని దర్శనమును పొందుతాము. పరిమితమైన ప్రతీ హృదయపేటిక ఆ పరమాత్మ అనంతకోటి సూర్యప్రభలతో నింపబడుతుంది. వాని సన్నిధి, ప్రకాశము మన శరీరాన్ని పూర్తిగా ఆవరించిన తరువాత "జయరామ" అనడంతో విశ్వమంతా రామమయమై శాంతిని, కాంతిని వ్యాపింపజేస్తుంది. ఒక్క "జయరామ" తో దగ్గరగానున్నా, దూరంగా నున్నా భారతదేశంలోనున్నా, అమెరికాలోనున్నా, ప్రతీవ్యక్తినీ విశ్వాత్మకమైన ఆ అదృశ్య తేజస్సు అవరిస్తుంది.

తరువాత "జయజయరామ" అనే ఈ పవిత్రములైన మూడు పదాలు ఉచ్చరిస్తే గతానికి, వర్తమానానికి, భవిష్యత్తుకి సంకేతాలుగా నిలిచిన ఈ మూడు పవిత్ర శబ్ధాలు మూడు కాలాలు ఏకంచేసి చైతన్యప్రదము, ఆత్మోజ్జీవకము ఐన వర్తమానక్షణంలో నిలుపుతాయి. చివరికి 'ఓం' అనే అక్షరాన్ని ఉచ్చరించి ఈ మాలని పూర్తి చెయ్యాలి. ఈ 'ఓం' కారమే మానవుని చరమగమ్యము. ఇది ఆత్మ స్వరూపము. వివేకం కలవారికి ఈ ఒక్క పదమేచాలు. ధ్యానిస్తే ఆత్మోన్నత్యాన్ని సులభంగా ప్రసాదిస్తుంది. రక్తమాంస మయమై ఈ అన్నమయ శరీరంతో సంబంధం పోయి అనంతకోటి సూర్యప్రకాశానికి ప్రకాశమైన ఆత్మప్రకాశం మనలో నిండుతుంది. ఈ మంత్రాన్ని మనం ధ్యానం చేద్దాం. ఇది మనకు ఆవేశాన్ని ఔన్నత్యాన్ని ప్రసాదిస్తుంది. యాంత్రికంగాకాక, చిలుకపలుకులుగా కాక ఈ మంత్రాన్ని మనస్సును, బుద్ధిని, ఆత్మను ఏకంచేసి దానియందే ఉంచి ధ్యానం చేయడం అభ్యాసం చేద్దాం.

శ్రీరామ జయరామ జయ జయ రామ ఓం.

ఈవిధంగా తెల్లవారుఝామున తొలిచూపు ప్రసరించినది మొదలు రాత్రి కన్నుమూత పడేవరకు ఈ విశ్వశాంతి మాలలను ఒకదాని తరువాత ఒకదానిని విశ్వక్షేమాన్ని కాంక్షిస్తూ ధ్యానంలో ధరిస్తూ ఉండండి.

ఈ విశ్వప్రేమ మాలికను నేను కూర్చినదానిని ఎవరికి అర్పించేది, ఎవరికేమిటి? అందరికీ ఏ ఒక్కరినీ ఈ విశ్వంలో వదలకుండా అర్పిస్తాను. ఈ పవిత్ర మాలికలు బాహ్య జీవితంలో ప్రవర్తించడానికి అందానికై ప్రజలకు అమ్మబడేవికావు. నివృత్తి మార్గంలో ధ్యానం చేసేవారికి, పరమాత్మకై తపించే వారికి ఉచితంగా ఇవ్వబడతాయి. ఈ అమూల్య అనర్ఘ విశ్వశాంతి మాలికలను కొనడానికి ఎవ్వరికీ శక్యంకాదు. ప్రపంచంలో ఉన్న ధన మంతా ఇచ్చినా దీని మూల్యానికి సరిపోదు. విశ్వానికే తమ హృదయాన్ని అర్పించినవారు, పరమాత్మకే తమ ఆత్మను సమర్పించినవారు విశ్వంలో అంతటా పశుపక్ష్యాదులతోసహా, సర్వత్రా పరమాత్మనే దర్శించేవారు ధన్యజీవులు. ఈ మాలికలను సులభంగా, ఉచితంగా పొందగలుగుతారు.

ఈ అల్పాల్పములైన మాటలను మాని ఇకనుంచి మనం "శ్రీరామ జయరామ జయ జయ రామ ఓం" అని సర్వదా ఉచ్చరిస్తూ ఉందాం. దీనితో మొదట మన శరీరం, తరువాత ప్రాక్పశ్చిమ దేశాలలో సర్వ విశ్వం, విశ్వాంతరాళంకూడ పరిపూర్ణ, అఖండ, అనిర్వాచ్య సచ్చిదానంద ప్రకాశంతో నిండి ఒకటౌతుంది.

హరిః ఓం తత్ సత్ ఓం

## : సమర్పణము :

**విశ్వప్రేమకు సంకేతముగా నిలిచిన శ్రీ ఆనందాశ్రమమందలి పూజ్యపాపాజీకి, పూజ్యమాతాజీకి నేను కట్టిన ఈ విశ్వశాంతి ప్రేమమాలికలలో మొదటి, రెండు మాలికలను సమర్పిస్తున్నాను. విశ్వములోని ప్రాణికోటినంతనూ జాతి, మత, వర్ణ, దేశభేదము లేక తమ బిడ్డలుగా భావించి ప్రేమించిన ధన్యజీవులు వారు, యదార్థమునకు ఈశ్వరుడొకడే, చైతన్య మొక్కటే, సత్యమొక్కటే, ప్రేమ ఒక్కటే, అందరి ఆత్మలలో ప్రవహించు శాంతి ఒక్కటే, వీనిలో భేదములు లేవు.**

శ్రీరామ జయరామ జయ జయ రామ ఓం:

ఓం! ఓం! ఓం!

(శాంతి జనవరి 1974)

# 15. శ్రీ సాయి భక్తులు

శ్రీ సాయి భక్తులకు నా హృదయములో నున్నత స్థానము కలదు. ఇంత మాత్రమున నితర భక్తులకు స్థానము లేదని కాదు. ఆత్మభావనతో నిండియున్న వారి హృదయములలో భక్తులకే గాక సమస్త జీవులకు స్థానముండును.

శ్రీ సాయినాథుడు ఆశ్రమములో వెలసినప్పటి నుండియు వందలాది భక్తులు ఆశ్రమమునకు వచ్చి సాయి ప్రార్థనఁ జేయుచు శ్రీ సాయిమందిరములో భజనలు చేయుట యానందదాయకమైన సంగతి. ఇప్పటివరకు దగ్గర దగ్గర వంద యుత్తరములైనను శ్రీ సాయి సహాయమును గోరుచు వ్రాయఁబడినవి.

ఈ యుత్తరములను వ్రాసెడి వారలలో చాలమంది శ్రీ సాయిని పరీక్షించుటకా యనునట్లు పసిపిల్లలవలె నాయన లీలలనే చూపుమని కోరుచుండుట విచారకరమైన విషయము.

శ్రీ సాయి పూజయను నా వ్యాసములో శ్రీ సాయి భక్తుల కాహ్వానమని నేను వ్రాసి నది మీకు మరల జ్ఞాపకము చేయుచుంటిని. ఆశ్రమ భక్తులు చాలమంది యాశ్రమములో శ్రీ సాయి లీలలను జూచుటకు రాఁగోరుచుంటిమని పలు తావులనుండి యుత్తరములు వ్రాయుచుండిరి. దైవభక్తితో నిండియున్న భక్తులందఱకును సుస్వాగతము. కాని యుంగరముల మీఁదను, పండ్లమీఁదను పేర్లు వ్రాయించుకొను నభిలాషతో రావలదు. మీరందఱును ముఖ్యముగా రావలసినదే. దైవచింతనతో రండు! దైవసన్నిధి ననుభవించుటకు రండు! శ్రీ సాయిలో విలీనమగుటకు రండు! స్వార్థరహితమైన విశ్వప్రేమను జవిచూచుటకు రండు! శ్రీ సాయినాథుని సేవాభాగ్యమునకై రండు! దేశవృద్ధికి లోకశాంతికిఁ దోడ్పడుటకు రండు! ఇదియే శాంత్యాశ్రమ వాసులు మీ కొసంగు సుస్వాగత శుభాకాంక్షలు!

ఆశ్రమమునకు వచ్చుచున్న వందలాది భక్తులలో శ్రీ సాయిలో లీనమైపోవుదమనెడి భక్తులు చాల యరుదై యుండుట శోచనీయము. తామర్పించిన పండుమీఁదనో, పుష్పము మీఁదనో లేక చేతిమీఁదనో శ్రీ సాయి నామమును వ్రాయుమని కోరెడివారు కొందఱు, ఉంగరములు, గాజులు, గడియారములు, గొలుసులు, మంగళసూత్రములు మున్నగు వెండి బంగారు వస్తువులను శ్రీసాయి సన్నిధి నుంచి సాయి నామమును వ్రాయుమని కోరువారు మఱికొందఱు. వారి వస్తువులు చాల విలువైన వగుటచే నవి పోవునేమో యను భయమున సాయి మందిరమునకుఁ దాళమువేసి కొందఱు కాపలాయుండవలసి వచ్చుచున్నది.

ఒక భక్తుడు కాకినాడ నుండి వచ్చి సాయి సన్నిధిని ఫలముల నుంచి తలుపులు

వేసి బైట కొంతసేపు నిలఁబడి పిమ్మట నా యొద్దకు వచ్చి "స్వామీజీ! సాయి తన నామమును నా పండ్లమీఁద వ్రాయుట కెంతకాలము పట్టును" అని నన్నడిగెను. అదియంతయు నీ స్వార్ధరహితమైన జీవితమును బట్టియు, నీ భక్తి శ్రద్ధలను బట్టియు నుండునని చెప్పితిని. దూరమునుండి వచ్చిన మరియొక భక్తుఁడు శ్రీ సాయినాథునకు జున్ను నర్పించి దానిపై నతని నామమును వ్రాయుమని కంఠముపైఁ గత్తిమోపి నిర్బంధించునట్లు రాత్రియంతయు నా గదిలోనే కూర్చుండెను.

మఱియొక భక్తుఁడు శ్రీ సాయి దర్శనమునకు వచ్చి 'శ్రీ సాయి మందు' అను విభూతిని మాతోఁ జెప్పకుండఁగనే దానిని వాడెడి విధానమును దెలిసికొనకయే (సదుద్దేశ ముతోనే యనుకొనుఁడు) తీసకొనిపోయెను. కొంత కాలమునకుఁ దిరిగివచ్చి రహస్యముగా విభూతిని తీసికొనిపోయినందులకు ఫలితముగాఁ దన శరీరమున బాధయు, మనస్సున నశాంతియుఁ బ్రబలినవని విభూతి పండును సాయి కర్పించి యాయనను క్షమార్పణకోరి యారోగ్యమును మనశ్శాంతిని బడసెను.

శ్రీ సాయినాథుని జ్యోతిష్కునిగను, మాంత్రికునిగను భావించి తన జీవిత భవిష్యత్తును గుఱించి లకోటాప్రశ్నలు వేసి వాటికి సమాధానములు శ్రీ సాయి నడిగి తెలిసికొని వెంటనే జవాబు వ్రాయవలెనని యుత్తరములు వ్రాయువారు చాలమంది కలరు.

కొన్ని యుత్తరములను జదువుచున్నప్పుడు నా చిన్ననాటి సంఘటన యొకటి–ఒక గారడీవాఁడు పట్టపగలు ప్రజలందరు చూచుచుండఁగఁ బొడినేలమీఁద గుడ్డవేసి తీయునంతలో ఫలములుఁగల మామిడిచెట్టును సృష్టించి యా పండ్లను గోసి మా కందఱ కును దినిపించిన దృశ్యము–నాకు జ్ఞప్తి వచ్చుచుండెను.

కొందఱు శ్రీ సాయినాథుని గారడీవానినిఁ జూచినట్లు చూచి తన పండ్లమీద, వస్తువులమీద నాయన నామమును వ్రాయుమని కోరుట హాస్యాస్పదమైనపని. అది వారికే గాక శ్రీ సాయినాథునికిఁ గూడ నగౌరవము. అట్టివారు శ్రీ సాయినాథుఁ డాశ్రమ ములో వెలసినందులకు నా మహానుభావుని సన్నిధిని మనశ్శాంతినిఁ బడసి యాధ్యాత్మిక ముగా వృద్ధియై జన్మరాహిత్యమును బొందక మితిలేని కోర్కెలతో, నర్థములేని యాశలతో దమ కాలమునేగాక శ్రీ సాయినాథుని యమూల్య కాలమునుగూడ వ్యర్థపుచ్చుచుండుట విచారకరము.

కాని యెవరు చేయుపని వారి కానందము. ఆడుకొనుచున్న పిల్లవానిని "నాయనా! శుచిగా నుండుము, దుమ్ములో దొర్లకుము." అని చెప్పిన నా బాలునికి గష్టముగా నుండును. ఆ బొమ్మలాట పూర్తియైన పిదపఁ దనంతట తానే యా ధూళినుండి బయటకు వచ్చును.

దైవచింతన లేకుండుటచే శ్రీ సాయిని మోక్షము నిమ్మని కోరుటకు బదులు నామ

రూపముల వెంటఁ బరుగెత్తుట, చిత్ర విచిత్రముల జూపుమని, రోగములు రూపుమాపుమని కోరుట జరుగుచున్నవి. ఎంత ధనమున్నను నెంత మేధాబలమున్నను దైవచింతన లేని జన్మలు మానవ జన్మలని చెప్పఁబడవు. దైవభక్తిఁ గలిగినవారే నిజమైన భక్తులు. అట్టివారు ముల్లోకాధిపత్యము నిచ్చినను నిరాకరించి పరిపూర్ణ శాంతిని మోక్షమును గోరుచుందురు.

కాలము విలువను గ్రహించని భక్తులు స్వల్పకాంక్షలతో నల్పాశయములతోఁ గాలక్షయ మొనరించుచుందురు. నేడే మనది. రేపు మనది కాదు. ఈ క్షణమే మనది. మరుక్షణము మనది కాదు.

కాన "యమూల్యమైన జీవితమును సద్వినియోగము చేసి తరింపుఁ" డని శాంత్యాశ్రమములో ననేక చోట్ల వ్రాయఁబడి యున్నది. కండ్లుండియు దీనిని జూడఁ జాలకుండుట చాల విచారకరము. మరల మరల వ్రాయుచుంటిని. మోక్షము నాకీక్షణము నందే కావలెనను తీవ్రమైన మోక్షేచ్ఛ భక్తుల మనుకొను వారిలో లేకుండుటచే విలువైన కాలమును చిన్నచిన్న యాలోచనలతో, వ్యర్థమైన మాటలతో, నిరుపయోగమైన పనులతో వ్యర్థపుచ్చుట జరుగుచున్నది.

నే నిటుల నా మనోభావములను వ్రాయుచుండుట కొందఱు సాయి భక్తులకు –ముఖ్యముగా నామరూపములకు దాసులైనవారికి నసంతృప్తినిఁ కలిగింపవచ్చును. కాని లక్కపిడతలతో నెంత కాల మాడుకొందుము? దుర్లభమైన మానవజన్మ యెందుకీ యఁబడెను? ఆత్మవిచారణ చేసి శ్రీ సాయి సన్నిధిలో నున్నప్పుడైనను నిత్యానిత్యవివేకము గలిగి శ్రీసాయిని కోరవలసినది కోరవలయును, గాని నా పండ్లపై నామమును వ్రాయుము. నా కుద్యోగము నిమ్ము, నా పిల్లవానికి వివాహము చేయింపుము. నా మనుమరాలికి సంతతి నిమ్ము, నా యప్పులు తీర్చుము. నా రోగములు పోగొట్టుమని పసికూనలవలెఁ బ్రాకులాడి మన జీవిత లక్ష్యమును, గమ్యస్థానమును మరువరాదు.

మన హృదయమును భగవంతున కంకిత మొనర్చి యాయననే నమ్మియున్నచో శ్రీ సాయినాథుని రూపముననో మరొక రూపముననో మన యర్హతననుసరించి మన వాంఛలన్నిటిని మనము కోరకుండఁగనే దైవము నెరవేర్చుచుండును. Deserve, no need of desiring–అర్హతఁ గలిగియుండుము, నీవు కోరనవసరము లేదు' అను వాక్యములో గంభీరమైన భావము గలదు. మన కేమికావలయునో మనకంటె దైవమునకే బాగుగఁ దెలియును. దైవభక్తిలో దన్మయత్వమును జెందుట మన పని. అప్పుడు దైవమే మన యర్హతానర్హతలను బట్టి మనకుఁ గావలసినది సమకూర్చుచుండును.

అల్పజ్ఞులమైన మనము సర్వజ్ఞుఁడైన దైవమును "నీవు నాకీ పని చేసెదవా? లేదా? ఈ వస్తువులపై నా పేరు వ్రాయనియెడల నిన్ను నేను నమ్మను" అని యనవచ్చునా?

చివరకు రోగులైనను మా రోగ నివారణ చేయనిచో మీ శక్తిని నమ్మమని యనరాదు. ఆ రోగ మెందుచేత వచ్చెనో దాని మూల మేమో తెలిసికొని జబ్బులోనైనను, బాధలోనైనను నిన్ను మరువక నీ జ్ఞప్తితో జీవించెడి శక్తినిఁ బ్రసాదింపుమని పరమేశ్వరుని ప్రార్థించుట నిజభక్తుల లక్షణము. అనేకమంది రోగబాధితులకు సానుభూతినిఁ దెలియఁబఱచుచు నేను వారికిచ్చు సందేశ మేమనఁగా, దైవనామమే, రామనామమే, సాయినామమే సమస్త వ్యాధులను నివారింపఁజేయును.

కావున మీరు మీ వ్యాధులను గురించి దైవమునకుఁ జెప్పనవసరములేదు. మీరా యుద్దేశముతో దైవమును ప్రార్థించవలదు. సర్వాంతర్యామి యగు భగవంతుఁడు మీరు చెప్పకున్నను మీ యవస్థలను దెలిసికొనఁగలడు. మీరు ప్రతిఫలాపేక్షారహితమగు దైవభక్తితో నున్నచో దైవమే మీకు మానసిక, శారీరక సౌఖ్యములను జేకూర్చును.

ఒకచోట దైవమిట్లు చెప్పెను. "నీవు నా పనినిఁజేయుము. నేను నీ పనిని జేసె దను." అనఁగా నిష్కల్మషమైన భక్తి శ్రద్ధలుగల మనస్సుతో మానవుఁడు దైవము నారాధిం చినపుడు దైవమే వాని లోటులను తీర్చును. అంతియేగాని దైవమును మన కోరికలను తీర్పుమని మనము ప్రార్థనలు, భజనలు చేయరాదు.

దైవము మన తండ్రి, తల్లి, గురువు సర్వమును, మన యాధారమును గమ్య స్థానమును గూడ దైవమే. ఆయన లేనిచో మన మొక్కక్షణమైనను జీవించలేము, అను పట్టుదలతో మనము దైవధ్యానము చేయవలెను.

సాయి భక్తుఁడగు గొప్ప యుద్యోగస్థుఁ డొకఁడు తానొక రూపాయి పంపుచు నిట్లు వ్రాసెను. "స్వామీజీ! నాకు సాయి యందు భక్తిమెండు. శ్రీ సాయికి నాయందాప్యాయ మధికము. కాన నీ రూపాయితోనొక క్రొత్త విభూతి పండును కొని దానిని సాయి సన్నిధి యందుంచి మా యింట్లో నన్నే ముద్దుపేరుతో మావారు నన్ను పిలచెదరో యా పేరును శ్రీ సాయినాథునిచే విభూతిపండు మీద వ్రాయించి వెంటనే నాకు పంపుఁడు. సాయినాథుఁడు తప్పక నా పేరు వ్రాయును."

ఈ యుత్తరము జదివినంతనే నా హృదయము నుండి తలవని తలంపుగా శ్రీ సాయినాథుని ప్రార్థన యిట్లు వెలువడినది. "ఓ సాయినాథా! సర్వాంతర్యామి! ఈ నూతనకర్మ నుండి నాకు విముక్తియే లేదా? దైవమా!"

వెంటనే యీ పై రూపాయి పంపిన భక్తునకు శాంతి ప్రార్థనను విభూతితో బంపి నిరంతరమును శాంతి ప్రార్థఁన జేయమనియు, స్వయముగా వచ్చి క్రొత్త విభూతి పండును శ్రీ సాయి సన్నిధిలో నుంచుమనియు వ్రాసితిని. శాంతి ప్రార్థనఁ జేయుమనుటచేతనో యేమో నా యుత్తరమునకు జవాబే వ్రాయలేదు.

బి.ఏ.–పట్టభద్రుఁడయిన మఱియొక భక్తుఁడీ క్రింది విధముగా వ్రాసెను. “స్వామీజీ! నేను శ్రీ సాయినాథుని, శ్రీ హరనాథుని పూజించుచుంటిని. బి.ఏ. పరీక్షలో వారే నన్ను కృతార్థునిఁ జేసిరి. అందులో సాయిబాబా నా పరీక్ష నెగ్గించెనో లేక హరనాథుఁడే తోడుపడెనో మీరు వ్రాయవలెను.”

అప్పుడు నేను “ప్రియసోదరా! నీవు యం.ఎ. పరీక్షకు చదువఁబోవునప్పుడు నీ పుస్తకములు విప్పక సాయినాథుని, హరనాథుని ప్రార్థించుచుండుము. అప్పుడు యం.ఎ. ఫలితములు నీకుఁ దెలియవచ్చును. ఆ ఫలితములనుబట్టి యే నాథుఁడు నీకుఁ దోడ్పడెనో నీవే గ్రహించగలవు. నీవు చేయవలసిన పనిని శక్తివంచనలేక యహర్నిశలు చేసినచో నందఱు బాబాలు ముఖ్యముగా నీ హృదయములో స్థిరముగా నిలచియున్న బాబాలకు బాబా నీకు జయమును సమకూర్చును.

ఒక సాయి భక్తురాలు తన భర్త తనను చాల హింసించుచుండెననియు, తన పిల్లలను తననుండి వేఱుచేయుచుండెననియు, తన డబ్బును లాగుకొనుచుండెననియు వ్రాసి తన్ను కాపాడుమని ప్రార్థించెను. మఱియొక యుత్తరములో–పెనిమిటివల్ల హింసలు పడలేక తన పెనిమిటి నుండి తన్ను వేరుచేయుటకు నొక ప్రసిద్ధ న్యాయవాదిని పెట్టితినని, తన విముక్తికై శ్రీ సాయినాథుని రాత్రింబవళ్లు ప్రార్థించుచుంటినినియు వ్రాసెను. మఱల నొక యుత్తరమున “స్వామీజీ! ఈ న్యాయవాది నా పెనిమిటి కంటె నధిక హింసలు కలిగించుచుండెను. నా ద్రవ్యమునంతయుఁ దీసికొని నా కేమియూ సహాయము చేయలేదు. నన్ను రక్షింపుము” అని వ్రాసెను.

ఇట్టి పరిస్థితులలో సాయినాథుఁడేమి చేయవలెనో, నేనేమి చేయవలెనో తోచక ‘యీ న్యాయవాదిని వదలి భర్తను జేరి యాయనను భక్తి ప్రేమలతో నారాధించుటయే మంచిదేమో యాలోచింపు’ మని యామెకు సలహా నిచ్చితిని.

ఒక చిన్న సాయిసమాజమున కధ్యక్షుఁడగు నొక వైద్యుఁడు “స్వామీజీ! నేను సాయి మందిరముఁ గట్టించుటకుఁ బ్రయత్నించుచుండ దాని కవసరమగు ద్రవ్యమును నా కెందు కిచ్చుటలేదో ఆయన నడిగి వ్రాయవలెను. నేను రామచంద్రపురమరిగితిని. అచ్చట నాకే లీలలును గనుపించలేదు. నిరాశచెందితిని. తోటపల్లి వచ్చుచుంటిని.” అని వ్రాసెను. దానిపై నేను “అయ్యా! మీకు పుణ్యముండును. ఇంతలోఁ దోటపల్లికి దొందరపడి రావలదు. ఎచ్చటకు వెళ్లినను మీకు నిరాశయే కలుగును. ఏ నిరాశలేని తావు మీ హృదయస్థానమే. అచ్చట మొదట శ్రీ సాయినాథుని స్థిరపరచి తోటపల్లి రాగోరెద” నని వ్రాసితిని.

మఱియొక వైద్యుఁడు సాయినాథుఁడేది కోరిన నది యిచ్చెదనని వాగ్దానము చేసియు నా కోరికలు వెంటనే యెందుకుఁ దీర్చుటలేదో యడిగి వ్రాయమనెను. నేను శాంతిప్రార్ధనను బంపుచు దానిని ప్రేమపూర్వకముగా నిరంతరముఁ బఠించుచున్నచో నన్ని కోర్కెలు నెఱవేరునని వ్రాసితిని. దాని కాయన కాగ్రహము కలిగినదేమో? "నాకు నే నడిగినదానికిఁ తగిన జవాబు కావలెను. శ్రీ సాయికాకున్న మీరైనను నా ప్రశ్నకుఁ దగిన సమాధానము వ్రాయు"డని నాకుఁ దిరిగి యుత్తరము వ్రాసెను. దానినిఁ జూచి యాశ్చర్యపడితిని.

ఎంత పట్టభద్రులైనను, నెంత వైద్యులైనను జ్ఞానములోఁ గన్ను దెఱువని పసికూనలకన్న హైన్యముగాఁ బ్రవర్తించు వారిని గురించి నా మనస్సు విచారపడును.

ఇటువంటి హాస్యాస్పదమగు కోర్కెలతో నిండియున్న లేఖలు లెక్కకు మిక్కిలిగ నున్నను స్థలాభావమచే వివరింపఁ దలచుకొనలేదు. వ్యాసమును బెంచి పాఠకులకు విసుగు గలిగించుటఁ మంచిదికాదు. భక్తులకుఁ దోడ్పడు మఱొకటి రెండు విషయములను వ్రాసి విరమించెదను.

ఒక సాయి భక్తురాలు తన యూరిలో సాయిని పూజించి అర్పించిన పండ్లపై నాయన బీజాక్షరములైనను వ్రాయుట లేదనియు, నిచ్చట యాశ్రమములో నైవేద్యమును గూడ స్వీకరించుచుండెను గాన నిదియే మంచి సావకాశమనియుఁబ్రతి దినమును రకరకముల పిండివంటలు చేసి శ్రీ సాయి కర్పించెడిది. శ్రీసాయితోఁ బాటాశ్రమవాసులు నామె పిండివంటల నారగించుచు నామె యాశ్రమములో నున్నంత కాలమును బందువుగా వెళ్ళఁబుచ్చి యానందించెడివారు.

భక్తులనేకులు కాంక్షాపిశాచములకు బానిసలై యీషణత్రయమును లేశమును విడువక ధనవ్యామోహులై "ఓ సాయినాథా! యిప్పుడే నాకు దర్శనమిమ్ము. నీ తేజస్సులో నన్ను లీనముఁజేసికొనుము" అని నిద్రాహారములు లేక రాత్రింబవళ్ళు ప్రార్థనలు, భజనలు చేయుచుండ నేను విద్యార్థిగా నున్న రోజులలోఁ జదివిన యొక చిన్న కథ జ్ఞప్తికి వచ్చుచున్నది.

ఈ కథయందు వివిధ మతముల సారాంశము నిమిడియుండుటయే కాక మనకు నిజముగా దైవభక్తి కలదో లేదో దైవసన్నిధిలో లీనమగుటకు సిద్ధముగా నుంటిమో. లేదో. దైవమును మనము హృదయపూర్వకముగా బ్రార్థించుచుంటిమో. లేదో. చిన్న చిన్న తేట మాటలతో సూటిగా దెలియవచ్చును..

ఒక చోట నొక దేవాలయము కలదు. అందుఁ బూజారి యర్చన చేసి ధూపదీప నైవేద్యముల నర్పించి తలుపులకు తాళము వేసి పిదప తన గృహకృత్యములు నెఱవేర్చు

కొనుటకు బోవుచుండెడివాడు. ఆ దేవాలయమున కొక భక్తుడు ప్రతి రోజు వచ్చి దైవప్రార్థన జేయుచు "ఓ దైవమా! నన్నిప్పుడు నీలో గలుపుకొనుము. నీవు లేకుండ నేను జీవించలేను. నీవే నా సర్వస్వము" అని గంటలకొలది ధ్యానములో నిమగ్నుడై యుండెడివాడు. పూజారి తలుపులు వేసికొని యింటికి బోవుటకు వీలులేక యా భక్తునితోనే కూర్చుండెడివాడు. వెడలిపోవుదమని నెమ్మదిగా భక్తునితో జెప్పినను 'నాకున్న దైవచింతన నీ కేమి తెలియును? అని గుడిని విడుచుటకు నిరాకరించెడివాడు. ఓ దైవమా? నన్నిప్పుడే యిచ్చుటనే నీలో లీనము జేసికొనుము. నిన్ను విడచి యొక్క క్షణమైనను మనఁజాలను. అని యింకను దీక్షతో ధ్యానము జేసెడివాడు.

అప్పుడు పూజారి యీ యవస్థనుండి తప్పించుకొనుటకు గత్యంతరము లేక యొక చిన్న పన్నాగముఁ బన్నెను. ఒక రోజున నా భక్తుఁడు రాకముందే విగ్రహము వెనుకవైపున దాగుకొనెను. భక్తుడు వచ్చి ఎప్పటి విధముగా బ్రార్థించుచుండ దైవవిగ్రహమే మాట్లాడినట్లు "ఓ భక్తుడా! నీ భక్తికి మెచ్చితిని. నిన్ను నాలో లీనము చేసికొనెదను, రమ్ము, రమ్ము, దగ్గరగా రమ్ము' అని విగ్రహము వెనుకనుండి యనెను. భక్తుని గుండెలు దడదడ కొట్టుకొన సాగెను. ముందునకు బదులు వెనుక కడుగులు వేయదొడగెను. అచ్చట నుండి పరుగెత్త జొచ్చెను. మఱల నా దేవాలయము వైపునకైనను రాలేదు.

ఇది నవ్వు వచ్చెడి కథ. అయినను మనము నవ్వుటకు బదులు మన హృదయము లను నిష్పక్షపాతముగ విమర్శించుకొని, దైవము తనలో లీనము చేసికొనుట కనుమతిం చినపుడు మనలో నెంతమంది యాయనలో లీనమగుటకు ధైర్యముతో ముందడుగు వేసెదమో పరీక్ష చేసికొని తెలిసికొనవలెను. ఈ సమస్యను మీకే విడిచి పెట్టుచుంటిని.

దైవచింతన గలిగి తీవ్రమైన మోక్షాపేక్షతో భగవంతునిలో లీనమగుటకు సిద్ధముగా నున్నవారికి నా ధన్యవాదములు. అట్టివారే నిజమైన సాయి భక్తులు. సాయి మందిరమువైపు రాకుండ బరుగెట్టువారికిని, నామరూపములను బూజించువారికిని నా వ్రాతలు కంటక ముగా నుండవచ్చును. కాని దైవమును జేరు సత్యమార్గము కఠినపరీక్షా కంటకములతో గూడియుండునని వారు గ్రహించవలయును.

ఈమధ్య నొక సమావేశములో శ్రీ ఆచార్య వినోబా భూములు కలవారిని లేనివారికి దోడ్పడుడని కోరుచుండగా నొక పెద్ద మనుష్యుడు లేచి 'బాబా! నీవు సర్వమును త్యజించితివి. బ్రహ్మచారివి. నీకు గుటుంబములేదు. నీవలె మేమెట్లు త్యాగము జేయగల'మని సునిశితముగా ప్రశ్నించెను. దాని కాయన "నాయనా! నా కుటుంబము నీ కుటుంబము కంటె బెద్దది. నా కుటుంబములో దిన దిండి, కట్టుబట్ట లేనివారైదు కోట్లు గల"రని చక్కని సమాధానము నిచ్చెను.

మీరు సన్యాసులు. మీ కేమియునవసరము లేదు. మీ రేమియు బాబాను కోరరు. మేము గృహస్థులము. మాకు సమస్తమును గావలయున'ను వారికి నేను గూడ పై సమాధానమునే యిచ్చెదను. దైవసన్నిధి ననుభవించెడిదే శాశ్వతమోక్షము నొసంగెడి గృహస్థ ధర్మము. 'పరోపకారార్థ మిదం శరీర' మను వేదోక్తి ననుసరించి మానవసేవ జేయుచు దైవములో లీనమగుటకు బ్రయత్నించినచో దైవమే మన లోటుపాట్లను దీర్చి కాపాడును.

'దేనిని తెలిసికొనినచో సమస్తమును దెలిసికొనవచ్చు'నను చిన్న ప్రశ్నకు సమాధానము దైవమును దెలిసికొనినచో–నీ స్వస్వరూపమును దెలిసికొనినచో నీవు సమస్తమును గ్రహించవచ్చు'నని సూక్ష్మములో మోక్షమన్నట్లు చెప్పబడెను.

పాఠకమహాశయులారా! శ్రీ సాయి భక్తులారా! నేను మీ కందఱకు నధైర్యవచనములే చెప్పి పిఱికిమందు నూఱిపోయుచుంటినని తలంపవలదు. శ్రీ సాయి ననుభవించనివారే పసిబిడ్డలవలె శ్రీసాయి లీలలను జూడగోరుదురు. రాజును దర్శించినవాడు సేవకునితో దన కాలమును వ్యర్థపుచ్చడు. ఫలముల నారగించెడివాడు వృక్షముల యాకులను లెక్క పెట్టుచు విలువైన కాలమును బాడుచేసికొనడు.

నేను గారడీ విద్యలు చేయలేను. అష్టసిద్ధులను వ్యక్తపఱుపజాలను. నేనేమియు మహత్తులను, లీలలను జూపలేను. కాని దైవకృపచే బాల్యమునుండియు జీవితమును దైవార్పణ చేయుటచే ననుభవించుచున్న ఫలితమును మీకు రుచిచూపగలను.

ప్రశ్న : అది యెద్ది?

జవాబు : హృదయపూర్వకముగా సాయి సన్నిధి ననుభవించ గోరుచున్న వారికి స్వస్వరూపానందము ననుభవించుటకు తోడ్పడగలను. Live in God and help others to live in Him–నీవు దైవములో జీవించుచు నితరు లాదైవము ననుభవించుటకు దోడ్పడుము. ఇదియే ప్రారంభము నుండియు నా జీవితాశయము. ఇది యొకటియే నాకు చేతనైన విద్య. ఈ యాత్మవిద్య మీకు గావలసినచో నా యొద్దకు రండు.

బ్రహ్మానుభవము తప్ప తదితర వస్తువులు, చిత్రములు లీలలు మున్నగునవి కావలసినచో నవి యిచ్చెడివారినే యాశ్రయింపుడు.

అసత్ పదార్థము మీకు గావలెనా? నిత్యమైన, సత్యమైన, పరిపూర్ణమైన మీ జన్మహక్కైన కోటిసూర్యప్రభాభాసమైన దివ్యతేజస్సు మీకు గావలెనా? అటులైన నావద్దకు వచ్చినచో మీకు నిరాశ కలుగదు. తదితరమగు మఱే వస్తువులకై మీరు వచ్చినను ఆశాభంగము కలుగవచ్చును. నే ననుభవించెడి దానినే మీకు బంచి పెట్టగలను.

జ్ఞాతం జ్ఞాతస్యమధునా ద్రష్టం ద్రష్టవ్య మద్భుతం

తెలిసికోదగిన దానిని దెలిసికొంటిని. చూడదగిన దివ్యదృశ్యమును జూచితిని, ఆహా! యేమి యద్భుతము.

ఆ సచ్చిదానంద స్వరూపమును జూడవలెనని యున్నచో శ్రీ శాంత్యాశ్రమమునకు విచ్చేయుడు. మీ కందఱకు మా హృదయపూర్వక సుస్వాగతము!

ఓం శ్రీ సాయినాథాయనమః ఓం శాంతి శాంతి శాంతిః।

హరిః ఓం తత్ సత్ ఓం

**: అంకితము :**

**దేశదేశములలో గల వివిధ మతముల సాయి భక్తులకు స్వస్వరూపానందమును జన్మరాహిత్యమును గోరుచు దైవాశీర్వాదములతో బ్రేమపూర్వకముగా నంకితము**

లోకా స్సమస్తా స్సుఖినో భవన్తుః

(శాంతి సెప్టెంబరు 1954)

## 16. శ్రీ శాంతి బాలికా గురుకులము

### (అప్రయత్నముగా దైవకృపచే స్థాపితమైన గురుకులము)

"ఈశ్వర కృప ముఖ్యమా? పురుష ప్రయత్నము ముఖ్యమా? ఈ రెండింటిలో యేది గొప్పది? ఈశ్వర కృపయే గొప్పదైన పురుష ప్రయత్నమవసరము లేదా? అంతా పురుష ప్రయత్నము మీదనేయున్న నిక ఈశ్వర కృప అనవసరమా? ఈశ్వరకృపయు, పురుష ప్రయత్నమును, యీ రెండును ముఖ్యావసరములేనా?" అనెడి యిత్యాది గూఢమైన సమస్యలు, ఆధ్యాత్మిక జీవితము నవలంబించెడి సాధకులందరి మనస్సులను ఆకర్షించుచున్నవి.

కొన్ని సామాన్యమైన చిన్న చిన్న ఉదాహరణలను దీసికొని మనుష్య ప్రయత్నమును, యీశ్వర కృపను తేలికగా బోధపర్చుకొనుటకు ప్రయత్నింతము.

మనుష్య ప్రయత్నము, నీరు కరువైనచోట, తుండుగుడ్డను నీటిలో ముంచి ఆ గుడ్డ సహాయముతో శరీరమంతయు రుద్దుకొనుచు స్నానమాచిరించినట్లుండును.

ఇక ఈశ్వర కృప అన్నివైపుల జలముచే నింపబడి సముద్రములో స్నానము చేయుచున్నట్లుండును.

నీరు లేక చనిపోవు చెట్టునకు నీరు పోసి పెంచుచున్నట్లు మనుష్య ప్రయత్న ముండును.

ఇక కుంభీపాతముగా వర్షము కురిసి, చెట్ల నన్నింటిని పూర్తిగా తడిపివేసినట్లు ఈశ్వర కృప యుండును.

మండువేసవిలో ఉక్క పెట్టుచు, చెమట కారుచున్నప్పుడు విసనకఱ్ఱతో విసరుకొనుచు, సేద తీర్చుకొనుచున్నట్లు పురుష ప్రయత్న ముండును.

ఇక మలయమారుతము వీచుచుండ శరీరమునకేగాక, మనస్సునకుగూడ చల్లదనము కలిగి ఆనందముగా యున్నట్లు ఈశ్వర కృప యుండును.

పురుష ప్రయత్నము అక్షయపాత్ర తీసికొని భిక్షాటనమునకు వెళ్లి నట్లుండును. ఈశ్వర కృప అమృతభాండమే మనలను వరించి మన వద్దకు పరువులెత్తి వచ్చినట్లుండును.

ఆధ్యాత్మిక పునాదిలేని పురుష ప్రయత్నము లన్నియు పొడినేలమీద కొట్టుకొనుచున్న చేపల గతివలె నుండును.

ఇక ఆధ్యాత్మిక బలము కలిగిన పురుష ప్రయత్నము–మానవులు జేయు స్వార్థరహితమైన పనులు–మంచినీటిలో ఆడుచు, తేలుచు ఆనందముగానున్న చేపల తృప్తిని బోలియుండును.

ఈశ్వర కృప–దైవబలము లేని పనులన్నియు నెంత బ్రహ్మాండమైనవిగా ప్రస్తుతము గానవచ్చినను అవి యన్నియు గాలిలోని మేడలే! ఇసుకలోని భవనములే!

ఎన్నటికైనను పెద్ద గాలివానగాని, తుఫానుగాని వచ్చిన కూలిపోవలసినవే! ఏ పనిలోనైనను జయము కలుగుటకు ఆధ్యాత్మిక జీవితము, స్వార్థరహితమైన ప్రేమ జీవితము ఈశ్వర కృప దైవబలము ముఖ్యావసరములు.

ఇప్పుడు మన శాంతి గురుకులమును విమర్శింతము–శ్రీ గెడ్డం సన్యాసిరావుగారు దేశభక్తులును, నిరాడంబరమైన త్యాగశీలురును గాన వారు ధనధాన్యములను అనేకమైన ధర్మ కార్యములకు ఇచ్చుటలో ఆశ్చర్యము లేదు. వారి సతీమణి శ్రీమతి కృష్ణవేణి గూడ 'పరోప కారార్థ మిదం శరీరం' – యీ శరీరము యితరుల సేవకొఱకే యివ్వబడినదనెడి నమ్మకము గలిగిన భక్తురాలు. వారు చేయు వివిధమైన దానధర్మములతో తృప్తిచెందక ఇందిర యను 8 సంవత్సరముల ప్రియ పుత్రికను శ్రీ శాంతి ఆశ్రమమునకును, కస్తూరి యను 6 సంవత్సరముల బాలికను శ్రీ గాంధీ ఆశ్రమమునకును అర్పించిరి. ఇట్టి ఆదర్శనీయమైన తల్లిదండ్రులను కనిన హిందూమాత గర్భము ధన్యవంతమైనది.

ఇందిర ఆమె గ్రామములో అందరివలె చదువకొనక తల్లిదండ్రులతో "నా కిచ్చట

చదువురాదు. ఆశ్రమమునకు పంపుదు, అచ్చట జ్ఞానేశ్వరి అక్కవద్ద బాగా చదువుకొందును" అని తఱచు చెప్పుచుండుటచే ఆమెను వారి పనిమనిషి ద్వారా ఒక శుభదినమున ఆశ్రమమునకు పంపియుండిరి. ఇందిరను తల్లిదండ్రులు తీరిక లేక ఆశ్రమమునకు స్వయముగా తాము ఆమెను తీసికొనివచ్చి విడిచి పెట్టజాలకున్నను ఆమె ధైర్యముతో ఆశ్రమమును జేరి వృద్ధియగుచున్నది. చి॥ జ్ఞానేశ్వరి ఆధ్వర్యమున ఆమె వంటరిగా చదువుకొనుచు, ఆడుకొనుచు, వృద్ధిచెందుచున్నను నాకు మాత్రము అంత తృప్తిగా లేకుండెను.

ఇందిర యీడుజోడునకు సరిపోయెడి మఱియొక చిన్న బాలిక దొరకిన ఇద్దఱును కలసిమెలసి యాడుకొనుచు, చదువుకొనుచుందురుగదా యని తలచగా, ప్రప్రథమము నుండియు ఆశ్రమ భక్తులైన శ్రీ కక్కిరాల ఆత్మారాం, కస్తూరీబాయిగారి పిల్లలు జ్ఞప్తికి వచ్చిరి. వారికి చాలమంది పిల్లలుండుటచే యొక బాలికను తేలికగా శ్రమలేకుండగా యివ్వగలరని తలచితిని. వారి పిల్లలలో జ్యోతియనెడి అమ్మాయి చదువుకొనకుండ అల్లరి చేయుచు తలిదండ్రులకు శిరోవేదన తరచు కలిగించుచున్నదట. బడికి పంపిన ఊరంతయు చక్కపెట్టి బడివదలివేయు వేళకు సరిగా బడినుండి వచ్చినట్లు ఇంటికి వచ్చెడిదట. చిన్నదానికో పెద్దదానికో యేదోయొక పేచీ పెట్టుచు తోటివారికి శ్రమకలిగించుచు, అన్నమైనను సరిగా తినెడిదిగాదట. ఆ జ్యోతిని ఆశ్రమమునకు పంపమని తల్లిదండ్రులకు వ్రాయగా వారు ఆనందముతో అంగీకరించిరి. జ్యోతికిగూడ చిన్న ఉత్తరము–'ప్రియమైన జ్యోతి, నీవు ఆశ్రమములో చదువుకొనుటకు రమ్ము' అని వ్రాసితిని. ఆ ఉత్తరము చూచినప్పటినుండియు ఆశ్రమమునకు వెళ్లెదనని ఏడ్పు ప్రారంభించుటచే మఱొక శుభదినమన మా రాజాజీ రాజమండ్రి వెళ్లగా జ్యోతి రాజాజీతో ఆశ్రమమునకు వచ్చెను. ఆశ్రమమునకు వచ్చినప్పటినుండి అల్లరియనెడిది యెటులుండునో మఱచినట్లు చాల భక్తిశ్రద్ధలతో చదువుకొనుచు, సంగీతముకూడ నేర్చుకొనుచు వృద్ధి అగుచుండెను.

ఇందిర జ్యోతులు రెండు శరీరములుగా గాక ఒక్క శరీరముగా ఆటపాటలలో ప్రేమతోనిండి వృద్ధియగుచుండుట, నాకును ఆశ్రమవాసులందరకును ఆనందము కల్గించుచుండెను.

ఒక్కమారు మేష్టరుగారు జ్యోతిని బాగుగా చదువుట లేదని అన్నంతమాత్రమున యేడ్చుట ప్రారంభించెను. తర్వాత జ్యోతితో ఆశ్రమములో మాత్రము యెన్నడు యేడ్వరాదని, ఎవ్వరైనను కొట్టినను, తిట్టినను గూడ దైవనామమును స్మరించుచు ఆనందముగ నుండవలెనని–యీ ఒక్క పాఠమును నీవు ఆశ్రమమునకు వచ్చినందులకై నేర్చుకొనమని చెప్పగా అప్పటినుండియు యేడ్చుట మానివేసెను.

కుమారి జ్ఞానేశ్వరి, ఇందిర జ్యోతులను కంటికి ఱెప్పపోల్కి కాపాడుచు వారు దినదినాభివృద్ధి గాంచునటుల జాగ్రత్త వహించుచున్నది.

ఇద్దరు యుండుటకన్న అకార, ఉకార, మకారములుగా ముగ్గురు బాలికలున్న బాగుండునేమో యని తలచగా, ఆశ్రమ భక్తులైన శ్రీ కేదారిశెట్టి సుబ్బారాయుడుగారి కుమార్తె 'శాంతి' జ్ఞప్తికి వచ్చెను. వారి సతీమణి గూడ భక్తురాలె. కాని చి॥ శాంతి తల్లి కొంగును విడచి యుండలేదు. వీధిలోనికి వచ్చుటకు భయపడును. ఒక్క కుమార్తెయే యగుటచే గారాబముతో పెంచుకొనుచుండిరి. శాంతి తల్లిదండ్రులను విడచి ఆశ్రమము చేరినా, ఆమె తల్లి తండ్రులు, ఆమెను ప్రేమించెడి బంధువులు శాంతిని విడచి యుండజాలని స్థితిగతులు యేర్పడెను.

అప్పుడు ఆమెకు, ఆమె జననీ జనకులకు కూడ చిన్న చిన్న ఉత్తరములు వ్రాసితిని. చి॥ శాంతి నా ఉత్తరము జూచి "బాబో! నేను ఆశ్రమములో నుండజాలను" అనెను. ఆమె తల్లిదండ్రులు భక్తులగుటచే-తండ్రి హరిజేరుమనెడి తండ్రి తండ్రి' అని భక్త ప్రహ్లాదుడు చెప్పిన మాటయందు నమ్మకము గలవారై యున్నందున యెటులనయిన శాంతిని ఆశ్రమ ములో జేర్చుటకు నిశ్చయించిరి. శాంతి యొక్కర్తె ఆశ్రమమునకు రాదు. ఆశ్రమములో నుండజాలదు. కాన ఆ పుణ్యదంపతులిద్దరు శాంతి చదువునకై తమ పిల్లవాడు చి॥ జగ్గయ్యదాసుతో కుటుంబసహితమగా ఆశ్రమమునకు మఱొక శుభముహూర్తమున వచ్చిరి.

చి॥ శాంతి చదువుకొనునప్పుడు తల్లిదండ్రులు కూడ దగ్గరయుండి శాంతితో మేష్టరువద్ద చదువుకొనవలసి వచ్చెడిది. భోజనమువద్ద గూడ ఆమె జనని యుండవలసి వచ్చెడిది. ఆశ్రమములో గూడ తల్లి దగ్గరనే తప్పనిసరిగా పరుండుట అలవాటయ్యెను.

వారం రోజులలో శాంతి, ఇందిర జ్యోతులతో చదువుకొనుచు పాడుచు, ఆడుచు, ప్రార్థన ధ్యానాదులు చేయుచు తల్లిదండ్రులను కొంత మరువసాగెను. మా అందరకు ఆశ్చర్యము కలిగెడిలాగున యొక రోజున తల్లిదండ్రులతో 'మీరు ఇంటికి వెళ్ళుడు. నేను ఆశ్రమములో జ్ఞానేశ్వరి అక్కవద్ద, ఇందిర జ్యోతులతో చదువుకొందును' అని చెప్పెను. అప్పుడు తల్లిదండ్రులు, అన్న జగ్గయ్యదాసు కలసి పిఠాపురం ఆనందముతో వెళ్ళిరి. శాంతి ఆశ్రమములో నుండగలిగినను, పిఠాపురములో ఆమెను ప్రేమించెడివారు శాంతిని జూడకుండ నుండజాలనప్పుడు శాంతి యెప్పుడైనను వెళ్ళి వచ్చుచుండును.

జన్మదినము (ది. 21-1-1955) యింకను పదిరోజు లున్నదనగా శ్రీమతి సత్యనారాయణమ్మగారి కుమార్తె చి॥ గాయత్రి శ్రీ మలిశెట్టి రంగారావుగారు ఆశ్రమమునకు వచ్చుచుండ మరల ఆ బండిమీదనే ఆశ్రమము జూచి వచ్చివేసెదనని జెప్పి వచ్చెను. ఇచ్చట ఇందిర, జ్యోతులు, శాంతి శ్రీ దాదాభాయిగారి వద్ద సంగీతము, శ్రీ ధర్మరాజుగారి

వద్ద హిందీ, శ్రీ రాఘవరావుగారి వద్ద ఇంగ్లీషు చదువుకొనుచు, ఉదయము, సాయంత్రము ప్రార్థన ధ్యానాదులు చేయుచుండుటను జూడగా గాయత్రికి వచ్చిన బండిమీద వెళ్లుటకు మనస్కరించలేదు.. ఒక్కసారే ఆశ్రమములో నుండిపోయెదనన్న తల్లి మొదలగువారు నిరాకరింతురని జన్మదినము వఱకైన నుండ ననుజ్ఞకు ప్రార్థించ సాగెను. చదువు పాడైపోవును గాన మరల సెలవులలో రావచ్చునని ఆమెను తీసికొని వచ్చినవారు చెప్పిరి. శనివారము ఆదివారము వచ్చుచున్నదిగదా, బడి సెలవులే గదా అని ఆశ్రమములో నుండుటకు పట్టుపట్టెను. ఆమె అవస్థ జూచి నేనుగూడ ఉంచివేయమంటిని. నా మాటను తీసివేయలేక అయిష్టముతో గాయత్రిని ఆశ్రమములో జన్మదినము వరకు ఉంచిరి.

జన్మదినము నాలుగు రోజులు పెండ్లివలె ఆనందముగా జరిగెను. గాయత్రి యింటికి వెళ్ళెడి రోజు సమీపించెను. బండి సిద్ధముగా యుండెను. ఇందిర, జ్యోతి, శాంతి విచారముగా నుండిరి. ఇక గాయత్రి వెక్కి వెక్కి యేడ్వసాగెను. ఆమె యేడుపు జూచిన వారందరకు యేడుపు రాసాగెను. ఇంటికి వెళ్లి మీ అమ్మతో జెప్పి రావచ్చునని యేడ్చుచున్నదానినే బండినెక్కించి, గాయత్రిని బలవంతముగా పంపించిరి. ఇంటికి వెళ్ళినను ఆశ్రమ విధానములను మానలేదు. ఆశ్రమములోవలె ప్రార్థన ధ్యానాదులు చేయసాగెను. ఆమె చాల ప్రీతిగా తినెడి ఊరగాయ, కాఫీ గూడ వాడుట మానివేసెను.

బడికి వెళ్ళనగా యేడ్చుట ప్రారంభించెను. ఇక లాభము లేదని తల్లిగారు, గార్డియన్ రంగారావుగారు గాయత్రికి కావలసిన బట్టలు, పుస్తకములు మొదలగున వన్నియు నిచ్చి మరొక శుభదినమున ఆశ్రమమునకు తీసికొనివచ్చి అందరకును–ముఖ్యముగా గాయత్రికి ఆనందమును కలిగించిరి. గాయత్రికి పది సంవత్సరములు ఉండును. కొదువ బాలికలకు ఎనిమిది సంవత్సరములు ఉండును. కాన యిప్పుడు గాయత్రియే మిగిలిన ఇందిర, జ్యోతి శాంతులకు నాయకురాలుగా యుండి వారి నందరిని కుమారి జ్ఞానేశ్వరి పర్యవేక్షణలో వృద్ధి చేయుచున్నది. ఈ గాయత్రికి నామకరణము ఆశ్రమములో నా చేతనే జేయించి యుండిరి. అందుచేత గాయత్రి ఆశ్రమమునకే చెందియున్నట్లు పోరాడుచు తన స్వంత స్థానమైన ఆశ్రమమును జేరుట ఆశ్చర్యముగా నున్నది.

శ్రీ సుబ్బారాయుడుగారి కుమార్తెకు శాంతి అనెడి నామకరణము గూడ నా చేతనే ఆశ్రమములో జేయించిరి. కాన ఆమె కూడ యీ ఆశ్రమ బాలికగా నున్నది.

ఇంజనీయరు శ్రీ కొత్త సుబ్బారావుగారి బాలికకు గూడ ఆశ్రమములో నామకరణము జేయించిరి. వారును వారి సతీమణియు చాల భక్తులు. వారి చిన్న శాంతిని గూడ త్వరలో ఆశ్రమమున కర్పించెదమని వ్రాసిన ఉత్తరము చదివి ఆనందించితిని.

పెద్ద పెద్ద గ్రామములలో పట్టణములలో లేని చదువు ఏమి? ఆశ్రమములో నున్న

చదువు ఏమి? ఆశ్రమ జీవితమున కాధిక్యత ఏమి యున్నది? అని శాంతి పాఠకులు ప్రశ్నించవచ్చును.

ఆశ్రమములో నున్నది ఆధ్యాత్మిక జీవితము, ఆధ్యాత్మిక వృద్ధి, కేవలము దైవకృపచే ఆశ్రమములో దైవభక్తిని ఉగ్గుపాలతో కలిసి ఇచ్చి వృద్ధి చేయుట జరుగుచున్నది.

ఈ బాలికల దినచర్య (టైమ్ టేబిలు) నొక్కసారి పరీక్షించిన వీరు ఆధ్యాత్మికముగనే గాక, అన్ని రీతులుగా నెటుల వృద్ధి యగుచున్నది మా పాఠకులు గ్రహించగలరు.

ఉదయము 5 గంటలకు 'బ్రహ్మానందం, హరేరాం' పాడుచు దైవజ్ఞప్తితో మేల్కొనెదరు. లేవగనే బద్ధకము పోవుటకు 15 నిమిషములు వ్యాయామము చేసి రెండు ఆసనములు వేయుదురు. అటు తరువాతను సంగీతము పాడించుటలో శాంతికుమారి తోడ్పడును. తరువాత నాశ్రమములో నున్న దారులు శుభ్రము చేసెదరు. అటు పిమ్మట స్నానము చేసి గుహలోనికి వెళ్లి శాంతి ప్రార్థన స్మరించుచు పది నిమిషములు ధ్యానము చేయుదురు. తరువాతను ఆశ్రమములో ఉదయ ప్రార్థనలలో అందరితో పాల్గొనెదరు. పిమ్మట రాత్రి పాలలో తోడు పెట్టిన అన్నమును భుజించి ఆశ్రమములోని శాంతి విద్యాలయమునకు వెళ్లి చదువుకొందురు. 10–30 గంటలకు బడినుంచి వచ్చి సంగీత విద్వాంసులయిన శ్రీ దాదాభాయి గారి వద్ద 1 గంట హార్మోనియం మీదను గాత్రముతో సంగీతము నేర్చు కొందురు. సంగీతము కాగానే తక్లీ మీద బాలికలు అరగంటసేపు నూలు తీయుదురు. నూలు వడికిన పిదప భోజనము చేసి 2 గంటల వరకు ఆడుచుపాడుచు విశ్రాంతిగా నుందురు. రెండు గంటలకు గంట కొట్టగనే హిందీ మేష్టరు వచ్చి హిందీ నేర్పును. అటు తరువాత ఇంగ్లీషు మేస్టరు వచ్చి ఇంగ్లీసు, తెలుగు నేర్పుచుండును. నాలుగు గంటలకు చదువు అవగనే సుగంధి కాఫీతో యేమైన ఫలహారము చేసి తోటపని అరగంట జేయుదురు. కొండవార నూతనముగా స్థాపితమైన నిర్వాణాశ్రమమునకు, నేను సాయంత్రము ధ్యానము చేయుటకు వెళ్లుచుందును. అప్పుడు నాతోపాటు వారు కూడ వచ్చి అచ్చట–ఇసుకలో భవనములు నిర్మించుచు ఆడుకొందురు. నా ధ్యానము వారి భవన నిర్మాణములు పూర్తి అయిన పిదప ఆశ్రమమునకు 'భజగోవిందం మూఢమతే–నహి నహి రక్షతి డుకృఞ్కరణే' అని భజన చేయుచు ఆశ్రమము చేరెదము. రాగానే భజన చేసి, భోజనము చేసి, ఏడు నుండి ఎనిమిది గంటలవరకు వారి వారి పాఠములు చదువుకొని 8 గంటలకు దినచర్య (డైరీ) వ్రాసి యీ క్రింది శాంతి ప్రార్థనను పఠించుచు దైవములో పరుండి మరల దైవజ్ఞప్తితో తెలతెలవారుచుండగనే లేచెదరు.

–లోకశాంతి ప్రార్థన–

పూజనీయమైన ఓ దివ్యస్వరూపా!

లోపలను, వెలుపలను, మీదను, క్రిందను, అంతటనూ నిండియున్న ఓ సర్వాంతర్యామీ! మా లోపల ప్రత్యణువునందును యిమిడియుండి; మా హృదయములకు హృదయము, మనస్సులకు మనస్సు, శ్వాసలకు శ్వాస, జీవనములకు జీవనము, ఆత్మలకు ఆత్మవై వెలుగొందు ఓ దేవా, ప్రేమైకమూర్తీ! నిన్ను తెలిసికొను భాగ్యమిప్పుడు, ఇచ్చటనే ప్రసాదింపుము.

ఓ తేజోమయమూర్తి! తూర్పు పడమరల, ఉత్తర దక్షిణముల, ఈ విశ్వమందంతటను, అందరునూ నీ దివ్య తేజస్సును గ్రహింతురుగాక, ఓ సచ్చిదానందరూపా! ప్రతి మానవ హృదయమునందును, నానాజాతి మధ్యస్థమునను శాంతి, సామరస్యముల బ్రతిష్ఠింపఁ జేయుము. ఓ దేవా! ఇదియే మా మనఃపూర్వకమైన ప్రార్ధన.

సర్వేజనా స్సుఖినోభవంతుః

శాంతి బాలికా గురుకులమును సంగీతపు మేస్టరు, హిందీ మేస్టరు, ఇంగ్లీషు మేస్టరు, శ్రీ రాజాజీ, కుమారి జ్ఞానేశ్వరి వారి వారి శక్తికొలది వృద్ధిజేయుచుండ నా మనస్సు గురుకుల బాలికల ఆధ్యాత్మిక వృద్ధిని గోరుచు ఉడతా సహాయమువలె వారికి ప్రతిరోజు యేదో యొక చిన్న పాఠము నేర్పుటకు గోరుచుందును.

నిన్నటి దినము నలుగురు బాలికలతో 'దేవు డెచ్చట నున్నాడో'' ఆలోచించి వ్రాయుమంటిని. జ్యోతి ఆకాశములో నుండెనని వ్రాసెను. ఇందిర తన మనస్సులో యుండెనని వ్రాసి యిచ్చెను. శాంతి తనలో యుండెనని వ్రాసి యిచ్చెను. గాయత్రి తన హృదయములో నుండెనని వ్రాసెను.

నా ప్రశ్నకు సమాధానముగా :-

గీ. ఇందుగల డందు లేడని సందేహము వలదు
చక్రి సర్వోపగతుం డెందెందు వెదకి
జూచిన నందందే గలడు
చక్రి దానవాగ్రణివింటే!

అని ప్రహ్లాదుడు కీర్తించిన పద్యమును నలుగురు బాలికలు వల్లించి తరుచు చదువుచుందురు.

నేటి దినమున - దేవు డెటుల నుండునో. ధ్యానము చేసి ఒక్కొక్కరు వ్రాసి యిమ్మని కోరితిని.

వెంటనే జ్యోతి తడువుకొనకుండ తెల్లగా నుండునని జెప్పెను. తెల్లగా అనగా

శుద్ధముగా, మలినరహితముగా నుండునని నేను ఆనందించితిని.

ఇంకను బాగుగా ఆలోచించి వారికి తోచినది వ్రాసి యిమ్మని చెప్పితిని.

జ్యోతి సదా కదలుచు, మెదలుచు, కర్మయోగమును వ్యక్తపరచుచుండును. ఆమె స్వభావముచే ఒక్క నిమిషమైన స్థిరముగా నుండజాలదు. సదా యేదోయొక పని జేయుచుండవలెను. ఏ పని నొప్పగించినను ఆనందముతో ఆడుచుపాడుచు జేయుచుండును.

ఇందిర శాంత గుణముతో స్థిరమైన బుద్ధితో భక్తి యోగమును వ్యక్తపరచుచుండును. ఆమె ప్రార్థన ధ్యానాదులు జేయుచుండ మూసిన కండ్లను మరల తెరువుమని చెప్పువరకు తెరువక తన్మయురాలై యుండును. ఆమెను జూచిన దేవునిరూపమును జూచినట్లు యుండును.

శాంతి భయభక్తులతో నిండియుండి అన్నింటిని పరిశీలించుచు అనేకమైన ప్రశ్నలు వేయుచు రాజయోగమును వ్యక్తపరచుచుండును. తనకు ఒప్పగించిన పనిని ఆనందముతో తన శక్తికొలది జేయుచుండును.

గాయత్రి సూర్యోపాసకురాలు. తేజస్సును ధ్యానించుచు జ్ఞానయోగమును వ్యక్తపరచుచుండును. ఈమెకు ఆశ్రమములో నామకరణమును జేసినప్పుడే

ఓం భూర్భువః స్వః ఓం తత్సవితుర్వరేణ్యంః

భర్గో దేవస్య ధీమహి, ధియోయోనః ప్రచోదయాత్॥

అనెడి గాయత్రి మంత్రోపదేశముతో నామకరణము జేయబడెను. ఈమె జ్ఞానముతో నిండి, మౌనముగా, పరిపూర్ణముగా నున్నట్లు గానవచ్చును.

ఈ నలుగురు బాలికలు హార్మోనియం వాయించుచు కలిసి “రాధాకృష్ణ బోలో ముఖసేనే’ అనెడి మీరాబాయి కీర్తన పాడుచుండ వినుటకెంతో ఆహ్లాదకరముగా నుండును. నలుగురు తకిలీలమీద దారము తీయుచుండకూడ చూచుట కానందము గల్గించుచుండును.

ఈశ్వర సంకల్పముచే అప్రయత్నముగా స్థాపింపబడిన శాంతి బాలికా గురుకుల మునకు చెన్నపట్నములో-క్వీన్ మేరీస్ కాలేజిలో హిందీ ఉపాధ్యాయురాలుగా నున్న శ్రీమతి కమలాదేవిగారు త్వరలో శాంతి ఆశ్రమము జేరి ఆమె కొదువ జీవితము శాంతి బాలికా గురుకుల వృద్ధికై గడుపుటకు కోరుచుండిరి. మరొక ఆంగ్లేయ దేశపు సోదరీమణి గూడ బాలికలకు చదువు చెప్పుటకు-చిత్తరువులు వ్రాయుట (డ్రాయింగ్ మొదలైనవి వేయుట) నేర్పుటకు ఆశ్రమము చేరుటకు కోరుచున్నది. ఇంకొక సంస్కృత విద్యావంతురాలైన సోదరి ఆమె జీవితమును ఆశ్రమ సేవకై యర్పించియుండెను. శ్రీమతి

సోదరి సుశీలాదేవి గారు కూడ ఎంతలో ఆశ్రమము జేరి గురుకుల బాలికల వృద్ధి తోడ్పడుదు నాయని రోజులు లెక్కించుచు అమెరికా నుండి యుత్తరములు వ్రాయుచుండిరి.

ఈశ్వరేచ్ఛచే ప్రారభింపబడిన పనులకు దైవమే అనేక రీతులుగా తోడ్పడుచుండుట అతి ఆనందమైన ఉత్సాహము నిచ్చెడి అంశము గదా!

నిజమైన చదువు అనగా దేశములోని పుణ్య తీర్థములను సేవించుచు, మహాత్ముల దర్శనము చేయుచు మనోవికాసము కల్గించెడి చదువులే చదువులని నమ్మకము గలవాడనగుటచే జీవకారుణ్య సమాజ స్థాపకులైన శ్రీ కారుణ్యానందస్వాములవారి యాధిపత్యమున యేర్పరచబడిన ఉత్తర దేశపు యాత్రా స్పెషల్ ట్రెయిన్‌లో మా గురుకుల బాలికలను పంపుటకు సంకల్పించగా, మా బాలికల తల్లిదండ్రులందరును నా సంకల్పము నుత్సాహముతో నంగీకరించుట ఆనందకరమైన సంగతి.

మా బాలికలు ఉత్తర దేశములో హిందీ, ఇంగ్లీషు మాట్లాడుటకు త్వరితముగా ఉ త్సాహముతో యిప్పుడు నిత్యమును వారి పాఠములు చదువుచుండిరి.

పరమహంస శ్రీ శివానంద స్వాములు వారి దర్శనము, తదితర మహాత్ముల దర్శనము జేయుటకు చాల కుతూహలముగా నుండిరి. మానవ ప్రయత్నము ఏమి లేక కేవలము దేవుని నిర్హేతుకజాయమానకటాక్షముతో స్థాపితమైన యీ శాంతి బాలికా గురుకులమును దైవము అన్నివిధములా వృద్ధిజేయుగాక!

చి॥ ఇందిర, జ్యోతి, శాంతి, గాయత్రీలను దైవమాయురారోగ్యములతో బ్రోచి వారి జీవితములు ఆంధ్రదేశమునకు, భారతదేశమునకే గాక, లోకమంతటికి ఆదర్శనీయులుగా నుండునటుల చేయుగాక!

లోకా స్సమస్తా స్సుఖినో భవన్తు!

శాంతిర్భవతు । మంగళం భవతు ।

హరిః ఓం తత్సత్!

## : అర్పణ :

**ఈ వ్యాసము భక్తి, జ్ఞాన, వైరాగ్య స్వరూపంబైన శ్రీమతి కుమారి జ్ఞానేశ్వరికి, ఆమె ఆధ్వర్యమున ప్రథమ శిష్యురాండ్రుగా వృద్ధి యగుచున్న ఇందిర, జ్యోతి, శాంతి, గాయత్రీల ఆయురారోగ్యములను, శాంతిని గోరుచు దైవాశీ ర్వాదములతో, ప్రేమతో వారికందరికి అర్పించబడినది.**

(శాంతి మార్చి 1955)

# 17. శ్రీకృష్ణ దర్శనము

నీ గృహాంగణ భూమి నిటలంబు మోవంగ
మోదించి నిత్యంబు మ్రొక్కడేని
నీ యధీనములుగా నిఖిల కృత్యంబుల
బ్రియ భావమున సమర్పింపడేని
నీ పాదాంబుజముల నిర్మలహృదయుడై
చింతించి మక్కున జిక్కడేని
నిన్ను జెవులార వినడేని నీకు సేవ
సేయరాడేని బ్రహ్మంబు జెందగలడె?
యోగియైన తపోవ్రత యోగియైన
వేదియైన మహాతత్త్వ వేదియైన.

శ్రీమతి అసనూయాదేవి శ్రీకృష్ణభక్తురాలు. ఆమె ఆశ్రమములో ముప్పది సంవత్సరముల క్రితము, తన భర్తగారితో ఆశ్రమ సేవచేయుచు కొంతకాలము గడిపియుండెను. సంసారములో నుండియు భక్తిశ్రద్ధలతో తన గృహకృత్యములను నిర్వహించుచు, దైవ పరితాపముతో జీవితమును గడపుచుండెను.

గృహస్థాశ్రమములో నున్నవారు కొందరు దైవప్రార్థన జేయుటకు, ధ్యానములో నియమముగా రోజూ కొంతకాలము గడుపుటకు తమకు తీరికయే లేదందురు. ఇక ఒక రిద్దరు పిల్లలు యున్నచో వారి సంరక్షణతోనే దినమంతా గడచిపోవుచున్నదని జెప్పుదురు. గాని మన అనసూయాదేవి, ఆరుగురు పిల్లల తల్లియై యుండియు, నిత్యము తన భర్తగారి యొక్క సేవ, పిల్లలయొక్క సంరక్షణ జేయుచు, వివిధమైన పూజా పునస్కారములు జేయుచు, పైగా శాంతి ప్రార్థనను నిత్యము 108 మార్లు స్మరించుటకు వ్యవధి గలిగియున్నదనిన, మా పాఠకులకు ఆశ్చర్యములలోకెల్ల ఆశ్చర్యముగా తోచక మానదు.

ఈ సందర్భములోనే Where there is a will, there is a way–దేనికైనను పట్టుదల, శ్రద్ధయున్న దానిని చేయుటకు మార్గము తనంతట అదే యేర్పడునని ఒక మహనీయుడు నుడివి యుండెను.

మొన్నటిరోజున సోదరి అనసూయాదేవి తన దినచర్య ను పంపుచూ :

"స్వామీ: నాకీ జన్మలో మరే కోరికయు లేదు. నేను వస్తువాహనములను కోరుటలేదు.

నాకు కావలసినది, మీ పాదసాన్నిధ్యమున కొంతకాలము గడుపుచు, శ్రీకృష్ణభగవానుని నిరంతరము దర్శించుకొనుటకు కోరుచుంటిని. ఈ నేత్రములతో ఆ కృష్ణపరమాత్మని దర్శించగలుగుటకు వరమును మీరు నా కొసంగుడు" అని దీనముగా వ్రాసెను. అప్పుడు నేను

"ప్రియమైన ఆత్మసోదరీ :

శ్రీకృష్ణభగవానుడు సభక్తికమైయున్న నీహృదయములో బంధితుడైయుండ బాహ్యమున జూచుటకు భ్రమపడెదవేల? అంతర్ముఖివై సంకల్ప రహితమైన నిశ్చల, నిర్మల దృష్టితో నీ హృదయములోనే ఆ కృష్ణపరమాత్మని దర్శింపుము. అప్పుడు నీవు ఆంతర్యమున దర్శించుచున్న శ్రీకృష్ణునే బాహ్యమున గూడ దర్శించగలవు.

ఈ మధ్య మరియొక రిటైర్డ్ జిల్లాబోర్డు విద్యాశాఖాధికారి (District Board Educational Officer) గ్రంధకర్త, మహాభక్తుడు భక్తితో వ్రాసిన లేఖకు జవాబుగా నేను ఆశ్రమము నుండి "మీ అపారమైన భక్తి ప్రేమలకు ఆనందించితిని. నేను మీకు ఏమి సేవ చేయగలను" అని వారికి వ్రాయగా ఆయన "ఓ ప్రభువా! నీవే నా కృష్ణపరమాత్ముండవు. నీవు కృపామయుడవై వరమిచ్చెదనినిన, నేను వలదందునా : నాకు ప్రపంచ వస్తు వాహన ములు, కీర్తి ప్రతిష్టలు, సిరిసంపదలు, చిరజీవితముగాని, చివరకు బ్రహ్మపదవియైన నాకు వలదు, నాకు కావలసిన దొక్కటియే." అవి యీ క్రింది పద్యమును వ్రాసెను.

నగు మొగమున్ సుమధ్యమును
నల్లని మేనును లచ్చికాట ప
ట్టగు నురమున్, బహు భుజములు
అంచితకుండల కర్ణముల్, మదే
భగవయు, నీలవేణియు, కృ
పారస దృష్టియు, గల్గు వెన్నుడు ఇ
మ్మగ పొడసూపు గాత కనుమూసిన
యప్పుడు విచ్చినప్పుడున్.

ఆయన అపారమైన భక్తి ప్రేమలతో వ్రాసిన ఉత్తరమును, నన్ను అడిగిన వరమును జూచి ఆనందించితిని. కాని, నేను ఆయనకు శ్రీకృష్ణ దర్శనమును కనుమూసిన, కనుతెరచిన యెటుల యివ్వగలను? చాల సందిగ్ధావస్థలో పడితినిగదా యని ఆలోచించుచు శ్రీకృష్ణభగ వానునే ధ్యానించగా, ఆయనయే యీ క్రింది రీతిని ఆ మహాభక్తునకు జవాబు వ్రాయించెను.

"ఓ పరమ భక్తాగ్రేసరా! ప్రియమైన ఆత్మసోదరా! శ్రీకృష్ణపరమాత్ముడు నీ హృదయమునకు హృదయముగా, మనస్సునకు మనస్సుగా, శ్వాసకు శ్వాసగా బరగుచు, కోటిసూర్యప్రకాశమానము ఐన దివ్యతేజస్సుతో నీ పరమ పావనమైన హృదయములో ప్రకాశించుచుండ, నీవే ఆ దివ్య తేజస్సువై వెలుగుచుండియు, ఆ తేజోదర్శన మిప్పించమని కోరెదవేల? ఆపాదమస్తకము, నీ శరీరమంతయు ఆ కృష్ణపరమాత్ముని తేజస్సే. నీ నేత్రము లలో జూచెడిది కృష్ణపరమాత్ముడే యని నిశ్చయ జ్ఞానము గలిగి, కనుమూసినను, తెరచినను, ఆంతర్యమున, బాహ్యమున గూడ, ఆ కృష్ణభగవానుని, అప్పుడిప్పుడనక, నిరంతరము అనుభవించుచు, నీ జీవితమును ధన్యవంతముగా జేసికొనెదవుగాక!" యని వ్రాయగా చాల సంతసించి అఖండ ప్రేమస్వరూపుండైన ఆ కృష్ణభగవానునిలో లీనమై, ఆనందముతో ఆయన జీవయాత్ర గడపుచుండెను.

మరియొక భక్తుడు, క్రీస్తుమత సాంప్రదాయకుడు, కొచ్చిను, తిరువాన్కూరునుండి.

"స్వామి! నేను మళయాళదేశములో పెద్ద ఉద్యోగస్థుడను. క్రైస్తవుడుగా జన్మించినను, హిందూమత సాంప్రదాయమునందు చాల భక్తిగలదు. నాకు ఏడు నెలలే సెలవు వున్నది. ఈ ఏడు నెలలు పూర్తియగు లోపల నాకు మోక్షమును ప్రసాదించుడు. మీరనుగ్రహించిన మీవద్దకు బయలుదేరివచ్చుచుంటిని" అని వ్రాసెను.

అప్పుడు నేను.

"నాయనా, ప్రియమైన ఆత్మసోదరా! మోక్షము ననుభవించుటకు, జన్మరాహిత్యమును జేసికొనుటకు ఏడు మాసములు గడువు పెట్టితివా? నీవు ఆశాపాశములకు జిక్కియున్నచో, విషయవాంఛలకు బానిసవై యున్నచో, ఏడు నెలలను మాట ఏల? యేడు సంవత్సరములు, యేడు యుగములలో కూడ ముక్తిని బడయజాలవు.

నీ మానవ వృత్తులను, కోర్కెలన్నింటిని భగవంతునకే అర్పించి దైవపరితాపముతో నిండి సంకల్ప రహితుడవుగానున్న నీవు ముక్తుడవగుటకు ఏడు మాసములననేల. ఏడు ఘడియలు, ఏడు నిమిషములు, చివరకు ఏడు క్షణములుగూడ అవసరములేదు.

మోక్షము ఆశారహితులదే :

కోరికయే సంకల్పమును గల్గించును. ఏ సంకల్పము లేనివారే బ్రహ్మవిదులు సంకల్ప రహితులు నిత్యసిద్ధులు. గాన అంతదూరమునుండి వ్యయప్రయాసలకులోనై ఇచ్చటకు వచ్చుటకంటే, అచ్చటనేయుండి, శాంతి ప్రార్థనను రోజుకు 108 సార్లు భక్తిశ్రద్ధలతో జపించుచు, నీ అభివృద్ధిని తెలియజేయుము" అని కోరితిని.

మరియొక భక్తుడు:

"స్వామీజీ! ప్రపంచములో నున్న వారితో నాకు సంబంధములేదు. నాకు మాత్రము మొదట ముక్తి నొసంగుము. ప్రపంచము కుక్కతోక వంటిది. దానిని యెంతవంకర లేకుండగ చేయవలెనన్ననూ కుక్కతోకను మనము తిన్నగా వంకరలేకుండగా చేయజాలనట్లు, యీ సృష్టిని, మానవాళిని మనము తిన్నగా చేయజాలము. గాన 'యెవరికివారే యమునాతీరే' అన్నట్లు ప్రప్రథమమున నేను తరించవలెను. గాన వెంటనే నాకు ఉపదేశమును ఇప్పించి నేను తరించుటకు, గమ్యస్థానము జేరుటకు తోడ్పడుడు" అని వ్రాసెను.

అప్పుడు నేను :

"నాయనా! కుక్కతోకను మనము తిన్నగాచేయ లేకున్నను, దానిని సరిజేయుటకు ప్రయత్నించుటలో మనతోక–అనగా చంచలమైన మనస్సు కొంత సరియగును. గాన ఇతరుల శ్రేయస్సును కోరుచు మనము వృద్ధియగుటకు ప్రయత్నించవలెను. నీ ఇంట్లో పదిమంది నీపై ఆధారపడియుండ, నీవు ఒకడవే విందు నారగించి, కొదువ వారందరును ఉపవాసము జేయుచున్న నీకు ఆనందముగా యుండునా? ఈ ప్రపంచమనే గృహములో, మానవకోటి అంతయు నీసోదరీ సోదర స్వరూపులేగదా! వీరందరును నరకమునకు బోయినా సరే నేనొక్కడినే స్వర్గము చేరవలెనని అనుట నీకు చెల్లునా? అది భక్తుని లక్షణమా? గాన యితరుల వృద్ధిని, శాంతిని, ముక్తిని గూడ కోరుచూ, నీవు తరించవలెను." అని వ్రాయగా, ఆయనగూడ ఆనందించి అప్పటినుండియు నిరంతరము ఇతరుల మేలును, లోకశాంతిని కోరుచు, యీ క్రింది రీతిగా శాంతి ప్రార్థనను స్మరించుచు, ఆ సోదరుడిప్పుడు దినదినాభివృద్ధిని గాంచుచుండెను.

ఓ తేజోమయమూర్తీ! తూర్పుపడమరల, ఉత్తర దక్షిణముల–ఈ విశ్వమందంతటను, అందరునూ నీ దివ్య తేజస్సును గ్రహింతురుగాక!

ఓ సచ్చిదానందస్వరూపా! ప్రతిమానవ హృదయమునందును, నానాజాతి మధ్యమునను శాంతి సామరస్యములను ప్రతిష్ఠింపజేయుము. ఓ దేవా! ఇదియే మా మనఃపూర్వకమైన ప్రార్థన.

లోకాస్సమస్తా స్సుఖినోభవంతు!

ఇటులనే చాలమంది సమీపస్థులు, దూరస్థులునగు భక్తులనుండియు వివిధ దేశములనుండియు, అనేక రీతులుగా ప్రాధేయపడుచు, భక్తితో...

ఓ స్వామీ! మాకు ఏసు దర్శనమును ప్రసాదించుము. మాకు సాయి కృపను గల్గింపుము., శ్రీకృష్ణ ప్రసాదమును నిప్పింపుము, బుద్ధభగవానుని దయను కల్గింపుము" అని వ్రాయుచున్నారు.

ఈ ఆర్తనాదములన్నియు వినుచు, వీరి ప్రార్థన లన్నియు చదువుచు, నా ఆంతర్య

హృదయములో పొందెడి ఆవేదనను, శ్రీకృష్ణపరమాత్మకు అప్పుడప్పుడీ క్రింది రీతిగా అర్పించుకొనుచుందును.

హే కృష్ణభగవన్ : సకల దేశములలో యున్న నీ భక్తకోటికంతకూ ముందుగా నీ దర్శనమిమ్ము. స్త్రీ పురుషాదులకు, ఆబాలగోపాలమున కంతకు నీ దర్శన మిమ్ము. నీ దివ్యదర్శన భాగ్యమును అందరు పొందిన పిమ్మట-సర్వజీవులు నీ దివ్య నామామృతమును గ్రోలి తృప్తిపడి ఆనందముగా యున్న పిమ్మట, మరెవ్వరు తరించుటకు మిగిలిలేరని నప్పుడే నా ప్రార్థనను జ్ఞప్తియుంచుకొని నా యొద్దకు దయచేయము. అంతవరకు, నీకై నేను ఓర్పుతో, ప్రేమతో వేచియుందును" అని తరచు మొఱలిడుచుండ, శ్రీకృష్ణపరమాత్ముడు నా ప్రార్థనను అంగీకరించుచున్నట్లే నేను భావించి ఆనందించుచుంటిని.

ఈ సందర్భములో మరొక భక్తవరేణ్యుడు నుతించిన ప్రార్థన జ్ఞప్తికి వచ్చి ఆ ప్రార్థననుగూడ శ్రీకృష్ణునికే అర్పించుచుందును.

ఓ ప్రభువా! ఇతరులను గొప్పవారినిగా ప్రఖ్యాతివంతులనుగా అందరిచే పూజింప బడెడివారినిగా జేయము. నన్ను మాత్రము నిరంతరము నీ పాదరేణువుగా అనమాధే యునిగా, అజ్ఞాత జీవునిగా అంత్యము వరకు ఉంచుము. ఇదియే నా హృదయపూర్వకమైన ప్రార్థన.

ఇట్టి భావనలతో శ్రీకృష్ణ భగవానుని దివ్యసన్నిధిని అన్ని వైపులను అనుభవించుచుండ రెండు ఆనంద బాష్పములు తలవని తలంపుగా "మేముగూడ శ్రీకృష్ణుని పూజించెదము" అన్నట్లు వచ్చుచుండ, వాటినే శ్రీకృష్ణపరమాత్మకు నా అల్పకానుకగా "శ్రీకృష్ణార్పణమస్తు" అని అర్పించి తృప్తిపొందుచుందును.

లోకాస్సమస్తా స్సుఖినో భవంతు

ఓమ్ తత్ సత్ : ఓమ్

**: సమర్పితము :**

**సమస్త జాతులలోని, సమస్త మతములలోని**
**శ్రీకృష్ణపరమాత్మయొక్క అనుంగు భక్తులకు**
**ఇది సమర్పితము.**

(శాంతి ఏప్రిల్ 1955)

# 18. శాంతసహితమగు సహనశక్తి

అన్యులు మనయందపోహపడినప్పుడు దానిని మనము మౌనముతో సహింప గలము. పరులు మనపై అపనిందమోపి తృణీకరించినపుడు సయితము మనము దానిని మనసునందిడు కొనక మరచిపోయి ప్రశాంతతతో భరింపగల్గుదము. మన శత్రువులు మనల బాధించి, ద్వేషించి దండతాడన మొనరించినను చిరునగవుతో, నిర్లక్ష్యభావముతో నోర్చుకొనవచ్చును. మనము విరోధులని భావించేవారు మనలను పీడించి, గర్హించి, దూషించినను మనము వాటనన్నిటిని సహింపగల్గుదము.

కాని మనకు ప్రియమిత్రులైనవారును, మనచే నత్యంత సన్నిహిత బంధువులుగ పరిగణింపబడినవారును మనపై నపోహపడినయెడలను, వారు మనలను నిరసించినను, ఎకసక్కెములాడినను మనకు సహించుట కలవికానంత మిక్కుటమగువెత జనించుటచే ఒక వేడి నిట్టూర్పును విడుచుటయో లేక లోన గర్హించుటయో చేయక నూరకుండలేము.

మనల మన శత్రువులే గర్హించి నిరసించి పీడించినపుడు ప్రేమభావముతో వారి హింసలను ప్రతిఘటింపకుండ భరింపగల్గినంత సత్యాగ్రహవ్రత దీక్షాపరతంత్రులమై యుండగల్గినపుడు కొంటె స్వభావముతోజేయు మన మిత్రుల యొక్కయు, శిష్యబృందము యొక్కయు నపచారములను దాక్షిణ్యరహితమైన కృత్యములను లెక్కగొనక వాటిని మాత్రమేల సహించి యూరకొనరాదు?

మన శత్రువులు మనలను చంప నుద్యోగించినను వారిని మంచివారిగనే యోచించి వార హత్యకృత్యముల సైతము సరకుసేయక సహింతుము. కాని మనకు మిత్రులును, హితులును, ప్రియులును నయిన వారొనర్చు కొలది నపకృతినయినను కొండంతగా పరిగణించి దానివలన విషపూరితమగు పాముకాటు కంటెను నెక్కువగు తీవ్ర దేహబాధను, మితిమీరిన మనోపరితాపమును ననుభవింతుము. ఇది సామాన్యమగు మనుజధర్మమై యున్నది.

నిజమగు ఘనత, మనకెట్టి యుపద్రవములు సంఘటిల్లినను, మన కత్యంత ప్రియులగువారు మన కెట్టి యిక్కట్టుల దెచ్చిపెట్టినను వాటి నన్నిటిని సమాన బుద్ధితో నోర్చి ప్రియమును, నప్రియమును నేకరీతిగ భావించి సమదృష్టితో మెలంగుటలో నున్నది. కాని మనము మన శక్తి సామర్థ్యంబుల నొసంగి మన జీవశక్తిచే పెంచి, పోషించి పెంపొందించిన మన శిష్యులు మనలను ధిక్కరించి, మనోవాక్కాయ కర్మములచే మనకు ప్రతికూలమొనరింప బ్రయత్నించి, మనలను ప్రేమించి, సేవించుటకుమారు వారి మూర్ఖతను ప్రకటించిన సమయములందే వాటిని కొంచెమైనను సరకుసేయక మనలో మనమిట్లు తలపోయవలెను.

"మన మెవరికిని గురువులమనుకాదు, వందనీయులమనుకాదు, మనకీ బాహ్యరూప నామములతో బనిలేదు. మనము నామరూపరహితమైన సత్య స్వరూపులము. ఈ సత్యన్యాయమునందితడు గురువు, ఇతడు శిష్యుడు, ఇతడు నిందితుడు, ఇతడు దూషించువాడు" అను పరస్పర భేదభావములకు గాని, ఇది శరీరము, ఇది ప్రపంచము అను ప్రత్యేకత్వములకుగాని అవకాశ మెంతయునులేదు. ఇందు దూషణ భూషణములను భిన్నగుణములులేక అంతయు దివ్యజ్ఞాన చైతన్య ప్రపూర్ణమై యెప్పుచున్నది.

పై జెప్పినరీతిని తలంచుటచేతనే ద్వంద్వసహితమై ఎప్పటికప్పుడు మార్పు జెందుచుండు నీ ప్రపంచములో మన ప్రియులును, బంధువులు నొనర్చు దొసంగులబాసి వానికి లోనుగాక తత్ప్రతిఘటనముల నతిక్రమించి దుఃఖాతీతులమై సుఖింపగలుగుదుము.

ఒక సమయమున ఋషిపుంగవుడగు వాస్వానీ మహాశయుని నొక రిట్లు ప్రశ్నించిరి.

""మహాశయా? నిజమగు ఆధ్యాత్మిక జీవితానందపరవశులగు మహనీయులు తమ్ము ఇతరులు నిందించి యెదిరించినపుడు వారేల తదపచారమును సరకుగొనక నిశ్చలచిత్తులై వర్తింతు"రని అడిగిరి. అందుల కా యనఘుడిట్లు ప్రత్యుత్తర మొసంగెను.

"నిజమగు మహాత్ములెప్పుడును దైవకృపయందు విశ్వసించుచుందురు. వారిపై దేవుని కృపారసము, వారిని లోకులు నిందించి హింసించినకొలది మరింత యెక్కువగ ప్రవహించుచుండును. మానవుని అమానుషత్వ మా దివ్యతేజోవంతులపై బరసిన కొలది వారిపై భగవంతుని కరుణ పెల్లుగ ప్రవహించుచుండును."

ఈ సత్యమునే యేసుక్రీస్తు ప్రభువు తన్ను తన మిత్రులు ద్రోహముచేసి శిలువపై చిత్రహింస గావించినపుడు లోకమునకు వెల్లడించెను.

"పరమపితా! నన్ను హింసించు యీ నా సోదరుల క్షమించి రక్షింపుము. వారు ఏమిచేయుచున్నారో వారే యెరుంగరు" అని నుడివియుండెను.

ప్రేమస్వరూపులారా! మన దేవతాంశ, యీ యజ్ఞానాంధకారమును బాసి, నేను గురువును, అతడు నాకు శిష్యుడు అను తారతమ్యములను వీడి, నశ్వరమగు శరీర భావననుండి తొలగి, కోటిసూర్యప్రకాశమై భాసిల్లుగాక!

లోకమందలి గురు శిష్యులకెల్ల శాంతి చేకూరుగాక!

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః హరిః ఓమ్.

(శాంతి సెప్టెంబరు 1956)

# 19. శాంతి

శాంతో౽ యమాత్మ ప్రియమైన శాంతి పాఠకా! మా శాంతి యొక్క ఆశీర్వాదములు నీయందుండుగాక! నీకు శాంతి జీవితమును ఇచ్చుటకే శాంతి వచ్చుచున్నది. నీ హృదయమును శాంతితో నింపుటకే ఇది ప్రారంభింపబడినది. నీ తాపత్రయములను, భయంబులను పారద్రోలి నీ జీవితమును శాంతిమయముగా జేయుటకే శాంతి నిన్ను జేరుచున్నది. ప్రేమ స్వరూపిణియైన, మా శాంతికి నీ ఆంతర్య హృదయములో కొంత తావును ఇచ్చెదవా? ఈ చిన్న సహాయమును మాత్రమే నీ నుండి కోరుచుంటిమి. మా శాంతి నీ హృదయమున ప్రవేశించుటకు పరితపించుచున్నది.

శాంతి నీకు అవసరము లేదా? నీ యంతరాత్మ నిరంతర శాంతికై పరితపించుట లేదా? "నాకు శాంతి అవసరము లేదు" అనెడివారు ఎవరైన యీ లోకమున నుందురా? చక్రవర్తి మొదలు నిరుపేదవరకు శాంతియే కావలెను. శాస్త్రజ్ఞుడైన పండితోత్తముని నుండి చదువురాని వానివరకు శాంతియే కావలెను. మహాత్ముని మొదలు నీచుని వరకు శాంతియే కావలెనుగదా? శాంతిని కోరనివారెవ్వరు. ప్రతివానికి శాంతి అవసరమైయున్నది. ఏలయన శాంతియే ప్రతి స్వరూపమునకు జన్మహక్కుగా నున్నది. సర్వశక్తుడైన దైవముయొక్క బిడ్డలందరకు నీ శాంతియే స్థిరమైన యాస్థియై యున్నది. ఇది యే యొక్క మతమునకు, ఏ యొక్క దైవమునకు సర్వాధీనమై యుండలేదు. దేశ మత జన వివక్షత లేకుండగ, శాంతి అందఱకు చెందియున్నది.

నిజముగా మన పుట్టుక చేతనే శాంతి మన జన్మ హక్కుగా నున్నది. మన గమ్య స్థానము శాంతియే! మన యాదర్శము శాంతియే. మన దారియు శాంతియే. మనకు తెలిసి యున్నను తెలియకున్నను శాంతినుండి దూరముగా గాని వేరుగా గాని జీవింపజాలము. ఇది భూతభవిష్యద్వర్తమాన కాలములలో విడదీయుటకు వీలు లేకుండ మనతో ఏకమై వెలుగుచున్నది.

ఈ శాంతి మన జన్మలకు ఆధారము, గమ్యస్థానమైయుండ, దానితోనె మన బ్రతుకు అంతయు నిండియుండ, అట్టి ముఖ్యమైన శాంతిని మన మిప్పుడు అనుభవించుచుంటిమా అని ప్రశ్నించుకొనవలెను. అపరోక్షముగా మన నిత్యకృత్యములలో ఈ శాంతిని అనుభవించుచుంటిమా యని భక్తిశ్రద్ధలతో ప్రతి పాఠకుడును తన అంతరాత్మను ప్రశ్నించవలెను.

నేను శాంతితో నిండి యుంటినా? అశాంతితో నిండి యుంటినా? నా నుండి శాంతి ప్రవహించుచ్చున్నదా, లేక అశాంతి-దుఃఖము ప్రవహించుచున్నదా? నేను శాంతినే ఎల్లడలను గాంచుచుంటినా లేక బాధను భేదమును జూచుచుంటినా?

అనుభవముగా శాంతిని పొందజాలని ఈ జన్మ యెందుకు? శాంతిని అపరోక్షముగా అనుభవించుటే ఇప్పుడు కావలెను. పెదవులతో "శాంతి" "శాంతి" యని యుచ్ఛరించిన లాభమేమి యున్నది. శాంతియని నోటితో బిగ్గరగా అరచిన మాత్రమున శాంతి గలుగునా? సారములేని యుచ్చారణలు వ్యర్థము. హృదయములను శాంతితో నింపుడు, శరీరములను శాంతిలో లీనముంచుడు. ఆలోచనలను శాంతిమయము జేయుడు. మనస్సులను శాంతిలో లీనము జేయుడు. జీవితములను సదా శాంతితో పొర్లి ప్రవహింపనిండు.

శాంతి! శాంతి అనగా నేమి? ఈ రెండక్షరముల మాటయేనా శాంతి? శాంతి యీ చిన్నమాటకు దూరమై యున్నది. శాంతి ఒక్క మాటకు బంధింపబడదు. అయినను శాంతిని ఒక గుడిలోపలనో, మసీదులోపలనో, చర్చి లోపలనో, జూచెడివారు చాలమంది గలరుగదా? ఏమీ? ఈ తావులకే శాంతి బంధింపబడి యున్నదా? శాంతి కాశీలోను, మక్కాలోను, జరూస్లములోననో యున్నదా? శాంతిని గుళ్ళకు గోపురములకు కట్టి పెట్ట రాదు. శాంతిని పుణ్యతీర్థములకైన బంధించరాదు. తమ అంతరాత్మలో శాంతిని గాంచెడి మహానుభావులు చాలా అరుదుగదా? శాంతిని తమలోపల గాంచలేనప్పుడు, ప్రపంచ ములోనున్న పుణ్యతీర్థములన్నియు సేవించిన మాత్రమున గాంచ గలుగుదురా? ఆంతర్యమున లేని శాంతి బాహ్యమున నెటుల గనబడును? లోపల నున్నదే బాహ్యమున గూడ గోచరించును.

నిజముగా నిత్యమైన శాంతి యనగా నెట్టిదో దాని గూడార్థమును పూర్ణభావనయు, అనుభవమున గనిన పూజనీయులు అరుదుగదా. స్వర్గరాజ్యము అట్టివారిదే! అట్టి యదృష్ట వంతులకే సమాధి అవస్థ పుట్టినిల్లయి యున్నది. వాస్తవముగా ఈ శాంతిని వేదములు (శాంతోஉయమాత్మ) శాంతియే ఆత్మయని ఘోషించుచున్న శాంతినుండి వేరుగాదు. కర్మేంద్రియములకు, జ్ఞానేంద్రియములకు, మనోబుద్ధి చిత్త అహంకారములకు అందని పూర్ణ శాంతియే యిది. ఇదియే గదా అందరి జీవితములకు గమ్యస్థానము. ఈ శాంతినే ఏసుక్రీస్తు "నా శాంతిని మీకిచ్చుచుంటిని" అని లోకమంతయు వెదజల్లెను! కరుణామ యుడైన బుద్ధభగవానుడు ప్రసాదించినదీ శాంతినేగదా! నిజముగా అఖండమైన ఈ పూర్ణ శాంతియే లోకములోనున్న అన్ని మతములకు అన్ని జాతులకు అన్ని శాఖలకు గమ్య స్థానమైయున్నది.

ప్రియమైన పాఠకా! ఈ పూర్ణ శాంతిని అనుభవించుటకు నీ ఆంతర్య హృదయ ములోని కేగెదవా? నీ జీవితముయొక్క తాపత్రయములను అవస్థలను గురించి వగవకుము. నీ జీవితములోని కష్టనష్టముల గురించి అధైర్యపడకుము. నీ జీవితముయొక్క ఆశాపాశ పిశాచములను లెక్కచేయకుము. ఇచ్చటనే నీవు చింతకును అధైర్యమునకును తావీయక,

నిర్భయముగా స్థిమితముజెంది పాశ్చాత్యుడైనయొక మహానుభావుని మాటలను సదా స్మరింపుము:–

"Out of the depths fresh Strenth-

Out of the darkness new Light-

Even in the gloom we are on the way"

అగాధములో పడినపుడే నూతనమైన బలము వచ్చుచున్నది. చీకటిలో నుండియే నూతనమైన వెలుతురు వచ్చును. అంధకారములో నైనను మనము దైవసన్నిధిలోననే, సరియైన బాటలోనే నడచుచుంటిమి. ఆహా! ఏమి ధైర్యమైన వాక్కులు! యెంత ఆనందమైన సంగతి! చీకటిలోనైనను వెలుతురులోనైనను, పుణ్యములోనైనను పాపములో నైనను మనలను ఆవరించియున్నది శాంతియేగాన మనము ధైర్యముతో నిండి ఆనందముగా నుందము. ఇప్పుడు మన మెచ్చుటెచ్చుట నేస్థితిలో నున్నను శాంతిలోనే నిత్యస్నాన మాచరించుచుంటిమి. ప్రియపాఠకా! నీవిది చదువునపుడు శాంతిలోనే మునింగియుంటిమి సుమా! మనమిప్పుడు శాంతితోనే నింపబడి యుంటిమి. మనము శాంతి చేతనే యావరింపబడి యుంటిమి. ఆంతర్యమునను బాహ్యమునను శాంతియే! మనము దానిని ప్రత్యక్షముగా యనుభవింతుము. ఈ శాంతిని హృదయపూర్వకముగా అనుభవింతము. మన యంతరాత్మ నంతను ఈ శాంతితో నింపుదము. అపరోక్షముగా యీ శాంతి సాక్షాత్కారమును పొందుదము. మన పత్రికయొక్క యాదర్శమిప్పుడు స్మరింతమా?

INHALE AND EXHALE PEACE,

THY BIRTHRIGHT.

శాంతినే నీవు ఉచ్ఛ్వాస నిశ్వాసములలో తీయుము. ఏలనన అదే నీ జన్మహక్కు. "శాంతియే నా జన్మ హక్కు" అని ఎలుగెత్తి చాటుము. "పరమ శాంతియే నా జన్మహక్కు" అని మననము జేయుము.

ఇకముందు శ్వాసను లోపలకు తీయునప్పుడు ప్రతీ శ్వాసతోను ఈ శాంతినే పీల్చుటకు నిశ్చయించుకొందము. ఈ శాంతిని యుచ్ఛ్వాసములో విడచుటకు స్థిరము జేసుకొందము. ఈ శాంతిలేని శ్వాసను ఒక్కసారియైనను విడువమని మరల మరల నిప్పుడే నిశ్చయించుకొందము.

**శాంతి సోదరా! శాంతి సోదరీమణీ! ఈ పత్రిక నటులుంచి నిమీలిత నేత్రములతో శాంతిని మరువనని, శాంతినే ప్రతి శ్వాసలోను తీయుదునని నిశ్చయించుకొనుము.**

ఆహా! ఈ శాంతియే నిత్యమైన సత్యముగదా! వివిధ మతముల యొక్క ధర్మసూత్రము లన్నియును మనకు దెలియకున్నను యీ శాంతినే మన యుచ్ఛ్వాస నిశ్వాసములలో గమనించుచున్న, ప్రతీ శ్వాసతో గ్రోలుచున్న, మన ముక్తికి, మనము తరించుటకు నిది చాలునుగదా?

ఓ అదృష్టభరితడవైయున్న శాంతిస్వరూపా! స్నేహితులు విరోధుల రూపముగానున్న శాంతమూర్తీ! ధనికుల రూపమునను బీదల రూపమునను వెలుగుచున్న ఓ శాంతి దేవతా! చరాచరములగ విలసిల్లుచున్న ఓ శాంత్యావతారా! ప్రకృతిరూపముగా వెలుగుచున్న ఓ శాంతిమాతా! వ్యక్త అవ్యక్తములుగా పరిణమించుచున్న ఓ శాంతినిధే! నీకు ధన్యవాదములు. సదా నిన్నే స్మరించునటుల కరుణించుము. మా మనస్సులు ఎచ్చటెచ్చట తిరిగినను నిన్నే స్మరించెడునట్లు ప్రసాదించుము. మా నేత్రములు దేనిని జూచినను నిన్నే గాంచెడిలాగున తోడ్పడుము. పరమ పావనమైన శాంతి స్వరూపమా! మా శరీరము లన్నిటియందును, కాలిగోరు మొదలు శిరస్సువరకు నిండియున్నది నీవుగాక అన్యము గాదనెడి అనుభవమైన జ్ఞానమును ఇమ్ము. మా హృదయములో వెలుగుచున్న జ్యోతిస్వరూపుండవు నీవేయని మమ్ము నెరుంగ నిమ్ము. ఓ శాంతిదైవమా! ఎప్పుడో ఎచ్చటనో గాక ఇప్పుడే ఇచ్చటనే ఈ క్షణముననే నీ శాంతి మా మనోవాక్కాయ కర్మలలో అనుభవముగా సాక్షాత్కరించెడిలాగున తోడ్పడుము. మా సర్వస్వము నీవే గాన మేము నీలోనే కదలుచుంటిమని, నీలోనే ఆలోచించు చుంటిమని నీలోనే మా పనులన్నియు జేయుచుంటిమనెడి అనుభవము నిమ్ము.

ఓ శాంతి జనకా! ఇప్పుడు ఏ శాంతి మమ్ము ఆవరించి యున్నదో, యే శాంతిని మేము అనుభవించుచుంటిమో ఆ శాంతినే మానవకోటి యంతయు అనుభవించునుగాక.

సర్వేజనా స్సుఖినో భవంతు!

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః !!

(శాంతి మార్చి & ఏప్రిల్ 1959)

# ౨౦. శాంతి ప్రార్థన

శాంతి ప్రార్థన వ్యష్టిజీవుని సమిష్టితో కలుపునట్టిది. జీవుని పరమాత్మలో లీనము చేయును. అదియెప్పుడో ముందుభవిష్యత్తు నందుగాక, వెంటనే దానిని స్మరించుచుండినపుడే దైవదర్శనమును మనమనుభవించునట్లు చేయునది. కాని నీ శరీరమునందు ప్రతి అణువు ఇప్పుడే, ఇక్కడనే దైవసామీప్యమును అనుభవించునట్లు ఈ చిన్న శాంతి ప్రార్థనను నీ హృదయపూర్వకముగాను, నిర్మలమగు ఆత్మ భావనతోను, నీవు చేయవలయును.

ఈ ప్రార్థన బహు సులభపదములతో యున్నదని మనము దానిని చులకన చేయుచున్నట్లు యెంతమాత్రము తలచవద్దు. కొందరకు కఠినపదముల నుపయోగించుట యిష్టము. వారికి మాటలతోనే పనిగాని మాటల అంతరార్దముతో పనిలేదు. అవియెంత పరుషముగాను, భేషజముతోను నిండియుండిన వారికి అంతయిష్టము. ఏలననగా వారి జీవనములు సాధారణమైనవిగాక క్లిష్టమైనవిన్నీ, తీర్చరాని కోరికలతో నిండినవిన్నీ అయి యుండును.

కొందరకు దేవుని హృదయమును సూటిగా తాకునట్టి చిన్న ప్రార్థనలే యెప్పుడును ఇష్టము. ఈ సాధారణ శాంతి ప్రార్థనలో కూడను, యెక్కడనో స్వర్గమందుగాని, ఆకాశ మందుగాని, దేవాలయము, గుడియందు మాత్రమునగాని దేవుడు నిలిచిపోయినట్లులేదు. అతడు యెచ్చటనైనను వేరుగా లేనేలేడు సరికదా మనుజుని హృదయము, జీవనము, ఆత్మయే అయియున్నాడు.

అంతేగాదు ఈ ప్రార్థన యేమతస్థునిచే నైనను, ఏమతములేని వానిచేనైనను ఉచ్ఛరించబడవచ్చును. దాని స్మరణచేత అది మనశ్శాంతి నిచ్చును. గనుక, యే మతము నందును విశ్వాసములేనివాని చేతనైనను అది చేయబడవచ్చును. దానిని అంతఃస్మరణ చేయువానిని గాఢమగు శాంతితో ఆశీర్వదించును.

శాంతి ప్రార్థన, "పూజనీయమైన ఓ దివ్యస్వరూపా" అను పదములతో ప్రారంభించును. పూజనీయమైన అనునప్పుడు తేజస్సు నీ పాదముల వ్రేళ్ళువద్దనుండి బయలు వెడలి నీ శరీరమంతటను నింపి, శిరస్సునందుగల సహస్రార చక్రమును తాకును. "దివ్యస్వరూపా" అనునప్పుడు నీ శరీర మంతటను మాత్రమేగాక స్వల్పమగు అణువు నుండి బ్రహ్మాండమగు గ్రహమువరకును ఆవరించియున్న యదార్థమగు దివ్య స్వరూపముతో నీవునిండి ఆవరించబడుదువు.

ఇప్పుడు దివ్యస్వరూపములో నీవు యుండుటేగాక, నీ యెదుట నున్న దివ్యస్వరూప మధ్యమున నీవు యుండి వానితో నీవు నిండియుందువు. అది స్వప్నము, ఊహా మాత్రము

గాక సర్వవ్యాపియగు దైవమునందు యదార్ధమగు విశ్వాసము నీకున్నచో ఇప్పుడే ఆయన దివ్యస్వరూపముతో నీవు నిండిపోదువు.

నీవు యెక్కడ ఉన్నను, యే పని చేయుచున్నను, నీవు యెవరవైననుసరే, నీవు దేవుని ఆకారము, అంతేగాక, దేవుని ప్రాణమూర్తివి, ప్రపంచజ్యోతికి ఆధారమగు సూర్యుని కిరణము.

**నీవు పూజనీయమైన దివ్యస్వరూపములో యున్నావు. పావనమైన దివ్యస్వరూపము నీలో యున్నది.**

మొదట బిగ్గరగాను చివర నీ ధ్యానములో నిశ్శబ్దముగాను, ఈ చిన్న ప్రార్ధనను నీవు ఉచ్చరిస్తూ దినదినము నీవు వృద్ధి చెందుచున్నకొలదీ ఆ దివ్యస్వరూపమును నీవున్నూ వేరుగాక ఒకరే అనిన్నీ, అట్టి అనంతమగు శాంతి, అందరియందును ఒక్క దైవమును చూడగలిగిన శక్తి యున్నవానిదే అనిన్నీ నీవు గ్రహింతువు.

**నిజముగా ఉన్నది ఒక్కటియే పదార్ధము. అదే నీవు.**

మహిమంతయు ఆ దివ్యస్వరూపముదే. నా జీవితమందు సార్ధకమగు పావనమైన కొన్ని క్షణములున్నవి. అప్పుడు ఈ శాంతి ప్రార్ధన నంతను నేను పూర్తిగా ఉచ్చరించలేను. “పూజనీయమైన దివ్యస్వరూపా” అను రెండు మాటల ఉచ్చారణే ఈ క్షణిక భావమునుండి అనంత జ్ఞానములోనికి నన్ను తీసికొని పోవునట్టి ఆనందముతో నన్ను నింపును.

ఈ ప్రార్ధనను ఇంకనూ **“లోపలను, వెలుపలను, మీదను క్రిందను అంతటను నిండియున్న ఓ సర్వాంతర్యామీ”** అని అంటూయుండగా ఆయన తేజస్సు మన శరీరముయొక్క ప్రతి అణువునందు ఆవరించును. ఇప్పుడే అనేక సూర్యుల దివ్యతేజస్సుతో సమానమగు స్వయంప్రకాశమైనట్టి ఆత్మభావముతో నిండియున్నట్లు మనము అనుభవింతుము. “ఇచ్చట, ఇప్పుడే” అన్న పదములు, బయటకు సాధారణముగా కనబడి నను, సర్వవ్యాపి, సర్వశక్తి సమన్వితుడు, సర్వజ్ఞుడు అన్న భావములన్నియు యిమిడియు న్నవి. గతించిన కాలమును మరచి, రాబోవునట్టి అగోచరమగు భవిష్యత్తు సంగతిని వదలి ఈ ప్రస్తుత కాలములోనే యుండుట యెంత శ్రేయమైనది. అంతమగు కాలములో అనం తమును యెవరు చూడగలిగి క్షణక్షణము జీవింతురో వారి జీవితమే సార్ధకమైనది.

ఈ శాంతి ప్రార్ధనను చెప్పునప్పుడు ఆయన అన్ని నేత్రములకు నేత్రమైయుండగా “నా నేత్రమునకు నేత్రమై” అని యేకవచన భావములో నేనెన్నడును స్మరించజాలను. అట్లే అందరును ఆయన బిడ్డలే అయియుండుటచేతనున్నూ ఆయన ప్రేమ యెవరిని ప్రత్యేకించక అందరిని ఆవరించును గనుక “ఓ ప్రేమైకమూర్తీ నన్ను రక్షింపుము” అని

నేను అనజాలను. **"ఓ ప్రేమైకమూర్తీ మమ్ములను రక్షింపుము"** అనుట యందే నాకు ప్రీతి. "నిన్ను తెలిసికొను భాగ్యము నాకు ప్రసాదింపుము" అనుటలో మన అహం భావము వెల్లడగును గనుక **"మేము వేడుకొనుచున్నాము."** (We) అని బహువచనము వాడుటలో నాకు ఆనందమైనది. గనుకనే **"తూర్పు, పడమరల, ఉత్తర, దక్షిణముల అందరును నీ దివ్య తేజస్సును గ్రహింతురుగాక"** అనియున్నది.

ఇతరుల శ్రేయస్సు కోరుటలో మొదట నీ హృదయములో శాంతిని నెలకొల్పుదువు. గనుకనే "ప్రతి మానవ హృదయము నందును, నానాజాతి మధ్యస్థమునను, శాంతి సామరస్యములను ప్రతిష్ఠింపజేయుము. ఇదియే మా మనఃపూర్వకమైన ప్రార్థన" అని యున్నది.

అవివేకియగు మనుష్యుడు తన గురించియే హెచ్చుగా చింతించుచుండుట చేతనే సుఖపడక దీనమగు జీవితమును గడుపుచున్నాడు. అహమును పూర్తిగా త్రోసి, అందరిని సుఖవంతులుగా చేయుటే తాను సుఖముగా యుండు మార్గము. నిరంతరము శాంతి ప్రార్ధన అహమును నశింపచేసి, అవివేకమును తొలగించి హృదయమందు ప్రేమను, ఆత్మయందు శాంతిని నెలకొల్పును.

ఆ దివ్యస్వరూపము మన అందరి హృదయములలో వెలుంగుచున్న తేజస్సుగనుక, మనము గుడులలోను, దేవాలయములందును ఉన్నప్పుడేగాక మన జీవితముయొక్క ప్రతి క్షణమందును, అందరి శాంతిని కోరుచు శాంతి ప్రార్ధనను స్మరించుచుండవలయును. విశ్వ శాంతిని నెలకొల్పుటకు దారిచేయు శాంతిని, హృదయమందు ఇప్పుడే, ఇక్కడే కలిగించుటకు శాంతి ప్రార్ధన తోడ్పడును.

ప్రియమైన ఆత్మ సోదరీ సోదరా! ఈ సాధారణపు శాంతి ప్రార్ధన భక్తిప్రధానమైన హృదయమునందు శాంతిని నెలకొల్పుటలో తోడ్పడి, నీ గృహమును శాంతితో నింపి, పూజ నీయమగు దివ్య స్వరూపముయొక్క తేజస్సు విశ్వమంతటను ఆవిర్భవించు నంతవరకు, నానాజాతి మధ్యస్థమందును శాంతి వ్యాపించుగాక!

దేవుని దివ్య స్వరూపమే దేవుని బిడ్డలగు అందరిలోనుయున్న సూత్రాత్మ గనుక అందరిని ప్రపంచముతో కలుపు పవిత్రమగు శాంతి ప్రార్ధనను భక్తితోను, నిశ్శబ్దముగాను కండ్లుమూసి చెప్పుకొందుము. హృదయముయొక్క అంతర్జ్యోతియు, విశ్వమంతటకును స్వయం ప్రకాశము అగు పూజనీయమైన దివ్యస్వరూపమునకు వందనములు.

ఓం ! ఓం !! ఓం !!!

(శాంతి ఏప్రిల్ 1960)

# 21. శ్వేతగిరి పిలుపు

## ఆదర్శ వాక్యములు

1. స్వర్గమును చేర్చు మార్గము ఇరుకుగాను రాళ్ళు, రప్పలతో నిండియుండును.

2. నా గమ్యస్థానమును చేరుటకు నేనొక దారిని కనుగొనెదను, లేకున్న ఒక మార్గమును చేసెదను.

3. మంచిగా ఉండి, మంచినే చేయుము.

4. లెమ్ము, మేల్కొనుము, నీ గమ్యస్థానమును చేరెదు వరకు ఆగకుము.

5. నీ జన్మ హక్కైన శాంతిని ఉచ్ఛ్వాస, నిశ్వాసములలో అనుభవింపుము.

## మా దినసరి ప్రార్థనలు

1. దేవా! ఇతరులు గొప్పవారై, ప్రతిభాశాలురై, కీర్తివంతులై యుండనిమ్ము; కాని నన్ను దీనుడనై నిరాడంబరజీవినై, నా స్వల్ప సేవను నిశ్శబ్దముగా చేయనిమ్ము.

2. ప్రియమైన దేవా! ఆత్మస్వరూపా! తమ దేదీప్యమానమై వెలుగు దివ్యజ్యోతిని, నాలో దివ్యకాంతి పుంజములతో ప్రకాశింపఁజేయుము. ఇతరులు నన్ను చూచునపుడు ఈ శరీరమునుగాక, నీ స్వప్రకాశమైన జ్యోతిని దర్శించునట్లు జేయుము. ఇదియే నా ప్రార్థన. లోకశాంతి ప్రార్థన.

3. పూజనీయమైన ఓ దివ్యస్వరూపా!

లోపలను, వెలుపలను, మీదను, క్రిందను, అంతటను నిండియున్న ఓ సర్వాంత ర్యామీ! మా లోపల ప్రత్యణువునందును ఇమిడియుండి మా నేత్రములకు నేత్రము, కర్ణము లకు కర్ణము, హృదయములకు హృదయము, మనస్సులకు మనస్సు, శ్వాసలకు శ్వాస, జీవన ములకు జీవనము, ఆత్మలకు ఆత్మవై వెలుగొందు ఓ దేవా, ప్రేమైకమూర్తీ! నిన్ను తెలిసికొను భాగ్యమిప్పుడు, ఇచ్చటనే మాకు ప్రసాదింపుము.

ఓ తేజోమయమూర్తీ! తూర్పు పడమరల, ఉత్తర దక్షిణముల, ఈ విశ్వమందంతటను, అందరునూ నీ దివ్య తేజస్సును గ్రహింతురు గాక! ఓ సచ్చిదానందస్వరూపా! ప్రతి మానవ హృదయమునందును, నానాజాతి మధ్యస్థమునను శాంతి సామరస్యములను బ్రతిష్ఠింప జేయము. ఓ దేవా! ఇదియే మా మనఃపూర్వకమైన ప్రార్థన.

లోకాస్సమస్తా స్సుఖినోభవంతు! ఓం శాంతిః శ్శాంతిః శ్శాంతిః

# బొబ్బిలిలో నా పాదయాత్ర విహారము

## గడ్డిపరకయైనను కదలజాలదు :

"శివుని యాజ్ఞలేక చీమయిన కదలునా?" యన్న వాక్యమువలె, భగవంతుని యాజ్ఞ లేక గడ్డిపోచైనా కదలునా. ఇది సత్యవాక్యమేగాక, భగవంతుడి వాక్యము కూడను. విషయాలు స్వల్పమైనా, గొప్పవైనా, అనుభవములు ఆర్తిపూరితములైనా ఆనందములైనా సత్యవాక్యము మాత్రము సర్వమానవుల సర్వకాల సర్వావస్థలయందు జీవిత గాథల్లో, సత్యవాక్యమయ్యే చెల్లుచున్నది. ఈ సత్యప్రభావము నుండి తపిప్పుచుకొనుట దుస్సాధ్యము. ఎవరు తమ నిత్యజీవితాల్లో పై సత్యాన్ని గుర్తించుకో కలుగుతున్నారో వారే ధన్యాత్ములు. మహాత్ములు కూడను. అట్టి ధన్యజీవులు తమ జీవితయాత్ర యందు అడ్డువచ్చు యాటంకాలనే ఆధారా లుగాం జేసికొని, ముందుకు సాగుచున్నారు.

ఆహా! బుద్ధిచాతుర్యాన్నేమనవచ్చును. తుచ తప్పక పూర్వవాసనల మరువదుకదా! ఈ శ్వేతగిరి పాదయాత్ర పశ్చిమమందొక పాదయాత్రను జ్ఞాపకానికి తీసుకువచ్చుచున్నది. నేను ముప్పది సంవత్సరములకు పూర్వము ఫిలడెల్ఫియా యందుండగా ఒక్క విహారము వెళ్ళినాను. అయితే ఈ బొబ్బిలి విహారానికి పాశ్చాత్యదేశ విహారానికి చాల తేడాయున్నది. ఉత్తర దక్షిణాల కెంతబేధమో, నరకానికి నారాయణ సౌధాని కెంత భేదమో అంత తారతమ్యం మొదటి, రెండవ విహారములకు ఉన్నది. ప్రస్తుతపు బొబ్బిలి పాదయాత్రా విహారాన్ని పిచ్చి విహారమని యనవచ్చునేమో!

## అమెరికాలో నా పాదయాత్రా విహారము :

నా మొదటి విహారయాత్ర కడురమ్యమైనది. ఆరోజు వర్షముతో కూడిన వారము. మేఘములు క్రమ్మిన గగనము. గొడుగు లేక వర్షపుకోటును తొడిగికొని ఫిలడెల్ఫియా యుద్యానవనమునకు వెళ్ళితిని. అందు నా స్వరూపాన్ని వేరుజేయక అందున్న ఒక్కొక్కదానితో మిళితమొనర్చితిని. కమ్మని సువాసనల వెదజల్లు పూలగుచ్ఛములతో, గానకోయిలలతో, ఇతరుల మనోరంజితమైన ఆనందములో, ఆకాశాన్ని అంటుకొనుటకై పైకెదుగు వృక్ష సముదాయముతో ఏకమైతిని. అమాయకులు ఆనందస్వరూపులగు చంటిపిల్లలతో, చిరునగవు చిందులాడుచు చిద్విలాసముతో ఆటలాడు పసిపిల్లలతో మాట్లాడుచు వారితో నేను ఒక్కడనైతిని, అంతేకాదు–ప్రకృతి సౌందర్యాన్ని తిలకిస్తు హాయిగా నుండు ప్రజా సమూహములో కలసితిని. నాపై మెల్లగా పడి చల్లగా జారు, మేఘుని వర్షబిందువులతో, పాలతో నీరు కలసినట్లు, ఏకమై, ఆ ఏకత్వాన్ని తనివితీర ఆనందిస్తూ అచటి శాంతి ప్రేమలతో నిండిన అమోఘ వాతావరణాన్ని చూరగొన్నాను.

## బొబ్బిలి యాత్ర:

అయితే బొబ్బిలియాత్ర ఏమని చెప్పుదును! ఆనాడు భాస్కరుడు తన పరిపూర్ణ వేడివెలుంగుల ప్రసరింపఁజేసిన రోజు, ఆ మిడిమిడి ఎండలో శ్వేతగిరి శిధిలదర్శనానికయి బయలు వెడలితిని. బాటలు ఫిలిడెల్ఫియావలె చదునైన బాటలుకావు. గాని రైల్వేలైను ప్రక్కన మెలికలు తిరిగి వెళ్ళు గరుకైన బాట. కొండవరకును రోడ్డు కాలిబాట మరి రాళ్ళరప్పలతో నిండిన యెగుడు దిగుళ్లు. పూల గుచ్ఛములకు బదులు ముండ్ల పొదరిండ్ల అవరితమైయున్న ఎత్తయిన శిఖరాన్ని ఎక్కవలసి వచ్చెను. ఇచట నేను క్రొత్తవాణ్ణి, మార్గము తెలియదు కాబట్టి ఒంటరిగా వెళ్ళక సూర్యనారాయణ యనెడు నౌఖరుని వెంటబెట్టుకొని వెళ్ళితిని.

## శ్వేతగిరి పిలుపు :

ఒక్క విషయము, ఈ యాత్ర పిచ్చిదని మొట్టమొదటనే చెప్పినాను. ఎందులకట్లు వెళ్ళ నిశ్చయించినానో తెలిసి మరల వివరములకు వెళ్ళుదము. మా బృందము 16 మంది హాయిగా అతిధి సౌధమునందు బసచేసినాము. శ్రీశ్రీశ్రీ బొబ్బిలి రాజావారి విశాలమైన విడిది గృహమునందు దిగినప్పటినుండి నా దృష్టి శ్వేతాచలాగ్రముపై నుండు శిధిలములపైఁబడుచుండెను. కాని విచారించగా, శ్వేతగిరి శిఖరముపై నుండు శిథిలములు చేరుట దుస్సాధ్యమనియు, పాతికేండ్లపైగా ఎవ్వరు అచటికి వెళ్లుట లేదనియు నుడివిరి. ఐతే నాలో అచటికి ఒక్కసారి వెళ్లి వాటిని దర్శించి విషయములు విపులముగ నెరుగవల యుననెడి యాశ జనించెను. ముండ్లపొదలతో నిండిన దట్టమైన అడవియని, యాశిఖరము చేరు ప్రయత్నము మానుమనిరి. వారు వద్దనుకొలది వెళ్ళవలెననెడి ఆతురత ఎక్కువయ్యెను, కర్మవశము నుండి తప్పించుకొనుట కెవరివశము? యోగియైనా, భోగియైనా, కర్మ తార తమ్యము లేక ఫలములనిచ్చి పరిపూర్ణమగును. కర్మ పరిపూర్ణతకొరకే జన్మగాని యితరమునకు కాదుగదా! ఈ కర్మఫలము జీవుడు గతమున విసరిన విత్తుల ఫలములుగాని వేరుకావు. కర్మ బలీయముకదా! ఒక్క చిన్న కథ జ్ఞాపకము వచ్చుచున్నది.

## కర్మచే నూతిలో పడనున్న మానవుడు :

ఆత్మదర్శన మొనరించిన ఒక ఆధ్యాత్మిక మహాపురుషుడు, ఒక్క సాధువు, ఒక్క నుయ్యి ప్రక్కన ధ్యాన నిమగ్నుడై యుండెను. మరియొక జీవి ఆ నూతిలోపడి ప్రాణ త్యాగమొనర్చుటకు ప్రయత్నించుచుండెను. అచటికి కొందరు పరుగులిడుచువచ్చి యా జీవిని రక్షించుమని యా సాధువును బ్రతిమలాడిరి. సాధువు నవ్వి ఉదాసీనుడైయుండెను. అచటి వారు యా సాధుచర్యనుఁజూచి తూలనాడసాగిరి. అది గమనించి వారితో యా

సాధుపుంగవు డిట్లనియె. "ఓరీ మూర్ఖులారా! మీరాతనిని బాహ్యదృష్టితో జూచిన నేనాధ్యాత్మి దృష్టితో యాతని విధివిలాసాన్ని గుర్తించుచున్నాను. ప్రతి మనుజునికి అంత్య ఘడియలు లెక్కింపబడియే యున్నవి. అట్లుండ అతని ఆత్మహత్యాసన్నాహము నాపుట కెవరి వశము. కర్మతోగూడిన దైవనిర్ణయాన్ని దాట సాధ్యమా?"

అట్లే, హాయిగా స్వర్గతుల్యమైన విశ్రాంతి విడిదియందుండక, కష్టపరంపరలతో నిండిన శ్వేతగిరి దర్శన ప్రయాణ వాంఛ నాకెట్లు కలిగెను?

ధర్మజుడు స్వర్గమున కరుగుట :

నేను నా మార్గదర్శి (తోడుగా తీసుకొన్న వ్యక్తి) తో పర్వతదరి చేరుసరికి వేడిమి యెక్కువయ్యెను. నేను కొండ నెక్కుచుండ ఒక చిన్న విషయము జ్ఞప్తికి వచ్చెన. ధర్మజుడు తన అనుజులతో, అనుంగు భార్య ద్రౌపదితో స్వర్గమున కరుగునెడ, ఒక్క విశ్వాస జంతువైన శునకము తప్పించి, తదితరులందరు తనవెంట వెళ్ళలేకపోయిరి. అయితే యిచట నాకు సూర్యనారాయణ నామధేయుడైన కాపలావాడు తప్ప, అనుచరులు యెవ్వరు నా వెంట రాలేదు. ఆ సూర్యనారాయణుడే ఆ పర్వతారోహణమున నా మార్గదర్శి, అతని జన్మస్థానము బొబ్బిలియైనా, ఒక్కసారికూడా యీ శ్వేతగిరి దరిదాపునకు వెళ్ళలేదు. అతడు ఉత్సాహ పూరితములైన ధైర్యసాహములతో ముందున కరుగుచుండెను. ముందునకు సాగిపోవుకొలది ముండ్లపొదరిండ్లతో నిండిన గరుకైన దారిగూడ నదృశ్యంబయ్యెను. వర్షమువలన, చిన్నచిన్న రాళ్ళన్నియు క్రిందికి జారి, వాలు ఎక్కువై త్రోవనిటారుగా నుండెను. శిరముపైకెత్తి జూచిన, పట్టులేని నేలయు, ఆధారము లేని రాళ్ళు, అచటచట దట్టమైన ముండ్లపొదళ్లు తప్ప నితరము కానరాదయ్యెను. ముందుకు దూసుకుపోవడానికి దుస్సాధ్యమయ్యెను. అట్టి నిస్సహాయస్థితియందు శ్రీక్రైస్తు భగవానుని సూక్తి యొకటి జ్ఞాపకమునకు వచ్చెను. "నాగలిమీద చేయూని దృష్టివెనుకకు మరల్చనేల?

అచటి ముండ్లతాకిడిచే శరీరమందంతా రక్తపుగీటు లేర్పడినవి. చిన్న చిన్న గాయములు పడినవి. మీదికి వెళ్లుటకు ఏమాత్రము సాధ్యముకాదయ్యెను. అడుగులు తడబడినా, కాళ్ళు వెనుకంజ వేయుటకు మనస్సొప్పలేదు. స్వర్గతుల్యములైన సుఖములు అతిథి సౌధమునందుండ, వాటిని వదలి, కడు యిడుమలకు లోనై దారిలేని దారియందు, ముండ్లకంపల కఠిన స్పర్శకు శరీరము ఆహుతియై, రక్తము స్రవించుచుండ, తల్లడిల్లు చున్నాను. ముందునకు నేనెందులకు వెళ్ళవలెను. దీర్ఘముగా ఆలోచించగా, ధర్మజుడు తన కర్మశేష ఫలితముగా స్వర్గమునకు పయనంబయ్యు, నరక దృశ్యము చూడవలసివచ్చెను గదాయను విషయము జ్ఞాపకము వచ్చుచున్నది. అలాగునే నా కర్మశేష ఫలము శ్వేతగిరి ఆరోహణమునకు కారణంబయ్యెను. కొండమీద కెక్కుచుండ కొన్నిచోట్ల త్రోవ నిటారుగానుండెను. వాలుయెక్కువగనుండెను. అప్పుడు అడుగుల తడబడ, నా మార్గదర్శి

నా శరీరాన్ని, తన శక్తికొలది బలమూని పైకిలాగుచుండెను. నేనొక్క సలహా చెప్పితిని. "నేను దిగజారినా నీ పట్టువదలక పైకిలాగుము. ఏకారణముచేతనైనా నీ పట్టును మాత్రము వదలకుము."

అటులనే నారాయణుని ధామము చేరుటకు లక్ష్యము చెదరక, పట్టువదలక పైకెగపడు చుండినచో, ఆ శ్రీమన్నారాయణుడే మన పట్టుదల, ఆసక్తి, ఓర్పు, చూచి సంతసించి, చేయూతనిచ్చి మనకు మార్గదర్శిగా యుండి, మనము నిశ్శక్తిచేనైనాసరే, నిరాశచేనైనాసరే, నిరుత్సాహముచేతనైనాసరే పట్టువదలినను, తను ఆ సర్వేశ్వరుడు పట్టువదలక మనలను పైకి లాగుచునే యుండును. ఆతను కడు జాలిగుండె కలవాడు, అల్పసంతోషి, తన బిడ్డలను సర్వదా రక్షించి, చేయూత నొసగి తనవద్దకు చేర్చుటే తనపని. అయితే ఆతని బిడ్డలు, కించిత్ మాత్రము అట్టి ఆలోచనలులేక, సంకల్పములేక యుండిన, ఆ పరంధాముడు మాత్రము ఎట్లు చేయూత నిచ్చును. నేను నా మార్గదర్శియగు సూర్యనారాయణుని నాకు మొదట సహాయము చేయుమని కోరలేదు. నా పట్టుదల, ఆసక్తి, కష్టములు చూచి, తానే సాయము చేయుచువచ్చెను. కాబట్టి శాంతి, సహనములతో ఆపరంధాముని చేరవలెననెడి ఆశ యుండిన చాలును. సర్వము తాను చేకూర్చి చేయూత నిచ్చి శాంతి సౌఖ్యము లిచ్చును.

ముచ్చటైన మూడు చుక్కలు :

ప్రారంభములోనే నాకు మూడు ముండ్లు త్రిశూలములవలె తగిలి, మూడు రక్తపుబిందువులు, నా చేతినుండి దిగజారసాగెను. మూడు అనే సంఖ్య కడు ముచ్చటైనది. రమ్యమైనది, అందమైనది, మహత్తరమైనది, బలమైనది మరియు బ్రహ్మాండ మైనదికూడాను. ఉజ్జ్వలమైన ప్రణవస్వరూపము, అకార, ఉకార, మకారములగు మూడింటి సమ్మేళనమేకదా బ్రహ్మాండము, బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులయొక్క సృష్టి, స్థితి, లయముల చేరికయేకదా! మానవ జీవితమునందు, జాగ్రత, స్వప్న, సుషుప్తి యవస్థలు కూడియుండునుకదా! కాబట్టి ఆ మూడు రక్తపు బిందువులను చూస్తూనే, దాని రమణీయత ఘనత మరియు పైన జెప్పినవన్నియు ఒక్కసారి జ్ఞాపకమునకు వచ్చెను. ఆనందభరితుడనై, ఆ ఆనందస్వరూపాన్ని తిలకిస్తూ వెంటనే నాలుకతో ఆరక్త బిందువులు లోనికి గొనినాను.

మా పాదయాత్ర సాగుచునేయుండెను. ముండ్ల తాకిడి ఎక్కువగుటవలన రక్తము దేహమునుండి ఎక్కువగా కారుచుండెను. అట్టి కష్టభూయిష్టమైన పరిస్థితులయందుండియు, మా లక్ష్యము మాత్రము మాకు గోచరమగుచుండెను. ఆ కరుణాసాగరుని కృపాకటాక్షముచే పలువిధములైన పరీక్షల నెగ్గి, యాటంకముల దాటి యెత్తయిన శిఖరాగ్రమును చేరగలిగితిమి. అటునుండి క్రిందికి జూచిన మా కన్నులు గిర్రున తిరుగుచుండెను.

చిట్టచివరకు శిధిలములకు :

నా మార్గదర్శి కడుశాంత స్వభావుడు. నేను హృదయభారముతో నిట్లంటిని. "ఎత్తయిన, నిటారైన, భయంకరమైన ఈ కొండదారిలో తిరిగి వెళ్లుట యేమాత్రము శ్రేయస్కరముకాదు. మఱియును దుస్సాధ్యముకూడాను." అతడది విని మరియొక సులభమైన మార్గమున్నదని చెప్పగా విని మనస్సు కుదుటపరుచుకొంటిని. కటికదారియందు వెళ్ళను, వెళ్ళను, శిధిల ములు మాకు దూరమగుచుండెను. నేను చాల డస్సినాడను. ఇక ఒక్క యడుగుకూడ ముందు నకు నడవ వీలులేకయుండెను. కాని నా మార్గదర్శి నన్ను నిరుత్సాహపరచక, శిధిలములనతి దూరములోనే యున్నవని ధైర్యము చెప్పుచుండెను. ఒక్క మలుపు మాత్రమే; శిధిలములు మాకగుపడుచుండెను. వాటి దర్శనముతో నాలోని శ్రమ, భయము బడలిక యదృశ్యం బయ్యెను. బాధ, కష్టము, వేడిమిని సరకుజేయక నా హృదయము ఆనందముతో తాండవ మాడ నారంభించెను. ఆ కరుణామయుని ఆశీర్వచనములకు మేమా భగవానుని మనసార స్తుతియించితిమి.

జీవితమెంత సున్నితము :

ఈనాటి మనుజుడు రేపటికి వుండడుగదా! యిదెంత సత్యవాక్యము! కష్టసుఖములందుండి గుణపాఠములు నేర్చుకొను వారిలో నేనొక్కడిని. ఈ మధ్యను ఒక భక్తుడు ఆశ్రమమునకు వచ్చి కొన్ని రోజులు గడిపెదనని చెప్పుచుండి హఠాత్తుగా గుండె ఆగి మరణించెను. జీవితము క్షణభంగురమనుటలో యేమాత్రము అతిశయోక్తిలేదు. గుండె ఆగుట కెంతో కాలము పట్టదుగదా! గుండె ఆగిపోవచ్చును. శ్వాసక్రియ స్వస్తి చెప్పవచ్చును. కాని మానవుని జీవిత పరీక్షలందును, ఈతిబాధలందును స్థిరమైనదియు, ప్రతీజీవి లక్ష్యమై జన్మహక్కయి వెలయునదొక్కటి యున్నది–అదియె మార్పులేని స్థిరవస్తువగు స్వయంప్రకాశజ్యోతి. దాని నంటిపెట్టుకొని, ప్రకాశింపజేయుచు తాము ప్రకాశించువారే ధన్యజీవులు.

శాంతి పతాకము :

మరియు మేము ఎత్తయిన స్థలములందుండు శిధిలముల చుట్టును ప్రదక్షిణ జేసితిమి. నా కోరికమేరకు, సూర్యనారాయణ నా రంగు తువ్వాలు తీసికొని, ఒక పొడవాటి కఱ్ఱకు కట్టి, బొబ్బిలి ప్రజల ఆనందసుఖములకు, విశ్వశాంతికై వూపెను. అలసి సొలసి యున్నను, నిశ్శబ్దముగా, ప్రపంచమందలి భగవానుని బిడ్డల శాంతికై, శాంతిప్రార్ధన చేసితిమి.

సూర్యనారాయణ, అచట రాళ్ళను ముండ్లను దూరముగా తీసి, శుభ్రపరచి, నన్ను కాస్త విశ్రమింపుమనియెను. నా తువ్వాలు క్రిందపరచి, తన తలపాగాను తలగడగా

నమర్చెను. ఆ చోటున నీడనిచ్చు ఒక్క చెట్టయిననూ లేదు. నిర్మానుష్యముగా యుండెను. దాహమా, విపరీతమయ్యెను, మాతో నీరుకూడ తెచ్చుకొనలేదు. నీరుండినను తీసికొని పైకెక్కుట, కడు కష్టమయ్యెడిది. మా చేతులు రెండును, ఎగబ్రాకుటకు, దిగజారుటకు ఉపయోగించుట వలన నీరు తీసికొనిపోవుట కష్టము. అట్టితతి, మా అతిధిగృహము, అందుండు చల్లని పానీయములు, పండ్లరసములు. మెత్తని పరుపులు, ఎలక్ట్రిక్ పంకాలు, మా మధుర స్మృతికి వచ్చినవి. క్రిందికేలాగు దిగడమాయని ఆయాసముతో ఆలోచనతో యుండ, నాకు తెలియకనే నిద్రపట్టెను. అప్పుడు స్ప్రింగు మంచముపై, మెత్తని పరుపులమీద పరుండియుండినట్లే యుండినది.

## మంత్రోపదేశము :

కళ్ళు తెరచి చూడ, సూర్యానారాయణ కొంచెమైనను నావలె విశ్రాంతి తీసికొనక క్రిందికి వెళ్లుటకు దారి సరిచేయుచుండెను. ఎంత విశ్వాసజీవి! కొద్దిగా విశ్రాంతి తీసుకొమ్మని చెప్పితిని. తన పరిపూర్ణ హృదయసేవకు, నేను ఋణస్థుడనైతిని? అందుచే యాతనికి “హరేరామ” మంత్రోపదేశముచేసి, ఎడతెగక భజయించి తరించుమంటిని. ఆశించని ఆశీర్వచనమువలన తన కళ్లు అశ్రపూరితములయ్యెను. నేనును ప్రేమాశ్రువులు రాల్చితిని. భగవానుడెంత దయార్ధ్రహృాదయుడు, ప్రేమమయుడు!

మంత్రోపదేశమైనది. బుద్ధి కోతితో సమానమైనదికదా! మా విశ్రాంతి భవనముందలంకరించి యుండు, నిర్జీవ పెద్దపులులు, చిరుతలు మొదలగు అటవిమృగముల ఆకారములవైపు మళ్ళినది. ప్రజారక్షణమునకై యా భయంకర అడవి మృగములను ఇట్టి అడవియందేకదా చంపియుండిరని జ్ఞాపకమునకు వచ్చెను! ఇది ప్రకృతి విలాసమేకదా!

## పులినోటియందు “సోహం” జపించుట :

నిద్రించుటకు కన్నులు మూయగా ఈ క్రింది ఆలోచనలు వేధింపసాగెను! ఇప్పుడొక పులి వచ్చిన చేయునదేమి? ప్రేమబోధ చేయుదును, మ్రింగెనా, సోహం,సోహం యని ఒక సాధువు జపించినట్లు మననము చేయుదును.

ఒక్క సాధువు, “సోహం, సోహం – నేనా జ్యోతిని, నేనే అది” అని చెప్పుచూ హిమాలయములందు పులి నోటిలోనకు వెడలెను. నేను కన్నులు తెరచిచూడ, నా ప్రక్కన పులిలేదు గాని, విశ్వాసపూరితుడైన నా మార్గదర్శి చింతాక్రాంతుడైయుండెను. ఆతని విచారమునకు కారణమరయ, యాతడిట్లనియెను. “వనము కొన్నిచోట్ల కాల్చుకయుండుటవలన ముండ్ల పొదిరిండ్లు దట్టముగా నున్నవి. కొత్తదారిని దిగుటయును చాలకష్టముగా యుండును.” ఆ మాటతో నా హృదయము, బాధాపూరితమై బరువయ్యెను. పైకెక్కినతీరు ఒక్కసారి

జ్ఞప్తికి తెచ్చుకొనిన దేహమునందు వణుకు పుట్టనారంభించెను. అట్టి అసహాయస్థితియందేమి చేయుట? కొండమీద ఎక్కువకాలముండుటకు దుర్భరముగా నుండెను. మరి క్రిందికి దిగుటయా భయంకరము. మరియు దుస్సాధ్యమయ్యెను. మానవ సహాయమా దుర్లభము. అట్టితఱి ఈ క్రింది మాటలు చెవులయందు గింగురు మనుచుండెను.

"అగాధములోగూడ నూతనబల మున్నది.
కటికి చీకటియుందును, నూతనజ్యోతి యున్నది,
అంధకారములోగూడ, మంచి మార్గములోనే యున్నాము."

ఈ పైవాక్యములు నాలో ధైర్యోత్సాహములు నింపుచుండెను. ఎట్లయినను క్రిందికి దిగిరావలెను. ఎండవేడిమి చండప్రచండముగా యున్నది. మరియు మా అభ్యాగతులు, ఆశ్రమవాసులందరు ఆతురతతో మాకొఱకై వేచియుందురు.

## కూర్చొని ప్రాకుట, దొర్లుట :

ఎత్తుగా, నిటారుగానుండు కొండ శిఖరముపై నుండి తడబడు అడుగులతో క్రిందికి దిగుట బహుకష్టము. కూర్చొనియే క్రిందికి జారవలెనని సూర్యనారాయణుడు చెప్పెను. నేల యెండుటాకులతో, మండుటెండతో, రాళ్ళ రప్పలతో ముండ్లమూకలతో నిండియుం డెను. గత్యంతరమా, వేరులేదు. నేనేమి చేయుదును! శాంతి ప్రార్థనను మననము చేయుచు భగవదేచ్ఛ ప్రకారము జరుగుగాకయని తలంచితిని. మార్గదర్శి ముందు వెళ్లుచుండెను. నేను క్రిందికి దొర్లిపోకుండ, నా కాళ్ళను నొక్కిపట్టుకొనుచుండెను. చేతులు గాయపూరి తములై యున్నవి. వాటితోనే నేలనూని దిగజారుచుంటిని. అబ్బ! ఎంత దుర్భరము!

## పరీక్షలు :

దీనికితోడు చేయి బెణికినది. బాగా వాచినది. వీపునందు  గూడను బెణికినది. గుండె వేగముగా కొట్టుకొన ప్రారంభించెను. రొమ్మునందు బాధ పుట్టెను. ఎండ నడినెత్తిని మాడ్చుచుండెను. దేహమునం దక్కడక్కడ రక్తము శ్రవించ నారంభించెను. కాని గాయపడిన చేతులను, క్రిందికి జారుటకు ఉపయోగింపక తప్పదయ్యెను.

## "పిలుపు" వచ్చినా సాయము చేయవలెను :

అట్టి స్థితియందును ఒక్క ఆలోచనవచ్చెను. నారాయణునికి సాయము చేయవలెనని మదికి తోచెను. అతను నాకొఱకై అష్టకష్టములు పడుచున్నాడు. అతని యిద్దరు పిల్లలను ఆశ్రమమునకు పంపిన ఆధ్యాత్మిక విద్యతోపాటు, ఉచితాహార సౌకర్యములు యేర్పాటు చేయుదునని చెప్పితిని. ఒకవేళ నాకంత్యగడియలు సమీపించి,  పరమేశ్వరునివద్దనుండి

పిలుపు వచ్చెనా, వెంటనే వెళ్లుదును, కాబట్టి యాతనికేలాగైననూ సాయము చేయవల యునను కొంటిని. చిరంజీవి జ్ఞానేశ్వరికి చీటి వ్రాసి పంపుదమన్నను నావద్ద కాగితము, కలము లేదు. కొండక్రిందికి చేరుట దుస్సాధ్యమని తోచినపుడెల్లను, నాకీయాలోచన వచ్చు చుండెను. అట్టి దుర్భరస్థితియందును, మారాజావారి కుటుంబమునకు భక్తులకు ప్రేమ తలంపులు పంపుచుంటిని. నాకు "పిలుపు" అప్పటికప్పుడు వచ్చినను విచారము లేదు. దైవకృపవలన నాకార్యభారమును శక్తివంచన లేకుండా నిర్వర్తింపచేయగలిగితిని. ఇప్పు డైనను ప్రపంచము వీడుటకు నాకెంతో సంతోషము! ఆనందముతో, చిరునగవుతో పిలుపు యెప్పుడు వచ్చినా పయనమగుటకు సిద్ధమే.

పూర్ణ బడలిక :

నా మార్గదర్శి పేరు సూర్యనారాయణ. సూర్యుడు పైనుండి నడినెత్తిన మాడ్చు చున్నాడు. నారాయణుడు నన్ను క్రిందనుండి దొర్లిపోకుండ కాపాడుచున్నాడు. నేను అలసి దిగజారుటకు శక్తిలేనప్పుడు, ఆ కటికరాళ్ళపై ఆకులను పరుపువలె పరచి నా విశ్రాంతికై నారాయణుడు తోడ్పడుచుండెను.

హృదయ వేగము హెచ్చుచుండెను. నీరు ఒక చుక్కకూడ లేదు. నాకు శ్వాస తికమక లైనప్పుడు, అడుగు ముందిడుట కిబ్బందియైనపుడు, పాదములయందు దడబుట్టినపుడు, మండుచున్న సూర్యుడు నడినెత్తికి సూటిగా నున్నపుడు, మూడుమార్లు ఈ క్రింది వాక్యములు, నాతోడు నీడగాయున్న సూర్యనారాయణునకు చెప్ప ప్రయత్నించితిని.

"ప్రియమైన సూర్యనారాయణా! నన్ను వదలి నిన్ను రక్షించుకొనుము. ఇక లాభము లేదు. నాశాయశక్తులా విశ్వప్రయత్న మొనరించితినిగాని ఇక ప్రయోజనం బగుపడదు." అయితే పై మాటలచే అతనిని నిరుత్సాహ పరచతలంచలేదు. కాబట్టి ఆ మాటలను దిగమ్రింగి నాను. పరాజయము ఒప్పుకొన్నవాడు పరాజితుడే. ప్రాణదానముచేయు ఈక్రింది వాక్యముల మననము చేసినాను.

"నేను జ్యోతిలో ఉన్నాను.
జ్యోతి నాలో ఉన్నది,
నేను జ్యోతిని,
జ్యోతి నేను వేరు వేరు కాదు–ఒక్కటే."

ఓం ! ఓం ! ఓం !

శాంతి ప్రార్థన నిశ్శబ్దముగా చేయ, బలము చేకూరినది. దానితో ఈ శ్లోకము చదివితిని.

దేహో దేవాలయ ప్రోక్తో
జీవో దేవః స్సనాతనః
త్యజే దజ్ఞాన నిర్మాల్యమ్
సోహం భావేన పూజయేత్ ॥

దేవుని ఆలయము దేహమే. విశ్వమే వ్యక్తి, భేదభావమును నిర్మూలనముచేసి, సోహం స్మరణతో పూజింపుము.

కర్మయొక్క చివరి దశ :

కర్మ ఎంత తీవ్రమైనదైనా, అంత్యము మాత్రమున్నది. భరింపరానిది బాధాకరమైన కర్మను, శాంతి, ధైర్య, సాహసాలతో అడుగడుగునా ఎదుర్కొనుటకు నారాయణుడు సాయ పడుట నాకెంత యదృష్టము! అట్టి నిస్సహాయ స్థితియందుకూడ, కర్మనుండి తప్పించమని నేను భగవానుని కోరలేదు. అయితే ఈకర్మను యెదుర్కొని దాటుటకు కావలసిన బలము నిమ్మని వేడితిని. నేను చాల దస్సియుంటిని. దిగుటకు శక్తిలేదు. అచటనే యుండుటకు వీలులేదు. సహాయము జేయుటకా, ఇతరులెవ్వరును లేరు. కాబట్టి కొద్దికొద్దిగా క్రిందికి దిగజారుటయే మార్గము.

పాండవ వనవాసము :

ఒక్కసారి పాండవులు వ్యయప్రయాసలతోకూడిన కష్టపరిస్థితులయందుండినపుడు వారి నిట్లడిగిరి.

"లోకారాధ్యుడైన శ్రీకృష్ణపరమాత్మ మీకు చెలికాడుగా బంధువుగా, గురువుగా, శ్రేయోభిలాషిగా, సారధిగా యుండియు, మీకీ వనవాసము, అజ్ఞాతవాసము, అసంఖ్యాక ములైన బాధలు తప్పలేదేమి?"

సాధువులకైనా, పాపులకైనా, ప్రజ్ఞావేత్తలకైనా, శుంఠలకైనా కర్మ "తుచ," తప్పక అనుభవించియే తీరవలెను కర్మలగూర్చి గొణుకుచుండిన అధికమగును. చిరునగవుతో యుండిన తేలికగును.

అంత్య పలుకులు :

నా పరితాప పరిస్థితిచూచి నా మార్గదర్శి నన్నిట్లు ఓదార్చెను. "అయ్యా! కొలది దూరములోనే నీడనిచ్చు చెట్టును చూచెదను. అచట మీరు విశ్రమించిన నేను క్రిందనుండి పల్లెకు బోయి, కరణంగారి యింటినుండి కార్కుసోడా, చల్లని నీరు తెచ్చెదను" ఎంత ఉ త్సాహపూరితములైన మాటలు! అయితే ఆ కొలది అడుగులు ఏలాగున వేయుట? వెంటనే యాతడు ఆనందమయమైన ముఖముతో గ్రామమునుండి మనకొరకై ఒక కారు వచ్చు

చున్నదని నుడివెను. ఆ మాటలు కొంత శక్తినిచ్చినందున మరికొంత క్రిందికి జారకలిగితిని. కొండ క్రిందనుండి మమ్ములను పిలుచు కేకలు వినబడెను. మా ఆనందమునకు మేరయే లేదు. వారికి సూర్యనారాయణ జవాబు యిచ్చుచుండెను.

## చివర సహాయము, జీపుకారు వేచియుండుట :

బహుకష్టములకు లోనై సాయమునకై యెదురుచూచుచుండ, ఒక జీపుకారు మా కొరకై వచ్చుట ఎంత యదృష్టము. బాధాకరమైన కర్మపోయి, సుఖముతోకూడిన క్రొత్త కర్మ వచ్చినది. వచ్చినవారు కొంత పెరుగు, మజ్జిగ తెచ్చియుండిరి. తాను వద్దన్నా, సగము వంతు సూర్యనారాయణున కిచ్చితిని. కొండక్రింద శ్రీకుమార రాజావారు, మరియొక జీపుకారుతో నాకొరకై వేచియుండిరి. వారి కారుకూడా అందుండెను. నాకు పులులు, చిరుతల వలన ఏదైన అపాయము కలిగినదేమోయని భయముతో, కొందఱు మనుష్యులను తుపాకులతోసహా, వారి వెంబడితెచ్చి యుండిరి. మాకు అత్యంత ప్రియులు, గౌరవనీయులు దయార్ద్రహృదయులు యగు శ్రీశ్రీశ్రీ బొబ్బిలి రాజావారికి, వారి కుటుంబమువారికి, నావలన ఆతురత, శ్రమ కలిగించినందులకు నేనెంతయో చింతించుచున్నాడను. శ్రీరాజా వారే స్వయముగా నాకొరకై వచ్చి పిలచితిరనికూడ విన్నాను. వారికి శ్రమ కలిగించి నందులకు చింతించితిని.

## మా బృందముయొక్క ప్రార్ధనలు :

శాంతి ఆశ్రమవాసులు నాకొరకై, స్వర్గములోయున్న అన్ని దేవుళ్ళను, శ్రీకృష్ణుడు, రామ, క్రైస్తు, జొరాష్టరు, బుద్ధ మొదలగువారిని ప్రార్ధించుచు, శాంతి ప్రార్ధనను పదేపదే చేయదొడంగిరి. ఆలస్యమై నాజాడ తెలియనందున పోలీసు సహాయము కోరమని ప్రార్ధించిరి. అయితే ప్రారంభము, చింతాపూరితమైనా, చివరకు అన్నియు సక్రమముగానే జరిగినవి.

## పిచ్చివిహారముయొక్క విచార ఫలితము :

నా దేహమునిండ ఆపాదమస్తకమంతా ముండ్లపొడుపులతో, రక్తపుగీటులతో, గాయములతో నిండియుండెను. ఆ భగవంతుడు నన్ను మృత్యుముఖము నుండి తప్పించినాడు. ఎంత దయార్ద్రహృదయుడు! ఆ పరంధాముడు నన్ను, సర్వసుఖములకు ఆలవాలమైన అతిధిసౌధమునందు జేర్చెను. అంతేకాదు, నన్ను నిష్కల్మషహృదయములతో ప్రేమించెడి భక్తులచేతులలో బెట్టెను. అట్టి భక్తులను నేనెంత విచారసాగరమున ముంచితిని! ఈ కష్టమంతా అనవసరము, మరియు ఆలోచనాహీనమైనదికదా!

కర్మ అంత్యము :

నన్ను కొండక్రిందనుండి జీపుకారు తెచ్చినపుడు 1/2 గంట వరకు ఎవ్వరితో మాట్లాడలేకపోయితిని. కర్మఫల మనుభవింపక తీరదు. అదృష్టమైనదే నా జీవితము. ధర్మరాజు వారికర్మవలె, నా కర్మయు ముగిసెను. నా కష్టపరంపరలట్లుండనిండు! ప్రేమ, దయ, శాంతి భరితములై అంకితమొనర్చిన దయాస్వరూపులగు శ్రీశ్రీశ్రీ రాజాసాహేబువారు, శ్రీశ్రీశ్రీ రాణీసాహేబావారు, శ్రీశ్రీకుమార రాజావారి భక్తిప్రేమలగూర్చి ఆలోచించిన, ఆనందము కలుగుచున్నది. అయితే వారికి ఆందోళన కలిగించినందులకు సిగ్గుపడుచున్నాను. కర్మఫలము ఎవ్వరికైనను అనుభవించక తప్పదుకదా!

నా హృదయము ఆనంద డోలికయందూగులాడుచున్నది. పరమేశ్వరునికి నా నమోవాకములు. వాని అత్యంత ప్రియమైన బిడ్డలకు నా ధన్యవాదాలు. పరిపూర్ణహృదయులైన శ్రీరాజాకుంటుబమువారికి, ఇతర భక్తులకు, నాకృతజ్ఞత.

భగవంతుడు బొబ్బిలి ప్రజలను, ప్రపంచ జీవులను, శాంతిభద్రతలతోను ఆనంద, ఆయురారోగ్యములతోను అలరారునట్లు, ఆశీస్సులు ప్రసాదించుగాక! ఇదియే నా ప్రార్ధన!

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః (ఆంగ్ల వ్యాసమునకు తెలుగు అనువాదము)

**: అర్పణ :**

**లోకకళ్యాణ, సౌభాగ్య, శాంతిప్రేమలకై, బొబ్బిలి ప్రియ సోదరీ సోదరుల క్షేమానికై విశ్వప్రేమతో, శాంతి ప్రార్ధనతో అర్పించు కానుక**

(శాంతి ఆగస్టు 1960)

## 22. శాంతి పాఠకులకు శ్రీస్వామీజీ ప్రార్ధన

మన 'శాంతి" పత్రిక దైవముయొక్క వాక్కుయని నా వెర్రి నమ్మకము. ఎవ్వరిబిడ్డ వారికి ముద్దుగదా! శాంతి, ఆంధ్రప్రదేశములలోనే గాక, తెనుగుచదవగలిగిన వారందరికి హిందూదేశమంతయు నలుమూలలకు వెళ్ళుచు, భక్తుల హృదయములను శాంతితో నింపుచుండ, నాకెంతయో తృప్తిగా, ఆనందముగా యుండును. తరుచు అనేకమైన ఉత్తరములు, శాంతి పాఠకులకు నూతనమైన శక్తిని, విశ్వప్రేమను, నిత్యశాంతి నొసంగుచున్నదని చదువుటకు నా హృదయమున కెంతయో ఆనందము గల్గుచుండును. మరల, ఒక్కొక్కమారు ఏ కఠిన హృదయుడైనా నాకు శాంతి పంపవలదు. మీ పేపరు ఆపుచేయుడు అని వ్రాయగనే, నా మనస్సునకెంతయో బాధగలుగుచుండును. అప్పుడు నే నీ క్రిందివిధముగా జవాబు వ్రాయుచుందును.

నాయనా! శాంతి వేదవాక్కు, వేదసారమును గలిగియున్నది. వేదములు దైవవాక్కులు, నీకు దైవవాక్కు వినవలెనని లేదా! దైవ వాక్కు వినుట, చదువుట నేటినుండి విరమించుకొందువా? నీవు పేదరికమువలన శాంతిచందా కట్టజాలనని విరమించుకొనవలదు. నీవు ఆర్థికముగా అవస్థపడుచున్న, అసలు చందా కట్టనవసరమేలేదు. చందా గురించి ఆలోచించవలదు. నాలుగు రూపాయలను దైవమునకు నీకును మధ్యను రానీయవలదు. నీ మనస్సు దైవము గురించి పరితపించుచున్న శాంతి నీకు ఉచితముగానే, నీ జీవిత కాలమంతయు పంపబడును. శాంతిని చదివెదను, వృద్ధి జెందెదను, తరించెదననియు, ఆనందము గలిగెడిలాగున వెంటనే ఉత్తరము వ్రాయుమని ప్రార్థన పూర్వకముగా, ఇకముందు శాంతి ఆపుజేయుడు, పంపవలదని తెలియజేయుచున్న పాఠకులకు వ్రాయుచుందును.

ఇంతగా ప్రాధేయపడుచు ప్రార్ధనపూర్వకముగా వ్రాసినను కొందరు, మేము శాంతి పంపవద్దన్నను, ఇంకను యేల తెలివితక్కువగ పంపుచుండిరి? అని క్రూరముగా వ్రాసిన ఉత్తరములు చదివి, మరీ బాధపడుచుందును. ఇట్టి కఠినహృదయుల సంఖ్య చాల అల్పమని, యే వెయ్యిలో ఒక్కరు ఉందురని వ్రాయుటకు ఆనందించుచుంటిని.

ప్రియమైన శాతి పాఠకులారా! శాంతి మీది, శాంతి ఆశ్రమము మీది, నేనుగూడ మీ స్వంతమే. మీరు శాంతి ఆశ్రమమునకు వచ్చి, మేమిచ్చట మీ అందరి వృద్ధిని కోరుచు జేయుచున్న కృషిని, శాంతి, పీసు, తదితరములైన కరపత్రములు (Electricity) విద్యుశ్చక్తి మొదలైనవి లేకున్నను (Hand Power) కరచరణములతోనే చిన్న ట్రెడిలు (Treddle) మీదను రాత్రింబగళ్ళు యెటుల ముద్రణ చేయుచుంటిమో మీరు జూచిన, శాంతి పత్రిక వృద్ధికై మీరుగూడ మాకు తోడ్పడెదరు.

మీ అందరి శాంతిని కోరుచు మేము చేయవలసిన సేవను, శక్తివంచన లేకుండగా పర్వతముల మధ్య యీ అడవిలో సరియైన పనిముట్లు, సహాయములేకుండ, కేవలము దైవ బలముచే జేయుచుంటిమి. ఇకమీరు చేయవలసిన సహాయము, శాంతిని మీరు చదువుటయే. శాంతిని ఇంకను వృద్ధి జేయుటలో తోడ్పడుడు, శాంతిని మీ బంధుమిత్రులచే గూడ చదివించుడు. శాంతిని హృదయమునుండి హృదయమునకు, గృహమునుండి గృహమునకు, గ్రామమునుండి గ్రామమునకు, దేశమంతయు వ్యాపించుటకు మా ప్రచారములో తోడ్పడుడు. వ్యక్తిశాంతియే లోకశాంతి అని సదా జెప్పుచుందును. గాన ప్రప్రథమమున మీ హృదయములలో శాంతిని స్థాపించి, దానిని, మీ గృహములలో స్థిరపరచుడు.

నేనీరోజులలో తరచు –

నీవు దుఃఖముతో, తాపత్రయములతో నిండియుండవలెనన్న, నీ గురించియే ఆలోచించుకొనుము. నీకు, యీ చింతలు, తాపత్రయములు, బాధలు వదలి ఆనందముగా యుండవలెనన్న, నీ జన్మహక్కుయైన శాంతిని ఇప్పుడే, ఇచ్చటనే అనుభవించవలె నని యున్న, ఇతరుల వృద్ధిగురించి ఆలోచించుచు, పాటుపడుము. శాంతిని నీవు అనుభవిం చుచూ, అందరిచే శాంతిని అనుభవింపజేయుము. ఇదియే నీవు తరించుటకు దగ్గర మార్గము. సూక్ష్మమైన, సులభమైన మార్గము.

పూర్వము ముప్పది సంవత్సరముల క్రింద ఆశ్రమంలో నొక భక్తుడు, హరిదాసుడు బ్రాహ్మణోత్తముడుండెడివాడు. తాను దైవస్మరణ చేయుచుండ, యెవ్వరైనను దైవస్మరణ జేయకున్న, వారితో, బాబూ నీకు నమస్కరించెదను. మీరుగూడ దైవనామస్మరణ జేయుడు. తరించుడు అని కోరెడివాడు. ఇంకను బిడియముచే దైవనామమును స్మరించుటకు అను మానించుచున్న, వారి పాదములమీద సాష్టాంగముగాపడి, బాబూ, దైవస్మరణ జేయుడు. మీరు జేసేవరకు మీ పాదములను వదలి లేవనని బ్రతిమాలెడువారు. ఇక గత్యంతరములేక బ్రహ్మణోత్తముడు, భక్తుడు తమ పాదములమీదపడి యుండెనని ఎంత కఠినహృదయులైనను ఆయనతో కలసి దైవనామము స్మరించెడివారు. ఆ భక్తుడు ఇప్పుడు యెచ్చట ఏలోకములో యుండెనో తెలియదుగాని ఆయన భక్తిప్రేమలు, దైవనామముయందు ఆయనకుయున్న ప్రీతియు నాకు తరుచు జ్ఞప్తికి వచ్చుచు, అటులనే శాంతిపత్రిక పంపవద్దు, నేను దైవవాక్కును చదవను, అనెడి వారందరకు నమస్కరించుచూ, నాయనాలారా! దైవవాక్కును చదువుచు, తరించుడని నా మనస్సు జెప్పుటకు కోరుచుండును.

నేను శాంతి పత్రికను చదవను, దైవవాక్కు వినను, నాకు శాంతి పంపవలదు అని వ్రాసెడివారిని జూచి దైవము చింతించుచున్నాడని, యముడు నవ్వుచున్నాడని నా నమ్మకము. ఉచితముగాయైనను, శాంతి పత్రికను అందుకొని దానినిన చదువుటకు నిరాకరించెడి శాంతి పాఠకులను వారి గ్రామములకు వెళ్ళి, వారి జీవితములను పరిశీ లించుటకు, వారి ఆత్మవృద్ధికి తోడ్పడుటకు నా మనస్సు కోరుచుండును. అందరూ నావారే; నా ఆత్మ సోదరీసోదర స్వరూపములే అనెడి భావనచే ఒక్కరినైన విడిచిపెట్టకుండగా అందరి శాంతిని, వృద్ధిని యీ మనస్సు సదా కోరుచుండును. శాంతి వద్దన్నను, కావలె నన్నను, శాంతియే దైవబిడ్డలందరకు సమానమైన జన్మహక్కుయై యున్నదన్న సత్యమును శాంతి పాఠకులు సదా జ్ఞప్తియందుంచుకొని, తమ జీవితములను శాంతితో నింపుకొని తరించెదరుగాక!

కత్తిపూడిలో చంటి అనెడి జట్కాబండివాడు కలదు. అతడు ఆశ్రమమునకు వచ్చెడి భక్తులను తన జట్కాలో తీసుకొనివచ్చుచు శాంతి ప్రచారము జేయుచుండును. ఆశ్రమమునకు వచ్చినవారితో తానుగూడ నా వద్దకు వచ్చి నేను జెప్పెడి మాటలు ఎంతయో భక్తిశ్రద్ధలతో వినుచుండును. అతడుశాంతి ప్రార్థనను వల్లించెను. ఒక్కొక్కసారి అతనిచేగూడ ప్రార్థన జేయించుచుందును. నాకు శాంతియందున్న ప్రేమచే ఆ జట్కాబండివానితో ఇటుల జెప్పితిని.

చంటీ! నీకు ఆశ్రమంయందున్న భక్తిప్రేమలకు ఆనందము, నీవు కత్తిపూడి నుండి ఆశ్రమమునకు భక్తులను తీసికొనివచ్చి ఆశ్రమము జూపించి మరల తీసికొనివెళ్ళుటకు 4 రూ॥లు అద్దె తీసుకొనుచుందువు. ఒక్క అద్దె ఇచ్చిన, నీకు శాంతి పత్రిక ప్రతినెలా వచ్చును. నీవు చదువుకొనుటయేగాక భక్తులందరకూ చదివి వినిపించుచుండవచ్చును" అని జెప్పగా ఆతడెంతయో ఆనందించి, శాంతిపత్రికకు చందాదారునిగా అగుటకు అంగీక రించెను. బీదవాడైన అతనినుండి చందా తీసికొనుట నాకంత ఇష్టతగా లేకున్నను శాంతి పాఠకులందరకు అతడుగూడ ఆదర్శముగయుండెనని అతని చందా అంగీకరించడ మాయెను. శాంతి పత్రికలు అన్నియు పాఠకులకు పంపుటకు సిద్ధముగా చేయబడియున్ననూ ఒక్కొక్కసారి వాటిని పోస్టుచేయుటకు బిళ్ళలు లేక ఆశ్రమవాసులు అవస్థలు పడుచుందురు. ఇట్టి క్లిష్టపరిస్థితులను ఆశ్రమాభిమానులైన మా పాఠకులు, ఆశ్రమభక్తులు గ్రహించి వారి చందాలను, ఆశ్రమ వృద్ధిని కోరుచు వారి విరాళములను పంపుచుందురుగాక! కొందరు ఆశ్రమాభిమానులు, శాంతిపాఠకులు చాలసంవత్సరముల నుండియు పత్రికను అందు కొనుచు చందా పంపుటకు తీరికలేకున్ననూ శాంతి పత్రిక ఆపుచేయమని వారు వ్రాయ నందుకు నేను వారికి కృతజ్ఞుండనై యుంటిని.

ఒక ప్రకృతి సంచికలో నరకమునకు టిక్కెట్టు సిగరెట్టు అని వ్రాయబడెను. సిగరెట్టు మొదలైన దురభ్యాసములు నరకమునకు తీసికొని వెళ్ళుచున్న, మనశాంతి స్వర్గమునకు తీసుకువెళ్ళును. సిగరెట్టు, బీడీ, త్రాగుడు, అతివాగుడు, అతితిండి, అతి నిద్ర, ఆత్మస్తుతి, పరనింద, అహంకార, మమకారములన్నియు నరకమునకే దారిని జూపుచుం డును. శాంతి మాత్రమే, ప్రస్తుతము చదువుటకు, అనుభవించుటకు శ్రమగా బాధగాయుం డును. శాంతి మార్గము ఇరుకుగా, రాళ్ళు, రప్పలు, ముళ్ళతో పరీక్షలతో మొదటిలో నిండి యున్నను,చివరకు అదియే విశాలముగా యుండి మిమ్ము, నన్ను అందరినీ కడతేర్చి స్వర్గము నకు చేర్చి జన్మరాహిత్యమును గల్గించును. శాంతియే సర్వేశ్వరుని సాక్షాత్కారమునకు సాధనము. "శాంతియు లేక సౌఖ్యములేదు"అని శ్రీ త్యాగరాజులువారు కీర్తించియుండిరి. అన్ని సౌఖ్యములకు శాంతియే ఆధారము, గమ్యస్థానము.

శ్లో॥ ఏకోవశీ సర్వభూతాంత రాత్మా !
ఏకం రూపం బహుదా యః కరోతి ।
తమాత్మస్థం యేను పశ్యన్తి
ధీరాస్తే షాం శాంతి శ్వాశ్వతీ నేత రేషామ్.

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

ఈ శరీరముండగా, నేను శాంతి పత్రికను చదవను, దైవవాక్కు నాకు అవసరము లేదు, నేను దానిని వినను అనెడి ఉత్తరములు యీ జీవితములో రాకుండుటయే నేను కోరుచుందును. మీ స్వంతమైన శాంతి, మీకు అనుభవనీయమైన శాంతినొసంగి శాంతితో మీ మనస్సులను, హృదయములను, మీ గృహములను నింపి, మీ జీవితములను శాంతి యుతముగా జేయుగాక! మా శాంతి పాఠకులనుండి నిరంతరము పూర్ణశాంతియే నలు దిశలకు ప్రవహించుగాక!

మన శాంతి గురించి పాశ్చాత్యదేశీయులొకరు రెవరెండు మేసీ దొరగారు, చిర కాలము ఆశ్రమములో ఉండి వారు వ్రాసిన ఆంగ్ల పద్యము అనువాదము జేయబడినదానిని మీతో పంచుకొని కడసారి నా ప్రార్థనగా వృద్ధిని కోరుచు–శాంతి ననుభవించుచు తరిం చెదముగాక యని విరమించుచుంటిని.

## శాంతి

శాంతిబోలిన మాట యీ – జగతి లేదు
శాంతి కెనయగు కోర్కెయె–చ్చటను లేదు
పరసుఖమువంటి యాస – ధరణిలేదు
జగతి జననమరణముల – శాంతి లెస్స
సంతసమునందు నిశ్చల – శాంతి పరంగు
శాంతి రహితుండు తుదియందు – శాంతి నొందు
శాంతి బ్రతుకగు; బ్రతుకుదా – శాంతి యగును
శాంతి సరితూగ నెద్దియు – జగతిలేదు
శాంతియుతుకునకు సర్వంబు – జగతి గలదు
జగతి కాదియు నంతంబు – శాంతి సుమ్ము

లోకాస్సమస్తా స్సుఖినోభవంతు.

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

(శాంతి అక్టోబరు 1962)

# 23. శాంతి కేంద్రము

తోటపల్లి కొండలలోని శాంతి ఆశ్రమమునందుండవలసిన వాడినయ్యు, దైవనిర్ణయ ముచే, నీలగిరి సర్వతోన్నత శిఖరములపై నేనుండుటకు దైవ ఆశీర్వచనము లభించినం దుకైనను, తూర్పు పడమర దేశములలో శాంతి కేంద్రములను, స్థాపించవలయునను కోరిక ఇపుడెంతైనను గలదు. యుద్ధ పెనుగండములు పైబడు సూచనలు గాన వచ్చు చున్న ప్రస్తుత హిందూదేశపు సంక్షుభిత వాతావరణములో, అట్టి కోరిక ముఖ్యావసరముకూడ నైయున్నది.

ప్రపంచములో ప్రతి వ్యక్తి హృదయములోను శాంతి బీజము నాటవలసిన ఆవశ్యకత తటస్థించినది. ఆంతర్యమున శాంతిని సుస్థాపితము చేసినట్లయిన, అచ్చోటనుండి దేశ వ్యాప్తంగా, ప్రపంచములోని దైవ సంతతికంతకును, కుల, మత, జాతి, దేశ విచక్షణ లేకుండ, తైలధారగా ప్రవహింపజేసి, దేశ శాంతిని, లోక శాంతిని, నెలకొల్పవలసియున్నది. అపుడు అంతటను సుభిక్ష మేర్పడును.

అంతరంగ శాంతి స్థాపనకు అత్యవసరముగా, ముందు సేకరింపవలసిన విధానములెవ్వి?

1. అదృష్టవశాన మనకు లభించిన ఉత్కృష్టమైన మానవ జన్మయొక్క అమూల్యతను గుర్తించి, సదవకాశమును జారవిడువకుండ, భక్తి వినమ్రులమై దైవమునుండి పిలుపురాక పూర్వమే, ఆయనను మనము గుర్తింపవలయును.

2. శాంతి ప్రార్థనను కంఠస్థము చేసి దినమునకు రెండు సార్లయినను, రాత్రి నిదురబోవునపుడును, ఉదయము మేల్కొనునపుడును దానిని స్మరణ చేయవలయును. నీ నిత్య కృత్యములలోను, విరామ సమయమునను ఎంత ఎక్కువగా భక్తిశ్రద్ధలతో దానిని స్మరించిన అంత ఎక్కువగా నీకు శాంతిసౌభాగ్యములను చేకూర్చును.

3. ఎల్లవేళలా నీ స్వలాభమే, స్వార్థమే ఆపేక్షింపక, "పరోపకారార్థ మిదం శరీరం" అని శాస్త్రములు చెప్పునట్లుగా, నీకీ దేహము లోక కళ్యాణమునకై పాటుబడుటకు కటాక్షిం పబడినది గనుక ఒక హృదయము నుండి మరియొక హృదయమునకు శాంతిసుధ వ్యాపించునట్లుగా, ప్రజా బాహుళ్యముచే శాంతి మంత్రమును స్మరింపచేయుచు, మానవసేవ చేయుదువుగాక! ఆ మహామంత్రము పఠించుచుండగనే, నిన్ను దైవము ననుభవింపచేయగల ప్రభావము, ఆ పవిత్ర మంత్రములో గలదు. అనేకులు యిట్లు పఠించి దైవము ననుభవిం చినట్లు మాకు తెల్పి యుండిరి. అట్టి దైవానుభూతి నీకు మాత్రమెందుకు కలుగదు?

4. వ్యక్తిగత శాంతియే, సంఘము మీద, సర్వతోముఖ శాంతిగా ప్రజ్వరిల్లు కారణమున, ప్రపంచశాంతికి దోహదము చేయుటకై ప్రప్రథమమున, మన హృదయములలో దానిని ప్రతిష్ఠింప చేసుకొని, పిమ్మట దానిని, దగ్గర దూర ప్రాంతములకు వ్యాపింప చేయవలసి యున్నది.

5. శ్రీ శాంతి కేంద్రములో, నీవు నీ హృదయ పరీక్ష చేసుకొని, అంతర్ముఖుడవై, అచ్చోటనే శాంతి బీజమును నాటవలయునేగాని, బాహ్యమున నున్న గురువులనుండి గాని, మత గ్రంథములనుండిగాని, నీవు నేర్చుకొనవలసినదేమియులేదు. అంతయు నీ పవిత్ర హృదయములోనే నీ ఆత్మ సమర్పణలోనే యిమిడియున్నది. మనము చేయవలసినది, బాహ్యమునుండి మనము నేర్చుకొన్న సమస్త విద్యలను, బుద్ధిగమ్యమైన జ్ఞానమునంతను, సమూలముగా మరచిపోవలెను. ప్రారంభమునను, మధ్యలోను, అంత్యముననుగూడ, ఎల్లవేళల శాంతి కేంద్రమునుండి నీవు నేర్చుకొనవలసినది స్వశక్తిని నమ్ముకొనుట మాత్రమేగాని, బాహ్యగురుజన గ్రంథ సముదాయముల నాశ్రయించుట యనునది ఎంత మాత్రమును లేదు.

ఇదియే సర్వసమగ్రమైన భౌతిక, ఆధ్యాత్మిక, సమన్వయ జీవితము కొరకైన శాంతి వ్యాపక దృష్టి – శాంతోద్యమము.

6. భయము, కలహము, క్రోధము, యుద్ధము మొదలుగాగల హృదయ విదారకమైన భయంకర తలంపులను తొలగించి, వాటిస్థానే, బాహ్యాంతరములందును, అంతటను, శాంతియుతమైన దివ్యతలంపులతో నింపుటకు ప్రాధాన్య మియ్యవలెను.

లోకమంతటను శాంతి వ్యాపించియుండుగాక!

లోకాస్సమస్తా స్సుఖినోభవంతు!

ప్రియమైన శాంతి పాఠకా! ఇప్పుడే ! నీవు జీవించియున్న ప్రస్తుత క్షణములోనే – నీ భక్తి హృదయములో మొదట శాంతి బీజమును నాటి, పిమ్మట నీ గృహమునందును, సంఘమునందును, దేశములోను, ప్రపంచమంతటను, శాంతిని వ్యాపింపచేసి, మానవాళి కంతకును, నీవు కూడ సహాయపడవా? ఓం ప్రథమముగా, నీ ఇంట దానధర్మములు ప్రారంభింపుము. ఈ క్షణమునుండియేశాంతి ప్రవహించునట్లుగా, శాంతి నాకాక్షించెడి, నీ భక్తి హృదయమున, ఆ ప్రవాహమును వెల్లువలై ముంచెత్తనిమ్ము!

వ్యర్థపు మాటలతోను, వృధా ప్రసంగములతోను, అర్థరహిత ఉపన్యాసముల నిచ్చుట లోను, కాలము నెంతమాత్రము దుర్వ్యయము చేయగూడనియంత ఘనమైనట్టిదిగా కాలము

అమూల్యమైయున్నది. గుండ్లు లేని తుపాకి యెంత విలువగా నుండునో, ఆత్మశక్తి లేని కళేబరము గూడ అంతయే విలువైయున్నది. మనకు ముఖ్యముగా కావలసినది ఆత్మశక్తి –సర్వత్రా వ్యాపించియున్న దివ్యప్రేమ, సర్వమును తనలో లీనము చేసుకొనునట్టి అత్యంత ప్రధానమైన దివ్య తేజస్సు అదియే మనకు కావలసియున్నది.

కాని, మానవుడు చందా సొమ్ములను ప్రోగుచేసియు, శాశ్వత నిధులను సేకరించియు, తాను దానికి అగ్రాసనాధిపత్యము వహించుట కపేక్షించియో, దాని స్థాపకుడుగా వెలుగొందుటకో, లేక దాని సెక్రటరీగానో, మేనేజరుగానో ఉండి పెత్తనము చేయుటకో, శాంతి ఆశ్రమశాఖలను అచ్చటచ్చట స్థాపించుట కుపక్రమించునేగాని, అదియేమి చిత్రమో! బలీయమైన, అనిర్వచనీయమైన మాయా ప్రభావమెట్టిదోగాని, తన హృదయములో శాంతి కేంద్రమును స్థాపించునట్టి శక్తిని మాత్రము పొందలేకున్నాడు. ముఖ్యముగా తన హృదయములో శాంతికేంద్రమును స్థాపించుట మినహాగా, దేశములో మరెచ్చటనైనను, సులభముగా శాంతి కేంద్రములను స్థాపింపగలడు. తన హృదయమున శాంతిని నెలకొల్పుటకు పడవలసిన శ్రమను, బైట ప్రపంచములో శాంతి కేంద్రములను స్థాపించుటలో తన మూల్యమును చెల్లింపనవసరము లేదు. ఏలననగా–దానిని ప్రజలే భరించెదరు.

కఠోపనిషత్తులో "శ్రేయశ్చ ప్రేయశ్చ" అని చెప్పినట్లుగా మొదటిది–మన హృదయములో శాంతి కేంద్రమును స్థాపించుకొనునట్టిది–శ్రేయో మార్గము. అది మానవుని అజ్ఞానమును, మమతను నశింపచేయును. ఇంక రెండవ మార్గమన్ననో పేరు ప్రతిష్ఠల కొరకు, కార్యనిర్వాహకత్వము, తనపై వేసుకొనుటకు చేసెడి ప్రయత్నము–అది ప్రేయో మార్గమనబడును. బుద్ధిమంతుడు శ్రేయోమార్గము ననుసరించును. బుద్ధిహీనుడు పేరు ప్రతిష్ఠలకై ప్రాకులాడెడివారి దుష్ట సహవాసము చేసి తన అంతరంగ శాంతి ప్రతిష్ఠను విస్మరించి బాహ్యప్రపంచపు శాంతి కొరకై పరువులిడుచు, ప్రేయోమార్గమున బడి కొట్టుకొనిపోవును. తాను సింహపు కొదమమైయుండియు, గంభీరముగా గర్జించుటకు బదులు, మేకవలె హీనస్వరముతో దుర్బలముగా మేమేమే, అని అరచుచున్నాడు.

ఓ మానవుడా! ఇప్పటికైనను మేలుకొనుము, నీ అంతరంగమున శాంతి నెలకొల్పుటకు యిప్పటికే కాలాతీతమైపోయినది, ఇంతటితోనైనను మేలుకాంచి, మొదట నీ అంతరంగ శాంతిని నెలకొల్పుము. అచ్చట నుండి అదియే నదీ ప్రవాహమువలె వడిగా కెరటములు కొట్టుకొనుచు ప్రవహించును.

శాంతి మార్గావలంబివైన ఓ సోదరయాత్రీకుడా! నీ సేవ చేయుటకే మే మిచ్చట

వేచియున్నాము. మా ప్రార్థనలన్నియు, మీ సహాయాభివృద్ధులను కోరియె! నీ భక్తి హృదయ ములో, శాంతి కేంద్రమును స్థాపించుటకు, ఇంకను ఎక్కువగా నీవు తెలుసుకోవలసిన విషయములున్నయెడల వాటి వివరములను తెలుపుచు, మాకు వ్రాయుము.నీ సందే హములు నివృత్తి చేయుటకై వేచి యున్నాము.

శాంతి కేంద్రము
లక్ష్మీవిహార్ – కోటగిరి

సర్వేజనా స్సుఖినోభవన్తు. ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

అనువాదము : స్వామీ నిర్వాణనందజీ

(శాంతి అక్టోబరు 1963)

# 24. శివుని ఆజ్ఞ

శివుని ఆజ్ఞ లేనిదే చీమయైనను చిటుక్కుమనదు అని, అనగా కుట్టజాలదని, పెద్దలు చెప్పిరి. శివుడన్నను దైవమన్నను ఒక్కటియే.

తోటపల్లి ఆశ్రమము మొదట అడవిగానున్న ప్రదేశమును, తేళ్లు, జెర్రెలు, పాములకు నిలయమైన, అడవి ప్రదేశమును, 200 ఎకరముల భూమిని, పుట్టలు మొదలైనవాటిని మట్టముగా జేయుచున్నను, పాములు మొదలైనవి రోజూ గానవచ్చుచున్నను, శివుని ఆజ్ఞ లేనందున, యెన్నడును యెవ్వరికిని హాని గల్గించలేదు.

ఒక రాత్రి చీకటిలో దీపమైనను లేకుండగా వెళ్ళుచు ఒక పాము మీద కాలు వేయుటచే, అది బాధలో భయపడి చి॥ జ్ఞానేశ్వరిని కుట్టుటయు, ఏమందును లేకుండగనే దైవాజ్ఞచే ఆమె, మానవసేవను నిరతరము చేయుటకు తగిన ఆరోగ్యమును పొందుట, చాలమంది ఆశ్రమ భక్తులకు తెలిసిన ముఖ్య విషయమే.

హృదయ రోగము పేరున ఆసుపత్రిలో కొంతకాలముండిన తరువాత, వాల్తేరు ఆశ్రమసేవ చేయుచు, చివరకు కైలాస ఆశ్రమమునకు, దానిని శిథిలమైన స్థితినుండి పునరుద్ధరణ చేయుటకు, శివుని ఆజ్ఞచేతనే నేను యిచ్చటకు తీసుకొనిరాబడితిని.

దైవాజ్ఞలేకుండ గడ్డిపరకయైనను కదలజాలదు గాన యిప్పుడీ వ్యాసమును, ఆయన ఆజ్ఞచేత, వారి సన్నిధిలోనే నేను వ్రాయగలుగుచుంటిని. ప్రతి క్షణము ఆయన జ్ఞప్తితో వ్రాయుట యెంత ఆనందము! ఆయనయే నా చేతితో వ్రాయుచుండెను. నేను ఒక

యంత్ర మును, ఈ శరీరమును నడిపించెడిది ఆయనయే. నేను వాని పనిముట్టును మాత్రమే. పనిముట్టుద్వారా పనిచేయువాడు దైవమేగదా!

శరీరమే దేవాలయము

శరీరములోనున్నవాడే దైవము

జీవో దేవ స్సనాతనహః

నిరంతరము జీవుడే దైవముగా నుండియు, తెలియలేకుండెను. ఉన్నది ఒక్కటియే గదా! అదియే నీవు. "తత్వమసి" గాని, మాయ ఆవరించి యుండుటచేత యీ పరమ సత్యమును తెలుసుకొనలేక పోవుచుంటిమి.

ఇప్పుడు మనము, శివుని ఆజ్ఞవలన నేను కైలాసములో గడుపుచున్న నా జీవితమును పరిశీలింతము.

తెల్లవారుఝామున నేను వ్రాసుకొనుచుండ ఒక చిన్న తేలు వచ్చి నా దగ్గరలో గోడమీద నుండెను. మరియొక గంటపోయిన తరువాత చూచినా అచ్చటనే, నేనేమి చేయు చుంటిని, ఆత్మ జ్ఞప్తితో నుంటినా లేదా అని చూచుటకు అచ్చట నా చెంతనే యుండెను. తెల్లవారగానే దానిని బైట పారవేయుదమని చూడగా, అచ్చటనుండి ఎచ్చటికో పోయెను.

మరియొక రోజున ఈమధ్యనే చిన్నపాము నేను కూర్చొని వ్రాసుకొనెడి కుర్చీక్రింద వుండెను. నెమ్మదిగా దానిని బైటకు దిగబెట్టితిమి. ఆ రాత్రియే మరొకటి వరండాలో కనుపించి-అదిగూడ చప్పుడు చేయగా క్రిందికి పోయెను.

మొన్నటిరాత్రి నేను కుర్చీమీద కూర్చొని కైలాసములో ప్రకృతి సౌందర్యమును, క్రిందనుండి కనిపించెడి లక్షలాది విద్యుచ్ఛక్తి దీపములను, ఆకాశములో నక్షత్రములను చూచుచు చల్లనైన గాలిలోగూడ దైవసన్నిధిని అనుభవించుంటిని.

అచ్చటనే చిరంజీవి శాంతి చాపమీద పరుండి రేడియోలో భక్తిగీతములను వినుచుం డెను. గురుకుల బాలబాలికలుగూడ అచ్చటనే యుండిరి. దీపము లోపలనున్నది. బైట చీకటిగానే యున్నది. హఠాత్తుగా స్తంభమునుండి ఏదో క్రిందపడినట్లు చప్పుడయ్యెను. శాంతి కాలుమీద గూడ పడెను. కైలాసములో దూలములు పెద్దపెద్ద బల్లులచే నిండియున్నవి గాన, బల్లియే పడెనని తలంచితిమి, ఎందుకైననూ మంచిదని దీపము తెచ్చి చూడగా శాంతి దగ్గరనే ఒక పెద్దపాము చుట్టుకొని యుండెను. అది తెల్లనిపాము. ఐదు అడుగుల పైగా పొడవుండును. అప్పుడు చప్పుడు చేయగా అది నెమ్మదిగా ప్రాకుచు పోయెను.

శివుడు కైలాసనాధుడు గదా! శివుని పటములోగూడ ఆయన కంఠము చుట్టును

పాములు కలిగిన పటము కైలాసములో నేనుండెడి భవనములో గోడకు తలిగించ బడియుండెను.

ఎంతలోతు తవ్వినా నీరు పడని నేలనూతిని, జంతువులకు పిల్లలకు అపాయకర ముగా నుండునని దానిని రాళ్ళచే పూడ్పించి, దానినే 'సోహం' కొలనుగాచేసి, అందు శివలింగ ప్రతిష్టగూడ చేసి, ప్రతి సోమవారము, చి॥ శాంతి, దేశవృద్ధిని శాంతిని, లోక శాంతిని కోరుచు కొబ్బరికాయను కొట్టి పూజ చేయుచుండును.

ఒక్కొక్కసారి శివలింగమును కైలాసములో చూచినప్పుడు, తోటపల్లి ఆశ్రమ సమీపములోనున్న మల్లవరమనే గ్రామములోవలె, ఏ పామో, సుబ్రహ్మణ్యేశ్వరుని కృపచే, శివలింగము చుట్టును చుట్టుకొని యుండకున్నను, కైలాసము అనేక రకరకముల పాములతో నిండి, ఎవ్వరికిని, ఎప్పుడును ఏ హానియు గల్గించుటలేదు గదాయని ఆనందించుచుంటిమి.

ఈ కొండమీద నీరు నిలవచేయుటకు రెండుపెద్ద సిమ్మెంటు కుండీలు, బ్రిటిష్‌వారి మిలటరీ హయాములో కట్టబడియున్నవి.

క్రిందటిసారి నేనిచ్చట ఆరు సంవత్సరములు మౌనముగానున్న రోజులలో, రెండు గజముల లోతు గలిగిన ఒక పెద్ద కుండీలో, రెండు పెద్ద త్రాచుపాములు. ఆ కుండీలోపడి బైటకు రాజాలక అవస్థపడుచుండ, నేను చూచి ఒక వెదురుగడను అందులో వేయగా, దాని సహాయముతో బైటకు వచ్చివేసి, వాటి స్థానములకు అవి వెళ్లిపోయెను.

ఆరోజులలో, ఒక చిన్నపాము నేను వ్రాసుకొనెడి బల్లమీద ట్రె (వుత్తరములుంచిన తొట్టి) లోనే, పరుండియుండి చేతికి తగిలెను. అప్పుడు తొట్టితో సహా బైటకు తీసుకొనివెళ్ళి వదలిపెట్టితిమి.

మరొకసారి పెద్దపాము గదిలోనుండి యెంతకు బైటకు వెళ్ళనందున, అపుడు జగ్గాసాహెబు అను తోటమాలి బుట్టలో గడ్డివేసి, దాని దగ్గర పెట్టగా అది అందులో ప్రవే శించినప్పుడు, ఆ బుట్టను గేటు అవతలకు తీసుకొనివెళ్ళి వదలిపెట్టబడెను.

ఆశ్రమవాసి, ఆశ్రమ జననిగా నిరంతరము భక్తుల సేవలో తన జీవితము గడుపు చున్న శ్రీ శేషమాంబ ఒకరోజు కైలాస ఆశ్రమంలో "దైవసన్నిధిని సదా అనుభవించుడు" అను వాక్యమును, ప్రణవ చిహ్నమును, ఒక స్తంభము మీద రంగులతో పెయింటు చేయు చుండ, ఒక పాము చూరులోనుండి, ఆమె వడిలో పడెను. హఠాత్తుగా పాము వడిలో పడినందున ఒకక్షణము భయ భ్రాంతులకు లోనైనను అటులనేయుండ, ఆ పాము నెమ్మదిగా ప్రాకుచు తన స్థానమునకు వెళ్ళిపోయెను.

విషజంతువులైనను మనము వాటికి హానిచేయనప్పుడు అవిగూడ మనకు హాని చేయవు.

"ఏ జీవులనైనను ప్రేమించి ప్రేమను బడయుము."

Love - Be loved

Love begets live, Hatred begets hatred

నీవు ప్రేమించిన సర్వము నిన్ను ప్రేమించును.

నీవు ద్వేషముతో క్రూరమైన ఆలోచనలతో నున్నయెడల యితర జీవులుగూడ, నీయందు క్రూరముతో ద్వేషముతో నుండునని ధర్మచట్టము చాటుచున్నది.

తోటపల్లిలోనగాని, కైలాసములోగాని, మరియే ఆశ్రమములో నైనను, ఎంత విషజంతువులనైనను కొట్టవలదని వాటికి బాధ గల్గించవలదని, యెంతమాత్రము చంపవలదనియే నేను సదా ఆశ్రమవాసులకు, పనివాండ్రకు బోధించుచుందును. అయినను ప్రేమ శూన్యమైన, జీవకారుణ్యములేని, పనివాండ్రు కొందరు, తొందరగా నా సలహాలను మరచి, అప్పుడప్పుడు యే పామునైనను, నేను లేని సమయమునందు చంపిరని వినగానే నేను బాధపడుచుందును.

ఇతరులను, లోకమునంతను మనము మార్చజాలముగాని, మనంతట మనము మార్చుకొని, ప్రేమగా, మనవలన యే జీవికి హాని కలుగకుండ, జీవించుటకు ప్రయత్నించ గలముగదా!

ఒక్కొక్క సమయమునందు అపాయకరమైన, విషపుపురుగు పాముగాని గదిలో మూలనుండ దానిని బయటకుతీయుట, నెమ్మదిగా అవతలకు పారద్రోలుటలో అది భయపడి కుట్టవచ్చును. దానిని గదిలో చంపివేయుటయే తేలికయని మంచిదని ప్రవృత్తి పరులైన తోటమాలీలు, పనివాండ్రు వారి మామూలు అలవాటు చొప్పున తలచుచుందురు.

శ్రీ గాంధీమహాత్ముని ఆశ్రమములలోగూడ, యెన్నడు పాములనైనను చంపకుండ, జీవహత్య లేకుండగనే వారు జీవించినంతకాలము బోధించుచూ, అందరకూ ఆదర్శనీ యముగా ప్రేమమూర్తివలె నుండెడివారు.

ఏ జంతువునైననూ ప్రాణము తీయుట సులభముగాని–ప్రాణదానము చేయుట దుర్లభముగదా! ద్వేషించుట బహుతేలిక, విశ్వప్రేమతో నిండియుండుట చాల కష్టము. అయినను దైవాకారముతో సృష్టింపబడిన మానవులకు ప్రేమయే సహజమైన స్వభావముగ నుండవలెనుగదా. తమ నిజస్వభావమును, జన్మహక్కు అయిన విశ్వప్రేమను మరచినవారు, అహంకార మమకారములతో నిండి, జంతుజాలమునకేగాక, మానవలోకమునకుగూడ, లోకకంటకులుగా, క్రూర రాక్షసులుగా బరగుచుందురు.

దైవానుభవము గల్గినవారు మాత్రమే, మానవకోటినేగాక, జంతుజాలమును, పిపీలికాది బ్రహ్మ పర్యంతమువున్న జీవరాసులలో దైవమునే గాంచుచు, దుర్లభమైన తమ

మానవజన్మలను సార్థకము చేసుకొనుటకు సదా ప్రయత్నించుచుందురు.

చీమలో, దోమలో, అణువు మొదలు బ్రహ్మాండమువరకు సర్వము దైవమేగాన, సర్వకాల సర్వావస్థలయందును, విషమ పరీక్షలలోగూడ దైవమునే గాంచగల్గిన వారి జీవితములు పరమపావనమైనవి.

మనలోనున్న దానినే బాహ్యమున అందరిలో గాంచెదము అనునది మరొక దైవ చట్టము. మనలో భయము, అసూయ, ద్వేషము అహంకారములున్న, వాటినే బాహ్యమున గూడ అందరిలోను గాంచుచుందుము.

మనలో ప్రేమ, సహనము, శాంతి, దైవానుభవమునున్న మన నేత్రములు ఏది చూచినను, మనదృష్టి ఎచట పడినను, సర్వము దైవముగానే గానవచ్చును.

ఈశావాస్య మిదం సర్వం, ఈ విశ్వమంతయు ఈశ్వరునితోనే దైవతేజస్సుతోనే నిండియున్నది. దైవము అద్వితీయుడు, రెండుగాని వాడు, దైవము తప్ప అన్యమైనది, ఎప్పుడు, ఎచ్చట, ఎన్నడూ లేదు గాన, సర్వములో నిరంతరము సదా దైవమును గాంచెడి వారి జన్మలే ధన్యవంతములు.

శ్రీ త్యాగరాజస్వామి ఎట్లు చెప్పిరో చూడుడు :

### –: శ్రీ త్యాగరాజ కీర్తన :–

హరికాంభోజి – రూపకం

రామ నన్నుఁ బ్రోవరా వేమకో లోకాభి
చీమలో బ్రహ్మలో శివకేశ వాదులలో ॥రా॥
ప్రేమ మీఱ మెలఁగు చుండే బిరుదు వహించిన సీతా ॥రా॥
మెప్పులకై కన్నతావు నప్పు బడక విఱ్ఱవీగి
తప్పు పనులు లేకయుండే త్యాగరాజ వినుత సీతా ॥రా॥

శివుని ఆజ్ఞ చేతనే, తన స్వభావమును అనుసరించి, తేలు కుట్టుచున్నది. ఆయన ఆజ్ఞ చేతనే తనను కుట్టుచున్న తేలునుగూడ – ప్రేమమయుడైన ఒక సాధువు తాను శాంతిగా, తన పరీక్షలను ఓర్పుతో, నిదానముగ అనుభవించుచు, తనను కుట్టుచున్న తేలునుగూడ విసుగులేక నిర్భయముగ మూడుసార్లు రక్షించగలుగుచుండెను. ఎవరి స్వభావము వారు విడువలేరు. తేలు కుట్టుట, సాధువు దానిని రక్షించుట.

(శాంతి అక్టోబరు 1964)

# ౨5. శ్రీ వి.వి. గిరి గారికి - స్వామీజీ స్వాగతము

(వైస్ ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా)

నాకు నేడు అత్యంత ఆనందముగ కలదు. నా బాల్యస్నేహితులగు శ్రీ గిరిగారికి స్వాగత వచనము యేవిధముగా ప్రారంభింపవలయునో తెలియుటలేదు. ఇచ్చటి కేతెంచిన వారందరికి దైవసన్నిధిలోనికి, ఈ క్షణముననే సుస్వాగతము, మీరందరు ఎచ్చటనుండి ఏతెంచితిరనెడి భావము నాకెప్పుడును కలుగదు. సదా మీరు నాతోనె, నాలోనె యుందురు. ఎల్లవేళల ఆ దైవమే వివిధ రూపులలో నాచెంతకి వచ్చుచుండునని భావించి ఆనందింతును. అందుచే మిమ్ము సేవించిన ఆ దైవమును సేవించినట్లే, మీ సేవయే నాకు మహదానందము నొనగూర్చును.

ఈ ఆశ్రమము స్థాపింపబడి 50 సంత్సరములకు పైబడినది. అప్పటి నుండియు నా బాల్య స్నేహితులగు శ్రీ వి.వి.గిరిగారు ఈ ఆశ్రమము దర్శింపవలెనని, నేను వాంఛించు చుంటిని. నేటికి నా కోర్కె సఫలమైనది. శ్రీ వి.వి. గిరిగారు ఇండియా వైస్ ప్రెసిడెంటు మీకు కావచ్చును. కాని నాకు మాత్రము నా బాల్య స్నేహితులే. అంతేకాదు వారు, మేము బాహ్య రూపమున భిన్నులముగా కన్పట్టినను ఆంతర్యమున ఏక స్వరూపములమే. కాలము చాల విలువైనది. వారు ఇచ్చట చాల స్వల్పకాలమే యుందురు. ఈ స్వల్పవ్యవధిలో మీకు నేనేమైన చేయగల్గినచో చాల ఆనందింతును. మీకు నే నెట్టి సహాయము చేయగలను? నేను పుస్తకముల నుండి చదివిన విషయములనుగాని, ఇతరులనుండి నేర్చుకొనినవిగాని మీకు చెప్పబోవుటలేదు. కేవలము నా జీవితానుభవములనే చెప్పెదను. అవి మీకేవిధమైన సహాయమైన చేయగల్గినచో చాల ఆనందము. నా కెప్పుడును ఒక భావన కల్గుచుండును. మనము ఆ తేజస్సునందే గలము. ఆ తేజస్సు మనలోనే గలదు. మనమే ఆ తేజస్వరూపులము. అట్టి తేజస్సును గ్రహించుడు. అదియే శాంతిని కాంతిని ప్రసాదించును.

మనమందరము ఆ పరబ్రహ్మమునుండి యేతెంచితిమి. సముద్రమునుండి అలలు యే విధముగ భిన్నముకావో, మనముగూడ ఆ బ్రహ్మమునుండి భిన్నులముకాము. బ్రహ్మము సత్యము, నిత్యము, స్థిరమైనది, శక్తి సృజనాత్మకము, సకల చరాచర సృష్టులు ఆ దైవశక్తిచేతనే సృష్టింపబడుచున్నవి. ఆ దైవసంకల్పము లేనిదే ఏ కార్యమును జరుగనేరదు. ఆ కృపామయుండైన దైవము మీ రూపములలో ఇచ్చటనే గలడు. అట్టి తరి మీకు నేను యేవిధమగు సేవ లొనగూర్తును?

భక్తతుకారాము సదా ఒక మంత్రమును జపించెడివాడు. అత్యంత ప్రతిభాసమన్విత

మగు ఆ మంత్రమహిమ వలన విగతజీవుడైన ఒక బాలకుడు పునర్జీవితుడయ్యెను. ఆ మంత్రము "జయ జయ రామకృష్ణ హరి ఓం" ఇది నా నిత్యజీవితములో ఏవిధముగా ఆచరణయందుంచితినో మీతో పంచుకొందును. ఒక్కొక్క పదోశ్చారణతో నా ప్రత్యంగమును, నల్దిక్కులును ఆ దైవజ్యోతిచే నిండిపోవుచున్నట్లుండును. అంతటను ఆ జ్యోతిర్మయము, ఆనందప్రపూర్ణము. ఇది నా స్వానుభవము. మీరందరూ కూడ యిట్టి మహదానందమును పొందవలెనని నా వాంఛ. మనము అనుక్షణము ఆ దైవసన్నిధానము ననుభవించుచు ఇతరులకుగూడ అట్టి అనుభవములను కలిగింప ప్రయత్నించవలెను. దైవమనగా యెచ్చటనో లేదు. ఈ స్వరూపములలోనే యుండును. నా జన్మదిన సందర్భములో ఒక భక్తుడు "స్వామీజీ అందరివలె మరణించరు. వారికి సంకల్పము గలిగినపుడు వారి యిచ్ఛననుసరించి శరీరమును విడిచెదరు" అని చెప్పిరి. అందెంతటి భావముగలదు! నిజముగ యీ బాహ్య రూపము నశింపవచ్చు, కాని నా ఆత్మ కెన్నటికని నశింపులేదు. నిత్యసత్యమై ఎల్లప్పుడును నిల్చియే యుండును.

మీరందరెంతయో వ్యయప్రయాసలకోర్చి ఆశ్రమమునకు వచ్చితిరి. గాన మీరు ఈ దివ్యతేజస్సును మీతోకొనిపొండు. ఆ కాంతియే మీకు జీవితానందమును చేకూర్చును. కృపామయుండైన దైవము నా బాల్యమిత్రులైన శ్రీ వి.వి.గిరిగారిని, వారి తనయులను, మీ అందరిని ఆయురారోగ్యములతో, శాంతితో బ్రోచుగాక!

లోకా సమస్తా స్సుఖినోభవతుః

ఓం! ఓం! ఓం!

(శాంతి మే 1968)

# 26. శ్రీ వివేకానందుని వేదాంతము

శ్రీ వివేకానందునిది అనుష్ఠాన వేదాంతము. అనుష్ఠానయోగ్యము గాని వేదాంత సిద్ధాంతము ఎంతటి ఉన్నతములైనను, అవి నిష్ప్రయోజనమే. వేదాంతము సర్వకాల సర్వావస్థలయందును మన జీవితములలో ఆచరణయోగ్యమై యుండవలెను. ఇంతియేగాదు. మతము లౌకికవ్యవహారములు పరస్పర విరుద్ధములుకావు. ఒకే నాణెముయొక్క ఇరు తెరువులు. మతము మన జీవిత సర్వరంగముల యందును ప్రదీపించవలెను. మన తలంపు లన్నిటియందును ప్రాధాన్యత వహించవలెను.

వివేకానందుని వేదాంత సూత్రములను క్రిందివిధముగా క్రోడీకరించవచ్చు:

(1) ఎట్టి తీవ్ర ప్రవృత్తియందున్నను, పరమశాంతిని కలిగియుండుట.

(2) సకల చరాచర సృష్టియందును ఏకత్వమును గాంచుచు, తద్రీత్యా ఆత్మవిశ్వాసమును బొందుట.

(3) నేను పాపిని అనెడి భావము లేకయుండుట.

(4) నిమ్నోన్నతములయందు సమభావన.

(5) వేదాంతరీత్యా ఎట్టి మతముకావలెను?

(6) సత్యాసత్య వివేకము.

(7) హృదయ నైర్మల్యముచే, సానుభూతిచే దైవమును పొందుట

(8) వేదాంతము నెట్లాచరింపవలెను?

తీవ్ర ప్రవృత్తియందు ప్రశాంతిగా యుండుటెట్లు. వేదాంత సిద్ధాంతముల యందు అత్యంత ప్రాధాన్యత వహించు కర్మరహస్య మిదియే. వేదాంతము నిష్క్రియత్వము బోధింపదు. అట్టి తీవ్ర ప్రకృతియందు పరిపూర్ణ శాంతితో ఎట్లుండుటో బోధించును. ఎట్టి పరిస్థితులు ప్రాప్తించినను,చిత్తస్థైర్యము కోల్పోవలదు. అప్పుడు మాత్రమే ఉత్తమ కర్మాచరణము జరుగును. ఆవేశము తగ్గినకొలదియు, మనము చేయు పనులు ఉన్నతమై వరలును. శాంతియుతముగా నాచరించిననే ఎక్కువగ పనిచేయగలము. క్రియా రూపకమైన శక్తిని వ్యర్థమైన మానసికోద్రేకమున వ్యయించకుండిన ఆ శక్తి అత్యుత్తమ కార్యములను చేయుటయందు వినియోగించును.

అద్వైతమే వివేకానందయొక్క వేదాంతసారము. సకల చరాచర సృష్టియందును నిండి నిబిడీకృతమై, సర్వజ్ఞమై, జనన మరణ రహితమై, సర్వశక్తి సమన్వితమై వరలునదా ఏకైకసత్యమే. అట్టి సత్యమును గుర్తించిన ఆత్మవిశ్వాసము కలుగును. కొన్ని మతములు

దైవమునందు నమ్మికలేని వానిని నాస్తికుడనవచ్చు. కాని వివేకానందుడు తనయందు (తన ఆత్మ యందు) నమ్మకములేనివానిని నాస్తికుండనును. మనిషికిని మనిషికినిగల వ్యత్యాసము కేవలము వారివారి యందుగల ఆత్మవిశ్వాసము పైననే ఆధారపడియుండును. ఆత్మజ్ఞప్తి లేకయుండుట, ఆత్మవిశ్వాసము లేకయుండుటే మానవుని దుర్భలత్వము. "సర్వశక్తులు నీలోనే గలవు అంతర్ దృష్టి కలిగియుండుము. నీవు దుర్భలుడవుకాదు." అని ఆతని సింహగర్జన. ఈ స్థితి గ్రహించిననే మానవుడుతాను దుర్భలుడుకాడు అని తలపోయును. ఇట్టి స్థితిబడయుటకు స్త్రీ పురుష విచక్షణ గాని, జాతిమత విచక్షణగాని అవసరములేదు, అందరు అట్టి స్థితి నందవచ్చు.

వివేకానందుడు "నేను పాపిని అని చెప్పుటకు" అంగీకరింపడు. పొరపాటును మాత్రము అంగీకరించును. నేను దుర్భలుడను, శక్తిహీనుడను, పాపాత్ముడను, ఏ కార్యమును చేయజాలను అనుటకు అంగీకరించడు. ఆత్మ సహజముగా పావనమైనది. పవిత్రత, అనురాగము, ప్రేమ, స్వేచ్ఛ, స్వాతంత్ర్యము దాని సహజ లక్షణములు సత్–చిత్–ఆనందస్వరూపము. ఇట్టిది వనాంతరములయందు, గుహాంతరముల యందున్నవారికేగాక, తీవ్ర కార్యక్రమములందు నిమగ్నమైన వారికిగూడ సాధ్యమని వివేకానంద బోధించును.

ఏకత్వమే వేదాంత మూలసూత్రము. వివేకానందుని వేదాంతము ద్వైతము నంగీక రింపదు. ఉన్నదొక్క జీవనమే. ఒక్క ప్రపంచమే. ఒక్క అస్థిత్వమే. అణువు మొదలు బ్రహ్మాండము వరకు నిండియున్నదా ఏకైక సత్యమే. అందుచే ఉన్నతమని; నీచమని భేదభావములు అంతరములందుండునేగాని వాస్తవమునకు లేవు. ఎవరినీ తప్పుపట్టు నధికారము ఎవరికినిలేదు. చేతనైన సహాయము చేయవలెను లేనిచో వారి దారిని వారిని బోనియ్యవలెను. అందరము వచ్చినదియు, ఉన్నదియు, చేరునదియు, ఒకేస్థానము.

వేదాంతపరమైన మతమిట్లుండవలెనని వివేకానందుని భావన. అది సర్వకాల సర్వావస్థలకును వర్తించునదై, సర్వవ్యాపకమై యుండవలెను. నీచాతినీచదశయందున్న వారిని, ఉచ్ఛస్థితియందున్నవారిని కూడ లేవనెత్తగల సమర్ధనీయమై యుండవలెన. అదెట్టి మతమైనను, పుణ్యపాపములను, నిమ్నోన్నతములను, పాటింపక తన ప్రేమ ప్రసరణచే సర్వులను సమానముగా పునీతము గావించునదై యుండవలెను. అట్టి మతమే వేదాంతము బోధించు మతము.

ఇంక ఇతని వేదాంతము సత్యాసత్య వివేచనగావించును. సత్యమైనదెల్లను ఏకత్వమునకే ద్రోవ తీయును. సత్యలక్షణములు రెండు. (1) ప్రేమ (2) ఏకత్వము. ప్రేమ సత్యము, ద్వేషము అసత్యము ఏలనన ప్రేమ ఏకత్వమునకు, ద్వేషము భిన్నత్వమునకు

ద్రోవదీయును గనుక, ప్రేమయే దైవము. ఈ కానవచ్చునదంతయు, ఆ ప్రేమరాశియొక్క వివిధ రూపాంతరములు.

ఇంక హృదయ పవిత్రతయే ఈశ్వర సాక్షాత్కారము కలిగించును. బుద్ధి కేవలము మన ప్రవర్తనను అనుసరించిచేయును. పనులను గావించునది హృదయస్పందనములే. విద్యుత్ కంటెను అమోఘమగు చలనశక్తి దీనికి గలదు. నీ హృదయమున సానుభూతి యున్నదా, అదియే జీవిత రహస్యము. బలము, చైతన్యము-ఆ సానుభూతియే సాంద్రమై, దివ్యమై, సకలమును స్పృసింపుచు, సకలమునందును ఆ ఏకత్వమును గాంచుచు, నీ లోపలను, వెలుపలను ఆ దివ్యాత్మానుభూతి పొందుట కుపరించును. బుద్ధి కేవలము చమత్కార పదములనుపయోగించుటకు, శాస్త్రములను వ్యాఖ్యానించుటకు వినియోగించునుగాని, ఆత్మవలె ముక్తిని ప్రసాదింపదు. నీ హృదయమునందలి భావములే ప్రేమయే నీ గమ్యమును జేర్చును. నీవు ఎవరినైన నిస్వార్ధముగ ప్రేమింపగలిగితివా నిన్నది దైవసన్నిధికి జేర్చును.

ఇట్టి వేదాంతమును అనుష్ఠానమున పెట్టుట ఎట్లో ఆ వివేకానంద బోధించెను. ప్రతి జీవియందును, ప్రతి జాతియందును, ప్రతి నగరమునందును, ప్రతి దేశమునందును, ప్రతి కార్యకలాపముల యందును ఎట్లనుష్ఠింపవలెనో ఆయన తెల్పియుండెను. గ్రంథస్థములైన విషయములందలి సత్యాసత్యములను అనుష్ఠించి చూడుడనియే వారి ప్రబోధము.

హైందవుడు క్రైస్తవుడుగా కాని, బౌద్ధుడుగాకాని మారనవసరములేదు. క్రైస్తవుడు హిందువు కానవసరములేదు. ఎవరు ఏ మతమునందున్న ఆ మతముననే యుండవచ్చును. కాని తమ కర్తవ్యము నిర్వర్తించుచు, ఇతరుల భావములను అర్ధము గావించుకొనుచు పురోగమించవలెను.

పవిత్రత, పూజ్యత, త్యాగము ఏ ఒక్క మతముయొక్క హక్కుభుక్తములు గావు. తమ ఒక్క మతము మాత్రమే నిల్చును గమ్యము చేర్చును. అని ఎవరైన బల్కిన అవి వట్టి మందబుద్ధుల ప్రసంగములేయని వారి భావన.

కావలయునది కలహముకాదు. సహకారము, అన్యమత ధ్వంసముకాదు, తదాశయ గ్రహణము. శతృత్వముకాదు-శాంతిసామరస్యములు. ఇవియే భావితరముల వారి మతమై వెలగవలయునని వివేకానందుని ఆశయము.

ఓం ! ఓం! ఓం!

(శాంతి మార్చి 1970)

# 27. శ్రమ

## (EXERTION)

ప్రతి వ్యక్తియు ఆత్మార్థమై కృషి సల్పుటచే దుఃఖమున నుభవించును. ఐనను ఈ రహస్యము నెవ్వడు నెరుగడు. ఆత్మజ్ఞానముచే పుణ్యవంతుడు మోక్షము నార్జించును.

–అష్టావక్రుడు.

ఎంతటి అగాధ, ఉత్తేజకర, మహోన్నత భావన యిది, ఒక భాగవతుడు మాత్రమే యీ మహోజ్జ్వల సూక్తినర్థము చేసికొని యభినందింపగలడు.

ఈ శీర్షిక ప్రాపంచిక జనులకు అసంతుష్టికరము, సౌమ్యేతరము, కాని చాలయేళ్ల క్రితమే యీ పేరుతోనే యీ విస్మయకర సందేశమును నా అంతఃప్రేరణచే వ్రాసియుంటిని.

వికల్పమేదైనను అది నింద్యమే.

నిశ్చలత్వమే పరిపూర్ణమయినది. అద్వితీయమైనది కావున నదియే సర్వశ్రేష్టము, అది, "యేకైక" మైనపుడు వికల్ప శ్రమలెట్లు కలుగును. వికల్ప శ్రమములు ద్వంద్వస్థితి యందే సాధ్యములు.

అష్టావక్రమహర్షి యిట్లు పేర్కొనెను.

కనురెప్పలు మూసితెరచుటయందు కూడ బాధను భావించు, "నిష్క్రియు"నకేగాని తదితరులకు ఆనందము లభింపదు.

ఐహికమునకు బద్ధుడై, ఇంద్రియములకు దాసుడైన యొక సామాన్యుడీ యగాధ సత్యముల నర్థము చేసుకొనలేడు. నామ రూపాత్మకమగు నీ ప్రపంమున కతీతుడగు యోగి మాత్రమే ఈ యగాధ ఆధ్యాత్మిక సత్యములు నవగతము చేసికొనగలడు.

ఇప్పుడీ సందేశము వ్రాయుటలో శ్రమలేదా? కాని కైలాసశిఖరమున ఈ ప్రత్యూష కాలమున ఆ శ్రమను మీవంటి పాఠకులతో కలిసి పంచుకొను నానందమును నే నను భవించుచున్నాను.

కైలాసము మిమ్మాహ్వానించుచున్నది. ఆ కైలాసాహ్వానమును మీరు చదివితిరా? వేత్తలని, వేదాంతులని పేరుపొందుటకు, లోకప్రసిద్ధినందుటకు నెంచి గొప్పగొప్ప పదజాలమును పునఃపునరుచ్చరించుచు, శాస్త్రములు, వేదములు, బైబిలు మున్నగు గ్రంథ ముల నుండి శ్లోకము వెంట శ్లోకమును గుర్తుకు తెచ్చుకొనుచుండుట మహా శ్రమ కాదా!

చరమశాంతిని అనుభవమేకాని అవరోధమెరుగని శాంతి కొరకు ఈ సమస్త శ్రమలను, వ్రాతను, చదువుటను, మాట్లాడుటను తుదకాలోచించుటను గూడ నధిగమిం పవలయును, అట్లు సమస్తచలనముల నుండి విముక్తుడు కావలయును.

యధార్థముగా ఈ శ్రమ-వికల్పము ముమ్ముందు ప్రాపంచిక లోలునకు కాకున్నను, భాగవతునకైన కార్పణ్యమును, అసంతుష్టిని కూర్చితీరును.

విశ్రాంతి యెరుగక దేశదేశములు గ్రుమ్మరు సాధుల యోగుల మాటయేమి? మరొకసారి యష్టావక్రుని విజ్ఞాన వాక్యములవలోకింతము.

వత్స! నిత్యము విభిన్న శృతిస్మృతి శాస్త్రాదులను గూర్చి మాటాడవచ్చును, వినవచ్చును. కాని ఆ యన్నిటిని మరచిపోనిదే యాత్మ (in self) సంస్థితుడవు కాలేవు.

తరంగములు సముద్రమునువలె ఈ విశ్వమెవరి నాశ్రయించి యున్నదో ఆతడు నీవేయని యెరింగియు దీనుని గతిపరుగిడనేల?

ధ్యానమును గూడ సంపూర్తిగ విసర్జింపుము. నీయంతఃకరణమున దేనికిని తావీయకుము. నీవు యధార్థమున నాతడవే-ఆ యాత్మవే. కావున స్వేచ్ఛవహింపుము. నిరంతర చింతనచే నీవేమి యార్జింపగలవు.

శ్వాసకూడ శ్రమయేనా? చలనమేనా?

నిస్సందేహముగ.

పవిత్ర రామనామ జపమో?

నిస్సందేహముగ సాధకున కదియారంభ దశయందు సాహయ్యకారియే-కాని యున్నత దశలయందది భారమే, శ్రమకరమే.

శ్రమ ఆంతరికమైనను, బాహ్యమైనను మరెట్టిదైనను వేదననే కొనితెచ్చును.

విజ్ఞులకొకమాట చాలును. కనుక నీ సందేశమును విశ్వసూక్తులయందలి యొక పద్యభాగముతో ముగింతును.

మరువ జాల పరాత్పరు మరువ జాల
నలస్వయం ప్రకాశ జ్యోతియైనవాని
లిప్త యందు వేయవ వంతు లిప్తయందు
వేయియవ వంతు కాలమే నీ-యెడంద.

విశ్వభావన గలవాడు శాశ్వత జీవితమును కోరడు. అది యాతని యందు యున్నది.

పావన శ్వాస-సోహం-అహంకారమును సంహరించును. అమాయికత నణచివేయును, హృదయమున ప్రేమానందములను జాగృతమొనర్చును. ఆత్మకు శాంతి చేకూర్చును.

ఓం తత్ సత్ ఓం

ఈ సోహం కారమును నిరంతరము విక్షేపరహితముగా ననుగమించు శక్తిస్థైర్యములు మనకు గలుగుగాక! అదియే మనలను నిర్మల శాంతి గమ్యమును చేర్చగల సుగమమగు ఋజుమార్గము.

సర్వే జనా స్సుఖినో భవంతు

ఓం ఓం ఓం

ఆ శీస్సుల నందు కొరకు
ఆ కైలాసమ్మునకై
అర్పించెద నమ్రుడనై

కైలాస వైభవము కాంక్షించు నుతులతో
శ్రమయు చలనముగల్గు జగతిలోనికి నేను
పావనా చలము దిగి పయనించు సమయమున

ఓం ఓం ఓం

అనువాదము : పాటీలు తిమ్మారెడ్డి. (శాంతి మే & జూన్ 1971)

## 28. శాశ్వతమైన సవాలు

ప్రశ్న : అనంత తేజస్వరూపి, విశ్వప్రేమమయుడు అగు ఆ దైవములేని క్షణము ఎద్దిఐన చూపించగలరా? లోపలగాని, వెలుపలగాని, ఎచ్చటనైనగాని ఆ దైవములేని తావు చూపించగలరా? ఆ విశ్వచైతన్యశక్తిచే నిండి నిబిడీకృతముగాని అణువెచ్చటనైన గలదేమో చూపగలరా?

ఆ దైవము మనలోని ప్రత్యణువునందును పరివ్యాపకుడై యుండెను. అణువు మొదలు బ్రహ్మాండము వరకును ఆ దైవమే ప్రకటీ భూతుడగుచుండెను. ప్రత్యణువునందును, పరమాణువునందునుకూడ ఆ దైవమే నిండియుండెననుటలో అతిశయోక్తి ఎంతమాత్రము లేదు.

లోపలను, వెలుపలను ఆ దైవమే.
ప్రత్యణువునందున ఆ దైవమే
ప్రతి ముఖారవిందమునను ఆ దైవమే.
ఎంత అద్భుతము! ఎంత ఆశ్చర్యము ! ఎంత ఆనందము!

ఆ దైవమును కాంచుటకు నా కన్నులను విచ్చితిని. నా కన్నులే దృశ్యమును గాంచినను అందు ఆ దైవమే. మీదను, క్రిందను ఎచ్చట చూచినను ఆ దైవమే ఆవృతుడై యుండెను. ఆ దైవమున కాంచుటకు కన్నులు మూసితిని. నా ప్రత్యణువునందును నఖశిఖ

పర్యంతము ఆ దైవమే నిండియుండెను. ఆ దైవము మాత్రమే శాశ్వత సత్యము. అఖండ సత్–చిత్–ఆనంద స్వరూపము. ఆ దైవమే సంపూర్ణ స్థితి. ఆ దైవమే సంపూర్ణ విజ్ఞానము. ఆ దైవమే సంపూర్ణానందము, ఈశావాస్యోపనిషత్తునందు తెల్పబడినట్లు

తదేజతి తన్నైజతి తద్దూరే తద్వదన్తికే
తదన్తరసల సర్వస్య తదుసర్వస్యాస్య బాహ్యతః ।

ఆ దైవతత్వము చలనసహితము, చలన రహితము. అత్యంత సామీప్యము. అత్యంత దూరస్థము ఈ సమస్త జగత్తుయొక్క బాహ్యాభ్యంతరములందెల్ల నిండియుండెను.

ఆద్యంతరహితమగు ఆ ఏకైకసత్యమే ఉన్నది. ఉషఃకాలమున బాలభాస్కరుని వెచ్చని కిరణస్పర్శలలో, మలయమారుతపు కోమలకరస్పర్శలలో ఆ దైవచైతన్యమును గుర్తించుము. "తత్త్వమసి" ఆ చైతన్యము నీవే.

పరిమితమగు మాటలచే వర్ణించుటకింకేమి కలదు. నీవు ఊహించుటకుగాని, చింతించుటకుగాని మరియేమి గలదు. ఆ విశ్వశక్తియే "సోహం" రూపమున ప్రతి శ్వాసలో ద్యోతకమగుటలేదా? అవాఙ్మానసగోచరము నిరుపమానము నిశ్చలము. "నిశ్శబ్దో బ్రహ్మ".

దైవమును నిర్వచించుటయన దైవత్వమును సంకుచితపరచినట్లే కాగలదు. కావున యీ పఠనములు, యీ వ్రాతలు సమస్తము ఆవలనుంచి, కోటిసూర్యప్రభాసమానమగు ఆ దైవతేజస్సును గుర్తించి నిశ్శబ్దములో నుందముగాక!

క్షణములో కోట్యంశమైనను దైవములేని కాలము భూతభవిష్యద్వర్తమాన కాలములందెచ్చటనైన యుండెనా? అట్లు అణువణువునను ఆ దైవము నిండియుండని స్థలమెద్దియైన యుండెనా? అసంభవము. వాస్తవమునకు ఆ దైవము దేశకాల నిమిత్తముల కతీతము.

లోపలను, వెలుపలను చక్షువు లాదివ్యతేజస్సునే గాంచుకావుత! శబ్దములో, నిశ్శబ్దములో శ్రోత్రములా దివ్యశబ్దములనే ఆలకించుగాక! సత్ వున్నచోట అసత్‌నకు స్థానములేదు. అవిభక్తమగు దైవము అంతటను, అన్నిటను యుండెను. నిత్యసత్యమగు ఆ దైవముగాక మిగిలినవన్నియు మిధ్యయే. జ్యోతిర్మయుడగు ఆ దైవమును సదా కాంచెదముగాక!

ఇదియే నా అప్రతిహతమైన సవాల్ ! ఏ జాతివారైనను, ఏ మతమువారైనను, ప్రాక్పశ్చిమవాసులైనను, ముముక్షువులైనను, మరెవరైనను, అందరియందును నిండియున్న ఆ ఏకస్వరూపునకు నా వినయపూర్వకమైన అర్పణ.

లోకాస్సమస్తా స్సుఖినో భవంతు!        ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

(శాంతి మే & జూన్ 1972)

# 29. శాంతి పూదోట

ఒక చక్కని పూదోట కలదు. అది "శాంతి పూదోట" లేక "దైవోద్యానము" అది పలు రకముల వృక్షములతో శీతలచ్ఛాయల ప్రసరించుచు ఆనందము కల్గించుచుండును. తోట ఒక్కటియే. కాని అందలి వృక్షములు మెండు. వివిధ రకములైనవికూడ. ఏ రెండును ఒక రకమైనవికాదు. ఏ వృక్షము ఆ విధమైన ఫలములనే ఫలించును. నాకు మాత్ర మీ ప్రపంచమే ఆపూదోట, వివిధ దేశములే ఆ వృక్షములు. దేశములు భిన్నమైనవైనను, ఈ దైవోద్యానమున మానవజాతి ఒక్కటియే. ఆకృతిలో, జాతులలో ఆ వృక్షములు భిన్నమైనవి కావచ్చు. కాని తోట ఒక్కటియే. అందొక్క వృక్షమేకాదు. సమస్త వృక్షములు మీకు చెందినవియే. కాని మానవుడు అజ్ఞానముచే అంతకును తానె ప్రభువునని మరచి, ఒక జాతి, ఒక మతము తనదిగా భావించుట, పూదోటలోని ఒకే వృక్షము మాత్రము తన దనుకొనునట్లుండును.

దైవము మీకు, మీరు దైవమునకు చెందియుండ, ఆ దైవోద్యానము మీదికాదా? తండ్రిదంతయు బిడ్డకు చెందదా! ఆహా! మానవుడు అవివేకియై అన్ని వృక్షముల నుపేక్షించి, ఒక్కటియే తన దనుకొనుట ఎంత అవివేకము. ఈర్ష్య, ద్వేషము, అసూయ వీనిచే నిండి మానవులు కఠినాత్ములై ఇతర జాతి, మతములపై దండయాత్ర సల్పుట, తన శాంతి పూదోటను దానే ధ్వంసము చేసుకొనుట కాదా? బాహ్యవిజ్ఞానము పెంపొందించుకొని, గర్వితుడై మారణాయుధములను తయారుచేసి వానితో బలహీనులను నశింపజేయుట, తనపూదోటలోని లేత మొక్కలను ధ్వంసమొనర్చుకొనుట కాదా? తోటయందు ఇతర వృక్షములను నశింపజేసిన ఒక్క వృక్షముండునా! అదికూడ నశించియే తీరును. స్నేహము, శతృత్వము, ఉన్నతి, పతనము మానవ హస్తములయందే గలదు. మహోన్నతుడై మానవజాతి అభ్యుదయమునకు తోడ్పడుట మానవకర్తవ్యము. అజ్ఞానముచే స్వార్థపరుడై భూమికి భారమగుటగాని, విశ్వప్రేమతో నిస్వార్థసేవ జేయుచు మానవాళికి ఆశీర్వాదమగుటగాని మానవ హస్తములందే యుండును. సర్వులను ప్రేమించగల అనంత విశ్వహృదయము కల్గియుండుటయే దైవము మానవునకు కల్పింపగల గొప్ప కాన్క. సత్యమును గ్రహింపక దైవస్వరూపులగు ఎవరికి హాని చేసినను దైవమునకు హాని చేసినట్లేయగును. దైవ ప్రతిరూపులగు ఏ మానవుని ప్రేమించి, సేవించినను దైవమును ప్రేమించి సేవించినట్లే యగును.

మహనీయులగు అట్టి సత్యద్రష్టలైనవారికి వారా దేశస్థులు, వీరీ దేశస్థులు అనెడి బేధమించుకయు వుండనేరదు. ఏజాతి, ఏమతమును చెందినవారైనను, వారందరిలో

ఒకే దివ్యజ్యోతిని గాంతురు. ఏయే మతములకు చెందినవారైనను వారందరి హృదయములలో స్పందించునది ఒకేదివ్య చైతన్యము కాదా? ప్రాక్పశ్చిమ వాసులందరు ఒకే దైవాంశ సంభూతులుకాదా? అట్లయ్యు కొందరు సంకుచిత్వముతో, జ్ఞానాభివృద్ధి నొందలేక క్రూరులై పులులవలె, త్రాచుపాములవలె వ్యవహరింతురు. వారికి దైవప్రేమను గూర్చి తెలుపుట అసాధ్యము. వారి ప్రస్తుతస్థితి క్రూరత్వము, కీడుచేయుట, నశింపజేయుట, ఇవియే వారి పరమావధి. అమాయకులు, బలహీనులు అగు వారి రక్తమును పీల్చుటలోనే వారికి ఆనందము కలదు. ఏవిత్తు విత్తిన అదియే ఫలించుననెడి దైవచట్టమును వారు గుర్తించరు. పలువిధములగు దుఃఖానుభవములు పొంది కొందరు సత్యాన్వేషణాపరులగు చుందురు. అంతయు దైవస్వరూపమేయని మనము గ్రహించినను, క్రూరమగు బెబ్బులిని గాని, విషసర్పమునుగాని ఆలింగన మొనర్చుకొనము కదా! అట్టి స్వభావము కలవారిని దూరముగా నుంచవలెను. ఒకదాని తర్వాత ఒకటి నాశనము చేయువారినుండి మనము తగినంత రక్షణతో కాపాడుకోవలెను. తోటలయందలి అంటు జాడ్యమును మీరెన్నడైన చూచితిరా? దానిని వెంటనే నిరోధించి, నశింపజేయనిచో ఒక చెట్టునుండి మరియొక చెట్టునకు వ్యాపించి కడకు తోటంతయు నశింపజేయును. ఆ తోటను కాపాడుటకు సత్వర చర్యలను గైకొనవలెను.అటులనే మానవాళియందుకూడా అంటు జాడ్యములవంటి వారుందురు. వారికే సర్వము తెలియుననియు, తామే అధికులమనియు భావించుచుందురు. ప్రమాదకరమైన, అట్టి క్రూరులను ప్రేమించుట కష్టమేయగును. కాని చెడును మనము దండింపవలెనేగాని వారిలోని సత్యాత్మనుమాత్రం ప్రేమింపవలెను. అప్పుడే మనకు ఆత్మశాంతి చేకూరును. విశ్వదృష్టితో విశ్వప్రేమ గలవారు ధన్యులు. జాతి, మతము, కులవిచక్షణ లేక, పాపులు, పుణ్యులు అను బేధము లేక సర్వులను తన ప్రేమ పరిష్వంగము లోనికి స్వాగతము పల్కువారు ధన్యులు. ఫలము లొసంగినను, ఒసంగకున్నను, ఒంకరగా యున్నను, ఎట్లున్నను తోటలోని చెట్లన్నియు, దాని యజమానునకు ప్రీతి పాత్రమైనవియే. అటులనే ఏ దేశస్థులైనను, ఏ జాతివారైనను సర్వసృష్టికర్తయగు దైవమునకు సమానులే. దివ్యప్రేమామృతమును సమానముగా వర్షింపజేయును. దైవము తన కృపావీక్షణములచే సర్వుల నొకేవిధమున వీక్షించుచుండును. క్రూరులకు, దుష్టాత్ములకు కూడ ముక్తి ఎన్నడు లభించునాయని నిరీక్షించుచుండును. "నేను మిమ్ము ప్రేమించునటుల, మీ రొండొరులు ప్రేమించుకొనుడు" ఇదియే దైవవాక్కు. నేడు ప్రపంచము ద్వేషము, భయము, అనుమానము, అపనమ్మకము మొదలగువానిచే నిండియున్నది. పై సువర్ణాక్షరములన్నియు అడవినికాచిన వెన్నెలవంటివేకదా!

కాని నాకు ఆశతీరలేదు. అనంతమగు ప్రేమామృతమును ప్రతి వృక్షముపై వర్షింపవలెననియు ఆ "శాంత్యోద్యాన" మంతయు ప్రేమ వెల్లువలో తేలియాడిన మనకు విశ్వమునకు కూడ శాంతి లభించునని నాయాశ. సర్వజ్ఞుడు, కరుణాస్వరూపియగు దైవము మనలనందరను అనంతశక్తి మయులగునట్లాశీర్వదించుగాక! ఈ నానాత్వములో ఏకత్వమును గాంచుచు, నానాజాతి మధ్యస్థమునందు శాంతి, సామరస్యములను పెంపొందింపజేయవలెను. ఇదియే విశ్వశాంతి మార్గము. మానవాళినంతయు ప్రేమించు వారి ప్రార్ధన ఇదియే కావలెను.

లోకాస్సమస్తా సుఖినోభవంతు

ఓం. ఓం. ఓం.

(శాంతి జూన్, జూలై 1975)

## 30. శాంతి పాఠకులకు ప్రేమలేఖ

భక్తి, ప్రేమస్వరూపులైన ఆశ్రమ భక్తులారా!

ప్రియమైన శాంతిపాఠకులారా! సదా శాంతి.

శాంతి మన జన్మహక్కు గాన నిరంతరము మనోవాక్కాయములలో నిత్య శాంతినే అనుభవించుటకు ప్రయత్నమైనా జేయుదుముగాక!

ఈమధ్య మిమ్ము ముఖ్యముగా శాంతి పాఠకులను అశ్రద్దజేయుచున్నట్లు అంతగా మీ వృద్ధినికోరకుండ మీకు తోడ్పడజాలకుంటినని నేనే చింతించుచుంటిని. అదియుగాక ఇంగ్లీషు PEACE పత్రికకే తరచు నా భావనలు వ్యాసములు వ్రాయుట జరుగుచున్నది.

ప్రేమయే దైవము. ప్రేమయున్న చోటనే దైవముండును. ప్రేమలేని హృదయము స్మశానమని జెప్పుచు, వినుచు ఆ దైవప్రేమను మన దినచర్యలో వ్యక్తపరచ జాలకుండుట విచారము. నాకు మీయందు ప్రేమయున్నచో ఆ ప్రేమను ఆచరణలో జూపించుచుంటినా అని నా అంతరాత్మయే నన్ను పరీక్షించుచున్నది దీపము వుండగా మేల్కొనవలెను. శరీర జ్ఞప్తినుండి ఆత్మ జ్ఞప్తికి మేల్కొనవలెను. నేను మేల్కొలపవలెను. మీరు మేల్కొనవలెను. దీపము ఆరిపోయిన తర్వాతను, అనగా ప్రాణము పోయిన తర్వాతను నేనేమి జేయగలను. మీరేమి జేయగలరు?

నేడే మనది

రేపు మనది కాదు

అని అందరకు తెలుసును. అయినను రోజులు, వారములు. నెలలు వ్యర్థమైన మాటలతో పనికిరాని ఆలోచనలతో స్వార్థపుపనులతో అమూల్యమైన కాలమును వ్యర్థబుచ్చుట జరుగుచున్నది.

మూడు చిన్న మహామంత్రములను శాంతి ఆశ్రమ వాసులందరూ నిరంతరము స్మరించుచుందురు. సత్సంగములో స్మరించెదరు. రోగనివారణ కేంద్రములో, రోగుల శాంతిని, లోకశాంతిని కోరుచు నిరంతరము ఆశ్రమ వాసులందరూ స్మరించుచుందురు. ఆశ్రమంకు వచ్చిన భక్తులు అతిధులు అందరిచే ఈ చిన్న మంత్రములను స్మరింప జేయుచుందురు. మీ అందరినీ గూడ స్మరింపమని కోరుచు వాటిని యిచ్చుట వ్రాయుచుంటిని.

హరేరామ హరేరామ రామరామ హరేహరే

హరేకృష్ణ హరేకృష్ణ కృష్ణకృష్ణ హరేహరే

ఈ మంత్రము బ్రహ్మవలన నారదునకుపదేశింపబడినది. ఈ కలియుగమున దీనిని ఎవరైనను దీక్షతో పఠించినయెడల మోక్షమును బడయగలరని జెప్పబడినది. కావున మీరు సదా దీనిని పఠింపుచు తరింపగోరెదము.

ఓం శ్రీరామ జయరామ జయ జయరామ రామ ఓం !

ఓం జయ జయ రామకృష్ణ హరి ఓం !

ఈ రెండు మంత్రములను నిరంతరము స్మరించుచూ మీ గృహములను స్వర్గధామములుగా జేసుకొనుడు.

శ్రీ మహాత్మాగాంధీజీ! తాను ఆహారము లేకుండ వుండగలను గాని ప్రార్థన లేకుండా జీవించజాలనని నుడివి యుండిరి.

మనలో చాలమంది, నూటికి 90 మంది ప్రార్థన లేకుండగనే జీవించుచుండిరి. తిండి మనకు ముఖ్యము. తిండి లేకుండ ఒక్కరోజుయైనా జీవించజాలము. ప్రార్థన లేకుండ సంవత్సరములు జీవించుచుంటిమి? ఇది మాయయొక్క ప్రభావము. విజ్ఞులను సహితము తిండికి నామరూపములకు బానిసలుగా జేయును.

మరి ఒక మహనీయుడు ప్రార్థన యెచ్చట వున్నదో అదియే స్వర్గమని, ప్రార్థనలేని గృహములు నరకమని నుడివెను.

ఆశ్రమ భక్తులారా! స్వీయపరీక్షచే మీ దినచర్యను మీజీవితములను పరీక్ష జేసుకొని మీ గృహములను స్వర్గతుల్యముగా యున్నవా? లేక దైవ ప్రార్థనలు లేకుండ నరకములుగా యున్నవో మీరే జూచుకొని నరకములను స్వర్గములుగా జేసుకొని మీ బంధు స్నేహితులచే

మీ పిల్లల అందరిచే యీపైన వ్రాయబడిన చిన్న ప్రార్ధనలను మీరందరూ జేయుచు దీపం వుండగనే తరించెదరుగాక!

నిరంతరము మీ వృద్ధిని కోరుచున్న నేను (అనగా ఓంకారము) ఇంకేమి యీ ఖండమైన మాటలతో వ్రాయగలను? ఒలికిపోయిన పాలకై విచారించిన లాభముం డదుగదా! అది కాలయాపనయేగాని యిప్పటినుండియైన మన గాఢమైన నిద్రనుండి మేల్కొని ప్రతీ క్షణమును సద్వినియోగము జేయుచు యింకను విలువైన పాలను అనగా కాలమును మాటలతో వ్యర్థము జేయకుండ, మనము తరించి, మనమీద ఆధారపడియున్న మన స్వంతమైన వారందరనూ ముఖ్యముగా అమాయకులైన మన బిడ్డలను అధోగతి పాలవ్వనీయకుండ, దైవమును జేరెడిలాగున నేటి నుండియు తోడ్పడుచు, వారిని ప్రహ్లాదుని వలెను, మీరా, శారదాలవలె వృద్ధిజేయుదము గాక! ఇది వ్రాయుచుండ ప్రహ్లాదుని పద్యము పానీయంబులు ద్రావుచున్ అనెడి పద్యము జ్ఞప్తికి వచ్చుచున్నది. గాన దానిని యిచ్చుట వ్రాయనీయుడు.

శా॥ పానీయంబులు ద్రావుచున్ గుడుచుచున్, భాషింపుచున్ హాస
లీలా నిద్రాదులు సేయుచున్ దిరుగుచున్, లక్షించుచున్
సంతత శ్రీ నారాయణ పాదపద్మయుగళీ ధ్యానామృతా స్వాద
సంధానుండై మరచెన్ సురారి సుతఁడే తద్విశ్వమున్ భూవరా!

ఈ మంత్రములతో పాటు యీ పై పద్యమునుగూడ కంఠస్థముగా జేసుకొని, దైవపరితాపనతో నిండి మీరంతా తరించెదరుగాక!

లోకాస్సమస్తా స్సుఖినోభవంతు.

## -: అర్పణ :-

**శాంతి పాఠకులగు సోదర, సోదరీమణులందరకూ వారి ఆయురారోగ్యములను కోరుచు ప్రేమపూర్వకమైన అర్పణ.**

(శాంతి మార్చి, ఏప్రిల్ 1976)

# 31. శాంతి ప్రార్ధన

(సూక్ష్మంలో మోక్షం)

అంతా కృష్ణమయం, బీజగమంతా కృష్ణమయం
కండ్లుమూసినా కృష్ణమయం, కండ్లు తెరచినా కృష్ణమయం

అంతటా ఆ కృష్ణుడే, పక్షిలోను, జంతువులోను, చిన్నమొక్కలోను, పెద్దమొక్కలోను, పసివానిలోను, పెద్దవానిలోను, ప్రతీ మానవునిలోను ఈ భూ ప్రపంచమంతటా నిండి యున్నది ఆ పరమాత్మయే–శ్రీకృష్ణుడే–

జీవించుటయే ఎంత అదృష్టము! ప్రతి క్షణములో దైవసన్నిధిని అనుభవించుచు జీవించుట ఎంత గొప్ప వర్ణనాతీతమైన అదృష్టము.

అంతా కృష్ణమయం

ఆంతర్యమున, బాహ్యమున, లోపల, వెలుపల, కండ్లుమూసిన, కండ్లుతెరచినా, దైవమునే సర్వములో గాంచుట ఎంత అదృష్టము.

అంతయు దైవమే, అంతయు కృష్ణుడే! ఇప్పుడు వ్రాయుచున్నది కృష్ణుడు, జూచు చున్నది కృష్ణుడు, ఆలోచించుచున్నది కృష్ణుడు, ఇప్పుడు ఇచ్చట యున్నది ఒక్కటే. దీనిని విజ్ఞులు వివిధ నామములతో కృష్ణుడని, క్రీస్తు అని, బుద్ధుడని, అల్లా అని, తేజస్సు అని, శాంతి అని, ప్రేమ అని, నిశ్శబ్దమని ఎవరికి ప్రీతి అయినట్లు వారు వివిధ నామములతో పిలచుచుందురు.

నామములతో పిలిచినంత మాత్రమున, ఎన్ని నామములతో పిలిచినను అది మారదు. అసత్ పదార్ధము మార్పు లేనిది. అసత్ పదార్ధమునే కొందరు సచ్చిదానంద స్వరూపమని పిలిచెదరు.

ఆనిత్యమైన, సత్యమైన పరిపూర్ణమైన దైవమును సత్తు,చిత్తు, ఆనందమని జ్ఞానులు భావించుచు ఆనందించుచుందురు.

మనకు ఇప్పుడు కావలసినది, పరోక్షజ్ఞానముగాదు, అనుభవమైన అపరోక్షజ్ఞానము. దైవమును వర్ణించుటగాదు, దైవమును అనుభవించుట. దైవము దైవమని నోటితో అరచిన ఫలితము లేదు. తేనె, తేనె అని అరచినంత మాత్రమున తేనె రుచిదొరకదుకదా? ఒక

గరిటెడు తేనెను నోటిలో వేసుకొనినప్పుడే తేనె రుచి తెలియగలదు.

అటులనే దైవమును, దైవసన్నిధిని మనలో ప్రతి అణువులో గుర్తించినప్పుడు, అనుభవించినప్పుడే దైవానుభవము గల్గును.

ఉన్నదొక్కటే, దైవముతప్ప, అన్యమైనది యెప్పుడును, ఎచ్చటను లేదు. ఆసత్ పదార్థమును, ఆనిత్యమైన దైవమును, మనము వర్ణించుటగాదు. అనుభవించుట కావలెను.

ఓ దైవమా! నీ వెచ్చటయుంటివి?
నీవు సర్వత్రా నిండియుంటివి.
నీవు నేను పిలిచినంత మాత్రమున
వచ్చెడిలాగున అంత దగ్గరగా యుంటివి.
నీ భక్తులు కొందరు నీవు పాదముల
కంటెను, చేతులకంటెను దగ్గరగా
యుంటివనిరి.
నీవు హృదయమునకు హృదయముగా,
శ్వాసకు శ్వాసగా యుంటివని
జ్ఞానులు చెప్పిరి.

మాకు కావలసినది నిన్ను, నీ దివ్య తేజస్సును ఎప్పుడోగాక, ఇప్పుడే, ఇచ్చటనే అనుభవించుటయే! ఇంక తడవేల? దైవమును అనుభవించుటకు ఇదియే సమయము. ఇదియే తావు.

శ్వాసకు శ్వాసగా, మాలో వెలుగుచున్న
ఓ దైవమా! అంతర్యామి, నీ దివ్య తేజ
స్సులో ఇప్పుడే ఇచ్చటనే నీలో విలీనమవ్వనిమ్ము.

శాంతో యమాత్మా!
శాంతియే ఆత్మ

నీవు నిశబ్దస్వరూపుడవు!
నిశ్శబ్దో బ్రహ్మ

శబ్దములోను, నిశ్శబ్దములోను నీవే! సర్వము నీవే! నీవు కానిదేమున్నది?

ఈ చిన్న శాంతి ప్రార్ధన, ఎంత చక్కగా, మనోహరముగా, హృదయరంజకముగా యుండి, అర్ధానిని స్మరించినంత మాత్రమున మమ్ము నీలో విలీనము జేయుచున్నది.

ఇక హెచ్చుమాటలేల. ఇక మాటలతో అమూల్యమైన కాలమును వ్యర్థము చేయుటకంటె, ఒక్కమారు శాంతి ప్రార్దన స్మరించి నీలో విలీనమయ్యెదముగాక!

ప్రియమైన శాంతి పాఠకులారా!
మీకు దైవము కావలెనా?
ఇప్పుడే కావలెనా?
ఇచ్చటనే కావలయునా?
సూక్ష్మములో మోక్షము

దైవము ఇప్పుడే ఇచ్చటనే మీకు కావలసిన ఒక్క తరి శాంతి ప్రార్ధనను హృదయపూర్వకముగా నూరుపాళ్ళు హృదయముతో స్మరించుచు నేడే తరించుడు.

లోకా స్సమస్తా స్సుఖినోభవంతు

హరి ఓం తత్ సత్ ఓం !

P.S. :- ప్రియమైన పాఠకులారా!

ఈ ప్రార్ధనను మీరు స్మరించుచు మీరు ఒక్కరే తరించుటతో తృప్తిపడక సోదరీ సోదర స్వరూపులైన లోకములో దైవబిడ్డలందరి చేతను శాంతి ప్రార్ధన స్మరింపజేయుచు లోక శాంతికి తోడ్పడగోరెదము. సర్వజనులకు శాంతి చేకూరుగాక!

హరి ఓమ్ తత్ సత్!

(శాంతి మే & జూన్ 1978)

# 32. శాంతిప్రార్థన - ప్రపంచ శాంతి

## భవిష్యత్కర్తవ్యము – నా దక్షిణాపథయాత్ర

నా దక్షిణాపథ తీర్థయాత్ర మనము మున్ముందుచేయవలసియున్న ఘనతరమైన కార్య బాధ్యతను గూర్చి నాకు కనువిప్పు గల్గించినది. నాకు తెలియని కొన్ని యజ్ఞాత శక్తులబలాత్కారముచే అనిష్టము తోడనే "తోటపల్లి" ఆశ్రమమును వదలి ప్రయాణమైతిని. అయిన నీ ప్రయాణములో నాయా ప్రదేశములలో నేను గొనిపోవబడిన తావులలో ప్రతిఫలాపేక్ష రవంతయు లేకుండగనే భగవత్సేవ చేయుటకై యత్నించితిని. నేనెప్పుడును గోరునట్టి ప్రతిఫల మనుఁడు బహూకృతియనుఁడు, లాభమనుఁడు–అయ్యది నా భక్తులు నా సందేశమును గ్రహించుటయే; "శాంతి ప్రార్థనను పునశ్చరణ మొనరించుచు అప్పుడే–తత్ప్రదేశముననే భగవత్సాన్నిధ్యమును ననుభవించుటయే".

"నిన్నటి మొగ్గలు, నేఁడు వికసించి మనోహరములై, సువాసనలను దగ్గరగా దూరముగా వ్యాప్తము చేయు"నను నట్టి పలుకులలో నెంతటి సత్యముట్టిపడుచున్నది! తద్విధముగనే నేడాచరింపఁబడు కార్యములు, సాధింపబడు కార్యసిద్ధులు ఇంతకుఁబూర్వము మన మూహించిన భావములకు, తలంచిన యుద్దేశములకు ఫలరూపములు గదా! నేనాచరించిన నాయారేండ్ల నిశ్శబ్ద తపస్సులో (మౌనజపములో) నాకీ దిగువ నుదహరింపఁబడిన భావములు తరచుగా నాకు కలుగుచుండెడివి–

"ఒకవేళ నీ వెప్పుడైన నీ నిశ్శబ్ద తపస్సునుండి విరమించినచో నీ వాక్కుచే నీ వేమి చేయదలంచుచుంటివి?" పై ప్రశ్నకు సమాధానము:–

"శాంతి ప్రార్థన" ను నేనొక హృదయమునుండి వేఱొక హృదయమునకు, ఒక కుటీరమునుండి వేఱొక కుటీరమునకు, ఒక గ్రామము నుండి వేఱొక గ్రామమునకు, ఒక నగరమునుండి వేఱొక నగరమునకు, ఒక జాతినుండి వేఱొక జాతికి, ఒక దేశమునుండి వేఱొక దేశమునకు–కాదు కాదు–తూర్పు నుండి పడమటి దిశవఱకు ప్రపంచమునందలి యన్ని దేశములకు, ప్రంచములోని యన్ని దేశముల ప్రజలు, అన్ని జాతుల ప్రజలు ఈ శాంతి ప్రార్థనను నైక్యకంఠమున వునశ్చరణము చేయునట్లొనరించుచు, ప్రసరింపఁజేయ తీవ్రముగ నభిలషించుదును."

నేనేనాడో కన్నకలలకు ఫలితముగా యీ నా జీవితము కలుగగా నేనెంతయో ధన్యుఁడను. నా జీవితము ధన్యము. సభలలో, భక్తులు నిమీలిత నేత్రులై, ఆనందాశ్రు వులు తొణక భగవత్సాన్నిధ్యము ననుభవించు నానందమున మునిగి, మానవ నిర్మితములైన జాతి మత వర్ణ దేశ భేదముల మరచి, యైక్య కంఠమున శాంతి ప్రార్థనను పఠింపచూచి

వినఁగల్గిన యా యుత్తమ ఘటికలకాలము నిజముగా ధన్యవంతమైన ఆనంద క్షణములుగా నాకు ననుభూతములు. మా సభారంగములో సభ్యులలో బౌద్ధులు కలరు; క్రైస్తవులుండిరి; మహమ్మదీయులుండిరి, నీచోన్నత జీవిత శ్రేణులకు సంబంధించిన హిందువులుండిరి; ఇందరున్నను ఆ క్షణములో, శాంతిప్రార్ధన సలుపు నిముషములలో మత జాతి వర్ణములు వారిపై నిడిన వివిధ బేధభావ సంకలితముద్రలు సంపూర్ణముగా విస్మరింపఁబడినవి. శాంతిప్రార్ధన పునశ్చరణము చేయబడు ఘటికలలో సభ్యులెల్లరు–అబేధభావమున నొక పరమాత్మ బిడ్డలు, (సర్వసామాన్య పితయైన యొకే); అదృశ్యమానుఁడైన భగవంతుని ప్రతిబింబములు; దివ్యజ్యోతియొక్క విస్ఫులింగకణములు. ఇట్టి సద్బోధాసామరస్య కలితానందమనః పరిస్థితిలోనే "ఈ ప్రపంచమంతయు నా కుటుంబము. విశ్వమందలి ప్రజలందరు నా సోదరులు, చెల్లెంద్రు. వారికి సహకరించుటయు పరిచర్య చేయుటయే నిజమైన మతము" అని ఆనందముగ నెవ్వడైన గానము చేయఁగలఁడు.

ఆశ్రమమును ననిష్టముతోనే విడిచి వెళ్ళినను, స్వధర్మమును శక్తివంచన లేక యాచరించి, ఆనందముతోడను, సంతృప్తితోడను నిండిన హృదయముతో నాశ్రమమును మరల ప్రవేశించితిని.

"బిడ్డా! చక్కగా నాచరించితివి!
మిక్కిలి సంతోషించితిని"

అని సర్వజగత్పితయైన యాపరమాత్మ నా చెవులలో గుసగుసలాడినట్లనిపించుచున్నది. గతికపోచయందుగూడ నా భగవంతుని కాననగును. ఆ జగత్పితయే ప్రతిపదముయందు నాతోనుండి, అభిలషతచే నువ్విళ్ళూరు తన బిడ్డలకై సహాయమొనరింప, సేవయొనరింప నన్ను ప్రబోధించుచు దీసికొనిపోయియుండ, ఇంతకుమించి యన్యథా యెట్లు కాగలదు? గతికపోచకూడ నా భగవంతుని ఆజ్ఞలేక కదలాడ జాలనప్పుడు–ఈ శరీరమనుసాధనము ద్వారా (నిమిత్తము ద్వారా) యాతఁడే సహకరించెను; సేవచేయించెను. అందుచే నిందేదైన విజయముగాని, వైభవముగాని యుండినచో నది యంతయు నా పరమాత్మదే! ముప్పది యైదు దినముల విచ్ఛిన్నముగ దీర్ఘయాత్ర జరిపి ఆశ్రమోన్ముఖుఁడనై యుండు తరి. నొక సభాసమావేశములో

"ఈ పవిత్రమైన దక్షిణాపథపు తిరునాళ్ళలో అత్యధికమైన
లాభమును పొందిన ఆత్మయేది?"

అను ప్రశ్న నాకు స్ఫురించినది.

ఎవరియంతటవారే–ఈ తీర్థాటనములో నెడబాటు లేక అన్ని రోజులు పాల్గొనిన

యట్టివాడే యధికలాభమును, సహాయమును పొందినట్టివాడని–తలపోయసాగిరి. హృదయానంద మాపజాలనిదై ముఖము తనంత తాను ప్రవచించుచు అప్రయత్నముగ నేను "అందఱికంటె అధిక తరావేశమును, లాభమును పొందినట్టివాడు ఓంకార స్వామియే' యని గట్టిగ పల్కితిని. ఈ పలుకు లాశ్చర్యమును గలిగించినవి. కాని ఇదియే నగ్నసత్యము. ఏలయన–"నీవెంత యిచ్చి యుందువో యంత నీవు గ్రహింతువు" నిజముగా ఇచ్చినట్టివాఁడే భవిష్యత్తున లాభము నొందినవాడును నగుచున్నాడు. అన్ని జీవితావస్థలలో, జిజ్ఞాసువులయిన భగవత్పుత్రులకు సేవచేయు భాగ్యము, ఉపకరించు భాగ్యము, భగవంతుఁడు నాకొసంగిన దానికి నేను మిక్కిలిగా సంతోషించుచున్నాను.

స్వానుభవపూర్వకమైన నా ప్రయోగాత్మక జీవితమునుండియే యెప్పుడును నుదహరింప నాకు కుతూహలము. నా పొరుగింటివాని ఆవులెన్నియో యెట్టివో గణించి చెప్పవలయునన్న నాకెంతయో దుఃఖము కలుగును. అనఁగా ఇతరులన నుభవపూర్వ కముగా నెఱింగిన విషయములను వాకొనుట నాకిష్టము లేదని మనవి చేయుచున్నాను. ఇతరుల యనుభవములను పౌనఃపుణ్యముగా చర్వితచర్వణ మొనరించుట నిర్మాంస శల్యమును పదేపదే కొరుకుటవంటిది. వారి యనుభవములెంతటివైనను కావచ్చును. మన యావు ఒక అరసోలడే పాలిచ్చినదనుఁడు. ఆయావుపాలే త్రాఁగుట మంచిదిగాని పొరుగువాని యావు పాలకై తాపత్రయము పడుట సమంజసముకాదు. కానని వాడెన్నడును కాననివారల గమ్యస్థానమునకు చేర్చలేనట్టులు, ఇతరుల యనుభవ క్షీరముల నదేపనిగా త్రాగుట కలవడిన వ్యక్తికి నోరు మెదల్చుటకైన నధికారము లేదని నా యభిప్రాయము. భవతుః ఆత్మాను భవమునుండి బ్రహ్మాండభరితమైన గొప్ప యుపన్యాసముల నీయలేక పోవచ్చును; అయినను ఆ వచ్చెడు నొకటి రెండు ప్రేమ పలుకులైనను విశ్వమంతయును పరివ్యాపించి వాని ఫలితము వానికుండును. సత్యాన్వేషణ పరులకు వానివలన నెంతయైన లాభ ముండును.

"'శాంతి ప్రార్థన" తజ్జపసమయములయందు, ప్రపంచమందలి సమస్త రూపములను, నామములను విస్మరింపఁజేసి భగవత్సాన్నిధ్యము ననుభవించుటకు నాకు మిక్కిలి సహకరించినది. ఇంకను సహకరించుచున్నది. ఇది ప్రతివ్యక్తిని రేపుకాదు నిన్నకాదు, మరొక్క సమయమునఁగాదు–తత్క్షణమే, తత్ప్రదేశముననే భగవత్సాన్నిధ్యము ననుభవింపఁజేయు నమోఘమైన ప్రార్థన. ఏదైన పిండివంట రుచి, దానిని గూర్చి యెంత వర్ణించినను, కలుగదు. ఒక్కసారి రుచి చూచిననే తెలియగలదు కదా! అట్లే ఈ శాంతి ప్రార్థనను ఒకటి రెండు మారులు మీరు జపింపుఁడు; దాని యమోఘము అద్భుతమునైన ఫలితము మీరిప్పుడే యనుభవించెదరు. ఆయది మీ జీవితము ఆనందానందమును,

ప్రేమను, ఉత్సాహ వికాసమును నింపును. స్వయం ప్రకాశమైన యా విశ్వజ్యోతిచే మీరు నిండి యుండిరి. పరివృతులై యుండిరి. శాంతిప్రార్థనను చదువునప్పుడు మీ యీ శరీరముల యందు చొచ్చుకొనిపోవు భగవత్సాన్నిధ్యముచే నిండి పరివ్యాప్తమై యుండును.

ఓ ప్రియమిత్రమా! నీకింతకంటె నభిలషనీయ మేమియున్నది? నీవు భగవంతునికొఱకు పరమ బాధాపీడితుఁడవైయున్నచో అతడిక్కడే యిప్పుడేయున్నాఁడు. నీవు సర్వప్రబోధ జనకమైన, శాంతినే రుచి చూడకోరుచుంటివా. ఆ శాంతి నీయంతరాత్మయందే నీచేఁదెలిసికొనఁబడగోరి నిహితముగానున్నది–ఇచ్చటనే ఇప్పుడే! త్రికరణశుద్ధిగా బుద్ధ్యాత్మ హృదయ బలములతో నీ శాంతి ప్రార్థనయొక్క పునశ్చరణము నీయందే యణగిమణగియున్న యా దివ్యజ్యోతిని, తద్విభూతి సహితముగా వ్యక్తముచేయును. నిరూపించును. “ఈ శాంతి ప్రార్ధన యందేమియును గ్రొత్తలేదు. ఇదియంతయు కఠోపనిషత్తులోనిది. లేదా మరో యుపనిషత్తులోనిది”. అని కొందరు పండితులు లేదా వేదాంతులు చెప్పవచ్చును. ఉపనిషత్తులలో నిదియున్నదని నేను పండితులతో నంగీకరించెదను. అంతేకాదు ఈ ప్రార్థన ప్రతీతర మత గ్రంథమునందుండనిండు. పోయిన దేమి? మఱి యిదో ఇయ్యది ఉపనిషత్తులనుండియే గ్రహింపఁబడినది–ఉపనిషత్తులనఁగా దైనందిన చర్యకయిన శ్రుతులు. అనుభవమునకైన స్మృతులు–అంతకంటె మఱేమి! శ్రుతులనుండి జీవితహృదయ గుహాంతరమునకుఁ దీసికొని రాఁబడినది. అంతియే యిందలి భేదమంతయుననని గ్రహింపవలయును.

“మన మందఱము వట్టి మాంసరహితములై, శుష్కములైన యెముకల నమలుచు సంతృప్తిపడవలదు, కాని, మన మందరము మన యనుభవమను సాధ్యమైన మాంసముల ఖండమును రుచిచూచెదముగాక”. అని పునశ్చరణ చేయుచు నాధృఢమైన కంఠము నెత్తి మరల మరల పలుకుచున్నాను.

వేదములలోను, బైబిలు గ్రంథములలోను, పిఠకములలోను, ఖురాను నందేమేమి యున్నదో యదియంతయు నా గ్రంథముల నుండి యావిష్కరింపఁబడవలయును. మన దైనందిన జీవితానుభవములో సువ్యక్తమగుటకై బుద్ధ్యాత్మ హృదయములయందును ప్రవేశమొంద ననుమతియొసంగవలయును. అప్పుడప్పుడుగాక నిరంతరము భగవత్సాన్నిధ్యమును ననుభూత మొనరించుకొనుటయే భగవంతు నెఱుంగుటకు లేదా భగవద్విభవ శైలశిఖరములనధిరోహించుటకు సూటిగా తీసికొని పోవుసులభమైన మార్గము. శాంతిప్రార్థనూరకే జపించుటయే భగవత్సాన్నిధ్యమును నిక్కడనే యిప్పుడే జ్ఞాతముగా ననుభవింపఁజేయును. ఇప్పటికిని నిదియే నా వ్యక్తిగతమైన యనుభవము. మీరందరొకే పరమాత్మ

యొక్క బిడ్డలగుట నా యనుభూతివంటిదే మీయనుభూతికూడ కావలయునని నేను నభిలషించుచున్నాను.

ఈ నా పవిత్ర తీర్ధయాత్రలో భిన్నమతస్థులై యుండి భగవదన్వేషణమునకై యత్నించు పలువురు భక్తజనుల హృదయములలో ప్రవేశింపగల భాగ్యము నాకబ్బినది. (అనఁగా నట్టి తపస్వులను కలిసికొంటిని) కాని వారితోడ యీ నా హృదయమును విచారభారవినమ్ర మొనరించినది. ఏలయందురా! వారి గృహములు ఆనందము, ఆరోగ్యము, శాంతి సామరస్యములతోఁ దొలకాడియుండుటకుఁ బదులు కొందఱి గృహములలో విచారము, రోగము, దుఃఖము గూడుకట్టుకొని వసించుచున్నవి. ఎక్కడో ఒకటి రెండు అదృష్టవంతములైన గృహములలోగాక, ఇతర గృహములయందు బండి గుఱ్ఱమునకు ముందుచంఁబడినది. (అనగా పరిస్థితులు విపరీతముగా నున్నవని యర్ధము. గుఱ్ఱము ముందుండవలెను; బండి వెనుకనుండవలయును. అప్పుడే ఈ గుఱ్ఱము మా బండిని ఎంత భారము వహించియున్నను లాగుకొని పోవఁగలుగును) ఇల్లాలు జీవిత శకటమును హరిద్వారమునకో, హిమాలయము వైపునకో లాగుకొనిపోవఁబ్రయత్నించును; ఇక ఇంటి యజమానియో రామేశ్వరమునకో లేదా కన్యాకుమార్యగ్రము వైపునకో జీవిత శకటమును త్రోసికొని పోవనెంచును. అయ్యో! ఒకే జీవితంలో నెంతటి విరోధ భావనములు; ఎంతటి విపరీత పరిస్థితులు!

నీవు తిరుపతికో లేక కైలాసమునకో యేగదలఁచినచో నీ జీవిత శకటమునకు కట్టిన రెండు ఎద్దులు లేక రెండు గుఱ్ఱములచేత శకటమును నొకేదిక్కునకు లాగికొని పోవనారంభించుము. అప్పుడే నీవేదో యొక కొంతగా పురోగమింపగలుగుదువు. సౌఖ్యముగా నుందువు, కానిచో నీ గృహము భేదాభిప్రాయములతోను, అనుమానములతోను, పూర్వాపర విరుద్ధములతోను-చిన్న విషయములయందును పెద్ద విషయములయందును నొకేవిధముగా నిండి యొక యధార్థనరకముగా నగును. వ్యథాభరభగ్నమైన హృదయముతో కాననివాడు కానని వారికి మార్గదర్శకుఁడైనట్లు, అందఱును అవిజ్ఞానాఖాతమున బడుచుండుట, తల్లి దండ్రుల తమ కుమారులయొక్క ఆధ్యాత్మిక విద్యాప్రబోధమును నిర్లక్ష్యము చేసి ఎల్లప్పుడు మారుచుండు నీ యస్థిర నామరూపశోభితమయిన యీ ప్రపంచమున నామగౌరవముల కొఱకై ప్రాకులాడుటయో, ఏదియో తాత్కాలిక ప్రయోజనాభిపరులై సంచరించుటయో, బాహ్యవిద్యావిధానమునకై బాధపడుచుండుట నేను గమనించితిని.

తన గృహమును స్వర్గధామమో, నరకధామమో చేసికొనుట ఎల్లను ఆయా వ్యక్తిమీఁద మాత్ర మాధారపడియున్న విషయము. ఆతఁడే యాతనియదృష్ట నిర్మాత. జనులకెల్లరుకును తమ గృహములను స్వర్గధామములుగా మార్చుకొనగలుగ సహాయపడుట పూర్వము కంటె

నిప్పుడు నా హృదయాభిలాషము; అవనీతలస్వర్గధామములుగా తమ గృహములను మార్చునట్లుగా వారికి సహాయపడుట. వారినే వారికి సహాయపడునట్లొనరించుట నేను కోరుదును. కోయంబత్తూరు నుండి యొక భక్త పరమాణువు వద్దనుండి వచ్చిన యీ యుత్తరము నా దక్షిణయాత్రా ఫలితమేమో యనిపించునట్టిది– నన్నానంద నిమగ్నుని చేయుచున్నది. ఆ యుత్తరమునుండి యథాతథముగా గొంత భాగమిందు దాహరించితిని, ఏలయన శాంతి పత్రికా పఠితలకు–తమ గృహములను శాంతిసౌధ స్వర్గసీమలుగా నొనరింప, శాంతి ప్రేమల హృదయముల నెలకొల్పి, అభిలషింపుడని ప్రబోధింపఁగోరి అంతియేకాక ఎందు ప్రేముండునో అందే స్వర్గరాజ్యము లేదా భగవంతుఁడుండునన్నట్టిది మీ రెఱింగినదియే కదా!

"ప్రియమైన ఓ స్వామీ!

మీ యాశ్రమ భక్తులతో మా సామాన్య గృహములకు మీరాక మాకొక ఘనమైన యాశీర్వాదము. "స్వార్ధరహితముగ నెచ్చోట రెండు ఆత్మలు పరస్పరము ప్రేమించు కొనునో–అందే స్వర్గమున్నది" అని మా నివాసములకువచ్చినతఱి మీరొసంగిన సందేశము మేమెన్నడును మరువరానట్టిది. ఒండొరులను స్వార్ధరహితముగా ప్రేమించి మీరుదాహరించినట్టి స్వర్గమును నిర్మించుటకే మేము సర్వాత్మనా ప్రయత్నించెదము. స్వామీజీ మా గృహములలో శాంతిని శ్వాసింపఁజేసెను; మా గృహముల శాంతితో నింపెను; మీ యొక్క రాకకు మీ యమూల్య శాంతిసందేశమునకు నేను, సోదరి సుబ్బలక్ష్మియు ఎప్పుడును కృతజ్ఞులముగా నుందుము. మేము కడు హితముగా భగవంతుని సాన్నిధ్యమును నను భవించినప్పుడును, ఇతర సన్నిహితులచే భగత్సాన్నిధ్యమునను భవింపఁబడచేసినప్పుడును స్వామీజీ సంతోషించునని మే మెఱుంగుదుము. పని తొందర వేళలయైనను కార్యమధ్య మందైనను నెన్నడైన కొన్నిక్షణములు తీరిక కలిగినచో శాంతి ప్రార్ధనను జపించి భగవంతుని సాన్నిధ్యమును ననుభవించుటకు ప్రయత్నించి పొందుదుమని మీకును మేము వాగ్దాన మిచ్చుచున్నాము. ఈ ప్రయత్నములో భగవంతుని సాన్నిధ్యమును ననుభవించుటకు మీరు మీ సంకల్పముల మాపై ప్రసరించి సహాయము చేయవలయునని కోరుచున్నాము. అందుచే ఒకవేళ ఐహిక వ్యాపారనిమగ్నతచే మేమా పరమాత్మను మరచిపోయినచో, మీ సంకల్పబలము మమ్ము మేల్కొల్పి, నిద్రలేపి,మాలో నివసించు నా పరమాత్మ సాన్నిధ్యమును గూర్చి మాకు వ్యక్తము చేయగలదు. స్వామీజీ ఆశీర్వచనములు సంపూర్ణముగా మాకు కలవని మాకు ధృఢవిశ్వాసమే. మీరు మా యింట నడుగిడిన దినము మొదలుకొని మాయింటి కేదియో యొక మార్పువచ్చినది. ఈ మార్పు చిరస్థాయిగా మా యింట వెలయవలయునని మేము కోరుచున్నాము.

నిజముగా ఓ స్వామీజీ! మా యిండ్లలో మీ తక్కువకాలపుటునికి మాకమితానందకర సన్నివేశ కాలమైనది; ఈ తరుణమును మా కొసంగిన దానికి భగవంతునికి మేమెంతయో కృతజ్ఞులము. మేము మీ యాశ్రమమునకు వచ్చి, మీ సన్నిధానమున ననుభవింపనగు నా యానందమును నా శాంతిమయ వాతావరణములో నానందింపవలయునని యాతురతతోనుంటిమి. అచిరకాలములో భవదాశీః ప్రభావమువలన నా యవకాశము కలుగగలదని యాశించుచున్నాము."

ఈ దినములలో దండ్రులను బిడ్డలయందును, బిడ్డలను తండ్రుల యందును భగవంతుని దర్శింపుడని కోరుచునే యున్నాను. అట్లే భర్తలు భార్యలయందు భగవత్స్వ రూపమును దర్శింప ప్రయత్నింపవలయును. మన కండ్లతో మన ముందు చూచు మానవునే మనము ప్రేమింపలేనప్పుడు ఈ భౌతిక చక్షువులచేఁ జూడఁబడుటకు వీలుగాని భగవంతుని మనమెట్లు ప్రేమింపగలము. "మానవుని ప్రేమించుటయే మాధవుని ప్రేమించుట."

నేనుపన్యసించితిని, శ్రోతలలో నొకవ్యక్తి తన స్నేహితులతో ఈ కలియుగమునందు భగవంతుని బడయుటకు, నింత ప్రయోగాత్మకమైనట్టిదియును, సులభమైనట్టిదియునునగు మార్గ మీపట్టణమున నుపదేశింపఁబడిన వానిలో నిది చాల గొప్పది. అనుభవపూర్వకమైనదిని చెప్పిన మాటలు వినినప్పుడింకొకసారి నాదక్షిణాపథ యాత్రలో నా కత్యంతానందావేశము కలిగినది.

ఇట్టిదే వేఱొక్క సన్నివేశము–ఒక ప్రసిద్ధకవి నా దగ్గరకు వచ్చి "ఓ స్వామీ! నిన్నటి రాత్రి యుపన్యాసములో మీరు చెప్పినట్లు నేనింటికరిగి నా భార్యలోను, నా బిడ్డలలోను భగవంతుని చూడగల్గితిని. మా యిల్లే యొక స్వర్గసీమయైనది. మేము చాల సంతోషిం చితిమి. మీకెంతయో కృతజ్ఞులము."

అని చెప్పినప్పుడును నాకత్యంతానందావేశము కలిగినది.

ఇక మన ముందున్న కార్యము :–

నిన్న మొన్నటి నా దక్షిణాపథ తీర్థాటనము వలన గలిగిన క్రొత్త యనుభవముల తోడను, సాక్షాజ్జీవదైవ స్వరూపములవలె దోచిన పలువురు భక్తులు, దేవతాత్ములు, భగవద న్వేషణపరులు, భగవద్దర్శననేచ్ఛామతులునైన వారితోడి పరిచయభాగ్యము కలుగుటవలన క్రొత్తగా గలిగిన ననుభవములతోడను ఈ బాహ్య ప్రపంచములో–దగ్గరను–దూరముగను గూడ నెంతయో చేయవలసిన పనియున్నదని నాకు తోచుచున్నది. ప్రాక్పశ్చిమ దేశములలో ప్రతి నగరమునందలి, ప్రతి కుగ్రామమునందలి గృహములను స్వర్గములుగా మార్చవల యుననినను, ప్రతి గృహమునందును శాంతిని స్థాపింపవలయునన్నను నెంతటి గొప్ప పనియున్నదో యూహింపుఁడు.

ఇది ఎంత పవిత్రమైన కార్యము! పవిత్రమేకాదు; ఎంత యున్నతమైనది. ఎంతగొప్పది, ఎంత పరిమితరహితమైనదీ కార్యము!! అట్లని భయపడరాదుగా! ఏమన చిన్న చీమలుచేరి ప్రాకుటవలన బండరాళ్ళపై బాటలేర్పడుచున్నవనియనుట మనమువినలేదా! ఈ నా యుత్సాహముతో, నాపై నేనేయారోపించుకొన్న బాధ్యతతో వర్ణ మత వివక్షతలేకయే ప్రతి సోదరుని,ప్రతి సోదరిని, ప్రతి గృహమును స్వర్గసీమగా మార్పతలపోయు నా యానంద స్వప్నము సఫలీకరింప సహాయము చేయుమనియు, దయచూపుమనియు, శ్రద్ధతో చేసాయమొనరింపుమనియు నేను విజ్ఞప్తి చేసికొనుచున్నాను. ఈ నా దక్షిణాపథతీర్థాటన జ్ఞాపకార్థముగా నా యీ శాంతి ప్రార్ధనను, తమిళము, మళయాళము, సంస్కృతము మొదలగు భాషలలోనికి ననువదించి చూచియానందింప వలెనని నా హృదయముబలాట పడుచున్నది. ఒకే ప్రదేశములో 2000 శాంతి ప్రార్ధన కరపత్రములు క్షణకాలములో నైపోయినవి.

ప్రతి వ్యక్తి తన హృదయమున ముందుగాను, తరువాత నితర హృదయమునందును శాంతిని స్థాపించుటయే యీ పవిత్ర కార్యారంభమునకు మార్గము. ఆ శాంతి కలిగించు మార్గము సులభమైన శాంతి ప్రార్ధన మూలముననే. ప్రార్ధించుము. కంఠస్థము చేయుము. ఒకసారిగాని రెండుసార్లుగాని లేక ఎన్నిమార్లు వీలైన నన్నిమార్లు ముందు వినబడునట్లుగా గట్టిగా చదువుము, తరువాత పెదవులతో చదువుము. తరువాత నీ మనస్సుననే నిశ్శబ్దముగా–కాంతులకు కాంతియైన యీ పరమాత్మానుభూతిలో నీవు నిమగ్నుడవై యానంద మనుభవించువఱకు నీ జపము నాచరింపుము. ఈ భగవద్దర్శన జీవితానంద కాంతి హృదయమునుండి హృదయమునకు, తరువాత క్రమేపి ప్రపంచమంతకును వ్యాప్తమగుగాక! ఒకేఒకసారి యీ యనంత విశ్వమును మన మేమాత్రము మార్చలేము. తుదకు మనయంతట మనమే శాంతిని హృదయముల స్థాపించుకొని మార్పును గలిపించుకొనవలయును.

మన హృదయములలో శాంతి ప్రేమలుండుగాక!

మన గృహములలో శాంతి ప్రేమలుండు గాక!

ఆశ్రమములయందు శాంతి ప్రేమలుండుగాక!

అన్ని జాతులయందును శాంతి ప్రేమలుండు గాక!

అన్ని దేశములయందును శాంతి ప్రేమలుండు గాక!

ప్రపంచమందంతటను శాంతి ప్రేమలుండు గాక!

ప్రపంచముయొక్క శాంతిపురోభివృద్ధులే మన శాంతి పురోభివృద్ధులు. మానవ క్షేమమే మన క్షేమము. అందఱికిని శాంతి కలుగుగాక!

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః ఓం తత్ సత్. (శాంతి అక్టోబరు 1986)

# 33. శివుడు - శివోహం

శివుడు–శివోహం ఒక్కటియా లేక రెండా? బేధభావనతో, శరీరజ్ఞప్తియున్నవారికి రెండే! ఇక అబేధ భావనతో, అద్వైత బుద్ధి గల్గినవారికి ఒక్కటియే! లక్ష్మీవిల్లాలో నేనుండెడి సువిశాలమైన గదిలో నా ముందుగా చక్కనైన శివుని పటము గలదు. ఆయనను తరచు నేను జూచుచుందును. ఆ శివుని జూచినప్పుడెల్లను పరవశత్వము గల్గుచుండును. ఆ పటములో శివుడు నిమీళిత నేత్రుడై ధ్యానము జేయుచుండును. తరుచు నా మనస్సుగూడ ఆ శివుని ధ్యానము జూచుచు నీవేమి జేయుచుంటివని నన్ను ప్రశ్నించుచుండును.

శాంతికేంద్రము పనులలో నున్నప్పుడు, శాంతి ఆశ్రమ తాపత్రయములు, తోటపల్లి నుండి వ్రాయబడుచున్నప్పుడు, నా అంతట నేను అల్పమైన తత్కాలితమైన విషయములకు మనస్సు నిచ్చుచుంటినని, బిడియము పడుచుందును. శివుడు పద్మాసనాశీనుడై కైలాసములో ధ్యానము జేయుచుండెను. నీవుగూడ ప్రకృతి రమణీయమైన పర్వతముల మధ్య నివృత్తుండవై ఏల ధ్యానము జేయవు. అని అంతర్వాణి నుడువుచుండును.

తదేక దీక్షగా ఆ శివుని చూచుచుండ, తన్మయత్వము గలుగుచుండును. నాకుగూడ ఆ శివునివలె సర్వము మఱచి సోహం భావనతో జీవించుటకు కోరుచుందును. ఆ శివునికి నాలుగు చేతులు గలవు. నాకు రెండు చేతులే గలవు. ఆయన ఒక చేతితో భక్తులకు అభయహస్త మిచ్చుచుండెను. నేనుగూడ ఒక్క చేతితో భక్తుల వృద్ధిని కోరుచు ఉత్తరములు వ్రాయుచుందును. శాంతి పాఠకుల వుపయోగార్థమై అనేకమైన వ్యాసములు గూడ వ్రాయుచుందును.

ధ్యానము చేయగా, చేయగా ఆంతర్య హృదయము నండి వచ్చు భావనలే యా వ్యాస రూపముగా పరిణమించుచుండును.

ఇంకను శివుని పటము చూడగా, చూడగా శివధ్యానము చేయగా, చేయగా శివునిలో సోహం ధ్యానము గమ్యస్థానము చేరినటుల తోచుచుండును. శివునిలో శ్వాసగూడ ఆడుటలేదు. నాలో యింకను సోహం–అదే నేను అనెడి భావన యున్నది. శ్వాస ఆడుచున్నది. శివునిలో శ్వాసయే ఆడుటలేదు.

ప్రియమైన శాంతిపాఠకా! నీవుగూడ వచ్చి శివుని దర్శించుచు శివధ్యానమును గాంచుము. ఆయనలో శ్వాసయే ఆడుటలేదు. అది సమాధిలో స్థిరమై యున్నది. "జీవో దేవస్సనాతనః" జీవుడే అనాది నుండియు దైవముగా నుండెను. సోహం భావేన పూజయేత్! సోహం భావననతో పూజచేయుము. సోహం భావనయే మానవజన్మకు గమ్యస్థానము.

ప్రియమైన పాఠకా! నిర్వాణాష్టకమును నీవు యెప్పుడైనా వింటివా? వినుటయే

గాదు, యీ ఆరు శ్లోకములను నీవు కంఠస్థముజేసి నిరంతరము శివధ్యానము జేయుచు రోజూ పఠించుటకు యీ క్రిందను నీ వుపయోగార్థమై వ్రాయుచుంటిని.

నిర్వాణాష్టకము

శ్లో॥ మనోబుధ్యహంకార చిత్తాది నాహమ్ ।
నశ్రోత్రం న జిహ్వా నచఘ్రాణ నేత్రే।
నచవ్యోమ భూమిర్న తేజో నవాయు ।
శ్చిదానందరూప శ్శివోహం శివోహమ్ ।

తా॥ మనోబుద్ధి చిత్తాహంకారములు నేను కాను. శ్రోత్రముగాని, జిహ్వాగాని ఘ్రాణముగాని, నేత్రములుగాని నేను కాను. ఆకాశముగాని, అగ్నిగాని, వాయువుగాని నేను కాను. చిదానందరూపుడగు శివుడనే నేను. శివుడే నేను.

శ్లో॥ నచప్రాణ సంజ్ఞోనవై పంచవాయు ।
ర్నవా సప్తధాతుర్నవా పంచకోశాః।
నవాక్పాణి పాదౌ నచోపస్థపాయు ।
శ్చిదానందరూప శ్శివోహం శివోహమ్।

తా॥ నేను ప్రాణ సంజ్ఞుడను కాను. పంచవాయువులుగాని, సప్తధాతువులుగాని, పంచకోశములుగాని, వాక్పాణి పాదపాయూవస్థలుగాని నేను కాను. చిదానంద స్వరూపుడగు శివుడనే నేను. శివుడే నేను.

శ్లో॥ నమేద్వేష రాగౌ నమేలోభమోహౌ ।
మదోనైవ మేనైవ మాత్సర్యభావః ।
నధర్మో నచార్థో నకామో నమోక్ష ।
శ్చిదానందరూప శ్శివోహం శివోహమ్ ॥

తా॥ నాకు రాగద్వేషములు లేవు. లోభమోహమదమాత్సర్య భావములున్ను లేవు. ధర్మార్థ కామమోక్షములున్ను లేవు. చిదాంనందస్వరూపుడగు శివుడనే నేను. శివుడే నేను.

శ్లో॥ నపుణ్యం నపాపం నసౌఖ్యం నదుఃఖమ్ ।
నమంత్రో నతీర్థం నవేదా నయజ్ఞా ।
అహం భోజనం నైవభోజ్య నభోక్తా ।
శ్చిదానందరూప శ్శివోహం శివోహమ్ ॥

తా॥ పుణ్యపాపములు నేను కాను. సుఖదుఃఖములున్ను కాను, మంత్రతీర్థ, వేదయజ్ఞములు నేను కాను. భోక్తృభోజ్య భోజనములున్ను కాను. చిదానంద రూపుడగు శివుడనే నేను. శివుడే నేను.

శ్లో॥ నమృత్యు శంకా నమే జాతిభేదః ।
పితానైవ మైనైవ మాతా న జన్మ ।
నబన్ధుర్న మిత్రం గురుర్నైవ శిష్య ।
శ్చిదానందరూప శ్శివోహం శివోహమ్ ॥

తా॥ నాకు మృత్యువు లేదు. సంశయము లేదు. జాతిభేదము లేదు. తండ్రిలేదు, తల్లిలేదు, జన్మలేదు. బంధుమిత్రులు లేరు. గురుశిష్యులు లేరు. చిదానంద రూపుడగు శివుడనే నేను. శివుడే నేను.

శ్లో॥ అహం నిర్వికల్పో నిరాకార రూపో ।
విభుత్వాచ్ఛ సర్వత్ర సర్వేన్ద్రియాణామ్ ।
నచా సంగం తంనైవ ముక్తిర్నబాధ ।
శ్చిదానంద రూప శ్శివోహం శివోహమ్ ॥

తా॥ సర్వేంద్రియముల కంతటికిని ప్రభువునై విలసిల్లుటచే నేను నిర్వికల్పుడను, నిరాకార రూపుడను, అసంగత్వముగాని, ముక్తిగాని, ప్రమేయముగాని నాకు లేవు. చిదానంద రూపుడగు శివుడనే నేను. శివుడే నేను.

నీవే శివుడవు! శివుడవే నీవు. నీవెప్పుడును రెండుగావు. ఒక్కటివే! తత్త్వమసి అదియే నీవు. ఉన్నదొక్కటియే! అదియే శివుడు.

శివోహం! శివోహం ! శివోహం!

మానవుల రూపములో నున్న శివమూర్తులకు ధన్యవాదములు.

(శాంతి ఫిబ్రవరి 1988)

# 34. శాంతి పాఠకులకు - శాంతి సందేశము

ఈ కాలములో యెచ్చట జూచినను పత్రికలే. ఊరునకొక్కొక్క పత్రిక చొప్పున వెలువడుచుండెనని జెప్పుకొనుచుండిరి. కాని యీ శాంతి పత్రిక క్రొత్త పత్రికగాదు; యిదివరకు వెలువడుచున్న పురాతన పత్రికయే !

అన్నిటికంటెను యీ శాంతి మీ స్వంతమైనది. మీ ప్రేమ హృదయములకు యిది వరకు శాంతి నొసంగియున్న పత్రికయే! “మీ శాంతి” మీ సేవజేయుటకు కోరుచున్నది.

మన ‘శాంతి’ నిప్పుడు భాగవతోత్తములైన శ్రీ త్యాగరాజులువారు కీర్తించిన “శాంతము లేక సౌఖ్యములేదు” అనెడి కృతితోనే ప్రారంభించెదము. ఈ ఆనందకరమైన, అనుభవ నీయమైన కృతిని యెరుంగనివారు, విననివారు ఆంధ్రదేశములో యెచ్చటనో గాని ఉండి యుండరు.

ఈ శాంతి నొసంగెడి యీ శాంతి కృతిని అచ్చువేయుచుంటిమి; గాన మా పాఠకులం దరును దీనిని వల్లించి దీని సారాంశమును వారి జీవితములలో వ్యక్తపరచుటకు ప్రయత్నిం చెదరుగాక!

“శాంతోయం ఆత్మ” యని వేదములు, మత గ్రంథములు ఘోషించుచున్నవి. శాంతియే ఆత్మ! శాంతిలేని జీవితము భూభారము. భూభారమేగాదు, ప్రత్యక్ష నరకమని గూడ జెప్పవలసియున్నది. కాన ప్రతివారును, శాంతి ననుభవించుటకై, ఆత్మానుభవమును పొందుటకై ప్రయత్నించవలెను.

శాంతి–యీ రెండు చిన్న అక్షరముల మాట, ఎంత శాంతి దాయకముగా, ప్రేమ పూరితముగా, ఆనందయుతముగా, ఉత్సాహకరముగ, మాధుర్యముగా యున్నది. ‘శాంతి, శాంతి, శాంతి’ అని స్మరించినను, మానవులు ఆరోగ్యముతో శాంతితో నిండి తాపత్రయ ములకు చింతలకు దూరులైయుందురు. అందుచేతనే, ఒక్కొక్క ఉపనిషత్తును, ప్రతి మతగ్రం థమును, ‘ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః’ అన శాంతితోనే ముగింపబడుచున్నవి. మనము గూడ, యీ శాంతి సందేశమును శాంతిమంత్రములతో ముగించెదముగాక!

ప్రియమైన శాంతిపాఠకా! యీ సందేశమును ముగించెడిముందు, మరల మిమ్ములను కలుసుకొని మీ శాంతిని కోరుచు, మీతో శాంతి పత్రికద్వారా సంభాషించుటకు నాకెంతయో ఆనందము నొసంగుచున్నది. ఋషికొండ సాగరతీరమున నూతనముగా స్థాపించిన శాంతి ఆశ్రమమునకు, కైలాస ఆశ్రమమునకు నిర్వాణాశ్రమమునకు మీ యందరకును, నా హృదయపూర్వకమైన స్వాగతమీయనీయుడు!

'ఆనందముగా యుండుటకు తేలికమార్గము యితరులను ఆనందపరచుటే' అని మహనీయులు నుడివియుండిరి. 'శాంతి' పత్రికద్వారా, మీరందరును, మీ శాంతికై స్థాపితమైన ఆశ్రమములను దర్శించి శాంతిని పొందెదరుగాక! అని ఆహ్వానించు సావకాశము కృపామయుండైన ఆ సచ్చిదానంద స్వరూపుండు మరల నా కొసంగినందుకు కృతజ్ఞతావందనములు. అన్ని జన్మలలో మానవజన్మ ఉత్తమమైనదని విజ్ఞులు జెప్పి యుండిరి; గాన, పూర్వజన్మ సుకృతముచే, దుర్లభమైన మానవజన్మమును పొంద గల్గినందుకు, మన జీవితములో నిత్యము ప్రతి గంటయు, ప్రతి నిమిషమును, చివరకు ఒక్కొక్క క్షణమును గూడ, దైవధ్యానమునందును, దైవసేవలోను వినియోగించి తరించెదముగాక!

దైవము మా 'శాంతి' పాఠకులందరిని, పాతవారిని క్రొత్తవారిని, వారు, వీరన నేల, ఆబాలగోపాలమును, ప్రతి సోదరీ సోదర స్వరూపములను, పూర్ణశాంతితో నిరంతరము బ్రోచుగాక! ఇదియే మీ ఆనందమును, ఆరోగ్యమును, శ్రేయస్సును, పూర్ణ శాంతిని కోరెడి మీ సోదరుడు ఓంకారము ప్రార్థనయై యున్నది.

లోకా స్సమస్తా స్సుఖినో భవంతు !

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

(శాంతి చైత్రం 1953)

## 35. శ్రీశైల యాత్ర

(శ్రీశైల శిఖరం దృష్ట్వా పునర్జన్మన విద్యతే)

దక్షిణదేశములో శ్రీశైలము పుణ్యతీర్థములలో చాల ముఖ్యమైన పుణ్యస్థలముగా ప్రసిద్ధికెక్కియున్నది. గాన శ్రీశైలయాత్ర చేయని భక్తులు ఎచ్చటనోగాని యుందరు. ఐనను ఈ 67 సంవత్సరములు శ్రీశైలము దర్శించకుండగనే, గడచుట చాల ఆశ్చర్యము.

దైవకృపచే అన్నితీర్థములు అవతారమూర్తులు, మహాత్ములందరూ, అంతర్యముననే గలరనెడి దృఢమైన నమ్మకముగలిగియున్నందున, యీ మనస్సు యెన్నడును బాహ్యయాత్రలవైపు అంతగా, పరుగెత్తదు. శ్రీశైలము వెళ్ళినగాని మోక్షమే లేదని కొందరు భక్తులందురు. ముఖ్యముగా శ్రీశైలమెళ్ళినవారికి అచ్చట జ్యోతిదర్శనము జేసిన, పునర్జన్మయే లేదని జెప్పుచుందురు. దుర్లభమైన మానవజన్మ జన్మరాహిత్యమును జేసుకొనుటకే ఇవ్వబడెను అన్ని జన్మలలో ఉత్తమమైన జన్మను పొందగల్గియు జన్మరాహిత్యమునకై ప్రయత్నించక సంసార మహాసముద్రములోబడి, మాయతో నిండిన వూబిలో

పడిపోయెడివారి జీవితములు చాల విషాదకరములుగదా! క్రిందపడుట, జారుట మెట్లుదిగుట, చాల సులభము. మీదకు వెళ్ళుట, మెట్లు యెక్కుట గమ్యస్థానము చేరుట చాలకష్టము. ఐనను సూక్ష్మములో మోక్షము దొరకుచుండ. శ్రీశైలము వెళ్ళినంతమాత్రముననే జన్మరాహిత్యము గలుగుచుండ, ఇంకను తడవేలనని వేలాది వేల భక్తులు నిరంతరము శ్రీశైలమునకు వెళ్ళుచునే యుందురు.

చిరంజీవి మా శాంతిగూడ మూడు సంవత్సరముల నుండియు చాల ఆతురతతో శ్రీశైలయాత్ర చేయవలెనని, ఇక జన్మలేకుండగ జేసుకొనవలెనని తొందరపడుచుండెను. గాని ఎప్పటికి ఏది ప్రాప్తమో ఏ రోజున ఏ దర్శనము పొందవలెనో అంతయు దైవనిర్ణయమై నట్లుండును. మా సుశీల శాంతిశకటము గూడ శ్రీశైల దైవమును దర్శించుటకే సిద్ధముగా యున్నట్లుండెను.

ఇదివరలో శ్రీశైలయాత్ర చేయుట చాలకఠినముగా యుండెడిది. ఏలనన, శ్రీశైల దైవముగూడ, తిరుపతి వెంకటేశ్వర్లువలె, ఎత్తుయైన కొండమీద విలసిల్లుచుండెను. దట్టమైన అడవులగుండా, చాల పర్వతములు దాటి, ముప్పది మైళ్ళు వెళ్ళవలసియున్నది, డోర్నగల్ వరకే రహదారులు, రోడ్లుగలవు. అచ్చటనుండి యాత్రికులు అడవులలో, కొండ లెక్కుచు దిగుచు, చాల అవస్థలు పడుచు కొన్ని రోజులకు కాలువలు, వాగులు, దాటుచు దారిలో వంటలు జేసుకొనుచు అతి కష్టముమీదను శ్రీశైలము చేరెడివారట!

ఇప్పుడు ఆంధ్రాప్రభుత్వమువారు, మినిష్టరు శ్రీ సంజీవయ్యగారి యాజమాన్యమున చక్కనైన రోడ్డు ముప్పదిమైళ్ళను యెన్నో లక్షల ధనమను వెచ్చించి యాత్రికుల సహాయార్థమై వేసిరి. గాన, ఇప్పుడు యెన్నో కార్లు, బస్సులు రోజూ యాత్రికులను తీసికొని వెళ్ళు చుండెను.

గూటీ (గుత్తి) నుండి శ్రీశైలము 150 మైళ్ళు వుండెను. ఆ రాత్రికి, శ్రీశైల పర్వతము చేరుటకే గూటీ త్వరితముగా వదులుటకు ప్రయత్నించితిమి. గూటీనుండి శ్రీశైలము నందియాలద్వారాగాని, కర్నూలు మీదుగాగాని రావచ్చును. గాని కర్నూలులో ప్రసిద్ధికెక్కిన నూతనముగా కట్టబడిన, శ్రీసాయిమందిరము వున్నందున, శ్రీసాయిభక్తురాలైన మా శాంతికి ఆనందము గల్గించుటకు కర్నూలు మీదుగనే వచ్చి తుంగభద్రా నది ఒడ్డున చక్కగా కట్టబడిన ఆ సాయిదేవాలయమును, శ్రీసాయిని దర్శించితిమి. చి॥ శాంతి, శ్రీ జగదీసు, గురుకుల బాలబాలికలు వగైరాలు శ్రీసాయినాధునకు, కొబ్బరికాయలు కొట్టుచుండ, చి॥ జ్ఞానేశ్వరి, నేను వరదలతో జలమయమైయున్న తుంగభద్రానదిని దర్శించుచు ఆ చక్కనైన ప్రకృతి సౌందర్యములో దైవమును గాంచుచు తృప్తిపొందసాగితిమి.

కర్నూలునుండి, శ్రీశైలమింకను 90 మైళ్ళు వరకు వున్నందున మేము తొందరగా, శ్రీసాయిదర్శనము ముగించుకొని, మా యాత్రను చేయసాగితిమి. వర్షాకాల మవ్వుటచే అంతగా వర్షము ఆ రోజున లేకున్నను ఒక్క చెరువుగట్టు తెగినందున కొన్ని రోడ్లుజలమ యమై యుండెను. చీకటిపడుచుండెను. చాలచోట్ల కాలువలు చీకటిలో దాటవలసి యుండెను.

శ్రీ సాయినాధుని దర్శనముచేతనే శ్రీశైలము చేరుట ఆలస్యమయ్యెను. గాన, ఆయనే మమ్ము సురక్షితముగా శ్రీశైలము జేర్చుననెడి ధృఢమైన నమ్మకముతో ప్రయాణము సాగించుచు చిన్నచిన్న కాలువలు చీకటిలో దాటుటలో చాల అవస్థలుపడుచు, చిట్టచివరకు శ్రీశైలము యొక్క కొండ మొదటి భాగమును చేరితిమి.

అంతయు చీకటిగా, అయోమయముగా యుండుటచేతను, చీకటిలో ఇంకను ముప్పది మైళ్ళు కొండలు యెక్కవలెను గాన కొండ దిగువ భాగమున, ఏదైన రహదారీ బంగాళాయున్న ఆ రాత్రి అచ్చట గడపి వుదయమే శ్రీశైలయాత్ర జేయుట మంచిదని నిర్ణయించి, పురాతనమైన ఒక్క రహదారీ బంగళా చేరితిమి. కొంత అవస్థ గలిగినను శ్రీశైల దైవము పేరున ఎటులనో ఆ రాత్రి గడిపి వుదయమే శ్రీశైలయాత్ర ఉత్సాహంతో ప్రారంభించితిమి. రహదారీ బంగళాలు కొన్ని అన్ని సౌఖ్యములతో రాజభవనములవలె యుండును. మరికొన్ని నాసరయ్యగారి మఠములవలె శిధిలావస్థలో యుండుట విచారకరము. మా సుశీల శాంతి శకటము చాల బరువుతో నిండియున్నను, మా గురుకుల బాలబాలికలు చి॥ జ్ఞానేశ్వరి, శాంతి హర హర, శంభో శంభో శివ శివ శంభో, నారాయణా నిన్నె నమ్మితిరా మొదలైన నామావళులను స్మరించుచు కీర్తించుచున్నందున ఏ శ్రమయు లేకుండగానే గమ్యస్థానమును జేర్చెను.

అచ్చట శ్రీశైలములో మేనేజరుగారు ఇదివరలో అన్నవరంలో యున్నప్పుడు ఆశ్రమదర్శనము జేసినవారైనందున, భక్తిప్రేమలతో, మాకు చక్కనైన వసతులు భోజన సదుపాయములుగూడ ప్రేమతో జేయించిరి. దురదృష్టముచే ఆనాడు పైపులనుండి నీరు రానందున విపరీతమైన దోమలుండుటచేతను కొంత అశాంతిగా, నిద్ర లేకుండగా శ్రీశైలములో గడపవలసియుండుట కొంత విచారమయ్యెనుగాని, మా శాంతికి మాత్రము శ్రీశైలము చేరకుండగనే శ్రీశైలదేవాలయ శిఖరమున జ్యోతి దర్శనమైనట్లు పొగగూడ గానవచ్చినట్లు జెప్పగా మేమంతా ఆ దృశ్యమును ఆమె గాంచినందున మేము చాల ఆనందించితిమి. అంతయు శ్రద్ధ నమ్మకములోనే యున్నదిగదా! మన అంతర్యమున యున్నదానినే, బాహ్యమున గాంచుచుందుము. ఈ శ్రీశైల దేవాలయ శిఖరమున జ్యోతిని దర్శించినవారికే ఇంక జన్మ లేకుండునని ప్రతీతి గలదు. నిత్యము దేవాలయ శిఖరమును

వేలానవేలు జనులు దర్శించుచుందురు. వీరందరూ జన్మరాహిత్యులుగా అవ్వుచున్నారా? ఇంతమంది రోజూ స్వర్గమునకు వెళ్లిన, అచ్చట గూడ, కొన్ని పుణ్యతీర్థములు, దేవాలయ ములలోవలె చాల ఇరుకుగా, అవస్థలుగా యుండునన్న సమస్యకు – సమాధానముగా ఒక చక్కనైన చిన్న ఇతిహాసము పురాణకథ జెప్పబడియున్నది.

పార్వతీదేవి శ్రీశైలయాత్ర జేయుచున్న యీ వేలానవేలేగాక లక్షలాదిగా, యాత్రలు జేయుచున్న యీ యాత్రికుల నందరిని జూచుచు శివునితో వీరందరూ స్వర్గమునకే వెళ్ళుచున్నారా ముక్తినిబడయుచున్నారా అని ప్రశ్నించగా, పరమేశ్వరుడు ఆమెకు బోధపర్చుటకు, ఆమె అనుమానము తీర్చుటకు, తాను ఒక్క ముసలివానిగా మారి, పార్వతిని తనచెంతనే ఒక్క ముసలి ఆమెగా జేసుకొని తాను వూబిలో దిగియుండెనట. అప్పుడు వేలాదివేలుగా వెళ్ళుచున్న భక్తులందరితో యీ ముసలి ఆమె తన భర్తయొక్క అవస్థను జూపుచు.

“ఓ తల్లులారా, తండ్రులారా నా భర్త వూబిలో, బురదలో పడి చనిపోవుచుండెను. మీలో వక్క పుణ్యాత్ములెవ్వరైనా నా భర్తను బైటకు తీసి బ్రతికించరా.”

అని ప్రార్థింపసాగెను. అప్పుడు చాల మంది తోడ్పడుటకు ఆ ముసలి వానిని బురద నుండి బైటకు తీయబోవగా అప్పుడు పార్వతీదేవి, ముసలి ఆమె.

“ఓ భక్తులారా, ఆగుడు మీలో ఏ పాపము యెన్నడూ చెయ్యనివారే, నా భర్తను లాగవలెను. పాపము జేసినవారు తాకవలదు.”

అని జెప్పగా అందరు విస్మయము జెంది ఎప్పుడో ఒకప్పుడు తమ జీవితములో ఏదో ఒకపాపము తెలిసియో తెలియకయో జేసియే యుందుమని నిరాశతో ఎవ్వరి దారిని వారే పోవుచుండ ఒక పతితురాలు యా ముసలి ఆమె దీన అవస్థను రోదనను జూచి.

“అమ్మా శ్రీశైల శిఖరమును దర్శించిన మాత్రమున అన్ని పాపములుపోయి జన్మ రాహిత్యులయ్యెదరని పెద్దలు, శాస్త్రములు జెప్పుచున్నవిగాన ఇదిగో ఆ శిఖరము నేనిప్పుడు ఇచ్చట నుండియే దర్శించుచుంటిని గాన, నా వెనుకటి పాపములన్నియు పోయెను. నీ భర్తను వూబి నుండి తీయుటలో తోడ్పడెదను.”

అని ఆమె హస్తములను అందించి పరమేశ్వరుని బురదనుండి బయటకు తీసెనని, ఆ పురాణగాథలో జెప్పబడియుండెను.

అటులనే వేలానవేల ప్రజలలో, ఏ ఒక్కరో నిజమైన భక్తి నమ్మకము గలవారుందురు. వారే తరించెదరు. గమ్యస్థానము చేరెదరు. జన్మ రాహిత్యులయ్యెదరు. కొదవ వారందరు లాంఛనంగా, బాహ్య నామరూపములను పూజించుచు పేరు ప్రతిష్టలకై ప్రాకులాడుచు

మరల మరల పుట్టుచు గిట్టుచు సంసార మహాసముద్రములో పడి దరిగానలేక కొట్టుకని పోవుచుందురు. ఆ రాత్రి యెటులనో పవిత్రమైన శ్రీశైలములో యున్నను దోమల సాంగత్యముతో బాధపడుచు నిద్రలేకుండగా, ఎంతలో తెల్లవారునని ఆతురతగా సూర్యభగవానుని దర్శనముకై వేచియుంటిమి.

శ్రీశైలములో అనేకమైనవి శ్రీభ్రమరాంబ దేవాలయము శివాజీ మహలు భీముని కొలను వగైరాలు వున్నను ముఖ్యముగా వీటిలో దర్శించ వలసినది పాతాళగంగ గలదు. ఈ తావే సప్తనదులు కలియుచున్న పవిత్రమైన స్థానముగా పరిగణింపబడు చున్నదిగాని, ఆలోతైన ప్రదేశమునకు వెళ్ళుట పాతాళమునకు వెళ్ళినట్లే యుండును.

రాత్రి నిద్రలేకున్నను బడలికగాయున్నను ఇట్టి సావకాశము మరల రాదుగదాయని ఆశ్రమవాసులు బాలబాలికలు వుత్సాహంతో పాతాళగంగ దర్శనముచేసి అచ్చట స్నానముచేసి పుణ్యము సంపాదించుకొనుటకే నిశ్చయించితిమి.

"అందరికంటె ముందుగా నేను దారితీయుచుందును. మీరంతా నా వెనుకనే రండు అని జెప్పుచు, పాతాళగంగవైపునకు నడవనారంభించితిని. ఒక్క మైలు వరకు రోడ్డువున్నది గాని అది రాళ్ళతో నిండియున్నందున మా శాంతి శకటమునకు శ్రమయిచ్చుట యిష్టములేక కాలినడకనే ఆ మైలు దూరముగూడ నడవనారంభించితిమి. మరియొక యాత్రికుడు ఒక సాధుపుంగవుని, పాతాళగంగకు వెళ్ళుటకు దారియెటులని తానువక్కడనే వెళ్ళగలనా, అని అడుగుచుండ ఆ సాధువు.

"పాతాళగంగ. 7, 8 మైళ్ళుండును. కీకారణ్యములోపడి, పెద్దపులులు వగైరాలుగూడ యుండును. గాన తన్ను కొంత డబ్బుయిచ్చి తీసికొని వెళ్ళు".

అని జెప్పుచు ఆ అమాయకమైన యాత్రికుని బెదరించుచుండ, నేను అప్పుడు అతని అవస్థకు విచారించి "నేను తీసికొని వెళ్ళెదను నాతోరమ్ము నేనుగూడ పాతాళగంగ దగ్గరకే వెళ్ళుచుంటిని" అని జెప్పగా, ఆతడు ఆనందముతో నాతో కలిసి రాసాగెను. ఆ సాధువునకు డబ్బు దొరకకుండగా నేను ఆటంకము వచ్చితినిగదా అని తీక్షణముగా నావైపు చూడసాగెను. నన్ను వెంబడించుచున్న యాత్రికునితో "నాయనా! నాతో నీవు వచ్చే యెడల అడుగుఅడుగునకు శివనామమునుగాని, రామనామమునుగాని స్మరించుచు మెట్లు దిగవలెను అని జెప్పగా, అతడెంతయో సంతసించి అటులనే దైవ నామస్మరణను, ప్రతీ అడుగునకు చేయసాగెను. ఒకవంద, రెండువందల మెట్లుగాక వెయ్యిమెట్లు దిగవలెను. దైవకృపచే అంతయెండగాలేక మబ్బుగాగూడ యుండెను. దిగుట చాల సులభమేగాన, వుత్సాహముగా దిగుచుంటిమి. అంతలో చి॥ శాంతి, జ్ఞానేశ్వరి, జగదీసు,

నాగమణి, తాయారు, చంటి, బాలకృష్ణగూడ, శంభో శంభో శంకర హర హర శంభో అని గీర్తించుచు, నన్ను కలిసికొనిరి. ఒక భక్తురాలైన సోదరి గూడ ఏకాకిగా ప్రయాణము చేయుచు మమ్ము చేరెను. ఈమెయే పరమేశ్వరుని బురదలో నుండి తీసియుండునా అన్నట్లు ఆమెవైపు జూచుచు, ఆమె నామధేయమును యదుగగా రామమ్మ అని జెప్పెను. అప్పుడు ఆమెనుగూడ, అడుగడుగునకు రామనామ స్మరణ జేయమనికోరగా, ఎంతయో ఆనందించి మాతో ఉత్సాహముగా నడచుచుండెను. పుణ్యనదిలో స్నానము జేయుటకు వెళ్ళుచు మావారందరూ చెంబుయైనా తెచ్చుకొనకుండా వట్టి చేతులతో వచ్చుచుండిరి. నదిలో స్నానము చేయుటకు చెంబుయైనా లేదని విచారించుచుండ, మాతోయున్న రామమ్మ "బాబు! నావద్ద చిన్న చెంబుయున్నది. గాని దానిని మీరు వాడవచ్చునో, వాడరాదో అని అనుమానించుచు జెప్పెను. దానిని మేమేల వాడరాదని" అడుగగా మీరు గొప్పవారు, నేను చాకలి మనిషిని అని జెప్పగా, నేను విచారించి,

"మనమందరము దైవబిడ్డలమే, దైవమునకు జాతిమత భేదములు లేవు. నీవు మా సొంత సోదరీ స్వరూపమే."

అని జెప్పుచుండ ఆమె ఆశ్చర్యము ఆనందముతో, ఆమె చెంబును మాకు అర్పించెను.

అతికష్టము మీద పాతాళగంగను చేరుటకు వెయ్యిమెట్లు ఓపికగా దిగగల్గితిమి. శ్రమతో మెట్లు దిగుచుండ మరల ఈ మెట్లు అన్నియు యెక్కుట యెటులనని ఆశ్రమవాసులు ప్రశ్నించగా నేనీ క్రిందిరీతిగా సమాధానము జెప్పితిని.

మా స్నానములైన తర్వాత, అచ్చటనే రాళ్ళమీద ఆసీనులమై కొంత తడవు ప్రార్థన ధ్యానాదులు భజన చేయడమాయెను. ప్రతీ వ్యక్తిని ఏకాంతముగా కూడ కొంత తడవు ధ్యానము చేయమని కోరితిని. ధ్యానమైన తర్వాతను భక్తురాలైన రామమ్మకు ఆ పరమపావనమైన క్షణమునందే ఉపదేశ మివ్వబడెను. ఆమె భక్తి ప్రేమలకు ఆనందించి ఒక రుద్రాక్షమాలను అర్పించి, రోజూ ఉదయము సాయంత్రమును, పవిత్రమైన రామనామ మును ఆ జపమాలమీద నియమముగా స్మరించుచు, తరించమని కోరితిని. ఈమె భక్తి భక్తురాలైన శబరి భక్తిప్రేమలను జ్ఞప్తికి తెచ్చెను. సోదరి రామమ్మ ఆనందమును యెటుల వర్ణించుట! త్వరలో శాంతి ఆశ్రమం చేరెదనని, కృతజ్ఞతా నమస్కారము అర్పించసాగెను. మేము వచ్చిన పని స్నానము ధ్యానము, సేవగూడ పూర్తి అయ్యెను. అప్పుడు శ్రీశైల పర్వతమును వెయ్యిమెట్లును యెక్కుటగురించి ఆలోచించవలసి యున్నది. అప్పుడే సూర్యభగవానుడుగూడ తీక్షణముగా రాదొడంగెను. కొండవైపు జూచిన మెట్లు యెక్కుట

గురించి తలంచిన హృదయము బరువెక్కుచుండెను. ఐనను, ఏదైవము నది ఒడ్డునకు క్రిందకు తీసుకొని వచ్చెనో ఆ దైవమే మరల కొండ నెక్కించునుగదా అనెడి తృప్తితో అయిష్టతగా ఆ పవిత్రమైన నిర్జనమైన ఏకాంత స్థానమునుండి బయలుదేరితిమి.

చి॥ శాంతి కృష్ణానది సంగమములో ఫలపుష్పాదులతో పూజగూడ జేసెను. అచ్చట నివసించుచున్న సాధువులకు దక్షిణ ఇవ్వగా వారు ఆనందించితిరి. ఆ వారములోనే నదిలోపడి మునిగిపోయిన దురదృష్టవంతుడైన యాత్రికుని స్థితి జ్ఞప్తికి వచ్చుచు నాకు చింతను మరల మరల గల్గించ సాగెను. అతని ఆత్మ శాంతినిగూడ కోరుచు ప్రార్ధనలు చేసితిమి.

అచ్చటచ్చట దారిలో కూర్చొనుచు చాల బడలికగా యున్నప్పుడు ఆ మెట్ల మీద పరుండుచు నెమ్మదిగా వెయ్యిమెట్లును దైవకృపచే మరల యెక్కుచు గమ్యస్థానమును శ్రీశైల దేవాలయమును చేరగల్గితిమి.

కాళ్ళు తడబడుచుండ, ఆ యెండలో మా బసను చేరి భోజనములు, ఫలహారములు జేసి అందరు తృప్తిగా కొంత తడవు విశ్రమించితిమి. శ్రీశైలములో పురుషోత్తమ నామ ధేయుడు పదహారు సంవత్సరముల బాలుడు, బొమ్మలవ్యాపారము జేయుచున్నవాడు మమ్ము ఎంతో భక్తి ప్రేమలతో ఆదరించుచు ఆశ్రమ భక్తుడాయెను. మా మేనేజరు జగదీసు గూడ చాల అలసిపోయి ఉండుటచే ఆ రాత్రిగూడ అచ్చటనేగడుపుటకు కోరెను.

గాని గడచిన రాత్రి దోమలచే గల్గిన అవస్థ, పూర్తిగా నిద్రలేని ఆ రాత్రి తలచినంత మాత్రముననే భీతిగాయుండి శ్రీశైలకొండ దిగియైనా క్రింద విశ్రమించ వచ్చునని జెప్పుచు, వెంటనే ప్రయాణమైతిమి. మా సుశీల శాంతి శకటముగూడ క్రిందకు వెళ్ళుటకు సిద్ధముగా యుండెను. దానివైపు చూచినప్పుడు ఆశకటమునకు ఏబాధ యుండదుగదా అని తలచసాగితిని. శ్రీశైలదేవాలయము మేనేజరుగారు అన్ని యేర్పాట్లు చేసినను దోమలకు భయపడి శ్రీశైలమును వదలుట విచారకరమని కొంత సిగ్గుపడితిమి.

గాని అంతా ఆత్మమయము గాన అన్ని జీవులలో, దైవమే గాన దైవములేనితావు సూదిమొన మోపుటకైనా లేనప్పుడు, దోమలో, చీమలో, యీగలో, దైవమునే గుర్తించి ఆనందించుటకు బదులు నా అపరిపక్వపు స్థితికి కొంత చింతించసాగితిని. దోమలో కుట్టుచున్నది, కుట్టబడుచున్నది, అంతయూ ఒకే దైవమనెడి అనుభవమే, మతమునకు గమ్యస్థానము, వేదముల సారముగదా! కుట్టేది కుట్టబడేవాడు ఒక్కటేగదా, అట్టి అద్వితీయమైన స్థితిని నోటితో చిలుకపలుకులువలె మహావాక్యములను స్మరించుటకంటె కఠిన పరీక్షలలో వ్యక్తపరచుటయే జీవన్ముక్తుల ఆశయము ఆదర్శముగదా!

మానవులకు అంతసేవ జేయజాలకున్నను, దోమల, చీమలకై నా యీ స్థూలశరీరములు, కొంతసేవ జేయుచున్నవని ఆనందించ వలసియున్నది. జన్మరాహిత్యము గల్గించెడి శ్రీశైలశిఖరమును బాహ్యముననేగాక ఆంతర్యమునగూడ ముఖ్యముగా, పాతాళగంగ యొద్దున ధ్యానసమయములో పొందగల్గితిమన్న ఆనందముతో, శ్రీశైలమును విడిచి ఆశ్రమ బాలబాలికలు శంభో శంకర శ్రీశైలవాసా అని కీర్తించుచుండ ఆ ముప్పది మైళ్ళు కొండలు, దైవనామస్మరణతో మా శాంతిశకట సహాయముతో శ్రీశైలనాథునకు కృతజ్ఞతా వందనములు అర్పించుచు క్షేమముగా దిగగలితిమి. సుఖదుఃఖములలో, విషమ పరీక్షలలో నైనను, కంటికి రెప్పగా తన బిడ్డలను కాపాడుచున్న, కుంటివారిని కొండ లెక్కింపగల్గిన మూగవారిని మాట్లాడించ కల్గిన ఆ కృపామయునకు శ్రీశైలనాథునకు మరల మరల కృతజ్ఞతాభివందనములు.

లోకా స్సమస్తా స్సుఖినోభంవతు

ఓం. తత్ సత్

## 36. సమాధిలో పలుకబడిన ఉపదేశ వాక్యములు

(పై శీర్షికయొక్క I నుండి IX వరకు ఓంకార సద్భోదామృతములో కలవు.
దాని పొడిగింపు ఇక్కడ కలవు)

మరల నా ఆత్మతో గురుమూర్తియొక్క శబ్దము మాట్లాడజొచ్చెను.

ఓ మనుజుడా! నీ నమ్మక మెచ్చటనున్నది. ప్రతీ యపాయమునకు, కష్టమునకు, వణుకుచుండుటకు నీవు పశువువాయేమి! నీవు శరీర జ్ఞప్తిని వదలు వరకు సత్యమును గ్రహింపజాలవు. నీ వన్నికోర్కెలను వదలువరకు నీ శరీర జ్ఞప్తిపోదు. నీవు శవమువా యేమి? నీవు చనిపోవు వరకును ఈ మట్టి శరీరములోనే నాట్యమాడుచుందువా? పేడపురుగునకు పేడయే బ్రహ్మానందముగా నున్నట్టు నీకీ మాయ ప్రపంచమే ఆనందముగానున్నదా? నీ చిన్న బ్రతుకునుండి బైటకు రమ్ము. మనుష్యుని బ్రతుకును బ్రతుకుము. మనుష్యుడుగా నుండుము. నీ జ్ఞానమంతయు సదా అడుగుననే కప్పబడియున్న ఇక నీ యాత్మ యెచ్చట నున్నది? ప్రపంచము నీ యవసరము కొరకే వేచియున్నదా! నీ వంత ముఖ్యమైన మనుజుండవా.? ఆత్మను ఆత్మచేతనే బలపరచుము. ఇకనైనను స్వతంత్రముగా నుండుము. నశింపబడని స్వరూపంబు కొరకే నీవు పాటుబడిన చావు నిన్ను అంటదు, యెందుచేతననగా చావనగా నేమిటో ఆ జ్ఞప్తిగూడ నీకుండదు. నశింపబడని

చావెరుంగని స్వరూపముగా నీవే యుందువు. ప్రపంచమంతయు, నిత్యమును తెలుసు కొనుటకే సదా ప్రథమమునుండియు ప్రయత్నించుచున్నది. ఆ ప్రయత్నములలో మొదటి మెట్టు సరియైన నడతయైయున్నది. సరియైన నడతయే అన్నింటికి ఆధారము. సరియైన నడతను బలపర్చుకొనుము. పవిత్రమైన నడతను తెచ్చుకొనుము, ప్రతి గంటయుగూడ పవిత్రమైన నడతను వృద్ధిపరచుకొనుటకే గడుపుము. చావు నెరుంగని నీ స్వరూపమునందే నీవు ఆలోచించుము, నీవుగూడ చావులేని స్వరూపంబయ్యెదవు. నిత్యమునే నీ గృహముగా జేసుకొనుము. అప్పుడు నిన్ను చావుగాని పుట్టువుగాని జన్మయొక్క సుఖదుఃఖములుగాని ఏవియుగూడ లేశమైన భయమును గలిగించనేరవు.

శరీరమును పోనిమ్ము శరీరమును నశించనిమ్ము, సదా శరీరజ్ఞప్తితోను శరీర సంబంధములగు నాలోచనలతోను నీ కాలమునంతయు వృధాపుచ్చవలదు. శరీర భ్రాంతిని విడువుము. స్త్రీ పురుష వివక్షత, భయము, నిద్ర, తిండి మొదలైన ఈ పశు జ్ఞప్తిని జయించుటే మతమంతకును, జ్ఞాన పుస్తకములన్నింటికిని అర్థముగా నున్నది. పశువుగూడ నీవలె తినుచు, తిరుగుచు, నిద్రించుచు భయముతో నిండి కాలమును గడపుచున్నది. ఈ గుణంబులె నీకుగూడ పశువునకు వలె సహజమైయున్న నీవు పశువుకంటె హెచ్చు యెటులనయ్యెదవు? దానిని చతుష్పాదజంతువనియు, నిన్ను ద్విపాదజంతువనియు వాడవచ్చును. ఇకనైనను ఈ పశుగుణంబులను వదలుము. ఈ శవముపై నభిమానమును వదలుము. ఈ శరీరమును శవముగానె భావించుము, దానిని శవమనియే పిలువుము. అన్ని యవస్థలలోగూడ దాని నటులనే హీనముగా జూడుము. దీనిపైన జరీబట్టలను, బంగారపు వస్తువులను బడవేయకుము. ఇది కుళ్ళు, గజ్జిపుండును, బంగారముతో కప్పెదరా? అనిత్యమైన మట్టి శరీరమును, ఆభరణములతోను, విలువైన అలంకారము లతోను పూజించెదవా? ఇది మన్ను, ఇది కుళ్ళు, జాగ్రత్తగా నుండుము. ఇకనైనను మేల్కొ నుము. ఆత్మయొక్కటి మాత్రమే నిత్యముగా నున్నది. ఆత్మ జ్ఞప్తితో నుండుటయే చావులేకుండుట ముక్తి. నిత్యమైన ఆలోచనలనే నీవు జేసిన నీవు నిత్యమునే చేరెదవు. నిర్భయముగా నుండుము. ధైర్యముగా నుండుము. వజ్రమెంత గట్టిగానుండునో నీవుగూడ నటులనే యుండుము. నా బిడ్డా! నీకు దైవమును తెలుసుకుందామని కోరికయున్నదా? అటులనైన శరీరమును గూర్చిన కోర్కెలతో నుండుటకు వీలులేదు. కోర్కెలకు కాలము చాలదు. ఇదే మంచి సమయము, ఈ క్షణమునందే మంచితరుణము. ఈ క్షణమునుండియు నీ మనస్సును నిత్యమునకిమ్ము. నీవు నిత్యముయొక్క బిడ్డవే. సత్యమే నీ స్వభావముగానున్నది. కాబట్టి ప్రాణముతో నున్న జ్ఞానామృతమును గ్రోలుము. నిత్యమైన అమృతంబులోని కురుకుము. దేనికి జడియవలదు. నిర్భయముగా నుండుము. బ్రతుకుయొక్క సుఖదుఃఖ

ములకు అతీతముగా నుండుట నేర్చుకొనుము. నీవాత్మవను సంగతిని మరువకుము. సదా నీ యాత్మ జ్ఞప్తితోనె గడపుము.

నీవు లోతునకు వెళ్ళుము. ఇంకా లోతుగా వెళ్ళుము. అచ్చట నీవు చాల బలముగా నున్నట్టు నీకే తోచును. నీ స్వభావముయొక్క అడుగునకు వెళ్ళుము. అచ్చట నీవు సదా పరిపూర్ణత్వముతోనే నిండియున్నట్టు నీకు తోచును. కొన్నిసార్లు నీవు వాడినంతమాత్రము నీకేమియు హానిలేదు. ఈ భయము, నీరసత్వము, స్థూల శరీర సంబంధమైనవని నేర్చు కొనుము, స్వప్నములకు గూడైన ఈ స్థూల శరీరమునుండియే ఈ భ్రాంతులు వచ్చుచున్నవి. గాన నీవు నీ నిజస్వరూపంబులో సదా నిర్భయముగాను స్వతంత్రముగానె యున్నావు. నా తనయా! బలమునిచ్చెడి యొక పాటబాడుము. నీవు చావు లేనటువంటి నిత్య స్వరూపంబు యొక్క బిడ్డవే. నీ గమ్యస్థానము నిత్యస్వరూపంబే, ఆత్మయే. సుఖదుఃఖములవలె దోచెడివి అనిత్యములేగాని, పరువెత్తెడి మన అనుభవములు అనిత్యమైన పెద్ద యెడారులలోను, యెండమావులలోను కానవచ్చెడి దయ్యములేగావా? నీ బ్రతుకును మరువనైన మరువుము, లేక దానితో దెబ్బలాడనైనను దెబ్బలాడుము. నీ వేది జేసినను ఫర్వాలేదు. నీవు గమ్యస్థాన మును జేరుటే కావలెను. శ్రమపడి శరీర జ్ఞప్తిని వదలి ముక్తిని పొందుము. నీవు నడచెడి దారి ముందుదైనను వెనుకదైనను ఒక్కటే. నీవు గమ్య స్థానము జేరుటే గావలెను.

అప్పుడు నా ఆత్మలో శాంతిగాను, ఆనందముగాను, నుండుటారంభించెను. అంతటను, అన్నింటను సర్వశక్తితో నిండియున్న స్వరూపదర్శనము హటాత్తుగా శాంతితో నయ్యెను, నా ఆత్మకు ఇది చాల బలమునిచ్చెను. ఆ తన్మయత్వ దశలో నా గురుమూర్తియొక్క వాక్యము శాంతిగా, అతి నెమ్మదిగా వినబడజొచ్చెను. కాలమునకు అతీతముగాను, కాలములోనుగూడ, అంతటా అన్నింటిలో నిండియున్న నిత్యస్వరూపంబుగా నున్నాను. ఆకారముతోనున్నను, ఆకారము లేప్పటికిని అంతయు ఆత్మగానెయున్నది. హృదయములో సదా ఏకత్వము శాంతియేయున్నది. నిజముగా హృదయములోపల శాంతితప్ప మరి యితరమేముండును! తుఫానులోనను బైటను, వివిధనామ రూపంబులుగా నున్న కెరటములలోనను, అన్నింటిలోనను నిత్యస్వరూపంబుయొక్క ప్రవాహమే ప్రవహిం చుచున్నది. అదియే నీ స్వస్వరూపము, నీ యాత్మ, "తత్త్వమసి".

## XI

సమాధి యవస్థలో గురుస్వామియొక్క వాక్యము మరల వినవచ్చుచున్నది.

చూడుము! బైట ప్రపంచమెటులనున్నదో యటులనే లోపల ప్రపంచము గూడ నున్నది. నామరూపంబులయొక్క ప్రపంచముగలదు, నాతనయుడా! ఈ బాహ్య ప్రపంచ

ములో, ఆశ్చర్యములు, విచిత్రములు, విశాలత్వము, అందము, పెద్దతనము మొదలైనవి యున్నను నీ ఆంతర్య ప్రపంచములోగూడ నోటితో వర్ణించుటకు వీలులేని, అంతు ఆదిలేని పరిపూర్ణత్వము, సర్వశక్తులు, చెప్పుటకు వీలులేని ఆనందము, శాంతి, కదల్పబడని గట్టి పునాదులతో స్థాపితమైయున్న నీ నిత్య స్వరూపము మొదలైనవియున్నవి. నా కుమారుడా! ఈ బాహ్య ప్రపంచము ఆంతర్య ప్రపంచముయొక్క చిన్న గుర్తుగానె యున్నది. ఈ యాంతర్య ప్రపంచములోనె, నీ నిజస్వరూపము, నీ నిజస్వభావము సదా వెలుంగుచున్నవి. నీ విచ్చట అంత్యమువరకు స్థిరముగానుందువు. ఇక బాహ్యప్రపంచము కొద్దికాలముదేగదా? నీఆంతర్య ప్రపంచములో అంతు ఆదిలేనట్టి లోతు తెలియబడనట్టి ఆత్మానందమున్నది. ఇక బాహ్య ప్రపంచములో సుఖదుఃఖములతో గూడియున్న నీ ఆనందములు క్షణభంగురములగానె యున్నవి. ఇచ్చటగూడ కొంత బాధగలదుగాని ఇదియేమి ఆనందకరమైన బాధ! నేను సత్యము నింకను పొందలేదుగదా అనెడి బాధ నీకు ముక్తికి దారిగానె యుండుచు అంత్యము నకు ఆనందమునే హెచ్చుజేయును.

రమ్ము! నీ ఆంతర్య ప్రపంచములో నీ నిజస్వభావమును బైటకు లాగుము. రారమ్ము! ప్రేమయనెడి రెక్కలమీద నాయొద్దకు రమ్ము. గురుమూర్తికి నీ శిష్య రత్నమునకును ఇంతకంటె గొప్పదైన దగ్గరదైన సంబంధ మెచ్చటనైన గలదా? ఓ నా తనయుడా, ఓ నా బిడ్డా, ప్రేమయొక్క స్వభావముశాంతియే. నోటితో చెప్పుటకు వీలులేకుండుటే. ఈ ప్రపంచ నడతలన్నింటికి లోతుగా నీ స్వభావమునకు చాలలోతులో దైవమున్నాడు. బైట సంగతుల న్నియు వదలిపెట్టుము. బాహ్మ ప్రపంచమును విడువుము. నే నెచ్చటకు వెళ్ళిన అచ్చటకే నీవు గూడ నన్ను వెంబడించుము. నే నేరీతిగానైన నీవుగూడ నటులనే యగుము. నేనెటుల నున్న నీవుగూడ నటులనే యుండుము. అయ్యో; దైవముయొక్క పవిత్రతను యెంత త్వరలోపొందుదువు. భక్తులయొక్క హృదయంబులో చాల గుడులున్నవి. అచ్చట ఆలోచన అనునది దైవము దగ్గరకు ధూపమువలె బోవుచున్నది. భక్తులు వారిమనస్సునే దైవమునకు ధూపముగా నర్పించుచున్నారు. నీవేది జేసినను అంతను జ్ఞానముతో నింపుము, సాకారములోను, నిరాకారములోనుగూడ బ్రహ్మమునే, ఆత్మనే నీవు జూడుము, రూపములోను, రూపములేని దానిలోను గూడ నీవు నిత్యమును, సత్యమునే జూడుము. మన ప్రభువుకంటె హెచ్చుగా గొప్పదైనది, మంచిదైనది, అతీతమైనది యెచ్చోటను లేదు.

భక్తుడు ప్రేమయొక్క దారి వెంటగాని, ప్రార్థనయను దారి వెంటగాని, ఆంతర్య ప్రపంచములోనికి ఇంకను చాల ఆంతర్యములోనికి వెళ్ళినప్పుడు, ఆత్మయొక్క అనేకవిధ ప్రపంచములను జ్ఞానదృష్టితో జూచుచున్నాడు. దైవమెప్పుడును చాల దగ్గరగానేయున్నాడు. స్థూలరీతిగా అతడు దగ్గరనుండుటేగాదు. జ్ఞానరీతిగా నీ ఆత్మలో ఆత్మగానున్నాడు. ఆయన

నిజముగా నీయాత్మ పదార్థముగాను, స్వరూపంబుగానె యున్నాడు. నీ యాలోచనలన్నింటిని తెలుసుకొనెడివాడు ఆయనయే. నీ హృదయములో దాచబడిన అతి నెమ్మదిగా స్మరించబడు ప్రార్థనలను యెరింగినవాడు ఆయనయే. నీ శరీరమును మరచిపొమ్ము కోరికలను వదలుము, ప్రేమకొరకే ప్రేమించుము, పనికొరకే పనిజేయుము, కోరికవలదు, శాంతియొక్క గదులలోనికి వెళ్ళుము. నిత్యముయొక్క సన్నిధిలోనికి రమ్ము, నీవెంతలోపలకు వెళ్లిన నంతదగ్గరగా నన్ను జూడగలవు. ఎందుచేతననగా లోపల లోతుగానున్న ఆంతర్య స్వరూపుండను నేనే., ఆత్మయొక్క ఆనందమును, జ్ఞానమును, బోధను ఆకర్షించెడి సూదంటు ఱాయిని నేనే, నిత్య స్వరూపంబును, ఆలోచనచేతను, రూపంబుచేతను, తాకబడని ఆత్మ స్వరూపంబును నేనే. నేను భాగములుగా భేదింపబడనివాడను, నేను నశింపనివాడను, హెచ్చు తగ్గులు లేనివాడను నేనే, నేను ఆత్మను, నేనే పరమాత్మను, ఆహా నేనే బ్రహ్మను, పరబ్రహ్మమును నేనేయైయున్నాను.

నా గురుమూర్తియొక్క వాక్యము లెంత ఆశ్చర్యముగానున్నది. నా యాత్మయేమని కేకలు పెట్టుచున్నదనగా, ఓ పరమానంద స్వరూపుడా! నీవే దైవముగా నున్నావు, నా దైవము నీవే, నా గురుదైవమా! నీవు బోధించెడి బోధయంతయు నీవే, ఈ ప్రపంచమున కంతయు ఆధార భూతుండవు నీవే, ఆహా నీవంతటను నన్నిటిలోను నిండియున్నావు. నీవులేని తావు సూదిమొన మోపునంతైనను లేదు, నీ స్వభావము ఏకత్వమే, ఒక్కటేగాని, నీ మాయా స్వరూపంబు నామరూపంబులనెడి కాంతులను కల్పించుచున్నది. ఆత్మయొక్క గొప్ప ప్రకాశమంతయు నీదిగానే యున్నది. ఆయాత్మ యొక్కటిగానె యున్నది. అంతకు సారాంశభూతమైన ఆత్మకు భాగములుగాని, విడదీయ బడుటగాని, హెచ్చుతగ్గులుగాని లేవు. అనేకవిధంబులైన రంగు రంగుల స్పటికపు అద్దం బులతో చూడబడెడి ఆత్మయొక్కటియే. ఓ గురుమూర్తీ! ఓ నా గురుస్వామీ! నీ ఆత్మ స్వరూపంబుయొక్క బ్రతుకులో నన్ను కలుపుకొనుము. ఓహో నీవే బ్రహ్మవు, నీవే విష్ణువు, నీవే సదాశివుడవు, నీవే బ్రహ్మమవు, నీవే పరబ్రహ్మమవు.

"హర, హర, ఓం, ఓం, మహాదేవ."

అప్పుడు నా ఆత్మ యేడవ స్వర్గమునకు వెళ్ళినట్లు గానవచ్చెను. అచ్చటి విశాలమైన, ప్రకాశ మాన్యమైన, జ్ఞానమును, తన్మయత్వమునే అంతట చూడగల్గితిని, అచ్చట అంతయు ప్రకాశముతోను, జ్ఞానముతోను తన్మయత్వముతోనె నిండియున్నది. ఆంతర్య ప్రపంచములో నా గురుమూర్తి రెండవ కృష్ణునివలె మారి, ప్రకాశముతోను తన్మయత్వముతోను నిండి కానవచ్చుచుండెను. ఆ సమాధియొక్క ఆంతర్య ప్రపంచము చాల లోతులోనున్నది. కాలమునకంటె లోతుగా నున్నది. ఆకాశముకంటెను విశాలముగా వ్యాపించియున్నది.

అచ్చట అంత స్వప్రకాశమే. చీకటియుండజాలదు. అచ్చట అజ్ఞానముండజాలదు. ఎందుచేతననగా అచ్చట అంతయు జ్ఞానమే. అచ్చట చావు నిలువబడలేదు. అచ్చట అగ్ని కాల్చలేదు. అచ్చట జలము తడపజాలదు. అచ్చట గాలి వేడిగా జేయలేదు. అది అనాది నుండియునున్న స్వరూపుని స్థానముగా నున్నది. ఈ అబద్ధపు బ్రతుకంతకు అతీతముగా నున్నది. అచ్చటంతటను అన్నింటిలోను నిండియున్న చలనములేని నిత్యస్వరూపమే నిండియున్నది.

ఆ స్వప్రకాశములో నా గురుమూర్తి తన్మయత్వములో నుండి మాట్లాడ దొడగెను. నా తనయుడా! ఆత్మయొక్క వారసత్వమంతయు నీదిగానె యున్నది. అంతు ఆదిలేని బలమంతయు నీదిగానె యున్నది. నీశక్తి అంతట యన్నింటిలో నిండియున్న శక్తియేయై యుండ, నీవు దుర్భలముగా నెటులుందువు? ఈ యింద్రియములయొక్క నాటకముచే నీవు తృప్తిపొంది యూరుకొనజాలవు. ఈ బాహ్య ప్రపంచమంతయు మరుపు, చావు. బాధలతోనె నిండియున్నది.

చావు నిన్ను బట్టుకొనగానె నీ శరీరము శవమగుచున్నది. గానీ యాత్మ సదా స్వతంత్రముగానె యున్నది. అది దేనితోను సంఘబంధములేకుండ నున్నది. దానికేరూపము లేదు, యేనామములేదు. అది సర్వమునకు సాక్షిగానున్నది. శరీరములెన్ని నశించినను అదిమాత్రమెన్నటికి నశింపబడదు.

అప్పుడు నా ఆత్మగురుమూర్తితో నైక్యమైనదై యేమని పలికెననగా అయితే ఓ ప్రభువా! యెంత ఆశ్చరముగానున్నది! నాకు చావులేదు, చావనెడిది లేనేలేదు.

అప్పుడు, గురుస్వామి యేమని జవాబు జెప్పెననగా, కోరికలతో నిండియున్న విషయేంద్రియలోలతగల బ్రతుకులు, పశువులకేగాని నరులకు తగవు. ఈ స్థూలమైనట్టి ప్రపంచ,మంతయు విషయకోర్కెలతోనున్న వారికి స్వర్గమువలె నుండును. దున్నపోతులు శరీరమంతయు బురదచేసుకొని బురదగుంటలలో నెంతో ఆనందముతో కాలము గడిపెడి లాగుననే కాముకులు అజ్ఞానాంధకారములోబడి దొర్లుచున్నారు. కోరికలకు హేతుభూతమైన మాయకు లోబడి వారి మార్గము చాల దూరముగానున్నది. నీవు వీటినన్నింటిని వదలి ముందుకు వెళ్ళుము. నీకు సరియైన సమయము వచ్చును. అప్పుడు మీదికి జూడుము, స్వప్రకాశముతో నిండియున్న నిత్యదీపంబులు, మీదనే, పైనేయున్నవి. మీదనే జూడుము. శుద్ధముగానున్నటువంటి నీ యాత్మలోనికిగూడ వాటి కాంతి చొచ్చుకొని వెళ్ళును.

ఈ మాటలు విన్నదై నా ఆత్మయేమన జ్ఞప్తి తెచ్చుకొనెననగా ఆత్మయొక్క స్వభావము సదా శుద్ధముగాను ఆనందముగానె యున్నది. దానియొక్క గమ్యస్థానము, తన్మయత్వమే,

స్వాతంత్ర్యమే, ఆ గమ్యస్థానము ఇచ్చటనే యున్నది. ఇప్పుడేయున్నది. ఎప్పుడోగాదు, యెచ్చోటనోగాదు, ఈక్షణమందే, ఇచ్చటనే, ఆత్మయొక్క గమ్యస్థానము నిశ్చయము. ఆత్మానందమే గమ్యస్థానముగానున్నది. అచ్చట కాలమనెడిది మాపుజేయబడెను. అచ్చట శాంతి స్వరూపమైనట్టి సత్యమును, స్వప్రకాశమైనట్టి బ్రతుకును కాంతినిచ్చుచున్నవి. అచ్చట కోరికల న్నియు, స్వప్నములన్నియు పూర్ణమయ్యెను. ఆత్మానందముచే కోరికలు మ్రింగివేయబడినవి.

ఆ విశాలమైన స్వరూపము నెన్నడనుభవించెదను. ఈ కాలమును మరచిపోయెడి దశ ఇంక నెంత త్వరలోరానున్నది. ఈ ఇంద్రియములయొక్క యాకారములింక నెంత త్వరలో నశింపనున్నవి. అంతట నిండియున్న ఆ విశాలమైన పరిపూర్ణ స్వరూపముయొక్క స్వాతంత్ర్యమును అనుభవించుటకు నేనేమి జేయను?

XII

ఏకాంతములోను శాంతిలోను నివసించెడు శబ్దము మరల సమాధి గంటలలో నా యాత్మతో నిటుల పలుకదొడగెను.

రా రమ్ము! నా తనయుడా, లోతైన, చాలలోతైన నిశ్శబ్దములోనకు శాంతిలోనకు రమ్ము, ఈ శరీర జ్ఞప్తి కతీతముగా దీని వివిధమైన యనుభవములను దాటి గొప్ప శాంతిలోనకు రమ్ము. బైటనున్నటువంటి కోరికలచేతను, తుఫానువంటి కామముచేతను, శ్రమపడవలదు. ఈ బైట వానిని జూచి భయపడవలదు. మేఘము లెంతయెత్తుగా కూడుకొని యున్నను, వాటికన్నింటి కతీతముగా సూర్యుడు సదా ప్రకాశించుచునే యున్నాడు. శాంతిగా యున్నప్పుడే హృదయము నిత్యానందములో కొట్టుకొనుచు నోలలాడుచుండును. అంతటా యన్నింటిలో నిండియున్న ప్రేమకు నీ హృదయమును తెరచుము. ఏకాంతము యెంత యింపుగానుండును! అది యెంత శాంతిని గలుగజేయును? ఓ! అంతటా యన్నింటిలో నిండియున్న ఆ ఏకాంతము కొరకు నా ప్రాణముల నర్పించెదను. సదా నిత్యమై, పూర్ణమై యున్న ఆ శాంతికొరకు నా శరీరమును, నా మనస్సును సర్వమును త్యజించెదెను.

ఒక మంచి యాలోచనగాని యొక జ్ఞాన కోర్కెగాని ప్రపంచమునందు యెప్పటికీ వృధాకాదు గనుక, నీవీ కాలముయొక్క శక్తిని మీరి ముందుకు వెళ్ళుము. అప్పుడే నీకు గొప్ప ఆలోచనలు వచ్చును. కాలమును మరచినప్పుడే నీ యాత్మ పరిపూర్ణత్వమును కోరుచున్నది. నీ ప్రపంచము నీ మనస్సులోనె యుంటున్నది. ఈ చిన్నదైన కాలములో నిత్యస్వరూపమును యిమడ్చుజాలవు. నీ ఆలోచనలచే ఆకాశముయొక్క హద్దులనైనా దాటి వెళ్ళజాలవు. కాలమును, ఆలోచనలను వదలినప్పుడు నీ నిజస్వరూప దర్శనమవును.

ఆత్మ స్వతంత్రముగా యున్నది. ఆత్మను యేదియు బంధించ లేదనెడు జ్ఞానముతో యెంత శక్తి వచ్చుచున్నది. యెంత ఆనందము, యెంత పరిపూర్ణమైనదశ, బలము గలుగుచున్నది. నీవు వచ్చితివో, నీవు వెళ్ళుచున్నావో, నీవు పనిజేయుచున్నావో, నీవేమీ పనిజేయుట లేదో ఈ యనిత్య సంగతులన్నియు నెవ్వరికి కావలెను. పెద్ద స్వప్నమైన ఈ బ్రతుకుయొక్క చిన్నకథలుగా భ్రాంతులుగా ఇవి యున్నవి. ఈ పరువెత్తుచున్న కాలమ నెడునదిలో యీ అనిత్య సంగతులన్నియు చిన్న చిన్న కెరటములుగా యున్నవి. ఇక యాత్మస్వరూపము సదా నిత్యముగానె యున్నది.

లోతుగా చాలాలోతుగా చెప్పుటకు కొలుచుటకు వీలులేనంత లోతుగా శాంతియుండి యున్నది. శాంతిని కొలుచుట కెవ్వరి శక్యముగాదు, ఇంద్రియములననెడు, ఆలోచనలననెడు బొమ్మలన్నింటిని చెరిపివేయుము. ఇవన్నియు నీ నీడలే, నీవు జ్యోతిస్వరూపములోనకే వెళ్ళుము.

ఇంకనూ యా మహావాక్యమేమని జెప్పెననగా; ఓ ఆత్మస్వరూపంబులో నేను ఆత్మననెడి దృష్టిగూడ యుండదు. అఖండముగా సదా నిత్యమైయుండే దానిగా, పరిపూర్ణ ముగా స్వతంత్రముగా, బేధములేని ఏకస్వరూపముగా అది వెలుంగుచున్నది. ఆత్మయొక్క రాజ్యములో నీవు యనుటకుగాని, నేను యనుటగాని, వాడుయనుటకుగాని తావులేదు. అదియంతయు అదే "ఓం, తత్ సత్. పోల్చుటకు వీలులేనటువంటిది. నోటితో చెప్పుటకు అతీతమైయున్నది. ఆ యాత్మను తెలుసుకొన్న వారందరును. నిజముగా ముక్తులయ్యే యున్నారు.

స్వతంత్రముగా యుండుటకు నిజమైన కోరిక, నిత్య స్వరూపములో ఐక్య మౌటకుగల గొప్ప పట్టుదలయే నిజమైన ప్రేమయని జెప్పవచ్చును.

రాత్రింబగళ్ళు శాంతికొరకు పలవరించెడిదే ప్రేమ. అది దేనిచేతను కదల్పబడదు. అది శాంతిగా వెళ్ళును. అంతటనుగూడ నిండి వెళ్లును. దానినాపుట కెవ్వరికీ శక్తిలేదు. అట్టి నిజమైన ప్రేమయే గమ్యస్థానము జేరును. ఎచ్చటనైతే దైవములందరూ లయమౌచు న్నారో, ఎచ్చటనైతే శబ్దమంతయు అణిగిపోవుచున్నదో, ఎచ్చటనైతే రూపమంతయు మ్రింగివేయబడ్డదో, ఎచ్చటనైతే ఆలోచన ఆలోచింపబడకుండగనే యుంటున్నదో, ఎచ్చటనైతే చావు బ్రతుకు ఇకయుండుటకే వీలులేకున్నవో దానినే నీవు ఆత్మగా తెలుసు కొనుము.

ఎచ్చటనైతే ప్రయత్నములు, దెబ్బలాటలు ఆగిపోయినవో, ఎచ్చటనైతే ఆనందమొక్కటే మిగిలియున్నదో, ఎచ్చటనైతే ద్వంద్వమైనదంతయు మూతవేయబడెనో, ఎచ్చటనైతే ఆనందము, పవిత్రత, పాపము, భయము, మంచిని బేధము లేకుండ జూడబడుచున్నదో,

ఎచ్చటనైతే మనస్సు ధ్యానములో సర్వాంతర్యామిగా సర్వశక్తితో నిండియుం టున్నదో దానినే నీయాత్మగా తెలుసుకొనుము.

నా తనయుడా, నా బిడ్డా అన్నిపొడవులకు పొడవైన దొక్కటిగలదు. అన్ని గొప్ప దైవములకు మీరిన పరిపూర్ణత్వముగలదు, నశించబడని స్వరూపమునకు విశాలమైన స్థలముగలదు. అన్నియు మాయమైపోవును. అన్నయు నశించును. అన్నిటిని భరించెడు దాత్మగానే యున్నది.

తర్వాత యాశబ్ద మాగిపోయిన తర్వాత నా ఆత్మగూడ ఆ విశాలమైన శాంతితో నిండియున్న నిశ్శబ్దములోనకు వెళ్లినట్టు తోచెను, అప్పుడు "నేను" అనెడిది లేదు. శరీర జ్ఞప్తిపోయెను. అచ్చట స్వప్రకాశముతో నిండియున్న జ్యోతిస్వరూపమేయున్నది. నిత్యమైన జ్ఞాన దీపముతప్ప యితరమేదియు నచ్చటలేదు.

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

## XIII

మరల యాత్మలోపలయున్న శాంతి తావును సమీపించినప్పుడు ఆశబ్దము మరల వినవచ్చెను.

మంచియనెడిది పాపముకంటె లోతుగా అన్ని తప్పులకంటె చాల లోతుగా యుంటున్నది. ఈ ప్రపంచముయొక్క ఉద్దేశ్యము ముఖ్యాభిప్రాయము మంచిగాయుండుటే, వర్ణించుటకు వీలులేనంత అన్నిటిని మించినంత మంచిగాయుండుటే. ఎచ్చటనైతే దైవముంటున్నాడో, యచ్చట లేశమైన పాపముండజాలదు. పాపమనెడిది కొంతకాలముదే ఎప్పుడును నిత్యముగాదు. పాపము మేఘము వంటిది. మేఘము నిత్యమా? అటులనే పాపముగూడ మేఘమువలె త్వరలో విడిపోవునేగాని అంత్యము వరకు నుండజాలదు. ఆత్మయొక్క సముద్రమునకు లోతులో చాలా లోతులో, సత్యముయొక్క జ్ఞానముయొక్క కదల్పబడని స్థిరమైన రాళ్లు గలవు. వాటిమీద అన్ని తుప్పలు, అన్ని అంధకారములు నశింపక తప్పవు. నిజమే. జలముమీదను వేగముగా వీచుచున్న కోర్కెలయొక్క గాలులును, ధ్వనులును, కామక్రోధములనెడి తుఫానులను, పాపములును చెడ్డ తలంపులును జేసెడి కొన్ని గంటలును యుండియున్నను, సర్వశక్తితో నిండియున్న ఒక్కక్షణమైనను సమాధినను భవించిన యెడల అజ్ఞానమంతయు నశించి శాంతి గల్గుచున్నది. మీదకు వచ్చుచున్న బలమైన పాపములన్నింటిని అది తుడిచివేయుచున్నది. ఆ సమాధి సూర్యుని ప్రకాశమువలె చీకటినంతను పోగొట్టుచున్నది. కాబట్టి చీకటిలోగూడ వెలుతురును మరువకుము. నీ పాపముల మధ్యనుగూడ దైవనామమునే పిలువుము. ప్రభువైన ఆతడు నీ ప్రార్ధనలను

వినును. అతనియొక్క దేవతలను నీకు తోడ్పడుటకు పంపును. ఆత్మయొక్క బలమును మీరిన దేదియులేదు. అన్నింటికి లోతుగా సదా జ్ఞానానందము ప్రవహించుచున్నది. ఆజ్ఞానమును ఒక్కమారైనా దర్శించిన అజ్ఞానము, పాపము, నివాసము చేయుచున్న ఈ బేధబుద్ధియంతయు నశించును. మొత్తముమీద నీవెప్పుడును స్వతంత్రుడు గానేయున్నావు. పవిత్ర జ్ఞానముతో నిండియున్నావు. ఈ ప్రపంచములో యున్న శక్తులన్నియు నీవు పిలువగనే నీ పాదంబుల నాశ్రయించుకొనుటకు వేచియున్నవి.

నీవు సదా స్వతంత్రునిగానె యున్నప్పుడు స్వతంత్రము కొరకేల శ్రమబడెదవు. జ్ఞానమును వృద్ధి చేసుకొనుటకే నీవు పాటుబడవలెను.

జ్ఞానానందముయొక్క ఒక్క కళయైనను యెంత మహాఘోరపాపంబులనయిన నశింపజేయగలదు. నిత్యస్వరూపముయొక్క బలమును స్వప్రకాశమేనీవని తెలుసుకొనుము. నీ బ్రతుకు ఇచ్చటను గాదు. అచ్చటనుగాదు. అది నిత్యములో శాశ్వతములో ఇమిడి యున్నది. పాపమనెడి భావన అంతయు దూరదృష్టితో జూచిన అజ్ఞానమేగాని వేరులేదు. అది యొక స్వప్నము. పాపముయొక్క స్వభావము దుర్భలత్వముగాయున్నది. నీవు సదా బలముగా యుండుము. నీ నిజస్వరూపమును ఒక్కక్షణమైన దర్శించినయడల నీవే ఆత్మవని సర్వశక్తుండవని స్వప్రకాశమానుండవని నీకే తెలియవచ్చును.

అప్పుడు ప్రార్ధన చేయునున్నదా అన్నట్టుగా శబ్దము అరచుట వినగల్గితిని.

ఇంద్రియములనెడి ఆలోచనలనెడి పర్ణశాలలను నిర్మించినవాడా! నీవు కట్టిన వాటిని నీవే పాడుజేయుము. భయములోను, స్త్రీపురుష వివక్షతలోను. తిండిలోను, నిద్రలోను బంధింపబడినవాడవై నీవంతట నీవే మూఢమైన అజ్ఞానములో మునింగినవాడవై, స్వప్నములను, భ్రాంతులను బొందుచున్నావు. నీవు అనుభవించుట నీయొక్క అజ్ఞానమె. నీ స్వప్నములన్నింటిని బ్రద్దలు కొట్టుము. ఆనందమనెడి దుఃఖమనెడి ఆలోచనలను వదలుము. ఇనుపనార్సమువంటి శరీరజ్ఞప్తిని అవతలకు పారదోలుము. నీవు చేయనున్నది చాల కష్టతరమైన పనిగాయున్నది.

మాయయొక్క రెక్కలు సాలీడుగూడు అల్లికకంటె పలచగాను వజ్రముకంటె కఠినముగాను వుంటున్నవి. ఓ ఆత్మా, నీ అంతట నీవే బాగుపడుటకు రమ్ము. ఈ గుడిసె నీవే కట్టితివి. ఈ గుడిసెను నీవే నాశనము చేయవలెను. వీటిని నశింపజేయు మార్గమే నీకు మోక్షమునకు మార్గముగాయుండును. ఇందులోనే నిత్యస్వరూపముయొక్క ఏకత్వ మంతయు ఇమిడియున్నది. నీయొక్క నిత్యస్వభావమును సూర్యుడు నక్షత్రములును ఈ ఆకాశముకూడ కలిసి మ్రింగగలవా? నీ ఆత్మ సదా నీతోడ ఏకమైవుంటున్నది. నీ అంతట

నీవే అన్ని బంధములను కల్పించుకొనుచున్నావు. ఆనందముకంటె దుఃఖమునే కోరుము. యెందుచేతననగా ఈ బాధలు దుఃఖములే నీయొక్క ఆలోచనలను సంకల్ప ములను సరిజేసి ఆత్మజ్ఞప్తిని గల్గించుచున్నది. ఓ ఆత్మానందమా, భయంకరమైనదానినే ప్రేమించుము, భయంకరముయొక్క దృష్టిలో యున్నప్పటికి నీవు చావునేగాకుండ నిత్యమైన నీ ఆత్మస్వరూపంబునుగూడ దర్శించెదవు. ఈ బ్రతుకంతయు ఒక స్వప్నమేకదా? వీటనన్నింటికి అతీతమైనది సదా వెలుంగుచున్నది. అంత్యమునకు అంతయు ఏకత్వమే. అన్నింటిని ఇముడ్చుకొనెడి జ్ఞానానందపరిపూర్ణత్వమె కల్గును. కిరణములు చాలగను అనేకవిధములుగా యున్నను, అంతయు సూర్యుని ప్రకాశమేగదా. కిరణమే సూర్యుడుగాను, సూర్యుడే కిరణముగాను వుంటున్నవి. ఇక నీవో? నీవే సూర్యుండవు, స్వప్రకాశమైన సూర్యస్వరూపంబు నీవే. మరియు చీకటిలోగూడ, వెలుతురే యుంటున్నది. అంతటా నీవే యున్నావు.

ఈ వాక్యములను విన్నదై నా ఆత్మ సమాధియొక్క చాలలోతైన దశలలోనికి వెళ్లినది. అప్పుడు కిరణమే సూర్యుడని, జీవియే ఆత్మయని అనుభవముగా తెలిసికొంటిని.

మరల సమాధిగంటలలో ఆ దివ్యతేజస్సు ఇటుల మాట్లాడదొడగెను.

ఏకాంతములో అన్ని శబ్దములకు మీరిన ఏకాంతములో, నిత్యమైన, శాశ్వతమైన ఏకాంతములో, నీయొక్క స్వభావము నివసించుచున్నది. ఈ ఇంద్రియ శబ్దములకు అతీతముగాను, బ్రతుకుయొక్క బాధలకు, కష్టములకు అతీతముగాను, పాపములకు విచారములకు అతీతముగాను, వీటన్నింటిలోగూడను నిత్యస్వరూపంబైయున్నది. సదా ప్రకాశించుచ్నుది. ఈ స్వప్నము అల్లుట యెంత విచిత్రముగా యున్నది. స్వప్నముకంటె స్వప్నముగాంచెడివాడు మరీ విచిత్రముగా యుండెను. ఓ ఆత్మస్వరూపమా, సదాజ్ఞాన మునకు వేరుగాయున్నావు. చావుయొక్క హద్దులను మీరినవాడవైయున్నావు, ఘోరమైన పాపములయొక్క సముఖములోగూడ డాగు (కళంకము) లేనివాడవై పవిత్రముగాయున్నావు. మంచి అనెడిది, చెడ్డ అనెడిది ఆలోచనయొక్క కొలతలుగాను భ్రాంతిగానుయున్నవి. ఆలోచనకుగూడ అతీతమై స్వప్రకాశమానమై పరిపూర్ణుడవై వెలుంగుచున్నావు. నీ స్వభావముయొక్క కాంతులు అన్ని వస్తువులను మీరుచున్నవి. నీవు వర్ణింప శక్యముగానివాడవు. వాక్కుకు అందనివాడవు. ఓ స్వప్రకాశముతో నిండియున్న నిత్య స్వరూపమా, ధ్యానసమాధులలో మునింగియుండెడి నీ స్వరూపంబును యెవ్వరు పాపాత్ముండని పిలువగలరు? మహాత్ముండనిమాత్రము నిన్నెవరనగలరు నీ గురించి యెవ్వరు మాట్లాడగలరు. నీ గురించి ఆలోచించనైన వశమా? అందరకూ, అన్నింటికీ మీరియుంటివిగాదా?

అందరిలోను ఏకమైయున్న ఓ ఆత్మస్వరూపమా, యెచ్చటను నశింపవు? చావు, యెరుంగని ఆత్మానందమా, యెవరు నిన్ను మనుష్యబ్రతుకుతో పోల్చగలరు. అన్నింటికి అతీతముగా చావును మీరియున్నావు. తుఫానువలె వీచుచున్న నీ ఆలోచనలయొక్క శ్రమలలోగూడ, సదా జాగ్రత్తగా నిన్ను కనిపెట్టుచున్న నిత్యస్వరూపమున్నదని తెలుసు కొనుము. అతనియొక్క వెలుతురును క్షణభంగురమైన యీ ఇంద్రియములు కనిపించకుండ చేయజాలవు. ఈ ప్రపంచములోయున్న దెబ్బలాటలన్నియు గలసి ఆయన శాంతిని తగ్గించజాలవు. కదలిక లేకుండగను, ఆలోచనలు లేకుండగను సూర్యునికి, నక్షత్రములకు, చంద్రునికి అతీతముగను అతడు వెలుంగుచున్నాడు. అతడే ఆత్మ. ఆత్మయే అతడు. ఇంద్రి యములయొక్క యుద్ధములలో జయమును గాంచెడివాడు ఆతడే.

అజ్ఞానము పర్వతముల యెత్తుకొలదియున్నప్పటికిని, పాపము తప్పులు అధోలోకము వరకు యున్నప్పటికిని, అతడే అన్నింటిని భరించేవాడుగ మలినరహితుడుగా ప్రకాశించుచున్నాడు. అంతయు తానుగానెయున్నాడు. బేధమునంతను మ్రింగివేసెడి ఏకస్వరూపముగా తానే వెలుంగుచున్నాడు. దీనిని తెలుసుకొన్నవాడవై స్వతంత్రముగా యుండుము. నీవే సర్వస్వతంత్రుడవు.

మరల నా ఆత్మకు కొన్ని మాటలు వినవచ్చెను. అయ్యో! నేను సదా నీకు దగ్గరగానె యుంటున్నాను. నీ పాపముయొక్క వల మూతి బిగుసుకొనిపోయేటప్పుడు నీవు గాడాం ధకారములో శ్రమపడుచున్నప్పుడు నేను అచ్చటనే నీతో యుండి నీ ఘోరపాపంబులన్నింటిని నేనుగూడ నీకై భరించుచున్నానని తెలుసుకొనుము. నీ ఆంతర్యములో వున్న సంగతుల న్నియు నేనెరుంగుదును. సదా నీతోనే నీలోనే బ్రతుకుచున్న నానుండియేదియు దాచజాలవు. ఆవగింజంతయైన నీ రహస్యమైన ఆలోచనైనా నా నుండి దాచజాలవు. నేను నీలోనె యున్నాను. నిన్ను నేను బాగా యెరుంగుదును. నేను లేకుండ నీవు కదలజాలవు. నీవు ఒక్క శ్వాసనైన తీయజాలవు. నేను నీ ఆత్మనన్న సంగతి మరుకుము. నీవెక్కడికి వెళ్లిన అక్కడికే వచ్చుచున్నాను. నీవెక్కడ యుండిన అచ్చటనే యుంటున్నాను. రారమ్ము ఇకనైనా నీ హృదయమును నా కర్పించుము. నన్నే నీ స్వంతముగా జేసుకొనుము. అప్పుడే అంతయు సవ్యముగా జరుగును. కీనీడయు ఏకారితమును వీటిలోగూడ నేను నివసించుచున్నాను. లోపలను బైటను నీ గుడిసెయొక్క హృదయములోగూడ నేనే నివసించుచున్నాను.

## XIV

ధ్యానముయొక్క శాంతి తావునకు నేను వెళ్లినంతలో నా గురుమూర్తియొక్క వాక్యము ఇటుల చెప్పదొడగెను.

నా కుమారుడా! నీ దుర్బలత్వములన్నింటిని నేనెరుంగనా? నీవెందుకు శ్రమ

పడెదవు? నీవేల విచారించెదవు? ఈ బ్రతుకంతయు కష్టములతోను ప్రయత్నములతోనేగదా నిండియున్నది. నిజమైన మనుజుడుగా నిలువబడుము. నీ ఆత్మను నీరసత్వమునకు లొంగనియ్యకుము. నీ లోపల సర్వశక్తిగల నిత్యస్వరూపమున్నదన్న సంగతిని మరువకుము. నీవు యేమి చేయవలెనన్న అదే చేయగలవు. నీకు ఒక్కటే అడ్డుయున్నది. అది నీవే శరీరము తిరగబడుచుండును. మనస్సు చలించుచుండునుగాని, గమ్యస్థానము చేరుట స్థిరమే. ఆత్మయొక్క శక్తిని ఏదియుగూడ అంత్యమునకు అడ్డజాలదు. నీ అంతట నీవు పట్టుదలగా నమ్మకముగా యున్నయెడల ఆంతర్యములోగూడి నీవు ఒకేరీతిగా, పట్టుదలగా, చలనము లేకుండ యున్నయెడల అన్నియు సవ్యముగానే జరుగును. నిన్నేదియు యెన్నటికి పూర్ణముగాగాని, కొద్దిగాగాని జయించజాలదు. మనస్సులోను, హృదయములోను కల్మషము లేకుండ యుండుటకు ప్రయత్నించుము. నీ గురించి నానుండి యేదియు దాచవలదు. నీ మనస్సు నంతను, అది నీ నుండి వేరైయున్నట్టుగా భావించి పరిశీలించుము. నీ ఆత్మ ఎవ్వరియొక్క సన్నిధిలో శాంతి ఆనందమును బొందుచున్నదో వారితో స్వతంత్రముగా మాయలేకుండా నీ గురించి యేదీ దాచకుండ మాట్లాడుము. కల్మషములేకుండా పట్టుదలగా యున్న స్వరూపమును నరకముయొక్క గుమ్మములు గూడ అడ్డజాలవు. కల్మషము లేకుండా ఏకాగ్రతగా పట్టుదలతో యుండుటే కావలెను.

ఇంతకు నీ తప్పులన్నియు నీ శరీర జ్ఞప్తివల్లనే గల్గుచున్నవి. నీ శరీరమును ఒక మట్టిముద్దను జూచినట్లె జూడుము. నీయొక్క ఆజ్ఞకు సదా లొంగియుండేలాగున జేయుము. మంచినడతే అన్నింటికి ప్రధానము. మంచినడకయొక్క బలమే నీకున్న మనోశక్తిగాను, బలముగాను యుంటున్నది. ఇది జ్ఞానజీవితమునకునంతకు రహస్యముగా యుంటున్నది. మన ప్రయత్నములన్నింటికి ఇదే భావముగా యుంటున్నది. దేశవృద్ధిని బాహ్యానడతలను జూడుము. ఆ నిత్యమైనవాటిగురించి ఇంద్రియములయొక్క జయము గురించి మనుజుడెంత వృథాగా కాలము గడుపుచున్నాడు. ఆంతర్యములో జూచిన, ఇదంతయు తిండికొరకు స్త్రీపురుషానందముకొరకే. మొత్తము మీద జనులందరి మనస్సులు విషయానందములలోనె మునింగి ఆనందించుచున్నవి. మనము శవమును పుష్పములతో కప్పెదము. పుష్పములతో కప్పబడినా, అది శవమే అనిపించుకొనును గాన జ్ఞానమును పొందనున్న పసిబిడ్డను ప్రపంచమంతా గొప్పదిగా భావించే అనిత్యముల గురించి జాగ్రత్తగా యుండనిమ్ము. స్థూలము కొరకు అనిత్యమునకేగాన హృదయమంతా కుళ్లుగానె మలినముతో నిండియుండును. క్షణభంగురములైన ఈ అనిత్య ప్రపంచ వస్తువులతోను ప్రపంచముయొక్క ఆకర్షణశక్తులతోను నీవేమీ సంబంధముంచుకొనవలదు. శరీరము దాచుకొనుచున్న

తప్పులను సిగ్గులను బైటికి లాగుము. కాగితపు బొమ్మలను చించివేయుము. ఈ బాహ్యమంతటితో నీకు లేశమైనా సంబంధము లేదని తెల్పెడి సమాధి అవస్థలోనకు దుముకుము. నీవే ఆత్మవు. రాజ్యములున్నను నశించినను దేశనడతలు గాంభీర్యముగాయున్నను, నశించియున్నను, పరిపూర్ణత్వముతోనిండియున్న నీ కేమియు సంబంధము లేదు. ఈ బాహ్యమంతయు ఈ కానవచ్చెడిదంతయు అనిత్యమే. కంటికి గానరానిదేదో అదే గొప్పదని నిత్యమని నమ్ముము. అదొక్కటే నీవు కోరదగినదని నిశ్చయింపుము.

నీవు సదా పేదరికముయొక్క బిడ్డగానె యుండుము. పవిత్రతకై యెక్కువైన కోర్కెనుంచుకొనుము. కామమును బంగారమును ప్రపంచస్వభావమునకు ఆధారములై యున్నవి. నీ స్వభావమునుండి పెరికి బైటకు పారవేయుము. ప్రతి సంకల్పమును అన్ని సంకల్పములను విషయములనే తెలుసుకొనుము. అజ్ఞానమునంతను విషయమునంతను నీ నుండి కక్కివేయుము. నీ ఆత్మను అన్ని అపవిత్రములనుండి కడిగివేయుము. బ్రతుకును, యేలాగున్న దానిని అటులనే జూడుము. అప్పుడు నీకది అంతయు మంచియుగాదు, చెడ్డదియుగాదు. అంతా మాయయే అని తెలియవచ్చును. బ్రతుకంతయు శరీరమును గురించి శరీర కోర్కెల గురించేగాన పూర్తిగా దానినంతయు వదలిపెట్టవలసినదే అని బోధపడును. నీయొక్క దైవస్వభావముయొక్క ప్రతి అంతర్యభావమును జాగ్రత్తగా కనిపెట్టుము. నీ ఆత్మను గురించి తెలియవచ్చెడి ప్రతీ సంగతిని ఆతురతగా మ్రింగి వేయుము. జ్ఞానమీ రీతిగా వృద్ధిజెందెడి తరుణములు నీ జన్మలో యెప్పుడో గాని రావు. అవి రానున్నప్పుడు మాత్రము నీవు శాంతి తావును జేరి లోదృష్టిలో మునిగి జాగ్రత్తగా వినవలెను. లోదృష్టి లేక నీవు నీ ఇంద్రియములతో కప్పబడియున్న జ్ఞానశూన్యుండవైన నీ జీవ స్వరూపము చెడ్డ అలవాటులయొక్క పిడికిళ్లలోబడి నశించును. నీకు నేను ఒక్కటే వార్తను ఇవ్వనున్నాను. సదా నీకిచ్చుటకు నావద్ద ఒక్కటే వార్తయున్నది. నీవే ఆత్మవన్న సంగతి మరచిపోకుమా! ఆ శక్తి అంతయు నీలోనే యున్నది. నీ వెంబడినేయున్నది. కల్మషము లేకుండాయుండుటే స్వతంత్రముగా యుండుట, నీయొక్క జ్ఞానస్వభావమునకు విధేయుడవై యుండుము. విధేయుడవై యుండుటే స్వతంతముగా యుండుటయని గూడ జెప్పవచ్చును. నీవు ముందుకు వేసే ప్రతీ అడుగుకూడ జ్ఞానవృద్ధికి దారిగానె యుండనిమ్ము. నీ బ్రతుకుయొక్క జ్ఞానదారిని నీవు నడచిన కొలదీ రోజు రోజుకు హెచ్చుగ స్వతంత్రముగా యున్నట్టు నీకే తోచును. నీలో సత్యజ్ఞప్తి యున్న, జనులందరినీ మీరియుందువు. ప్రపంచమునకంతకు అతీతుడవై యుందువు. నీకు నీవు నిజముగా యుండుము. అప్పుడు నీ నుండి వచ్చెడి ప్రతి మాటయు గూడ జ్ఞానశబ్దముతో మ్రోగుచుండును. అప్పుడు నీవు సమాధివాక్యములనే సదా మాట్లాడు చుందువు. నీ నుండి వచ్చెడి దంతయు జ్ఞానముగానె యుండును. ఇతరులనుగూడ పవిత్రముగ జేసెడి శక్తి నీకు వచ్చును.

ప్రతీ మనుజుడుగూడ తనయొక్క మంచినడతను వృద్ధి జేసుకొనకతప్పదు. యెవ్వరును దాగియుండజాలరు. సదా అజ్ఞానముతోనె నిండియుండజాలరు. ఒకడు స్థూలరీతిగా వంకరగాయున్న యెడల జనులందరు ఆ వంకరను జూచెదరు. అట్టితీరుననే నీవు జ్ఞానరీతిగా వంకరగాయున్న అనగా జ్ఞానశూన్యుండవైయున్న జనులందరకు నీవు అజ్ఞానివని మూఢుండవని తెలియనేవచ్చును. అప్పుడు ఆ స్థితిలో నీవు ఆత్మను గురించి మాట్లాడిన జనులందరూ వెంటనే నీ హృదయములో లేనిదానిని నీవు మాట్లాడుచున్నావని తెలుసుకొందురు. ఇదియే అనుభవశూన్యమైన జ్ఞానమని జెప్పబడుచున్నది. నీవేరీతిగాగూడ నీలో అనుభవము లేనందుచే వారిని జ్ఞానరీతిగా లేశమైనా వృద్ధి జేయజాలవు. నీవు జెప్పెడిదేదియు వారి మనస్సులకు నచ్చదు, తట్టదు. యేలననగా నీ అంతట నీవే ఆ సంబంధమైన వాడవుగావు; దానిలో యెన్నడూలేవు కాబట్టి నీకు జ్ఞానము ననుభవించెడి గొప్పమహాత్మునిగా కావలెననియున్న నీ అంతట నీవు బాగుపడుటకు వెంటనే త్వరపడుము. నీనైజమును జాగ్రత్తగా కాపాడుము. ప్రతి సంకల్పమును జాగ్రత్తగా పరిశీలించుము. నీయొక్క వాసనలనన్నింటిని జ్ఞానరీతిగా మార్చుము. కల్మషరహితముగా యుండుము. నీయొక్క సమాధినంతను నీవు జ్ఞానరీతిగా అనుభవించెడిదంతను వృధాపుచ్చకుండా కూడబెట్టి యుంచమని నిన్ను నిర్భంధించుచున్నాను. నీయొక్క మంచి ముత్యములను పందులముందు పడవేయకుము. నీవు జ్ఞాన సంబంధమైన ఆశ్చర్యమైన దశలను అనుభవించుచున్న యెడల మాటలేకుండా శాంతిగా యుండము. బైటకు మాట్లాడుటచే ఆ జ్ఞానజ్ఞప్తిని వదలి బాహ్యములో పడుదువు. నీకు దొరికినదాని యందే ధ్యానించుము. నీకున్న దానంతటితోను, నీ మనస్సంతటితోను ఆత్మయొక్క ఏకాంతములోనకు వెళ్ళుము. నీయొక్క జ్ఞానమునంతను నీయొక్క సమాధినంతను దొంగవాడు తన డబ్బునెటులనైతే జాగరూకతతో దాచునో నీవుగూడ అటులనే దాచుము. నిత్యజ్ఞప్తిని సదా వదలరాదు. ఆత్మా నందమునంతను నీలోనే దాచుకొనవలెను. నీ హృదయమంతయు జ్ఞానముతో నిండియున్న ప్పుడు శాంతిలో యుండుటకు కొంతకాలము నీవు అభ్యసించినప్పుడు జ్ఞానము నీలో పొర్లి పారుచు మనుజులందరకు ఆధారముగాను యుండెదవు.

నేను నీకు నొక్కి చెప్పబోయెడిది ఒకవిధమైన జ్ఞానమార్గముగలదు. భయంకరమైన దానిమీదనే ధ్యానించుము. యెందుచేతననగా భయంకరమైనది సర్వత్రాయున్నది. నిజముగానే ఒక మహాత్మునిచే తాను ముట్టుకొనెడిది అంతయు బాధయే అని చెప్పబడినది. దీనిని విచారముతో తీసుకొనకుము. ధైర్యముతోను ఆనందముతోను అభ్యసించుకొనుము. మంత్రసంబంధమైన ఆరాధన లన్నింటిలోను యేదో ఒక విధముగా భయంకరమైన దానిని

పూజించుట జూచుచునేయున్నాము. వాస్తవముచే భయంకరమైనదానిని పూజించుటగాదు. ఇంద్రియములలో మునింగి యుండెడివారికి అంతయు భయంకరమే. శరీర జ్ఞప్తికి బంధింపబడినవానికంతయు ఆనందముగాను భయంకరముగాగూడ యుండును. గాని నీవు అన్నింటిని మీరి యుందువు. సమాధిని బొందకున్ననూ నీ ఆలోచనలలోను జ్ఞాన సంకల్పములలోను మీరి యుండుటగూడ కొంతమేలే. నీవు సదా భయంకరమైన దానిమీద ధ్యానించుటచే నీవు తప్పక ఇంద్రియముల యొక్క కామమును జయించుచున్నావు. ఆత్మయొక్క జీవితమును నీవు కౌగిలించుకొను చున్నావు. అప్పుడే నీవు స్వతంత్రుడవుగాను పరిపూర్ణుండవుగాను జేయబడుచున్నావు. బ్రతుకునకు అవతలి ఒడ్డున యున్న నాతో క్రమేణ ఒక్కటిగా అవుచున్నావు. బ్రతుకునెప్పుడు స్థూలరీతిగా జూడకుము. ఆత్మరీతిగా బోధపర్చుకొనుము. జ్ఞానరీతిగా అనుభవించుము. ఆ తక్షణమే ఆత్మబ్రతుకుయొక్క భావన అంతయు నీకు స్పష్టముగా తెలియబడును, అప్పుడు నీవు మహాత్ములందరు భయముచేతనో దెబ్బలాటచేతనో కామము ధనము సంబంధమైన వాటినన్నింటిని విడచిపెట్టి సదా పవిత్రతను పేదతనమును ప్రేమించెదరని నీకు తెలియవచ్చును.

ఇంతమట్టుకు చాలును. నేను చెప్పినంత మట్టుకు అనుభవములో పెట్టుకొనుము. నీ శరీరమంతయు నీ నాడులన్నియు ఈ జ్ఞాన వుద్దేశములతో నింపి జ్వరము వచ్చేవరకు వీటినే మరల మరల ఆలోచించుము. చింతన జేయుము. వాటియొక్క పరిపూర్ణత్వము స్వప్రకాశమానము నీ శరీరమంతా వ్యాపించినదై నిన్ను మరల ఇంకొక పవిత్రమైన జ్ఞానముతోను ఆత్మ జ్ఞప్తితోను నిండియున్న నూతన శరీరముగా మార్చునిమ్ము.

హరిః ఓం తత్ సత్ ఓం.

## XV

అంతయు శాంతిగా నున్నప్పుడు సమాధిలో లోతుగా యున్నప్పుడు గురుమూర్తి కానవచ్చినవాడై యేమని చెప్పెననగా!

నా కొమారుడా! తల్లియొక్క రూపమైన శక్తియందే ధ్యానించుము. అన్ని భయములను పారదోలి ఆ శక్తి నీకానందము నిచ్చును. శక్తిని మీరినవాడవై తల్లియొక్క స్వరూపమైన శాంతిని బొందెదవు. ఈ బ్రతుకుయొక్క అశాశ్వతముల గురించి నీవు భయపడవలదు. భయంకర రూపములన్నియు నీకు కానవచ్చినను అవి వేనవేలు రెట్లు వృద్ధియై నిన్ను జడిపించినను ఇవన్నియు స్థూలమని, బాధింపజాలవని మరిచిపోకుము.

ఆత్మ నశింపుగానిదిగదా యని నీవు అన్ని సమయములయందు, నిశ్చలతగాను పట్టుదలగాను యుండుము. ఆత్మయైన నీ నిజస్వరూపము మీద నిలువబడుము.

సర్వమునకు సాక్షిభూతమైయున్న అనిత్య స్వరూపమును దప్ప యింక దేనిని నమ్మకుము. అప్పుడే నీవు యీ నామరూపములయొక్క తుఫానులో చలనము లేకుండ యుండగలవు. వచ్చెడిదియు వెళ్లెడిదియు ఆత్మగాదు. రూపముతో నీవు ఐక్యమును జెందకుము! ఆత్మతో ఐక్యమగుము. ఈ బాహ్యప్రపంచములోయున్న వస్తుసముదాయమంతకు అశాశ్వతమే బాగా గానవచ్చును. ఇంద్రియ సముదాయము ఆలోచనలులేని ఆత్మ స్వరూపంబులో శాశ్వతముగా స్థిరమైయుంటున్నవి.

నిత్యమైనది సత్యమైనదేదో అపారమైన సముద్రమువలె కొలవబడదు. దానిని యేదియు బంధింపజాలదు; యేదియు మీరి యుండజాలదు. సమాధియొక్క పూర్ణావస్థలలో అంతు ఆదిలేని, తుది మొదలు లేని, వడ్డు హద్దులేని, సముద్రమువంటి ఆజ్ఞాన స్వరూపము ఆత్మ వైపే ప్రవహించుచున్నది. మనస్సు దీనినందుకొనజాలదు. (సశేషము)

## 37. స్వభావము

ఎలుగుబంటి తోలు
ఎన్నాళ్ళు ఉతికినా
నలుపు నలుపే గాని తెలుపు రాదు
విశ్వదాభిరామ వినుర వేమా.

ప్రియమైన పాఠకులారా! ఎలుగుబంటిని జూచితిరిగదా! దాని చర్మము యెంత నల్లగా యుండునో, అందరకును తెలిసినదే. నల్లని డాగు వున్న వస్త్రమును నిమ్మరసము తోను, పటికతోను, సోడాతోను రుద్దినయెడల, ఆ డాగు మాయమగును. ఒక ఎలుగుబంటి చర్మమును తీసుకొని దానిని తెల్లగా జేయుటకు ప్రయత్నించుట ఎంత విఫలము. తోటపల్లి ఆశ్రమములో చాల నిమ్మచెట్లు గలవు. వాటి పండ్ల రసము నంతను ఎలుగుబంటి తోలుమీద వేసి, రాత్రింబగళ్ళు తోమినను ఇసుమంతయు తెల్లబడదుగదా! నిమ్మపులుసుతోనే గాక లోకములో డాగులు, మచ్చలు పొగొట్టెడి మందులన్నియు వేసి, తోమినను ఎలుగుబంటి తోలు నలుపు నలుపే గాని తెలుపు కాజాలదు.

ఎలుగుబంట్లలో కొన్ని తెలుపు ఎలుగుబంట్లుగూడ గలవు. అవి చాల అరుదు. ధ్రువ ప్రాంతములందు, వాటిని జూచినవారు చెప్పుదురు. అటులనే, మనుష్యులలోగూడ, రెండు విధములవారు గలరు. తెలుపురంగు స్వభావము గలిగిన అనగా సాత్వికులైన సజ్జనులు చాల అరుదు. ఇక నలుపురంగు గలిగినవారు అనగా, తామసగుణ ప్రధానులు

ముఖ్యముగా యీ కలికాలములో–ప్రపంచ మంతయు నిండియున్నారు. ఈ తామసికులు ఇతరుల వర్తనమును మార్చుటకు సదా ప్రయత్నించుచుందురు. అహర్నిశములు, వారు యితరులను మార్చుటకు ప్రయత్నించుచుందురు; గాని, తమ్ము తాము మార్చుకొనుటకు మాత్రము ప్రయత్నించరు. దైవము వారిని మాత్రము ఏ తప్పులు లేకుండా సృష్టించెననియు, తప్పులన్నియు యితరులవే యనియు వాదించుచుందును. ఇక సాత్వికమైన భక్తులు, తెల్ల ఎలుగుబంట్లవలె ఏకాంత గుహలలోనో, ఏ కీకారణ్యములలోనో జీవించుచు, నిరంత రము తమ్ముతామే సంస్కరించుకొనుచు ఆదర్శజీవితములు గడుపుచుందురు. వారుతప్పు అంతయు తమదేననియు, ఇతరుల తప్పు లేమియు లేవనియు భావింతురు. ప్రపంచములో పూర్వమువలె యిప్పుడు కూడ రావణ, దుర్యోధనాదులు, శకునులు గలరు. అటులనే, అచ్చుటచ్చుట, ధర్మరాజులు, శ్రీరాములు, భక్త ప్రహ్లాదులుకూడ ఉన్నారు. కాని అట్టి మహనీ యులు చాల అరుదు.

రావణుని స్వభావము నెవరు మార్చగలిగిరి? దుర్యోధనుని స్వభావమును శ్రీకృష్ణభగ వానుడుగూడ మార్చజాలడయ్యెను. స్వభావమును మార్చుటెంత దుర్లభమో తెలిసికొనుటకు ఉదాహరణగా, రావణుని తలలను నొక్కక్కటిగా శ్రీరాముడు ఖండించుచుండ, క్రొత్త శిరస్సులు వెనువెంటనే పుట్టుటను తీసుకొనవచ్చును. అటులనే మనలో వున్న అహంకార మమకారములను యెంత ఖండించినను, అణగద్రొక్కినను, మరల మరల అవి ఉద్భవించు చునే యుండును.

స్వభావమును మార్చుట అసాధ్యమని మన మధైర్య పడనవసరములేదు. ఏలనన, యితరుల స్వభావమును మనము మార్చజాలము, గాని, మన స్వభావమును మనము నిత్యానిత్య వివేకము గలిగి, సాధనచతుష్టయముచే మార్చుకొనుటకు సావకాశము గలదని శాస్త్రములు చెప్పుచున్నవి. ఇది మనకు ఆనందమైన వార్తకాదా!

నిరంతరము దైవనామస్మరణ జేయుటచే, సుస్వభావుల మగుటకు సాధ్యమగును.

ప॥ పానీయంబులు ద్రావుచున్ గుడుచుచుఀ
భాసించుచుఀ హాసలీ
లా నిద్రాదులు సేయుచుఀ దిరుగుచున్
లక్షించుచుఀ సంతత
శ్రీ నారాయణ పాదపద్మయుగళీ చింతా
మృతా స్వాద సం
ధానుండై మరచెఀ సురారిసుతుడే
తద్విశ్వముఀ భూవరా.

– భాగవతం, సప్తమ స్కంధం 128

దుర్జనుల స్వభావము మార్చుటెంత దుర్లభమో, సజ్జనుల సాత్విక స్వభావమును మార్చుట గూడ యంత కష్టము. భక్తప్రహ్లాదుని సుస్వభావము నెవరైన మార్చగలరా? విషము త్రాగింపబడినను, ఏనుగులచే త్రొక్కింపబడినను, కొండల మీదనుండి త్రోయబడినను, ఇంకను అనేక విషమ పరీక్షలచే హింసింపబడినను, భక్తప్రహ్లాదుడు దైవనామస్మరణను ఒక క్షణమైనను విడువలేదుగదా!

ప్రియమైన పాఠకులారా! దైవభక్తితో నిండి, మోక్షమునకై పాటుపడుచున్నవారు లోకమంతను తరింపజేయవలయు ననెడి అవివేకమును విడచి, తమ స్వభావమును బాగుపరచుకొనుటకు సదా ప్రయత్నింపవలయును.

మన మందరమును హిరాణ్యాక్ష, హిరణ్యకశిపుల స్వభావములకు దూరముగా నుండి, ప్రహ్లాదునివలె మహాభక్తులమై సుగుణాభిరాములమై వర్తింతుముగాక!

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

(శాంతి ఫిబ్రవరి 1955)

## 38. సుందర దృశ్యము

ఏకం సత్ విప్రాః బహుధావదంతి

ఉనికి ఒక్కటే! దానినే పండితులనేక విధములుగ వర్ణింతురు–

సుందర దృశ్యముకూడ నొకటిగనే యున్నది. కాని భిన్న భిన్న దేశముల జాతులలోని దైవమానవులచే నది వివిధములగు నామములచే పిలువబడినది. దానిని కొందరు మహత్పూర్ణమైన దృశ్యమనిరి. ఇతరులు దానికే అనిర్వాచ్యమగు దృశ్యమని, విశ్వరూపమని, పరాదర్శనమని నామకరణము చేసిరి. నేను ఇంద్రియములతో గాంచుదానిని పరాదర్శనమని చెప్పుటకు నాకిష్టములేదు.

ఈ సుందర దృశ్యములలోని ఖనిజ, వృక్ష, జంతు, మానవ లోకములోనేగాక, దివ్య అజ్ఞాత, అగోచర లోకములలోగూడ నివసించునది భగవంతుడే. ఇచట ద్వైతమను పొలసులు రాలిపోవుటచే బాహ్యాభ్యంతరములలోను ఉపరితలములలోను, సర్వే సర్వత్ర అంతయు సుందరమే. భూత, భవిష్యద్వర్తమానములన్నిటి యందు నదే సౌందర్యము, అదే మహిమ, అదే సత్యము. నా దృష్టి నెటు సారించినను అదే సౌందర్యము బ్రహ్మము.

సుందర దృశ్యమనినను, బ్రహ్మమనినను, సద్వస్తు వొకటే గనుక బ్రహ్మము, సుందర

దృశ్యమనునవి రెండుకావు. ఒకటే. నిన్నటి ప్రాతఃసమయమున నుప్పొంగు మహూదధి యపార, జలరాశిలో దివ్యగానము నాలాపించు నుత్తుంగ తరంగములపయి తన యద్భుత మైన కిరణములను ప్రతిబింబించు శోభాయమానమగు అరుణోదయము నెదుట ధ్యానము చేయుచుంటిని. ఆ సుందర దృశ్యము మౌనముగా ననుభవించి యానందించవలసినదేగాని, పరిమితమగు వాక్కుతో వర్ణింప శక్యముగాదు.

అది ప్రకృతి సౌందర్యములో బ్రహ్మముయొక్క ఖేలనము. అందు వ్యక్తావ్యక్తములలో, దృశ్యాదృశ్యములలో నంతయు భగవంతుడే! ఆ సుందర దృశ్యమును గాంచు భాగ్యమబ్బిన వారు ధన్యులు. అందు వారు అనేకత్వము ననేకత్వమున గాంతురు. ఆ సుందర దృశ్యములో గోడ గోడ కాదు. చెట్టు చెట్టుకాదు. జంతువు జంతువుకాదు. మనిషి మనిషికాడు. అన్నియు నభిన్న పరబ్రహ్మముయొక్క వివిధమయిన యావిర్భావములే. ఇచటనే మనలోనున్న ప్రతి యణువునందుకూడ చొచ్చియున్న సాన్నిధ్యము మనకు గోచరించును. ఆ సాన్నిధ్యమే గడ్డిపోచనుండి యన్నిటి కంటె పెద్ద గోళము వరకు వ్యాపించి యంతర్యామిగ నున్నదని గోచరమగును.

ఈ ఆలోచనలో నిమగ్నుడనయి, అప్రయత్నముగ నొక ఱాతి ముక్కను చేతబట్టి, దానినిట్లు ప్రశ్నించితిని–'నీవు బ్రహ్మమువా?'

ఱాయి : 'అవును నా హృదయములోని స్థిరత్వము బ్రహ్మము. అందుచే నేను బ్రహ్మమునే'

ఒక పుష్పమును తీసుకొని – నీవు బ్రహ్మమువా? అని అడిగితిని.

పుష్పము : 'అవును నేను బ్రహ్మమునే, నా సౌరభము బ్రహ్మముకాదా.'

నా చెంత నొక పక్షి యానందముతో స్వేచ్ఛగ పాడుచుండుటను చూచి – 'నీవు బ్రహ్మమువా?' యని అడిగితిని.

పక్షి : తప్పక నేను బ్రహ్మమునే. నిర్విచారమైన నా పాట బ్రహ్మమును వెల్లడి చేయుటలేదా.

పిమ్మట నొక మానవుని తీసికొని యతను బ్రహ్మమగునా యని ప్రశ్నించుకొంటిని. ఆతడు బ్రహ్మము కాదా. అతని కన్నులలో మెఱయునది, హృదయములలో స్పందించునది, శ్వాసలో ప్రవహించునదేమి? నిశ్చయముగ మానవుడు భగవత్స్వరూపమే. అతడు బ్రహ్మ మునకు ప్రతిబింబము. నేను ఊగుచున్న తరంగములనుండి సముద్రపు ఆవలి దిక్కునకు కదలికలేని జలమువంక దృష్టిని బఱపి చల, అచలములలో రెండింటిలో కూడ బ్రహ్మ సౌందర్యము ననుభవించితిని. ఆకాశమును, ఊర్ధ్వలోకమును, ఆలోకించి యా సౌందర్యము

ననుభవించితిని. అన్నిటికంటె నా యెదుట నుండి తన వెలుతురులో నన్ను స్నానమాడించు దేదీప్యమానమగు సూర్యుని యనంతమగు కాంతి కిరణములలో నా సౌందర్యము ననుభవించితిని. నా శరీరములో ప్రతి యణువునందు ప్రసరించుచున్న మహిమ, వెచ్చదనము కంటె సూర్యుని యందు నేనేమి పొడగాంచగలుగుదును? ఊయి, పువ్వు, పక్షి, మనిషి, ఆకాశము ఊర్ధ్వలోకము, అన్నిటిలో భగవంతుని సుందర ముఖారవిందమును గాన్పింప చేయు ఆ సుందర దృశ్యమెంత ధన్యమయినది!

ఉన్నతమైన పర్వతశ్రేణిలో త్వరితగతిని పరుగులిడు మేఘమాలికలలోను, మనపయి వీచుగాలిలోకూడ, భగవత్సాన్నిధ్యమును గాంచుట యెంత గొప్ప సంగతి! ఆనాడే, తన కాటులోకూడ సౌందర్యము ననుభవించునేమోయని పరీక్షించుట కాయనునట్లొక దోమ నన్ను కుట్టెను. అదే యభిన్న బ్రహ్మమును తనలోకూడ చూడగలుగుదునో, లేదోయని చూచుట కొక పసిరిక పాము ప్రత్యక్షమయ్యెను.

దైవ సౌందర్యపథమున నెన్ని చిక్కులు, పరీక్షలు! నిశ్చయముగ సత్యమార్గము మిక్కిలి యిరుకుగను మిట్టపల్లములతో కూడియుండును.

క్షురస్యధారా నిశితా దురత్యయా
దుర్గం పథస్తత్ కవయో వదంతి.

కఠోపనిషత్తు 3, 14.

ఆ మార్గము మంగలి కత్తివలె వాడిగనుండి, దాటుటకును, నడచుటకును కష్టముగ నుండునని జ్ఞానులు చెప్పుదురు. ఆ యొంటరి మార్గమున ప్రయాణము చేయువారుమిక్కిలి యరుదుగ నుందురు, బాధలకు పరీక్షలకు ఆగగలిగిన వారికి తుదకు సుఖములభ్యమగును. అట్టివారికి పగవానిపోటి, స్నేహితుని ప్రేమ అంతయునొక్కటే. కదలిపోవుమేఘము వలె నిందాస్తుతులు వారి సుందర దృశ్యము నేమియు చేయజాలవు.

యథార్థముగా నీ సుందర దృశ్యము జీవితమునందలి యొడుదుడుకుల తీవ్రమయిన బాధలు, పరీక్షలనుండి తుట్టతుదకు పరాదర్శనమునకు దారిచూపును. అచట నంతయు బ్రహ్మమే–ఆత్మసౌందర్యము–ఉపనిషత్తులు స్తుతించునట్లు కోటికోటి సూర్యులప్రభ.

న తత్ర సూర్యోభాతి న చంద్ర తారకం
నేమావిద్యుతోభాంతి కుతోవయమగ్ని:
తమేవ భాంత మనుభాతి సర్వం
తస్య భాసా సర్వమిదంద విభాతి!

కఠోపనిషత్తు : 5, 15

అచట సూర్య చంద్రులు, తారకలు విద్యుత్తు ప్రకాశింపవు. అగ్నిమాట చెప్పనేల? అది ప్రకాశించునపుడు వెనువెంటనే అన్నియు ప్రకాశించును. దాని వెలుగుచే నన్నియు వెలిగింపబడును.

దివి సూర్య సహస్రస్య భవద్యుగ పదుత్థితా

యదిభా! సదృశీసాస్యాద్భా సస్తస్య మహాత్మనః। గీత : 11, 12

ఆకసమున నొకే సమయమున సహస్ర సూర్యుల ప్రభోదయమైన, ఆజ్యోతి, విశ్వరూపుని కాంతికొకింత సరిపోయిన పోవచ్చును.

సర్వేజనా! స్సుఖినో భవంతు!

ఓం ఓం ఓం

(శాంతి ఆగస్టు 1955)

# 39. బౌద్ధమత సందేశం

బుద్ధం శరణం గచ్ఛామి.
ధర్మం శరణం గచ్ఛామి.
సంఘం శరణం గచ్ఛామి.
ఇది బౌద్ధుల నినాదము

దైవమును గురించి బుద్ధుడు మౌనము వహించినాడు. అతనికి ధర్మమే దైవము. కావుననే–

"“సోదరులారా!

ధర్మడిండిమము మ్రోగింపుడు,
ధర్మపతాక ప్రతిష్ఠింపుడు.
ధర్మ శంఖమును పూరింపుడు.

ధర్మమును, సత్యాహింసలను, మనసా, వాచా, కర్మణా ప్రకటింపుము” అని ప్రబోధించెను.

అందరి మతవాదులవలె బుద్ధుడు దైవము ఇట్టివాడు – అట్టివాడని నుడువలేదు. దైవము అవాఙ్మానసగోచరుడు. అట్టివాని గూర్చి చెప్పుటకు మాత్రమేమున్నది? అందులకే కాబోలు బుద్ధుడు ఈ విషయమై ఊరకున్నాడు.

దయ సర్వాభరణములలోను అమూల్యమైనది. కరుణయు, ప్రేమమునులేని హృదయము పుష్పవిహీనమైన ఉద్యానము వంటిది. ప్రేమ ఇగురొత్తని హృదయము కేవల స్మశానము.

బుద్ధుని ప్రవచన సారమిది. బాధలన్నిటికి కోరిక మూలకారణము. ఈ కోరకయే మానవుని పతనమునకు హేతువు.

ఆశయే బంధము; నిరాశయే ముక్తి.

నిర్వాణమే బౌద్ధుల పరమావధి. వారి నిర్వాణము వైదిక దర్శనములందలి మోక్షము వంటిది. బుద్ధుని అష్టాంగ మార్గము అనుసరించిన నిర్వాణము పడయవచ్చును.

బుద్ధుని గ్రహించుటకు బుద్ధుని యంతటివాడు కావలెను. కృష్ణుని యనుభవించుటకు కృష్ణుడే కావలెను. క్రీస్తును తెలిసికొనుటకు అట్టి మనస్సు కలవాడే కావలెను–ఇవి మహనీయులు చెప్పు మాటలు.

బుద్ధభగవానుని గురించి వ్రాయుటకు మొదలిడగా నా పూర్వానుభూతులు కొన్ని నెమరుకు వచ్చినవి. బుద్ధుని విగ్రహములను చిన్నతనము నుండియు చూచుచున్నాను. పావనమైన బుద్ధుని జీవితమును, ఉపదేశములను కూడ చదివియున్నాను. నా చిన్నతనమందే నేను బుద్ధభగవానుడు గయలో ఏ బోధివృక్షము క్రింద తపంబొనరించెనో ఆ మహాబోధి క్రిందనే బుద్ధభగవానునుని వలెనే పద్మాసనమున కూర్చుండి కొంత తడవు ధ్యానమొనరించితిని. ఏమి అదృష్టము! ఒక అపూర్వానుభూతిని పొందగలిగితిని.

అంతేగాదు ఆ పవిత్ర ముహూర్తమున ఆ ధ్యానావస్థలో ఒక్కమారు నా హృదయము బుద్ధభగవానుని అఖండ హృదయముతో శ్రుతి కలుపుకొన్నది. మన భారత దేశమునకేగాక, చైనా, జపాను, బర్మా మొదలైన విదేశములలోకూడ రకరకములైన ఆ బుద్ధభగవానుని విగ్రహములను చిత్తరువులను చూచియుంటిని.

నిరుడే తోటపల్లి కొండలలో నిర్వాణాశ్రమమును స్థాపించితిని. అచట సర్వమత సామరస్య చిహ్నముగ పద్మము, శిలువ, 'ఓం' కారము, చంద్రవంక కల విశ్వమత చిహ్నము 15 అడుగుల ఎత్తు కలది ప్రతిష్ఠించబడినది. నిరుడు లక్షపత్రిపూజయు యీ సంవత్సరము షష్ఠిపూర్తి మహోత్సవమునకు కోటి పత్రిపూజా మహాక్రతువును అచ్చటనే జరిగినవి. షష్ఠిపూర్తి పేరిట శ్రీ బుద్ధభగవానుని, శ్రీక్రీస్తుప్రభువుని, శ్రీకృష్ణదైవము యొక్కయు, శ్రీ గాంధీమహాత్ముని యొక్కయు నిలువెత్తున విగ్రహములను ఎత్తైన పీఠములమీద స్థాపించబడినవి. ఈ అవతారమూర్తుల విగ్రహములముందే పైన చెప్పిన విశ్వమత చిహ్నము ఎర్రని పద్మముతో ప్రకాశించుచున్నది. ఇది యీ వ్యాసము వ్రాయునపుడు నాముందు కానవచ్చు దృశ్యము.

ఈ విగ్రహముల వెనుక ఏమున్నదో చూడుడు! అట నిర్వాణ మందిరమున్నది. నిర్వాణమందిరమన పెద్ద అక్షరములు సిమ్మెంటుతో చెక్కబడినవి. ఆ అక్షరములవెనుక బౌద్ధమతసారాంశమైన మంత్రములకు మహామంత్రమైన "ఓం మణిపద్మిహమ్" అని సిమ్మెంటుతోనే చెక్కబడినవి.

ఓం మణి పద్మిహం

మణి పద్మములో నున్నది.

అమూల్యమైన ఆ తద్వస్తువు జ్యోతిరూపమున నీ హృదయపద్మమున కలదు. మానవుడా! ఆ ఆత్మమణి నీ హృదయ పద్మమందే యుండ, వెర్రి ఆలోచనలతో నద్దానికి బాహ్యలాంఛనములకు బానిసవై నామరూపములలో వెతకెదవేల? ఓం మణి పద్మిహం! అది లోపలనే యున్నది; నీ హృదయమునందే ఉన్నది. ఆ మణి నీకొరకు వేచియున్నది. ఒక్కమారు నిమీలిత నేత్రాలతో, దానిని  నిశ్శబ్దములో గుర్తించుము.

నేనీ వ్యాసమును వ్రాయుచుండగా చక్రవర్తియైన బుద్ధుడు, సర్వసంగపరిత్యాగియైన బుద్ధమూర్తి, చేత భిక్షాపాత్రనుగొని 'భవతి భిక్షాం దేహి' అనునట్లు నావైపు జూచుచున్నాడు.

ఇక లోపల నా గదిలో నేవంక చూచినను బుద్ధభగవానుని విగ్రహాలే–అతని పటములే. ఎటు చూచినను బుద్ధభగవానుడే. ఆ దివ్యమూర్తి సాన్నిధ్యము ననుభవించుటఎంత అదృష్టము–అతని విగ్రహములు, ప్రతిమలు, చిత్తరువులు నిరంతరము జూచుటవలన అతని సాన్నిధ్యము ననుభవించుట వీలుపడును. కాని, ఆంతర్యమున అమూల్యమైనబుద్ధ మణిని నిశ్శబ్దములో గుర్తించుట కష్టము. ఆ దివ్యమణి హృదయపద్మమున సాక్షాత్కరింప జేసికొనుటకు శ్రీ బుద్ధభగవానుని అష్టాంగ మార్గము ననుసరింపవలెను.

బుద్ధభగవానుని జీవితసారము విరోధమును, విద్వేషమును ప్రేమతో ఎదుర్కొనుట, విరోధులను ప్రేమతో జయించుటయును, జీవకారుణ్య మాతని జీవిత లక్ష్యము. మానువులయెడనే కాక పశుపక్ష్యాదులయందు కూడ యాతని కరుణ వెల్లివిరిసెను.

నిర్వాణము బౌద్ధుల పరమలక్ష్యము. నిర్వాణమన నేమియోకాదు. నిర్వికల్ప సమాధియే. కోటిసూర్య ప్రభాభాసితమైన ఆ అఖండ సచ్చిదానంద స్వరూపుడైన ఆ పరం జ్యోతిని అపరోక్షముగా సాక్షాత్కరింప చేసికొనుటయే. అహింస ఆత్మనిగ్రహము. సత్యము, సత్ప్రవర్తన, భూతదయ, చిత్తశుద్ధి, ధర్మమును జీవితమునందాచరించుచు జీవయాత్రను నడపుటయే మానవజీవితోద్దేశమని బుద్ధభగవానుడు తన సందేశము నందించినాడు.

సత్యము, జ్ఞానము, శాంతి, ప్రేమ, దయ ఏ మహనీయునిలో మూర్తీభవించినవో ఆ బుద్ధభగవానునికి ధన్యవాదములు.

**ఓం మణిపద్మిహం**

ఓం బుద్ధపరమాత్మాయనమః
లోకా స్సమస్తా స్సుఖినో భవంతు,
హరిః ఓం తత్సత్ ఓం.

అర్పణ

**ప్రాక్పశ్చిమ దేశాలలోని బుద్ధభగవానుని భక్తకోటికి అనుచరులందరకు, దుర్లభమైన మానవ జన్మకు గమ్యమైన నిర్వాణమును, పరిపూర్ణమైన శాంతిని వాంఛిస్తూ ప్రేమ పూర్వకంగా అర్పణ.**

సర్వేజనా స్సుఖినో భవంతు.
ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః (శాంతి మే 1956)

## 40. సంచార వైద్యసేవా దళము

భగవంతుడు రోగివలెను, పేదవాని రూపమునను లోకములో నవతరించుచుండు నని బ్రహ్మవిదులచే చెప్పబడినది. దేవుడు వీధులలో తిరుగాడు కుక్క మాదిరిగను, ఆకలిచే అల్లాడు పిల్లిపిల్లవలెను మనముందుగూడ సాక్షాత్కరించుచుండును. దైవము సర్వవ్యాప కుడగుటచే అన్ని రూపములును ఆయనకు చెందినవే యగును. ఎల్లజీవులలో నందముగ నగపడుచు, అందరి కన్నులలో దివ్యముగ ప్రకాశించుచు అఖిల ప్రాణులయొక్క హృదయము లలో తేజరిల్లుచుండుననుట నిశ్చయము. ఎవరు మానవుని, జంతువును, పక్షిని సహితము సమానముగ ప్రేమించునో అతడే దేవుని తీవ్రముగ ప్రార్థించుచున్నాడని చెప్పబడినది. ప్రతి మనుజుడును సంచలనముగల నొక దేవాలయమని నుడువబడినది. ఎవరు అన్ని ప్రాణులయొక్క ముఖములలో దైవమును వీక్షించుచున్నారో వారలే ఎంతయు ధన్యవంతులు!

సత్యము, భగవంతుడు వివిధ రూపముల వెలయుచుండుననుటయు ఆయన మన ప్రతి రక్తనాళము నందును నిండి నిబిడీకృతమై యుండి ప్రపంచమందంతటను వ్యాపించియుండి మనచెంత కేతెంచుచుండుననుట నిక్కువము. దేవుడు లేని స్థలమున్నదా? సర్వేశ్వరుని, పేదాకృతిలోను, రోగస్థితిలోను ఎవరు సేవించుచున్నారో వారలే ధన్యులు! పేదసాదలు, రోగపీడితులు, మనచెంతకు జేరజాలనప్పుడు మనమే వారి చెంతకుపోయి ఆకలి, చలి మొదలగు బాధలచే నల్లాడు వారియొక్క శరీరావసరములను తీర్చి వారివారి ఆధ్యాత్మికాభివృద్ధికి తోడ్పడి వారి సేవచేయుట ఎంతయు ఘనమగు మానవసేవయేగదా!

అన్ని దానములలోను, ఆధ్యాత్మికాభివృద్ధికి తోడ్పడుట మహాదానమగును. ఆకలి గొన్నవారికి అన్నమిడుటచే, వారి కప్పటికప్పుడే ఆకలి శాంతించును, బట్టలు లేనివారికి గుడ్డలొసంగి వారల ఆ యవసరమును తీర్చినను, వారికి మరి కొంతకాలమునకా కొఱత కలుగుచునేయుండును. అట్లనే ఒక రోగికి, చికిత్సచే వ్యాధినుండి విముక్తిని చేసినను, ఆతనికి మరల నా వ్యాధి రావచ్చును. అట్టి రోగగ్రస్తునకు ఒకానొక కళాశాలలో విద్యాభ్యాస మొనరింపజేసినను ఆతని జన్మ మృత్యు స్థితినుంచి తప్పించుట దుస్సాధ్యమేయగును. ఈ కాలపు విద్యాభ్యాసము తరుచు మనుజుల నిర్జీవులుగ నొనర్చును. గర్వపూరితులుగను, దురహంకారపరులుగను, ఆత్మజ్ఞాన రహితులుగను మార్చుచున్నది. ఈనాటి చదువులేమియు విద్యార్థులలో దేవుని గుర్తింప నెంతమాత్ర ముపకరించుటములేదు. ఆత్మ వికాసమొసంగి ఆత్మోన్నతికి తోడ్పడునదే అత్యంత శ్రేష్టమైన విద్యయననొప్పును.

ఇంద్రియలోలత్వమునకు లోబడని, సుఖముల కతీతుడై, భగవంతుని తెలియ పాటు పడుటకును, ఉత్తమస్థితికి గొంపోవుటకును ఘనముగ తోడ్పడునదే, పరమవిద్య యనబరగును. మానవుని దివ్యత్వమునకు మార్చగల, మహిమగల ఆత్మవిద్యా ప్రభావము వలన మానవుడు దివ్యత్వమును పొందును. ఆత్మ విద్యాప్రతిభలేని చదువువలన మనుజుడు పశువుగానో, యంత్రముగానో తయారగును. ఏలనన అట్టి విద్యకు పునాదిగాని మూలా ధారముగాని లేదు. ప్రతి మొగ్గయు పుష్పముగా నెట్లు వికసించునో, అట్లనే స్వార్ధరహితుల ఆశయములు తప్పక నెరవేరును.

ఈ తీరుననే తోటపల్లి పరిసర గ్రామముల ప్రాంతమునుండి ఒక భగతత్సేవాపరా యణుడు, స్వార్థత్యాగశీలుడును, ఐన ఒక వైద్య ప్రముఖుని, సహాయమును పేదలయొక్క, రోగులయొక్కయు చికిత్సార్థమైన సేవకై చిరకాలమునుండి ప్రయత్నించుచుంటిమి. క్రిందటి మాసమందే పింఛను పొంది విశ్రాంతి గైకొనిన హైదరాబాదు నివాసియగు డాక్టరు మాధవరావుగారియొక్క సేవాభాగ్యము బీదసాదలగు రోగుల చికిత్సకయి, దైవకృపవలన, ఆశ్రమాభివృద్ధికయి, అదృష్టవశమున లభించినది. ఇదివరలో వైద్యసహాయమేమో యెరుం గని పరిసర పల్లెగ్రామములలో, బీదరోగుల ఉచితమైన అమూల్య చికిత్సా సేవకై మిక్కిలి తోడ్పడు ఈ వైద్యసహాయమున కెంతయు ధన్యవాదములు, ఆశ్రమాభిమానులైన స్వార్థ రహితమైన సేవాసక్తితోగూడిన "కెప్టెన్" మార్కండేయ మహాశయుని సేవకు మహోపకారము కెంతయు కృతజ్ఞులము.

దూరమున సమీపములందుగూడ గల పల్లెలలోని, ప్రజాసమూహమునకుగూడ వైద్యసహాయము ప్రసరింపజేయుటెట్లు? పరమేశ్వర కృపయే ఇందులకు పరమ సాధనము. దేవుడు తన ప్రియతనయుల స్వల్పకోర్కెల నేమియైన తీర్చునుగదా, సంఘసేవాభిమానులగు

ప్రభుత్వమువారును, బోర్డు ప్రముఖులును, శ్రీశాంతి ఆశ్రమమును దర్శించి ఆశ్రమములో శాంతియుతముగ జరుగుచున్న సేవ నెంతయు కొనియాడి, ముందొక "వేన్" ద్వారా సహాయమొనర్చ వాగ్దాన మొసంగిరి. ఈ ప్రాంత పల్లెలలో ఈవిధమగు ముఖ్య సహాయ సంపత్తి గలుగుటంతయు నా హృదయమున కానందభరితమైన విషయమై యున్నది.

ఇప్పుడు, ఇంతకు ముందు నిర్వచించిన విధమున, ఆత్మోన్నతి కెంతయు తోడ్పడుచు ప్రబలమగు పునాదులపై గట్టబడిన విద్యాకృషియే నిజముగ సహకారియగును. భగవంతుడొకడే యనియు, విశ్వమంతయి బ్రహ్మమేయనియు, యెల్లరూపముల వెలుంగు ఆత్మ పదార్థమునే మనమెల్లపుడు సేవించుచున్నామను భావన పొందినపుడే మనము సేవానంద నొందుదుము. అట్టిచో భగవత్సేవయు మానవసేవయు దైవారాధనయై యొప్ప గలదు. అట్లు కానిచో మనము ప్రతిఫలాపేక్షగాని, ధనాశగాని, ఏ కృషి చేయక, వైద్య సహాయ మెవరికి జేయము. ఎక్కడ విశ్వప్రేమయుండునో, అక్కడనే సంపూర్ణ స్వార్థరహిత మగు సేవ యొప్పగలదు.

ఇప్పుడు వైద్యసహాయ దళమునుగూర్చి కొంతయోచింతము. ఈ వేన్ను ఉపయోగించి, మనము వైద్యసహాయమును గావించుటెట్లు? మనము ఈ "వేన్"లో పెద్ద ధ్వనితో ప్రచార మొనర్చు Mike శబ్ద విస్తీర్ణ మైకుయంత్రము నేర్పరిచి అందుమూలమున గ్రామస్థులందును ఆకర్షింపజేసి నిస్సహాయులగు నిరుపేదలగు రోగులయొక్క సేవచేయుటకు కోరుచుంటిమి. ఈ "వేన్" ప్రతి పల్లెయందును, బిగ్గరగా ప్రతిధ్వనింపజేయుచు తిరుగును. ఈ ధ్వనిగల యంత్రమువద్ద స్త్రీపురుష లెల్లరును, ఆబాలగోపాలమును గుమికూడ జేయును, ఇట్లు "వేన్" చెంతజేరు జనమునకు పారిశుద్ధ్యము ఆరోగ్య పరిశుభ్రత మొదలగు ప్రాథమిక, ఆరోగ్య సాధన విషయములను ప్రభోదించుచు, వాటిని ప్రదర్శన మూలముగా ప్రచార మొనరింప సంకల్పించితిమి. మేము చేయబూనిన ప్రచారమును బాగుగ చూచి పల్లెటూళ్ళ ప్రజలందరను భయముతో పిఱికి గొఱ్ఱెలవలె పాఱిపోక సింహమువలవలె గర్జించుచు తామందరును భగవంతుని బిడ్డలును, దైవస్వరూపులును అని ప్రకటింతురుగాక!

భగవంతుడు సర్వాంతర్యామిగావున ఆయన ఎల్లరి హృదయములలో నిండియు న్నాడు. గావున ఈ గుంపులుగా కూడు వారందరును పరస్పర సహాయమొనర్చుకొనుచు, ఐకమత్యముతో చెలంగుదురుగాక! ఎవరినివారు ప్రత్యేకముగ నొంటరిగ ప్రేమించుకొనుట పాడిగాదు. ఈ ఆశయము పల్లెలందలియు పట్టణము లందలియు ప్రజల హృదయములలో ప్రకాశించుగాక! "అందిరి కొరకును ప్రతివాడును ప్రతివానికొకందరను" పాటుపడ ప్రయత్నించవలెను. ఈవిధమగు ఆశయము అన్ని పల్లె పట్టణ ప్రదేశములలో వ్యాపింప జేయవలెను.

ఆధ్యాత్మిక సందేశ మందరకును తెలియచెప్పి భక్తులందరిచేతను “శాంతి ప్రార్థన” పఠింపజేసి, దానిని కంఠస్థ మొనరింపజేసి మా సంగీతోపాధ్యాయుడు “రఘుపతి రాఘవ రాజారాం” అను గీతమును గానమొనరింపజేయును. అప్పుడు మా డాక్టరుగారు రోగుల నందరిని చేరబిలిచి వారికి ప్రత్యేకముగ నొకరికొకరికి చికిత్స చేయుదురు. అక్కడ దాది, కూడ చిన్నపిల్లల నతి ప్రేమతో చెంతదీసికొన వాళ్ళకు కళ్ళు కడుగుట చెవులను పరిశు భ్రపరచుట మొదలగు ఆరోగ్యసేవ వారికి అవసరమైనవి ఎంతయో చేయును. ఏ రోగికైనా వ్యాధి హెచ్చుగ నున్నచో నట్టి రోగిని వేన్‌లో నెక్కించికొని ఆశ్రమ మందున్న ఆసుపత్రికి (వైద్యాలయము) లోనికి తీసుకొనివచ్చి, తగిన మందులను, ఉపశాంతులనుపథ్య పానములను తగిన రీతిని చేయించి, వారిని అతి ఆదరముతో మరల ఆరోగ్యమార్గమునకు మరల్చుట జరుగును. ఆ రోగికి బాగుగ నారోగ్యమమరిన పిదప వానికి తగిన వస్త్రములిచ్చి, అతనిని తన నివాసస్థలమునకు చేర్చబడును. రోగస్థితిలో చికిత్సను పొంది క్రమముగా దైవశిక్షను పొందినవారలు ఆరోగ్యము కలిగిన పిదప వారి స్వగ్రామములలో ఆధ్యాత్మిక ప్రచార మొనరింప సహాయపడగలడు. ప్రతిఫలము నపేక్షింపకయే బహిరంగముగ చాటకయే ప్రశాంతముగ అట్టివారు వారి వూరివార లందరకును, సేవచేయుట ఎంత దైవప్రీతికరమగు సంఘసేవయోగదా! ఇట్టి నిరాడంబరమును, నిశ్చలమును ప్రశాంతితో గూడినదియునగు సేవ ప్రతిఫలాపేక్ష లేకయే చేయుటెంత ప్రశంసాపాత్రము. మేమీ సేవను, పేరు ప్రతిష్ఠలకుగాని, ప్రఖ్యాతి కొరకుగాని బహుమతులగోరి గాని ఎంత మాత్రమును చేయుటలేదు. ఈ సేవాదీక్ష మేము మా ఆత్మశాంతికిగాని మోక్షసాధనము నకుగాని, ఆత్మ స్వాతంత్ర్యము నపేక్షించిగాని చేయనుద్దేశింపక కేవలమును భగవంతుని బిడ్డల సేవించుటకు మాత్రమే చేయుచున్నాము. శ్రీశాంతి ఆశ్రమముయొక్క మూలధర్మము ప్రత్యేక వ్యక్తి శాంతియే, ప్రపంచ శాంతికి దారితీయగలదని ఎప్పుడును నిరాఘాటముగ ప్రకటింపబడుచున్నది. అందుచే, ఈ శాంతి, హృదయమునుండి హృదయమునకు, ప్రతి గృహమునుండియు సంఘమునకును, పల్లెపల్లెలకును క్రమముగ ప్రపంచమంతటను వ్యాపించి విస్తారముగ నాటుకొనవలెను. ఇవ్విధముగ భగవంతుని తోటలో దైవవుద్యానవన ములో మా స్వల్ప కృషియు సేవయు ప్రముఖతగాంచి ఫలవంతమై, స్వచ్ఛమై, శుభ్రమై, నిష్కళంకమై దేవుని శాంతి దివ్యోద్యానమునందు, తేజోవంతమై ప్రకాశించుగాక! భగవదేచ్ఛలేనిదే మనమంతట మనమొక గడ్డిపోచనైన కదల్పలేము. ప్రపంచమను ఎండమావులలో ప్రతిఫలించి ఆకాశములో పరుగిడు కీర్తియను మేఘములను క్షణిక సుఖముల వెంటాడించుచు, అజ్ఞానాంధకారములోబడి శరీర వాంఛలకై పరితపించేవారి జీవితములు విషాదకరము.

దేవుని బిడ్డలను సేవించుటకే ఈసంయుక్త వైద్య దళసహాయమెంతయు తోడ్పడ, ఈ పేదసాదల సేవాభాగ్యము చేయ సేవా బీజములను బాగుగ నాటజేసిన, మన హృదయ ములలో ఒక్కరై ప్రకాశించు దివ్యతేజోమయునకు, మన మన ప్రస్తుతులును ఆయన సంతత సేవాభిలాషతోగూడిన మన గౌరవమర్యాదలును చెందుగాక! ఆ మహామహుడే మన అండయై, బలమును జీవశక్తి ప్రదాతయునై మన గమ్యస్థానమై యొప్పుగాక!

భగవంతుని ఆశీర్వచనములే పదింతలుగ మనలన రక్షించి ఆయన ప్రేమాలింగన ములో మనము శాశ్వతప్రేమను అమరత్వమును అనుభవించి వీరు వారనక ఎల్లజనులును ఆయనంతుని సాన్నిధ్యసుఖ మనుభవింతురుగాక!

ఈ నా సందేశమును "శాంతి" పత్రికను చదువుచు, శాంతి ఆశ్రమ పురోభివృద్ధిని నిరంతరమును గోరుచు, "ప్రపంచ శాంతి" ప్రార్ధనను పఠించుచు నున్న భక్తులందరి ఆశీర్వాదముల నపేక్షించుచున్నాను. "సేవ" యనునొక చిన్న పద్యముతో యీ సందేశమును ముగించుచున్నాను.

## సేవ

స్వాధీనముగనున్న సాధనలందు
దళముగా నున్నట్టి పద్ధతులందు
అనువుగా నున్నట్టి యన్నిచోటులను
అమరిక కల్గిన యన్నికాలముల
వారు వీరన కెల్లవారికి నీవు
ఎందాక నీ శక్తి కందుబాటగునో.
యందాక మేలు కూర్పందలకొనుము.
అదే పరమేశునకు సేవాంజలి సఖుడ!

తూర్పు పడమరగల తన బిడ్డల నందరిని భగవంతుడు బ్రోచుగాక! ప్రాక్పశ్చిమముల తూర్పుపడమరల నొప్పు ఎల్ల సేవాభిరతులకును ఈ సందేశము ప్రేమ పూర్వకముగా సమర్పింపబడినది.

హరి ఓం తత్సత్. ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

(శాంతి మార్చి 1957)

# 41. స్వకీయము

మారుటయే స్వభావముగల యీ ప్రపంచమున మార్పు తప్పదు. కాని మార్పులేని దేవలోకమున లేక సత్యలోకమున మార్పుల కతీతమైననిత్యమయిన సత్యమున్నది. ఏకము, అద్వితీయమగు ఒక ఆత్మకే అంకితము చేసిన వారి మనస్సులు హృదయములు సుస్థిరముగా నిల్పినవారే ధన్యులు. 1959 నూతన సంవత్సరారంభమున వాల్తేరు నుండి తోటపల్లికి శాంతి ముద్రణ పరికరములు మార్చుట మొదలుకొని అభివృద్ధియేగాక అత్యధికాభివృద్ధి నొందుచున్న చాల మార్పులను ఆనందముతో జూచుచు పీస్ శాంతి రెండు పత్రికల సత్వరాభివృద్ధి కోరుచున్నాము.

విద్యాధికులు భక్తిశ్రద్ధాసక్తి సమన్వితులు "పీస్" పత్రికా సంపాదకులగు డాక్టరు శ్రీ వేపా నరసింహముగారు (ఎమ్.ఎ.పిహెచ్.డి.) 70వ సం॥ము వచ్చుటచే విశ్రాంతితో శాంతియుతముగ జీవిత శేషము గడపదలచి బెంగుళూరు వెళ్ళుచున్నారు. గౌరవార్థమై స్వార్థరహితముగ జేయుచున్న వారి సేవను కోల్పోవుటకు మేము మిక్కిలి విచారించు చున్నాము. ఇంతవరకు వారు ఆశ్రమ విషయమై చూపిన అమూల్యమగు సానుభూతికి "పీస్" పత్రికకు చేసిన నిగూఢమైన సేవకు మా హృదయపూర్వకమైన వందనముల నర్పించుచున్నాము. వీరు "పీస్" పత్రికా సలహా సంఘసభ్యులు గావున "పీస్" పరితులు వీరి విజ్ఞానప్రదములగు వ్యాసములకు దూరము కారు.

మన కోటగిరి, నీలగిరి శాంతి నిలయమునకు, అధ్యక్షురాలు, భారతదేశమునకు నిగూఢ మిత్రురాలునగు సోదరి లలితాదేవి మన "పీస్" పత్రికకు గౌరవ సంపాదకురాలుగా నుండుటచే సంతోషించుచున్నాము. సర్వ సమత్వముగల మనస్సుతో సర్వ సామాన్యమగు ప్రేమమయ దృష్టితో బహు గ్రంథములను రచించిన ఆమె ప్రేమ ఆధ్వర్యముల మూలముగా మన "పీస్" పత్రిక భవిష్యత్తులో కూడ ప్రఖ్యాతతో వర్ధిల్లగలదని దృఢముగా నమ్ముచున్నాము. డాక్టరు జ్ఞానానందస్వామీజీగారి (డి.యన్.సి.పి. హెచ్.డి. గౌతమి ప్రొఫెసరు, పరమాణు శాస్త్రశాఖాధ్యక్షులు, ఆంధ్ర విశ్వవిద్యాలము, వాల్తేరు) సానుభూతి, ఆశీస్సులతో నూతన సంవత్సరాది నుండి భావిలోకూడ "పీస్" అభివృద్ధి విషయమునను శ్రీ శాంత్యాశ్రమము ధన్యమైనది.

డాక్టరు సచ్చిదానందమూర్తిగారు (ఎమ్.ఎ.పి.హెచ్.డి. తత్వశాఖాధ్యక్షులు ఆంధ్ర విశ్వవిద్యాలయము, వాల్తేరు) సోదరి జమునాబాయ్ (డైరక్టరు, మహిళాభ్యుదయ సంఘము, ఆంధ్రప్రదేశము, హైదరాబాద్) శ్రీ ఎమ్. అయ్యన (బి.ఎ.ఎల్.ఎల్.బి. రాజమండ్రి) వీరి ముప్వురి యొక్క సానుభూతి ప్రార్థనల వలనను మన "పీస్" "శాంతి" పత్రికలు ధన్యత నొందినవి.

సుప్రీంకోర్టు న్యాయవాది, మరియు విదేశవ్యవహార మంత్రి వర్గమునకు గౌరవ న్యాయ సలహాదారున్ను అగు శ్రీ నారాయణ (ఎమ్.ఎ.బి.ఏ.) గారికి మన "పీస్" "శాంతి" పత్రికల అభివృద్ధియందు ప్రాచ్య పాశ్చాత్య దేశములలో శాంతి ప్రార్ధన వ్యాప్తిలోనికి తెచ్చుట యందు ఆసక్తి, సానుభూతి యుండుటవలన ఆనందించుచున్నాము.

శ్రీమతి ఇర్మగార్డ్ జియోర్గషుల్జు (గంగామయీ-జర్మని), శ్రీమతి జాన్. బి. హేవార్డు (జ్ఞానదేవి) న్యూయార్క్; కుమారి ఎలిజిబత్ అషెలిష్ (ది లేడీ ఆఫ్ కేలండర్ రిఫార్మ్) మన పీస్ పత్రికకు ఎల్లప్పుడు సహాయముచేయుచు ఆశ్రమాభివృద్ధిని కోరుచు పీస్ పత్రికా సలహా సభ్యురాండ్రుగా నున్నందులకు పరమానంద భరితులగుచున్నాము.

ఆర్థికమంత్రిత్వ శాఖ యందలి కంపెనీ-ఎడ్మినిష్ట్రేషన్ శాఖాధ్యక్షులు మన ఆశ్రమా ధ్యక్షులయిన శ్రీ తెన్నేటి విశ్వనాధంగారు; ఉపాధ్యక్షులు శ్రీ వి.ఎల్.ఎన్.మూర్తిగారు (రిటైర్డ్ డిప్యూటీ డైరక్టర్ ఆఫ్ పోష్టు అండ్ టెలిగ్రాఫ్) శ్రీ శాంత్యాశ్రమముయొక్క సర్వతోముఖా భివృద్ధికి తోడ్పడుచు సముచితమైన సలహాల నిచ్చుచున్నారు. ఉత్సాహ పూరితమైన సాను భూతితో సహాయముతో ఆశ్రమమును ఆదర్శప్రాయమైన శాంతి నిలయముగాను సత్యా న్వేషణ తత్పరులకందరకు శాంతి ప్రచారక కేంద్రముగావించుచున్న ప్రాచ్చపాశ్చాత్య దేశస్థులైన అందరు సభ్యులకు మిత్రులైన ఆశ్రమ శ్రేయోభిలాషులకును మా కృతజ్ఞతాభివందనముల నర్పించుటకీ యవకాశమును వినియోగించుకొనుచున్నాము.

ఓ ప్రియమైన శాంతి పాఠకులారా! శాంతిని కోరువారందరకును శాంత్యాశ్రమము సమిష్టి ఆస్తి. అందుచే "శాంతి" మీదే కావున ప్రాచ్య పాశ్చాత్య దేశములలో సత్యాన్వేషణ తత్పరుల కందరకును ఇది మిక్కిలి సహాయకారిగా నుండి యుపయోగపడునట్లు చేయుటకు మీ సాహాయ్యమును, సానుభూతిని కోరుచున్నాము.

మానవులలోను నానాజాతులందును శాంతి సామరస్యముల వ్యాపింపజేయుటకు మాకు తోడునీడగా నున్న మన మిత్రుల క్షేమమునకు శాంతి పాఠకుల శ్రేయస్సుకు భగవంతుని అమూల్యములయిన యాశీస్సులకు వేడుచున్నాము.

సర్వేషాం శాంతిర్భవతు ఓం - ఓం - ఓం

అనువాదకులు : మోడేకుర్తి సత్యన్నారాయణ, వాల్తేరు

(శాంతి జనవరి & ఫిబ్రవరి 1959)

# 42. సంకల్పమే బంధము

సంకల్పమాత్రాన, సంభవమే బంధః అని ఉపనిషత్తులు ఘోషించుచున్నవి. నామ రూపములతో గూడియున్న బ్రహ్మాండమైన యీ సృష్టి అంతయు సంకల్ప ఫలితమే అని బ్రహ్మవిదులు నుడివియుండిరి. సంకల్పమే మనుజుని బానిసగా అస్వతంత్రునిగా జేయుచున్నది. తామసమైన సంకల్పనలు బంధించుచున్నవి. సాత్వికమైన సంకల్పనలు విముక్తి నిచ్చుచున్నవి. సంకల్పము తామసమైనదియైనను, సాత్వికమైనది యైనను సంకల్పము సంకల్పమే, గొలుసులు, బేడీలు యినుముతో చేయబడినను, బంగారముతో చేయబడినను అవి సంకెళ్ళే. బంగారపు సంకెళ్ళుగూడ బంధించగలవు గదా.

గాన సంకల్ప రాహిత్యులదే మోక్షమని అనుభవజ్ఞులు చాటుచుండిరి. గాని ఏ సంకల్పము లేకుండ యుండుట దుర్లభముగదా! ముఖ్యముగా సంకల్ప రాహిత్యమైనస్థితి, సామాన్యులకు దుర్లభమేగాక అసాధ్యమని జెప్పవలసియుండన్నది. అందుచేతనే తామసమైన సంకల్పనలను రాజసమైన సంకల్పనలను సాత్వికమైన సంకల్పనచే జయించి చివరకు సాత్వికమైన సంకల్పనలకుగూడ అతీతులై యుండవలెనని శాస్త్రములు, అనుభవజ్ఞులు ఏకగ్రీవముగా నిరంతరము బోధించుచుండిరి. సర్వములో గూడియున్న చెడు సంకల్పము సుడిగాలివంటిది. దాని ప్రారంభావస్థను చిన్న మర్రివిత్తునకు పోల్చిజూడుడు. ఆ చిన్న మర్రివిత్తు అనే సంకల్పమును నాటిన దానినుండి మొక్క వచ్చును. ఆమొక్క విశాలమైన పెద్దవృక్షమై కోటానుకోట్ల మర్రివిత్తులను గలుగజేయును. యీ కోటానుకోట్ల విత్తులను సంకల్పముల నన్నిటిని పాతిన మరల వాటి వుత్పత్తిని సంఖ్యను సంఖ్యలలో లెక్కపెట్టుటకే అతీతమై అగ్రాహ్యముగా యుండును.

అటులనే యీ బ్రహ్మాండమైన సృష్టి అంతయు వివిధ కోరికలతో గూడికొనియున్న మానవుని జీవితమంతయు ప్రారంభమున చిన్న మర్రివిత్తునుండియే మొదలిడెను. మోక్షాపేక్షగల్గిన తత్వవిదులు సంకల్పములకు చాలా దూరముగా యుండవలెను. తెలిసి తెలియకయో, వాసనా బలిమిచేతనో, సహవాసదోషముచేతనో ఏమాత్రము తావును సంకల్పమునకు వారి జీవితములో యిచ్చినను దాని ప్రభావము సుడిగాలివలె పరిణమించును, సంసార మనెడి యీ మహా సముద్రములో జీవుడినావ సంకల్పమనెడి సుడిగాలిచే కట్టబడి అగాధమైన అజ్ఞానములో మునిగిపోవుచున్నది.

ప్రారంభములో మనకు తెలియకుండగనే సంకల్పము అల్పమైన చిన్న గాలిగా ప్రారంభించి అదియేమహా సుడిగాలిగా మారి యెట్టి జీవితమైనను ధ్వంసము జేయుచున్నది.

ఈ భావననే శ్రీ కృష్ణభగవానులు గీతలలో ఈ క్రింది శ్లోకములలో విపులముగా

విషయ వస్తువుల గురించి ఆలోచించినంత మాత్రమున ఎటుల మానవుడు అధోగతిని చేరుచుండునో నుడివియుండిరి.

శ్లో॥ ధ్యాయతో విషయాన్ పుంసస్సంగస్తే షూపజాయతే
సంగాత్సం జాయతే కామః కామాత్క్రోధోభి జాయతే ॥ అ. 2-62

శ్లో॥ క్రోధాద్భవతి సమ్మోహ స్సమ్మోహాత్ స్మృతి విభ్రమః
స్మృతిభ్రంశా ద్బుద్ధినాశో బుద్ధినాశా త్ప్రణశ్యతి॥ -62

తా॥ ఒక పదార్థమును తలచుట లేక చూచుట లేక వినుట దీని వలన సంగము కలుగుచున్నది. దానియందున్న గుణాగుణ విచారణ చక్కగా చేయక దానినే నాల్గు పర్యాయ ములు మననము చేయుటవలన కామ మేర్పడుచున్నది. ఆ కోరికపై మనస్సుంచుటవలన అది నెరవేరియే తీరవలయునను పట్టుదల కల్గుచున్నది. లేక అది నెరవేరకుండ అడ్డ పడు వారలపై కోపము కలుగుచున్నది. ఆ కోపమువలన తెలివి నశించుట, అందువలన మంచి అడుగంటుట పెద్ద పిన్న తారతమ్యము తెలియక కాని పనులు సైతము చేయుట, అందుకు తన బుద్ధి నశించుట, అందువలన తానే భ్రష్టుడగుట సంభవించును.

రాజసముతో గూడియున్న కోరిక యెంత హానికరమైనదీ, శ్రీకృష్ణభగవానులు గీతలో మరల మూడవ అధ్యాయము 37వ శ్లోకములో జెప్పుచు ఆ అధ్యాయమును కొదువ ఈ క్రింద వ్రాసిన శ్లోకములలో సంకల్పమును మనోబలిమి చేతను, బుద్ధికుశలత చేతను జయించి ఆత్మనిష్ఠను స్థిరము జేసెడి మార్గమును సూక్ష్మముగా వుపదేశించియుండిరి.

శ్లో॥ కామేష క్రోధ ఏష రజోగుణసముద్భవః
మహాశనో మాహాపాప్మా విద్ధ్యేన మిహవైరిణమ్॥ అ. 3-37

తా॥ కామముచే ప్రేరేపింపబడి (ఆశకులోనై) పరధర్మ మాశ్రయించుచు, పాపమును చేయుచున్నారు. ఈ కామ క్రోధములు రజోగుణము నుండి పుట్టినవి. వీనిని శత్రువులుగా భావించవలయును.

శ్లో॥ ధూమేనావ్రియతే వహ్నిర్యథాదర్శో మలేన చ
యథోల్బేనావృతో గర్భస్తథాతే నేదమావృతమ్॥ అ. 3-38

తా॥ అగ్ని పొగచే కప్పబడుచున్నది. ప్రయత్నముచే ఊదినచో మాయమైపోవు చున్నది; అద్దము మురికిచే కప్పబడియున్నది. కడిగినచో మురికి పోవుచున్నది. పిండము మావితో కప్పబడియున్నది. అట్లే జ్ఞానము కామముచే (కోరికలచేత) కప్పబడి యున్నది. ఆ కామమును తీవ్ర వైరాగ్యముచే పోగొట్టవలయును.

శ్లో॥ ఆవృతం జ్ఞానమేతేన జ్ఞానినో నిత్య వైరిణా।
కామరూపేణ కౌంతేయ । దుష్పూరేణానలేన చ॥ అ. 3-39

తా॥ అగ్నిహోత్రమువలె పూరింప శక్యము గానిది కామము. జ్ఞానికి నిత్య విరోధియై యున్నది. అజ్ఞానికి ప్రాణస్నేహితునివలె నున్నది.

శ్లో॥ ఇంద్రియాణి మనోబుద్ధి రస్యాధిష్ఠానముచ్యతే
ఏతైర్విమోహయత్యేష జ్ఞాన మావృత్య దేహినమ్॥ అ. 3-40

తా॥ ఇంద్రియములు, మనస్సు, బుద్ధి ఈ కామమునకు ఆశ్రయస్థానములు. ఈ కామమే జ్ఞానమును మరుగుపరచి దేహధారిని మోహింపజేయుచున్నది.

శ్లో॥ తస్మాత్త్వ మింద్రియాణ్యాదౌ నియమ్య భరతర్షభ ।
పాప్మానం ప్రజహిహ్యేనం జ్ఞాన విజ్ఞాన నాశనమ్॥ అ. 3-41

తా॥ జ్ఞానమును, విజ్ఞానమును నశింపజేయు కామమును జయించుటకు ఇంద్రియ నిగ్రహమే గొప్ప సాధనముగా ముందంగీకరింపవలయును.

శ్లో॥ ఇంద్రియాణి పరాణ్యాహురింద్రియేభ్యఃపరం మనః
మనసస్తు పరాబుద్ధిర్యో బుద్ధేః పరతస్తు సః॥ అ. 3-42

తా॥ ఇంద్రియములకంటె మనస్సు, మనస్సుకంటె బుద్ధి, బుద్ధికంటె ఆత్మ శ్రేష్ఠములైనవి.

శ్లో॥ ఏవం బుద్ధేః పరం బుద్ధ్వా సంస్తభ్యాత్మాన మాత్మనా ।
జహి శత్రుం మహాబాహో కామరూపం దురాసదమ్॥ అ. 3-43

తా॥ అర్జునా! బుద్ధిచేత మనస్సును నిగ్రహించి ప్రబల శత్రువగు కామమును సంహరింపుము.

సంకల్పాతీతులైన బ్రహ్మవిదులకు ధన్యవాదములు.

సత్సంకల్ప రాహిత్యమే మోక్షము.

లోక స్సమస్తా స్సుఖినో భవంతుః

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః॥

(శాంతి జనవరి & ఫిబ్రవరి 1960)

# 43. సోదరి సుశీలాదేవి ధనరాశులు

నీ ధనము యున్నచోటనే, నీ మనస్సు యుండును. అని ఒక మహనీయుడు నుడివి యుండెను. ఇంటిలో బల్లమీద వెయ్యి రూపాయలు మరుపుచే, వదలివేసి, సినిమాకు వెళ్ళినను, గుడిలోనకు వెళ్ళినను నీ మనస్సు, సినిమాలో బొమ్మలను, గుడిలో దైవమును జూచుటకు బదులు ఇంటిలో వదలి వేసిన డబ్బు గురించియే ఆలోచించుచూ, వెంటనే ఆ డబ్బును జాగ్రత్త జేసుకొనుటకై పరుగెత్తెదవు.

నీకున్న ధనము, నశించెడి, తుప్పు బట్టెడి, దొంగల నపహరించెడి, బాహ్యధనము గాక, ఆత్మధనమైయున్న అప్పుడు నీ మనస్సు నీ ఆత్మయందే దైవమునందే యుం డును. సోదరి సుశీలాదేవి ఆశ్రమమునే తన శాశ్వతమైన ధనముగా జేసుకొని దాని వృద్ధికై ఇరువదియైదు సంవత్సరములు అహర్నిశములు పాటుబడెను. తన తల్లితండ్రులు సుస్తీగా యున్నప్పుడు ఆమె అమెరికా వెళ్ళినను, ఆమె మనస్సు సదా ఆశ్రమ వృద్ధినే కోరుచు ప్రతీ నెలా, ధన సహాయమును ఆశ్రమ పోషణకై పంపుచుండెడివారు. ప్రతీ వుత్తరములో డాలరు బిల్లులో, ఏదో చెక్కుయో, వుంచెడివారు. కడసారి ఆమెకు అమెరికాలోయున్న ఆస్తి అంతయు పోగు జేసుకొని, ఇంక మరల అమెరికా వెళ్ళకుండగా, హిందూదేశములోనే వుందునని, స్థిరము చేసుకొని వెళ్ళిరి. కొన్ని వుత్తరములలో, యీ క్రింది రీతిగా ఆశ్రమవృద్ధిని కోరుచు వ్రాస్తిరి.

నా సోదరికి చాలా డబ్బు వున్నది. ఆమెకు పిల్లలు కూడ లేరు. గాన నా డబ్బు ఆమెకు అవసరములేదు. నా సోదరుడు బ్రహ్మచారి, డాక్టరు, గాన ఆయనకుగూడ నా డబ్బు అవసరములేదు. గాన నాకు వున్న ప్రతీ సెంటు–ప్రతీ నయాపైసయు శాంతి ఆశ్రమమునకే చెందవలెనని చెప్పుచూ, వ్రాయుచుండెడివారు.

కర్మ సూత్రములు అగ్రాహ్యములు, వాటి నెవ్వరూ దాట జాలరుగదా! సోదరి సుశీలదేవి ఒకటి తలచిన దైవము వేరొకటి తలచెను. ఇంక వారం, పది రోజులలో హిందూదేశము వచ్చివేయుటకు సిద్ధమవ్వుచుండ, ఒక్కనాటి రాత్రి ఆమెయు, ఆమె సోదరుడును కలసి న్యూయార్కు వెళ్ళి మంచులో వచ్చుచుండిరి. వారి ఇల్లు జేరుకొనుచుండ, అంతలో వెనుక నుండి ఒక డాక్టరు పెద్దకారు వచ్చి వారి ఇంటి ముందే, ఇద్దరినీ హఠా త్తుగా మీదబడి చంపి వేసెను. ఎంతక్రూరమైన దుర్మరణము! విషాదకరము! వెంటనే ఆమె సోదరి, ఈ హృదయ నిర్భేధకమైన వార్తను టెలిగ్రాం ద్వారా తెలియపర్చెను. మేము నమ్మలేకపోతిమి. మరల సానుభూతి టెలిగ్రాములు, వుత్తరములు పంపితిమి. ఎన్ని సాను భూతి వుత్తరములు, టెలిగ్రాములు వ్రాసినను పోయిన ప్రాణము మరలరాదుగదా!

శ్రీ సుశీలదేవి శరీరము పోయిన వెంటనే, ఆమె సోదరి తరుచు వుత్తరములు వ్రాయుచు, ఆశ్రమవృద్ధికి తోడ్పడెదనని, హఠాత్తుగా, బలవన్మరణముచే ఇన్సూరెన్సు డబ్బు వారి మృత్యుకారకుడైన డాక్టరు ఇవ్వవలసియుండునుగాన, దానికై తిరుగుచుంటిననియు, అది అందగనే సుశీలదేవి పేరున శాశ్వతమైన సహాయము చేయుదుననియు, ఆశ్రమ సంబంధమైన పుస్తకములు, వుత్తరములు, వస్తువులు సుశీలదేవి పెట్టెలలో యున్నవని వాటినిగూడ పంపెదనని వ్రాయుచుండెడిది. మృత్యువు ఇన్సురెన్సు డబ్బు 50 వేల డాలర్లుయైనా వచ్చియుండును. అనగా రెండు లక్షలు పైగా వుండును. ఆమె సోదరిని, శ్రీ సుశీలదేవి పరీక్ష ప్యాసుయైన (Trained Nurse) ఆమె హృదయమునకు సన్నిహితమైన ప్రసూతి కేంద్రమును కట్టించమని కోరితిమి. స్వల్పమైన యీ సేవను సుశీలదేవి జ్ఞాపకార్థముగా, ఆనందముతో జేయునని నమ్మి వుంటిమి.

క్రమముగా మా వుత్తరములకు జవాబు గూడ వ్రాయుట మానివేసెను. డబ్బు హెచ్చుయైన కొలదీ, ఆమె సోదరి సుశీలను, ఆమె హృదయమునకు సన్నిహితమైన శాంత్యాశ్రమమును, హిందూదేశమును, ఆమె వాగ్ధానములను, దైవమునుగూడ మరచిపోయెను. సోదరి సుశీల డబ్బు అంతయు ఆమె తీసుకొనెను. సుశీల ప్రేమ, భక్తి, కరుణ, దయ సేవాపరత్వము మాలో ప్రవేశించెను. డబ్బుతో ఆమె సోదరి తృప్తిపొందెను. సుశీలగారి ప్రేమ తత్త్వము, ఆత్మానుభవముతో, మేము తృప్తిపొందుచుంటిమి. సోదరి సుశీలాదేవి అమెరికాలో చనిపోయినను, ఆమె మనస్సు హృదయము, ఆమెకు ప్రియతుల్యమైన ఆశ్రమము యందే వున్నవి. గాన ఆమె ఆత్మ ఆశ్రమవాసులలో మా అందరిలో ప్రవేశించి శరీరము పోయినను, అనేకమైన పనులు పెద్ద ఆసుపత్రి, గురుకులము మొదలైనవి. గవర్నమెంటు వారి సహాయముతో గూడ జేయించగల్గెను.

అమెరికా వెళ్ళినప్పుడు, త్వరలో ఆమె వచ్చుటకు ప్రయాణమవ్వుచు, ఆశ్రమంలో కారులేక ఇబ్బంది పడుచుంటిమని ఏదైనా వాడిన Second Hand Car తత్కాలికముగా కొనమని, తాను వచ్చేటప్పుడు కొత్తకారు అమెరికా నుండి తెచ్చుచుంటినని వ్రాయుచు రూ. 2500 లు చెక్కు పంపెను. దానితోనే సుశీల శకటమునుకొని, ఆమె పేరున వాడుచుంటిమి. సుశీలగారి భౌతిక దేహము అమెరికాలో, ఆమె సోదరి గృహముందే పోయినను, ఆమె ఆత్మ హిందూదేశము వచ్చి ఆశ్రమంలో వుండియే ఇదివరకు కంటె అశరీరిగా గొప్ప సేవ జేయుచుండిరని, మా నమ్మకము. ఆమె సోదరి గల్గించిన నిరాశనుగూడ ఆమె ఆత్మ చాల బాధపడుచుండెనని, తలచెదము. శరీరము పోయినను సోదరి సుశీలాదేవి 25 సంవత్సరములుకు ఆశ్రమవృద్ధి కోరుచు జేసిన గొప్పపనులు, ఆమె పేరున శాశ్వతముగా

మిగిలియేయున్నవి. తోటపల్లి ఆశ్రమంలో ఒక సుశీల భవనము రెండు అంతస్తులమేడ యున్నది. వాల్తేరులో గూడ సముద్రపు ఒడ్డున ఒక సుశీల మందిరమున్నది. తోటపల్లిలో చక్కనైన సుశీల ఆసుపత్రి కట్టబడెను. దానికి ఇరువైపులా స్త్రీలవార్డు, పురుషులవార్డు, ఒక్కొక్క వార్డులో 10 బెడ్సు యేర్పర్చవలెనని నిశ్చయించి అమెరికాలో యున్న మరొక సోదరి సహాయముతోను, చైనాలో యున్న ఒక్క జనని సహాయముతోను, ఇంతవరకు రెండు వార్డులకు పునాదులతో, Foundations యెత్తు వరకు రాయితో కట్టించగల్గితిమి. 5 సంవత్సరములు గడచినా, వార్డులు పూర్తిచేయలేకపోతిమని, హఠాత్తుగా, సోదరి సుశీలాదేవి బాధపడుచున్నట్లు ఈ మనస్సు చింతించ దొడగెను. అప్పుడు నేను యే రీతిగానైనను, నా సర్వము అర్పించి శాయశక్తులా అహర్నిశములు కృషిజేయుచు, ఈ రెండు వార్డులను వచ్చే క్రిష్టమస్‌కు పూర్తి చేయుశక్తిని ప్రసాదించమని దైవమును ప్రార్ధించుచుంటిని.

టైము చాల తక్కువగా యున్నను–అనేకమంది ఆశ్రమభక్తులు, ఆశ్రమాభిమానులు వారి ప్రేమను, సానుభూతిని పంపసాగిరి. సుశీలగారిని ప్రేమించెడి కొందరు భక్తులు, వారి తల్లిదండ్రుల పేరుననో, వారు ప్రేమించిన సన్నిహితుల పేరుననో ఒక్కొక్క బెడ్డు 1500 రూపాయలకు కట్టించుటకు వాగ్దానము చేసిరి.

శ్రీ నిత్యానంద విభూతిస్వాములవారు, జపాను, చైనా, యూరపు అనేకమార్లు వెళ్ళిన, దేశ ప్రసిద్ధికెక్కిని జ్యోతిష్కులు, గొప్ప స్వాములు. నా ఆశయములు, ఆవేదన జూచి, వారి తల్లిగారి పేరున రెండు బెడ్సు (స్పెషల్ వార్డు) ఒక గది 3000 రూపాయలు యేర్పర్చిరి. దైవమెంత కృపామయుడు! ప్రారంభములో అనేకమైన పరీక్షలు, అవస్థలు గల్గించినను చివరకు మన స్వార్ధరహితమైన సేవను, శక్తిని, పట్టుదలను జూచుచు, ఆయనే తోడ్పడుచుండును.

నీలగిరిలో శాంతి కేంద్రమును వృద్ధి జేయుచు, చాలాకాలముండవలెనని వచ్చినను, ఇప్పుడు వార్డులు రెండును పూర్తిజేయుటకు త్వరలో తోటపల్లి వచ్చుచుంటిమి. ఆశ్రమాభి మానులు, ముఖ్యముగా శ్రీ సుశీలదేవిని, ఆమె యొక్క అఖండమైన సేవను, ప్రేమను తెలిసిన వారందరూ, ఆమె జ్ఞాపకార్ధముగా, యీ రెండు వార్డులు సకాలములో పూర్తి అవ్వుటకు వారి వారి శక్తికొలది, తమ మనోధనములతో, చివరకు బాహ్యధనము లేనివారు, వారి ప్రార్ధనల తోనైనను తోడ్పడెదరుగాక!

క్రీస్తు ప్రభువు ఒక చోట

Heaven and earth may pass away, but my words shall not pass away.

స్వర్గము, భూమి మాయమవ్వవచ్చును గాని, నేను నుడివిన మాటలు వ్యర్థమవ్వవు. అని నుడివియుండిరి.

శ్రీకృష్ణ భగవానుని, శ్రీ ఏసుప్రభువు ఆశీర్వాదములచే యీ రెండు వార్డులు సోదరి సుశీలదేవి జ్ఞాపకార్థముగా భక్తుల సహాయముతో త్వరలో పూర్తి అగుగాక! శ్రీ క్రీస్తును, శ్రీ కృష్ణయు రెండు గావు. వున్నదొక్కటే! దానినే వివిధ మతస్థులు వారికి ప్రీతియైన నామ ములతో పిలచుచుందురని, సదా శాంత్యాశ్రమము, శాంతి పత్రికలద్వారా బోధించుచుం డెడిది అందరకూ విశదమే.

అద్వితీయమైన కృపామయుడైన దైవము శ్రీసుశీల ఆసుపత్రిని ఇప్పుడు కట్టబోవుచున్న, త్వరలో పూర్తి అవ్వనున్న, స్త్రీ పురుషుల రెండు వార్డులను, రోగులను, ఆశ్రమ భక్తులను, వార్డులకు సహాయపడుచున్న భక్తులను, ఆశ్రమవాసులను, ముఖ్యముగా అమృతతుల్యమైన శ్రీ సుశీలదేవిగారి ఆత్మను నిత్యశాంతితో బ్రోచుగాక!

లోకాస్సమస్తా స్సుఖినోభవంతు

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

(శాంతి అక్టోబరు 1963)

## 44. స్వభావము

జన్మతో వచ్చిన స్వభావము ననుసరించియే, మానవులు కొందరు స్వార్థులుగాను మరికొందరు స్వార్థరహితులుగాను యుందురు. ఆంతర్య స్వభావముచేతనే, ఒక మానవుడు సదా తనను గురించియే ఆలోచించుచు, యమయాతనలకు లోనగు నరకబాధలు అనుభవించు పనులు చేయుచుయు భయభీతులు లేకనే జీవించుచుండును. తన తాపత్రయములకు అశాంతికి తన స్వార్థమే, తన అధర్మమే మూలకారణము.

మరియొకరు "Service before self" సేవను స్వార్థము ముందు, ఆదర్శముగ నుంచుకొని, యితరులసేవ చేయుచు తన జీవితమును శాంతిగా, ఆనందముగా, ప్రేమతో మానవసేవలో గడుపుచుండును.

స్వార్థుడు సదా స్వార్థపు ఆలోచనలతో నిండి తన అధర్మముతో తన గోతిని, తానే తీసుకొనుచు పతనమవ్వుచుండుట కానలేదు. ఇక స్వార్థరహితుడు “పరోపకారార్థ మిదం శరీరం” అనెడి ధర్మసూక్తిని అనుసరించుచు తన జీవిత మంతయు ప్రేమతో యితరుల సేవలోనే సదా గడుపుచు, దుర్లభమైన మానవజన్మ గమ్యస్థానము చేరుటకు, జీవితమును

సార్ధకము చేసుకొనుచుండును. ఈ దైవచట్టముల, కర్మసిద్ధాంతముల నెవ్వరు అతిక్రమించ జాలరు. రెండు, రెండు కలిపిన మీకు, నాకు, అందరకును నాలుగే అవునట్లు, మానవసేవనే దైవసేవగా భావించి, దైవము దైవము అని నిరంతరము పరితపించెడివారు, దైవములోనే లీనమగుదురు.

అటులనే స్వార్ధుడు విషయలోలుడై సదా తన అభివృద్ధి గురించియే జీవించుచు తాను పాడగుచు, యితరులకుకూడ, తనకు తెలియకుండగనే కష్టనష్టములు గల్గించుచుం డును. ఒక్కనికి సదా దైవసేవ చేయవలెనని, దైవ పనులకు తోడ్పడవలెనని యుండును. మరొక్కనికి, స్వార్ధమును ముందుగా నుంచుకొని, తాను తెలుసుకొనకుండగనే పాడగును. దైవపనులకు కష్టనష్టములు గల్గించవలెనని కోరుచుండును. ఈ విపరీతమైన ఈ రెండు రక ముల భావనలకు వారివారి జన్మతహ సంపాదించిన స్వభావములే కారణములుగదా? మానవ స్వభావముల నెవ్వరు మార్చజాలరని యందురు.

తేలు స్వభావము కుట్టుటే, సాధువు స్వభావము యితరలను కాపాడుటయే, నదీతీరమున జపము చేయుచు, వరదలలో కొట్టుకొనిపోవుచున్న తేలును, ఒక సాధువు రెండు మూడు పర్యాయములు కాపాడుచుండగా, దానిని పైకి తీసినపుడెల్లను అది ఆ సాధువును కుట్టుచున్నప్పటికి తాను కాపాడుట మానలేదు.

ఆ చిత్రమును చూచుచున్న ఒక సామాన్య మానవుడు “ఆ తేలు కుట్టుచుండగ దానిని రక్షించెదవేల?” అని ప్రశ్నించగా ఆ సాధువు “దాని స్వభావము కుట్టుటే, నా స్వభావము రక్షించుటయే” అని చిన్నమాటలలో గొప్పపాఠమును చెప్పెను.

ప్రియమైన పాఠకా! నీ స్వభావము కుట్టుటయా, ఆత్మస్తుతి, పరనిందయా, లేక స్వార్ధరహితమైన సేవ చేయుచు దైవపనులకు తోడ్పడుటయా! నీ జీవితమును నీవే పరీక్షించి జాగ్రత్తగ చూచుకొని, దుర్లభమైన మానవ జన్మయొక్క గమ్యస్థానమైన దైవమును చేరుము.

గాఢమైన అంధకారములో, మదమాత్సర్యములతో నిండియున్న ప్రవృత్తిపరులకు తమ స్వభావమును గ్రహించుటగూడ చాల కష్టము. అట్టివారు సదా యితరుల స్వభావ ములనే కనిపెట్టుచు, ముఖ్యముగ లేని లోపములను వూహించుచు విమర్శించుచుందురు. తమ్ముతాము విమర్శించుకొనజాలరు. అట్టివారు అధోగతినే చెందుదురు. తమ్ముతాము విమర్శించుకొని ప్రవృత్తిమార్గమును వదలి నివృత్తి మార్గము ననుసరించెడివారు, తప్పక నేడుగాకున్న రేపైనను తరించి శాశ్వత శాంతిని బడయదురు.

స్వభావము ననుసరించి మానవులు తాము స్వార్ధపు పనులు, హానికరమైన పనులు జేయుచున్నప్పుడుకూడ మనము ఇట్లు తప్పుచేసిన వారినిగూడ ప్రేమయే దైవమని గుర్తించి, ద్వేషముతో నిజముగ చూడనవసరముండదు.

ఒక్కొక్కమారు దైవసన్నిధిని అనుభవించుచున్నప్పుడు, దైవముతో ఏకాంతముగా యున్నప్పుడు, నాకు తెలియకుండగనే దైవముతో ఈ క్రింది రీతిని, పసిబిడ్డవలె మాట్లాడు చుందును.

ఓ ప్రియ దైవమా! ఈ సౌందర్యవంతమైన నీ సృష్టిలో తేళ్లు, జెఱ్ఱెలు, పాములు, క్రూరమైన చిరుతపులులు, పెద్దపులులను గూడ ఏల సృష్టిం చితివి? విషజంతువులను కౄరమృగములను సృష్టించినను, నీ ఆకారములో సృష్టింపబడిన నీ బిడ్డలైన మానవులలోగూడ కొందరిని తేలు, జెఱ్ఱి, పాము గుణములతో కౄరమైన తోడేళ్ళు, పెద్దపులుల స్వభావముతో ఏల సృష్టిం చితివి?

మహనీయులు, తేలునకు విషము దాని కొండెములోను, పామునకు విషముదాని కోరలయందునే యుండునుగాని, ప్రవృత్తిపరుడైన, దయా దాక్షిణ్యములు లేని కౄరమైన మానవునకు కాలిగోరు మొదలు శిరస్సువరకు, నిలువంతయు విషమె అని అనుభవముమీద చెప్పియుండిరి. వారి నేత్రములే విషపూరితములు, అట్టి ప్రవృత్తిపరులు నిత్యము ధనారా ధనతో తృప్తిచెందక, సాధు సజ్జనులకు, ధర్మకార్యములకు హాని చేయుచు సదా స్వార్ధపు ఆలోచనలతో నిండి అమూల్యమైన కాలమును, వ్యర్ధమైన మాటలు, హానికరమైన పనులు చేయుచు, అధోగతి పాలగుచుండుట చాల విచారకరము.

ఇట్టివారి స్వార్ధపు పనులు, నీచగుణములు తలచినప్పుడె, సాధుపుంగవుడు, మహనీయుడైన శ్రీ జయదేవుని జీవితము, ఆయన పరీక్షలు జ్ఞప్తికి వచ్చుచుందును.

శ్రీ జయదేవుల భక్తి ప్రపత్తులకు, వైరాగ్యమునకు జ్ఞానబోధలకు ఒకరాజు ఆనందించి ఆయనను చాలకాలము తనవద్ద నుంచుకొని, జయదేవులు స్వగ్రామము వెళ్ళెదనని చెప్పగా ధనధాన్యములు యెన్నో బహుమతుల నిచ్చి తన వద్దనున్న యిద్దరు సేవకులను జయదేవుల గ్రామమునకు ఆయనను జాగ్రత్తగా చేర్చి రమ్మని ఆజ్ఞాపించెను.

ఈ సేవకులు ఆ ధనమంతను జూచి వ్యామోహపడి అడవులలో వెళ్ళుచున్న సమయమున, అచటి పాడుపడియున్న బావిచెంత, జయదేవుల చేతులు, కాళ్ళు ఖండించి, ఆయనను ఆ బావిలో పడవేసి ధనమునంతను అపహరించి వెడలిరి.

భక్తాగ్రేసరులైన శ్రీ జయదేవులు పాడుపడిన బావిలో పడవేయబడినను, అచ్చటగూడ దైవనామ స్మరణలోనే కాలము నిశ్చింతగ గడుపుచుండెను.

మరియొక రాజు వేటకై అచటికి వచ్చి, దాహముగా నుండి జలమునకై నూతిలోనికి జూడగా ప్రకాశవంతమైన శ్రీ జయదేవుల విగ్రహము గానవచ్చినందున వెంటనే

నూతినుండి బయటకు తీయించి ఆయనను తన రాజధానికి తీసుకొని వెళ్ళి ఉచిత పీఠము మీద కూర్చుండబెట్టి పూజింపసాగెను. శ్రీ జయదేవుల సన్నిధిచే, భక్తుడైన ఆ రాజు జీవితమంతయు పూర్తిగా మారి, తన ఆస్తినంతను బీదసాదలకు, సాధుపుంగవులకు, పంచి పెట్టుచుండెను.

ఆ ఆనందవార్త క్రూరులైన జయదేవుల హస్తములు, చరణములు ఖండించి నూతిలో పడవేసిన దుర్మార్గులకు తెలిసినందున వారు సాధువేషములు ధరించి, బహుమతుల కొరకు రాజు సన్నిధికి వచ్చిరి. అప్పుడు దర్బారులో సింహాసనము ప్రక్కను ఉన్నతాసనము పైన తాము చేతులు కాళ్ళు ఖండించిన శ్రీ జయదేవులను జూచి ముచ్చెమటలు పట్టి గడగడ వణకనారంభించిరి. ఆ క్షణములో తమ పాపము పండి, తమ చెడు కర్మచే వెంటనే శిక్షింపబడుదుము అని తమలోతాము చాల భయపడి బాధపడుచుండిరి.

అప్పుడు కృపామయుడైన జయదేవుడు వారిని గుర్తించి భక్తుడైన రాజును పిలచి వీరిరువురు గొప్ప మహాత్ములు వీరికి పారితోషికములను ధనధాన్యములను వారు కోరినవన్నియు నిచ్చి ఆదరించి, పంపుడని చెప్పెను.

కొందరు, యీ యిద్దరు సాధువులు యింతగా చెమటలతో వణుకుటకు కారణము అడుగగా, వీరు గొప్ప మహానుభావులనియు, ఇట్టివారు ప్రపంచములో సాధారణముగా దొరకరనియు సమాధానము చెప్పి జయదేవుడు తృప్తిపరచెను. అతి క్రూరులు దయాదాక్షిణ్యములు లేని మన దొంగ సాధువులు ధనరాశులను రథము మీద వేసుకొని వారి గ్రామము వెళ్ళుచుండగా, రథమునడిపే రాజసేవకులు యిట్లు ప్రశ్నించిరి.

ప్రశ్న : "అయ్యా! అనేకమంది సాధుపుంగవులు, నిరుపేదలు, రోగులు రాజసంస్థానమునకు మా గురువుగారి యొద్దకు రోజూ వచ్చుచుండిరి గాని, మిమ్ము ఆదరించి, గౌరవించి, పూజించినట్లు ఎవ్వరినీ ఎన్నడూ ఇంతవరకూ పూజింపలేదు; కారణమేమి?" అని అడిగిరి. అప్పుడీ క్రూరులైన, రాక్షస హృదయముగల దొంగసాధువులు ఈక్రింది రీతిగా చెప్పిరి.

"ఓ రాజసేవకులారా! పూర్వము యీ జయదేవుడు గొప్ప అపరాధము చేసెను. చాల దుర్మార్గుడు. మా రాజు యితనిని చంపివేయుమని మాకు ఆజ్ఞాపించగా, మేము కారుణ్యముతో అతనిని చంపకుండ కాళ్ళు చేతులు మాత్రము ఖండించి వదలిపెట్టితిమి. అతనికి మేము అట్టి గొప్ప ఉపకారము చేసి ప్రాణదానము నిచ్చినందులకు మమ్ములను గుర్తించి ప్రతిఫలముగా మేము అతని మీద ఏమైనను చెప్పెద మేమోయని భయపడి, మాకీ ధనరాశుల నిచ్చి తృప్తిపరచెను.

హృదయ విచ్ఛేదకరమైన అట్టి క్రూరమైన అబద్ధములు చెప్పుచుండగా-భూదేవిగూడ యీ అసత్యములను విని భరింపజాలక, వారి రధము ముందు నేలను బీటదీసి అనగా భూమి బ్రద్దలవ్వగా ఆ క్రూరులు ఆ ధనముతో ఆ అగాధములో పడి నశించిరట.

నేనైనను, మీరైనను, మరి ఎవ్వరైనను, ఎంత బలవంతులు, చాకచక్యములు తెలివి తేటలు గల్గినవారైనను, పాపపు విత్తనములు నాటిన వారి దుర్గతి చివరకు యిటులనే యుండును. ఎవ్వరు జల్లిన విత్తనముల ఫలితములను వారే, నేడుగాకున్న రేపైనను అనుభవించి తీరవలెనను సూత్రము ఆశ్రమవాసులకు, ఆశ్రమ భక్తులకు నేను సదా చెప్పుచునే యుందును.

నేడు మనకు అధర్మముగ జయము గల్గినదిగదాయని నవ్వుచు తృప్తి పడరాదు. దైవచట్టములు అతి క్లిష్టమైనవి. దారుణమైనవని చెప్పుచుందురు. ప్రేమ మయుడైన దైవము, తన చట్టనిర్మాణములో తాను చండశాసనుడనిగూడ వెర్రిమానవులు గ్రహింప జాలకున్నారు.

దైవము సదా సాక్షి స్వరూపుడే! సూర్యునివలె దివ్యతేజస్సుతో అహర్నిశములు వెలుగుచుండును. మన చెడుకర్మ ఫలితములే బండిచక్రములు ఎద్దుల వెనుక తిరుగు చందమున మనలను వెంబడించుచున్నవి. మంచి చేసిన సత్ ఫలితములు మన కీనీడవలె మనలను అనుసరించుచున్నవి. నిరంతరము దైవము దైవమనెడివారు, దైవపరితాపనతో నిండియున్నవారు భ్రమర కీటక న్యాయమువలె దైవములోనే విలీన మగుచుందురు. మట్టిమట్టియనెడి ధన పిశాచారాధకులు పిశాచములనే చేరుచుందురు.

ప్రియమైన శాంతి పాఠకులారా! మూర్ఖులను దుర్జనులను గురించి భర్తృహరి తన సుభాషితములలో ఏమి చెప్పెనో యీ దిగువ పద్యములు చూడుడు :

తే॥ తివిరి యిసుమునఁ దైలంబుఁ । దీయవచ్చుః
దవిలి మృగతృష్ణలో నీరు । ద్రావవచ్చుఁ
దిరిగి కుందేటికొమ్ము సా । ధింపవచ్చుఁ
జేరి మూర్ఖుల మనము రం । జింపరాదు.

తే॥ విద్యచే భూషితుండయి । వెలయుచున్నః
దొడరి వర్జింపనగుజుమీ । దుర్జనుండు
చారు మాణిక్య భూషిత । శస్త మస్త
కం బయిన పన్నగము భయం । కరముగాదె.

ప్రవృత్తిపరుల స్వభావములను మనము మార్పజాలముగాన, విలువైన మన కాలమును-యితరులలోని చెడ్డను జూచుచు వ్యర్థబుచ్చుటకంటె, అందరిలో దైవమునే జూచుచు అందరియెడల సదా ప్రేమనే చూపుచు మనము తరించెదముగాక!

ఎన్ని అవస్థలు, పరీక్షలు వచ్చినను, దయామయుడైన శ్రీ జయదేవునివలె, ప్రేమ స్వరూపుడైన శ్రీ క్రీస్తు ప్రభువువలె, సహనముతో, ప్రేమతో శాంతిగా భరించుచు మననుండి, మనకు హానిచేయుచున్న వారి వైపులగూడ ప్రేమయే సదా పొర్లి ప్రవహించుగాక!

ఒక భక్తుడు.

"ఓ దైవమా! మాకు వచ్చుచున్న పరీక్షలను, అవస్థలను, అపనిందలను, తగ్గించుమని, తీసివేయుమని నేను ప్రార్థించుటలేదు. వీటినేగాక మరి ఎన్ని అవస్థలు, పరీక్షలు వచ్చినను శాంతిగా ప్రేమతో వాటినన్నిటిని నిర్భయ ముతో భరించుటకు బలమైన భుజములను ప్రసాదింపుము" అని కోరెనట.

ధర్మ, ప్రేమ మూర్తులైన భక్తవరేణ్యులకు ధన్యవాదములు!

లోకా స్సమస్తా స్సుఖినోభవంతు

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

(శాంతి ఆగస్టు 1964)

## 45. స్థలాంతర మార్పులు

ఒకానొకప్పుడు, ఒక మనిషి మరియొక మిత్రునితో నిట్లు ప్రశ్నించెను.

ప్రశ్న : దేవుడేమి చేయును?

మిత్రుడు : దేవుడు ఏమీ చేయడుగాని, ప్రజలను ఒక స్థలమునుంచి మరియొక ప్రదేశ మునకు బదిలీ చేయుచుండును. ఆయన భాగ్యవంతుని బీదవానిగాను, పేద వానిని ధనవంతునిగాను చేయుచుండును. వున్నతస్థాయిలో నున్నవానిని క్రిందకును, అడుగునవున్నవానిని పైకి లేవనెత్తుచుండును.

శ్రీ పరమేశ్వరాజ్ఞ లేనిదే ఒక గడ్డిపరక కూడ కదలదు గాన, ఏ మార్పులైనా, ఏ బదిలీలైనా ఆయన ఆజ్ఞ లేనిదే జరుగగలవా? స్వార్థుడు స్వర్గలోకమునకు వెళ్లుట తటస్థిం చినను, అతని స్వార్థపు ఆలోచనలు, మాటలు, పనులవలన దానినికూడ అవలీలగ మహా నరకము క్రింద మార్చివేయగలడు. అట్లే ఒక మంచివాడు నరకమునకు వెళ్లుట తటస్థిం చినను దానిని, తన పవిత్ర, స్వార్థరహిత మంచి తలంపులచేతను, ప్రేమ మాటలచేతను, ధర్మ కార్యములచేతను, స్వర్గతుల్యముగ మార్చి, దాని నివాసులను భక్తితో సుఖవంతులుగను, తృప్తితో సంతోషవంతులుగను చేసి, ఆనందపరచుచుండును.

గాని, జ్ఞానులు జ్ఞానవంతులు, భగవంతుడేమియు చేయడని చెప్పుదురు. ఆయన

జనులను స్వర్గమునకుగాని, నరకమునకుగాని ఎన్నడు మార్చడు. సూర్యభగవానుడెట్లో ఆయనకూడ నిశ్శబ్దముగ సాక్షిభూతుడుగ నుండి ప్రపంచమున కంతయు, జీవము, తేజస్సు, ప్రేమ వ్యాప్తి జేయుచుండును. ఒక కవి భగవంతుని కానరాని శక్తిని గురించి ఎట్లు వర్ణించిరో యీ దిగువ పద్యములో చూడుడు :

మ॥ ఎదురం దండముఁ చేతఁబట్టక, నిజాధీసుండు చూపట్టినన్
దుదకున్ సేవకు లెట్టులో యతని కన్నుల్ గప్పి వర్తించు; రే
మది? నిన్నెన్నడు జూడకుండియును తండ్రీ! విశ్వమంతైనఁ ద
ప్పదు నీయానతి; యద్భుతావహము, దేవా! భక్త చూడామణి.

మ॥ నిముసంబైనను విశ్రమింపఁడొకచో నీ రేజ మిత్రుండు; సం
ద్రము దానించుక మేర మీరదు; జగత్ప్రాణుండు వచున్ సదా;
క్షమ సర్వంబు వహించు; నీరదము వర్షం బిచ్చుఁ గాలాను సా
రముగా, నీవతిచండశాసనుఁడ వౌరా! భక్త చింతామణి.

ఈ ప్రపంచములో ప్రతినిత్యము ఏమి జరుగుచున్నదో కొంచెము జాగ్రత్తగ విచారించుచుండిన మన కగపడునదేమనగా. కొందరు ఉద్యోగస్తులకు సకారణముగను, అకారణముగను, ముందుగ తెలుపకుండ అఠాత్‌గను బదిలీలు జరుగుచుండును. ఇట్టివి కొందరికి చాలబాధలు, మనోవ్యధలు కల్గించుచుండును. నేను హృద్రోగముతో విశాఖపట్నం ఆసుపత్రిలో చికిత్స పొందుచుండగ, నాకు ఎంతో భక్తి ప్రేమలతో చికిత్స చేయుచున్న ఒక మంచి డాక్టరుకు అఠాత్‌గ హైదరాబాదు బదిలీ అయినది. అప్పుడు రోగికి డాక్టరుకు కలిగిన భీతి, ఆశాభంగము, తల్లడపాటు వర్ణనాతీతము! గాని ఉభయులుకూడ, ఈశ్వరానుగ్రహముచేత, మనోధైర్యముతో, “మా యిష్టముగాదు ఓ ప్రభూ! నీ యిష్టప్రకారమే జరుగనిమ్ము” అని చెప్పగలిగిరి.

నిశ్చయముగ చూచిన, దైవము, సూర్యభగవానునివలె సాక్షీభూతుడేగదా! ఆయన దివ్యతేజస్సును, యీ బదిలీలు, మార్పులు ఎట్లా తాకగలవు. మబ్బులు వచ్చుచు పోవుచుండునుగాని, సూర్యునకు ఏమి లోపము కలుగును. వర్షము వచ్చిననేమి, రాకపోయిననేమి, సూర్యునకు ఆయన తేజస్సునకేమి మార్పువుండదుగదా! అమాయకపు నీతివంతులైన ఆఫీసర్లకు బదిలీ చేయించుటకు, స్వార్థులు సదా కుట్రలు చేయుచునే వుందురు. తమ స్వభావమునకుగాని, తమ బంధుమిత్రుల లాభమునకుగాని తమ పార్టీ లాభమిషచేతనుగాని యీ కుట్రలు పన్నుచునేయుందురు.

ఒక్కొక్కప్పుడు బహు నిజాయితీగా, చాల సమర్థతతో పనిచేయుచున్న ఆఫీసర్లనైనను, భక్తిపరులు నిజాయితీ కోరి ప్రజలచే చాల మన్ననలను పొందుచున్నవారినైనను, శకునివలె

కుట్రలు పన్ని బహుదూరము పాపభీతి లేక ఎంత ధనమునైనను వెచ్చించి, లంచములనైనను యిచ్చి, బదిలీలు చేయించి, తమ దుర్మార్గపు పనులకు, వ్యూహాలకు, అడ్డులేకుండ చేసుకొనుటకు ప్రయత్నించుచుందురు. అంతట తమ పాపపు పనులను ఎవరు ఆటంకపరచ వారుండరు గదా యని సంతోషించుచుందురు. ధర్మాత్ములైన పాండవులకు వ్యతిరేకముగ అనేక కుట్రలు పన్నిన దుర్యోధనాదుల గతి ఏమాయెనో మరతురు. మాయ ఎట్టివారినైనను యీ కలియుగములో భ్రమింపజేయునుగదా!

రామరాజ్యము కొరకు తపించి, తపించి మహాత్ముడు ప్రాణములు విడిచిన యీ పవిత్ర దేశములో, యిట్టి మార్పులు మన స్వపరిపాలనములో బహుతరచుగ జరుగుట ఎంత శోచనీయము! ఎంత అధర్మము! దేశ గౌరవమునకు భంగకరము!

మంచి ఆఫీసర్లు ఎట్టి బాధలకు, యిట్టి మార్పులవలన లోనుగావలసియున్నదో కొంచెము ఆలోచించండి. ఆయన వారి ఏడు ఎనమండుగురు పిల్లలు స్కూళ్ళలో, కాలేజీలలో చదువుచుండగ, వారిని, ధర్మపత్నిని విడిచి క్రొత్త తావుకు వెళ్ళవలసినదేగదా!

ఒకానొకచోట భార్యాపిల్లలు యిద్దరు మంచి డాక్టర్లు పరస్పర సహకారముతో చాల భక్తి ప్రేమలతో మానవసేవయే మాధవ సేవయని తలచి స్వార్ధము విడచి, ప్రజాసేవ చేయుచుందురు. అతాత్ మార్పుల వలన అట్టి యోగ్యులుకూడ విడదీయబడుదురు. ఈ తలవని తలంపుగా, పిడుగువలె వచ్చు మార్పులలో, వృద్ధులుగాని, రోగగ్రస్తులుగాని, వార్ల కుటుంబములలో నున్నయెడల వారికి అనివార్యముగ దూరదేశములకు వెళ్ళవలసి వచ్చినపుడు కలుగు కష్టములు, ప్రయాసలు, బాధలు వూహించ నెవరితరము. ఈ కుట్రలు పన్ని తత్కాలిక లాభములు పొంది, సంతోషించుచున్నవారికి, యీ అనివార్యముగ బాధలకు గురియైన యోగ్యులగు, భక్తిపరులగు వారి వుసురులు తగలక మానునా? వ్యూహాలు పన్ని, యితరులకు బాధలు కలిగించి ఆనందించుచున్న అయోగ్యులకు బొత్తిగా దూరపు ఆలోచన లుండవుగదా! తగిన వైద్యసహాయమున్న చోటులకు యీ వ్యాధిగ్రస్తులను, వృద్ధులను మార్చుటలో వారికి కలుగు వ్యయ ప్రయాసలు ఎంతని వూహించగలము?

ఇట్టి అకారణ, అనివార్యమైన. అతాత్ బదిలీలకు గురియైన యోగ్యులకు ఉపశాంతి కొరకు, బలమిచ్చుటకు ఒక మంచి మాట చెప్పవలసియున్నది. ప్రతీదీ మనమంచి కొరకే యను దానిలో చాల సత్యమున్నది. ఈ మార్పులు ఎంత బాధాకరముగా కనిపించుచున్నను, భగవానుడే తన భక్తులకు, ఎప్పుడు ఏది మంచియో తెలుసుకొనగలడుకదా? ఎవరు ఎన్ని కష్టములు శోధనలు వచ్చినను, తృప్తిగ, సంతోషముగ వుండగలిగిన వారి జీవిత ములేగదా ధన్యవంతములు.

ఒకప్పుడు ఒక మహాకవి తాను ఎంత విద్యావంతుడైనను, తనకు తగిన మంచి చెప్పుల జతనైనను, భగవంతుడు ప్రసాదించలేదని, దుఃఖముతో విసుగుజెందుచుండెనట. ఆతడు ఒకనాడు అరాత్‌గా, రెండు పాదములులేని దురదృష్టవంతుని చూచుట తటస్థించెను. అప్పుడు పరమాత్మ తనకు రెండు పాదములను యిచ్చి, వాటిని మంచి స్థితిలో నుంచుట తనపైన ఆయనకుగల అమిత ప్రేమను తెలుసుకొని చెప్పులు లేకపోయినను మంచిదే అనుకొని సంతృప్తిపడెను.

అన్యాయముగగాని, సకారణముగగాని, అకారణముగగాని, బహుతరచుగగాని, బదిలీలు వచ్చువారు, కొంచెము దీర్ఘాలోచన చేయవలసియుండును. మనము మాయచేత, ఉద్యోగములు చేయుచోటనే శాశ్వతముగా వుంచబడుదుమను పొరబాటు యభిప్రాయముతో అనూహ్యమైన ప్రేమలను, బంధములను పెంచుకొన్న వాటిని త్రెంచుకొని, నూతన స్థాన ములకు వెళ్ళవలసియుండునుగా! ఎప్పుడో ఒకప్పుడు యీ ప్రపంచమునుండి రాబోవు శాశ్వత బదిలీకి అందరు సిద్ధపడవలసి వుండవలసినవారేగదా! అట్టిచో, యీ అశాశ్వత బదిలీలు ఎంత క్రమశిక్షను ప్రసాదించి, శాశ్వత బదిలీకి మానవులు తయారగుటకు తోడ్పడును. బదిలీ కాగానే, వారి గృహముల తాలూకు ఆవరణల దొడ్లలో ఏర్పాటు చేసు కొనిన ఫలవృక్షములను, పూలమొక్కలను, నూతనముగ ఏర్పడిన మిత్రులను బంధువులను అందరిని విడిచి వెళ్ళవలసినదేగదా! ఈ ప్రపంచమును విడువవలసి వచ్చినపుడు వారు వీరనక అందరిని అరాత్‌గా విడవవలసినవేగదా!

అష్టావక్ర మహాముని ముక్తిగోరువారికి ఎంతమంచి సలహా చెప్పెనో యీ దిగువ పద్యములో చూడుడు.

గీ. ముక్తివాంఛించెదేని యో పుత్ర! నీవు
విషము రీతిని విడువుము విషయతృష్ణ
సత్య సంతోష శమ దయార్జవములెల్లఁ
గ్రోలు మోయి పీయూషంబుఁ గ్రోలునట్లు.

గీ. దార దాయాది సంపర్ధంబులెల్ల
క్షేత్ర మిత్ర ధనాగార కీర్తులెల్ల
మూడునాళ్ళ ముచ్చటలయి ముదముగొల్పు
స్వప్నవిలసితమగు నింద్రజాలమట్లు.

పైన చెప్పబడినట్లు, యీ ప్రపంచ సుఖదుఃఖములనెల్ల స్వప్నములవలె చూడగలిగిన మహనీయుల జీవితములే, ఎన్ని పరీక్షలు, కష్టములు వచ్చినను, నిశ్చింతగ, తృప్తితో,

మానవ గమ్యస్థానమైన ముక్తిసుఖము కొంచెము చవిచూడగలిగిన అదృష్టవంతుల జీవితములే యితరులకు మార్గదర్శిగా నుండునుగదా! వారే యల్లవేళల సంతోషముగ నుండగలుగుదురుగదా!

ఇట్టి సందర్భములలో యీ బదిలీలు, మానవ గమ్యస్థానము చేరదలచిన వార్కి ఎంతగనో ఉపయోగపడునుగదా! ఎంతయో మహోపకారము చేయునుగదా! కండ్లను బలవత్తరముగ తెరచి, ప్రపంచ నిజస్థితిని బాగా గుర్తించునట్లు చేయునుగదా! అదివరలో ఎంతయో ప్రేమతో వున్నట్లు కనిపించు తాపేదార్లు, యితరులు, బదిలీకాగానే వారి ప్రేమనంతను పాత ఆఫీసరును విడిచి, నూతనముగా వచ్చు ఆఫీసరువైపు కేంద్రీకరించుట ప్రతివారి అనుభవములో నున్నదేగదా! ఈ ప్రేమలు ప్రయోజనముకొరకే స్వార్థమునకేగాని, నిజమైన ప్రేమ కాదని స్పష్టముగ గోచరించునుగదా!

శ్రీ శంకరాచార్యులు ఎంతో అనుభవంతో చెప్పిన విషయము యీ దిగువ పద్యములో చూడుడు.

మ. ధనమార్జింపఁ గలంతకాలము కళత్ర భ్రాతృ పు
త్రాదులు దనయాజ్ఞ న్విహరింతు రార్జనము సుంత న్మా
న దత్క్రమంబెల్లగన్గోని శక్యాతుజురీతహ్రా
ని రోగాదులం దనువుండినవేళఁ జూడఁ డొకఁడై
దయా గోవిందు సేవింపుమా.

ఈశ్వరుడు సర్వాంతర్యామి. ఆయనలేని తావు లేదుగదా! ఎచ్చటికి బదిలీ అయినను, పరమాత్మ సాన్నిధ్యము విడిచి వెళ్లుటకు వీలు లేదుగదా! ఆయన రాజ్యములో ఆయన ఆజ్ఞలను పరిపాలించుచు ఎచ్చట ఆయన నెవరినుంచిన, వార్కి ఆయన చింతన నున్నంత వరకు, ధర్మము పాటించువరకు ఏమి కొదువ యుండును. ఆయనను ఒకక్షణమైన మరువ కుండువారి జీవితములే ధన్యములని యీ దిగువ పద్యము సూచించుచున్నది.

శా. నీ సంకల్పమె సృష్టి , నీవు గనుగొంటెరక్ష; నీ వూరకుం
టే సంహారము సూ , మహాత్మ : యటుగా కీ భూమి యీ సాగరం
బీ సర్వాద్భుత భూతకోటి, యికఁ వేటేలాగు సర్గఁబుగా
నీ, సంరక్షణగాన సేయఁ దరమౌనే? భక్త చింతామణి.

ఈ అకారణ, అతాత్ బదిలీలు, ఒక్క పరమాత్మ యొక్కడే ఏ ప్రాంతమునకువెళ్ల

వలసివచ్చినను నిజమైన దిక్కుగా స్పష్టముగా రుజువగుచుండునుగదా! మిగతావారందరూ స్వార్థులు, ఎప్పుడైన ననవేల బదిలీ కాగానే కనిపించనివారే విడనాడువారే. ఇది ప్రపంచతీరు.

మన మధ్యను, శకునిలు, దుర్యోధనులు, సదా వుంటూనే వున్నారు. కన్నులున్న వారు వారిని చూడగలరు. చెవులున్నవారు వారు పైపైనచేయు పొగడ్తలను వినగలరు. బుద్ధినుపయోగించ గలిగినవారు వారు వెనుకనుంచి తీయు గోతులను తెలుసుకొనగలరు.

శ్రీకృష్ణభగవానుడు ధర్మమూర్తిగాన, ధర్మము తప్పక నడుచువార్కి సదా తోడుగ, నీడగ, నుండును. నూరుగురు కౌరవులు ఒకవైపునుండి, ఒకరు చేయి ఎత్తగనే, 99 సోదరులు చేతులనెత్తి వారి పార్టీ బలము చూపగలిగినను, ఎన్నాళ్ళిట్లు చేయగలిగిరి? అధర్మము–పార్టీబలము–ఎన్నాళ్ళు పనిచేయును? ద్వాపర యుగములోనేగాదు భారతము, ప్రతినిత్యము, ప్రతి యింటిలోనేగాదు. ప్రతి దేశములోను భారతము కనిపించుచునే యున్నది. History repeats itself. ఏది నిత్యమో? ఏది సత్యమో తెలుసుకొనగలిగి, అనిత్యమైన వాటిని సాధనచేత క్రమేణా విడనాడి మానవజన్మ గమ్యస్థానమైన భగవంతుని చేరుటకు ప్రతివారు, అహర్నిశములు కృషిచేసి తరించవలసియుండునుగదా!

ఈ మామూలు బదిలీలను, ఏ కారణముచేత తటస్థించినా, న్యాయముగా జరిగినను, అన్యాయముగా జరిగినను, మానవులందరికి తప్పక ఎప్పుడో ఒకప్పుడు ముందుగా చెప్పియు, చెప్పకయు ఊహించుటకు వీలులేని అఠాత్‌గాకూడ తటస్థించు శాశ్వత బదిలీలకు, సోపానములుగ వుపయోగించుకొనవలసివుండును. అట్లు ప్రతీ కష్టము, శోధన, పరీక్ష మన మేలుకొరకే తటస్థించునని తెలుసుకొని స్థిత ప్రజ్ఞులవలె నుండగల్గినవారి జీవితములే ధన్యవంతములు. యితరులకు ఆదర్శనీయములు!

లోకా సమస్తా స్సుఖినోభవంతు ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

(శాంతి అక్టోబరు 1964)

# 46. స్వార్థపరులు

స్వార్థులను చూచిన నాకు చాల చింతగా నుండును. స్వార్థరహితులను జూచిన చాల ఆనందముగా నుండును. ఒక తేలునుగాని, పామునుగాని జూచిన భీతిగా నుండును. ఒక పావురమునుగాని, గువ్వనుగాని, రామచిలుకనుగాని, నెమలినిగాని జూచిన ఎంతో సంతోషముగ నుండును. దైవసృష్టి యిచ్చు ఆనందం వర్ణనాతీతముగదా?

ఐనను తేలులోను, పాములోను, పావురములోను, రామచిలుకలోను, నెమలిలోను ఒకే దైవము. అద్వితీయుడైన పరమాత్మ, విలసిల్లియుండెను. గాని వాటివాటి ప్రకృతి ననుసరించి అవి సంచరించుచుండును.

స్వార్థుడు తన స్వభావము ననుసరించి యితరులకు, దైవ పనులకు హాని కల్గించును. తన గోతిని తానే తనకు తెలియకుండగనే త్రవ్వుకొనుచుండును.

స్వార్థరహితుడు, దైవభక్తులకు, దైవ పనులకు సంతోషముతో సదా తోడ్పడుచు, తన స్వార్థరహితమైన సేవతో స్వర్గమునకు సోపానములను కట్టుకొనుచుండును. ఇదియొక బట్టబయలుగానున్న సర్వులకు తెలిసిన దైవచట్టము, ఇందులో రహస్యమేమియు లేదు. ఎవ్వరు జల్లిన విత్తనముల ఫలితములను వారే ఎప్పుడో ఒకప్పుడు అనుభవించక తప్పదు కదా! మట్టిమట్టియని, మట్టిని పూజించెడువారు, మట్టిలో లీనమగుచుందురు. దైవము దైవమనుచు దైవమును సదాభక్తితో నిర్మల హృదయముతో పూజించెడువారు దైవములోనే విలీన మగుచుందురు భ్రమరకీటక న్యాయము దీనిని ఋజువు చేయుచున్నది. మతేగతి ఈ దైవ చట్టములు, సాధువులు, యోగులకేగాక, బ్రహ్మచారులకు గృహస్థులకు, వానప్రస్థులకు అందరకును సమముగా వర్తించును.

ఈ మధ్యను యిద్దరు గృహస్థులు. ఆశ్రమ భక్తులు, క్రొత్తగా ఒక బస్సురూటు గవర్నమెంటు అధికారుల ప్రేమ సానుభూతులతో సహాయముతో ఆశ్రమమునకు వేయుటకు ప్రయత్నించుచుండిరి. అప్పుడు అధికారులు వారిని మీరు ఆశ్రమమునకు దైవపనికి యెంతవరకు తోడ్పడెదరు? మీరు ఎంత తీసుకొందురని అడుగగా, వారు వెంటనే తడుముకొనకుండగా–"సర్వము దైవపనికే, మాకేమియు వలదు, దైవము మాకు యిచ్చినదే మాకు సరిపోవును" అని సంతోషముతో సమాధానము చెప్పగా–అప్పుడు ఉద్యోగస్తులు వారియొక్క స్వార్థరహితమైన భావనలకు ఎంతయో ఆనందించిరి. అట్టిచో, తప్పక ఆశ్రమమునకు మీరే కాక అందరు సహాయము చేయవలసినదే యనిరి.

ఈ విషయము వినిన నా మనస్సునకు యెంతయో నూతన శక్తి, ఆనందము

కలిగెను. కలియుగమైనను స్వార్థులు అహర్నిశము కుట్రలు స్వార్థపు ఆలోచనలతో నిండి, ఆత్మస్తుతి పరనిందలతో తమ జీవితములను గడపుచున్నను, కొందరు స్వార్థరహితులైన భక్తులు యింకను అచ్చటచ్చట యు–ండుటచేతనే, ధర్మము పరిపాలింపబడుచు, లోకములో కొంత శాంతి విలసిల్లియున్నది. పాపభీతి, దైవభక్తి కనిపించుచున్నవి.

లోకములో అందరూ, చైనా ప్రధానివలె యున్నచో ఇక ప్రపంచముయొక్క అవస్థలు వేరుగా చెప్పవలెనా? చెడ్డయున్నచోట మంచియు, మంచియున్నచోట చెడ్డగూడ నుండును. దుస్వభావములను దుర్భలత్వమును జయించి, మంచి గుణములను అలవాటు చేసుకొనుటయే దైవమును చేరుటకు చక్కనైన రాచబాట.

ఎంత తెలివైన వాడైనను, చాకచక్యములు గల్గిన చదువరియైనను, స్వార్థుడు అందరిని సదా మోసపుచ్చ జాలడు.

లింకను మహాశయుడు "నీవు కొందరిని సదా మోసపుచ్చగలవు. అందరను కొంతకాలము మోసపుచ్చగలవు గాని, అందరినీ యెల్లకాలము అనగా నిరంతరము మోసపుచ్చజాలవని" చెప్పియుండెను.

ఇతరులను మోసపుచ్చుటలో, తాను త్రవ్విన గోతిలో తానే పడుచుండును. స్వార్థునకు డబ్బుతోగల తన లంకిని విడదీయుటకు వీలులేని సంబంధము గలదు. డబ్బునకు ప్రాణమునకు లంకె అని స్వార్థుని గురించియే చెప్పబడి యున్నది. తన స్వార్థపు పనులతో యితరులకు కష్టనష్టములు, హాని కల్గించుటకు నిశ్చింతగ వేలకివేలు ఖర్చుబెట్టును.

దైవపనులకు ఒక్క రాగిడబ్బుయైనను యిచ్చుటకు చాల బాధపడుచుండును. ఎవ్వరి డబ్బు ఏవిధముగా వుపయోగపడవలసినదీ, అదిగూడ దైవ నిర్ణయమేగదా! స్వార్థుల ధనము స్వార్థపు పనులకే వినియోగమగును. నిస్వార్థపరుల ధనము దైవపనులకే సంతోషముతో, ప్రేమతో ఎల్లప్పుడు వాడబడుచుండును.

## పరోపకారార్థ మిదం శరీరం

ఈ శరీరములు ఇతరుల సేవకొరకై యివ్వబడెనని పెద్దలచే చెప్పబడినందులకు స్వార్థరహితులు, తమ మనోధనములు, తమ సర్వస్వము యితరుల సేవలో సదా వాడుచు తాము తరించి యితరులకు మార్గదర్శకులుగా జీవించు చుందురు.

ఇంతకూ యితరులనగా ఎవ్వరు? ఒకే ఆత్మ తప్ప అన్య మెప్పుడును, యెచ్చటను లేదనియు దైవము అద్వితీయుడనియు యీ ప్రపంచములో కనిపించునదంతయు ఒకే ఆత్మ స్వరూపమేననియు శాస్త్రములు చెప్పుచున్నవిగదా!

అంతా రామ మయం బీ జగమంతా రామమయం అనియు అంతా కృష్ణమయ

మనియు సదా కీర్తించుచుంటిమి. కన్నుమూసినా, తెరచినా దైవమును శ్రీరాముని, శ్రీకృష్ణుని గాంచెడివారి జీవితములు ఎంత అదృష్టములు! వారే నిజమైన భక్తులు, లోకోపకారులు, లోకము నుద్ధరించగలవారు. స్వార్ధము నరకమునకు బాట. స్వార్ధరాహిత్యము స్వర్గమునకు దారి. స్వార్ధరహితులున్నచోటు, స్వర్గతుల్యముగదా! వారి పవిత్ర జీవితములు ఆదర్శ ప్రాయములుగదా! స్వార్ధరహితులకు ధన్యవాదములు! వ్యక్తుల శాంతి, దేశవృద్ధి లోక శాంతికై కృపామయుడైన దైవము ప్రస్తుతము స్వార్థులుగానున్న తన బిడ్డలను గూడ, స్వార్ధరహితులుగా మార్చి వారి వృద్ధికి దేశ వృద్ధికి, లోకశాంతికి తోడ్పడుగాక!

సర్వేజనా స్సుఖినోభవంతు.

ఓం శాంతి, శ్శాంతి, శ్శాంతిః

(శాంతి నవంబరు 1964)

# 47. స్వర్ణోత్సవ సందేశము

ప్రియమైన ఆశ్రమ భక్తులారా! ఆశ్రమాభిమానులారా! ఈ స్వర్ణోత్సవము జ్ఞాపకార్ధ ముగా, నా హృదయము, మీ హృదయములను, శాంతితో, ప్రేమతో, తేజస్సుతో తాకుటకు, కోరుచున్నది. ఇట్టి ఆనందకరమైన సావకాశమును నాకు ఇచ్చి మీ హృదయములను పూర్ణ శాంతితో, నూతనమైన శక్తితో, దివ్య తేజస్సుతో, ఎప్పుడో రాబోయెడి అస్థిరమైన భవిష్యత్తులోగాక, ఇప్పుడే, ఇచ్చటనే మీ జన్మహక్కు అయిన దివ్యసన్నిధిని అనుభవించుచు, యీ జన్మదినోత్సవములను, ముఖ్యముగా స్వర్ణోత్సవమును జయ ప్రదముగా జేయగోరెదను.

శాంతి ఆశ్రమము స్థాపించి ఇప్పటికి యేబది సంవత్సరములు గడుచున్నదనిన నాకే ఆశ్చర్యముగా నమ్ముటకు వీలులేనట్లుగా నుండును. ఏలనన, నాకే, అనగా యీ శరీరమునకే 50 సంవత్సరములు లేనట్లుగాను, ఇంకను పసిబిడ్డవలె యున్నట్లె తలంచుచుందును. కొన్ని సమయములలో నేను జన్మించితినా లేదా అన్నట్లుందును. గాని ఆశ్రమములో జేయుచున్న వివిధమైన కార్యకలాపములు, అన్ని రంగములలో జరుపబడుచున్న సేవయు, గురుకులములో బాలబాలికలు, మొదలగువారు నావద్దకు పరుగెత్తుకొని వచ్చుచు, తోటపనులు మొదలైనవి ఉత్సాహముతో జేయుచుండుట జూచుచుండ ఇది అంతయు స్వప్నముగాదు నిజమే అని తోచుచుండును.

నా ముందరనే యున్న శ్రీకృష్ణ, శ్రీ క్రీస్తు, శ్రీ బుద్ధభగవానుడు, గాంధీజీల విగ్ర హములు జూచుచుండ వారి మహోత్కృష్టమైన ప్రబోధములను, జ్ఞానమును, ప్రేమను, కరుణను, సేవను, నాకు నిరంతరము బోధించుచు శ్రీ శాంతి ఆశ్రమము స్థిరమే అని

తలచుచుందును. ఈ అవతారమూర్తుల సందేశములు, మా శాంతి పాఠకులందరి హృదయ ములలో నిబిడీకృతమై దేశవృద్ధికి, లోకశాంతికి మానవాభ్యుదయమునకు తోడ్పడుగాక!

నా దినచర్యలో కొన్ని ఆంతర్యానుభవములను, స్వంతమైన భావములను నాకు, తోడ్పడుచున్న చిన్నచిన్న సామాన్యమైన వాటిని మీకు తెలియజెప్పి మీతో పంచుకొనుటకు కోరుచుంటిని. రోజూ స్నానము జేయుచుండ, చెంబుతో నీళ్లు శిరస్సుమీద పోయగనే, ఇంతవరకు గడచిన, రోజులు, నెలలు, సంవత్సరములు-గతంనాస్తి-అన్నట్లు గడచి పోయినవి, పూడ్చివేయబడినవి. ఇప్పుడే నేను నూతన జన్మ నెత్తుచుంటిని. నా వయస్సు ఇప్పటినుండియే. యీ క్షణమునుండియే ప్రారంభించుచున్నదని ఆనందముతో మురియు చుందును. ఇంతవరకు, గడచిన జీవితము, యెట్టిదైనను యీ స్నానముతో యీ చెంబుడు నీళ్ళతో మాయమగుచున్నది, (లేకుండ పోవుచున్నది) పాతజన్మ పోయి, క్రొత్తజన్మ వచ్చుచున్నదనెడి భావనయే నాకెంతయో నూతనశక్తిని, ఆనందమును, ఉత్సాహమును గల్గించుచుండును.

ఇంక ఇంతవరకు చేసిన సేవ, ఇకముందు చేయవలసియున్న సేవను తలచిన, కొంత అసంతృప్తి, నిరుత్సాహము గలుగుచుండును. ఏలనన, చేయబడిన అల్పసేవకంటె, ఇకముందు చేయనున్న అపారమైన సేవయే అణువుముందు బ్రహ్మాండమువలె గానవచ్చు చున్నది. ఇంతవరకు జరిగిన సేవ, ఈ సేవ, యేరంగములోనైనను, అది సముద్రమందు నీటిబుడగవలె గానవచ్చుచు, నిరుత్సాహమునే గల్గించుచుండును. మానవకోటి అంతయు, ప్రపంచమంతయు, మన స్వంతమైన జ్ఞాన గృహమేగాన అందున్నవారందరూ, జాతి, దేశ, మత వివక్షత లేకుండ మానవులేగాక, జంతుజాలమంతయు, వృక్షములు, ఖనిజములు గూడ దైవస్వరూపములే గాన వీరందరూ, అన్ని నామరూపములును తరించుట దైవత్వ మును అనుభవింపజేయుట యెటులననియే యీ వెర్రి మనస్సు నిరంతరము ఆలోచించు చుండును.

ప్రాక్పశ్చిమములలో, మానవకోటి అంతలో, ఒక్క జీవినైనను, ఏ వ్యక్తినిగూడ వదలిపెట్టకుండ అందరి తరింపునకు శాంతికి, తోడ్పడుటకే యీ మనస్సు సదా కోరు చుండును. ముఖ్యముగా స్వర్ణోత్సవము జ్ఞాపకార్థముగా ప్రియమైన ఆత్మసోదరీ, సోదర స్వరూపులారా! మీ అందరి సర్వకాల సర్వావస్థలందును మీకు ఆధారము గమ్యస్థానము దుర్లభమైన మానవజన్మకు జన్మహక్కు అయిన దివ్యతేజస్సును సదా అనుభవించుచు, మీతోడి ఆత్మస్వరూపుము లందరితో, ఆ దివ్యతేజస్సును పూర్ణశాంతిని, పంచుకొనుచు, తరించెదరుగాక!

ఆనందముగా నుండుటకు దగ్గర మార్గము, తోడి సోదర సోదరీ స్వరూపములందరి

సేవ జేయుచు తోడ్పడుటయే. మీకు బాధలు, తాపత్రయములు, అవస్థలు చింతలతో నుండవలెనన్న మీ అమూల్యమైన జీవితములను వ్యర్థబుచ్చవలెను. మీ గురించియే ఆలోచించుకొనుచున్న స్వార్థము నరకమునే జేర్చును. లేక మీరు ఆనందముగా, శాంతిగా, శక్తితో నిండి యుండవలెనన్న అమూల్యమైన జీవితమును ఇతరుల సేవలో గడుపుచు తరింపుము. తరింపునకు శాంతికి, ఇదియే సూక్ష్మమైన బట్టబయలుగా నున్న దగ్గర మార్గము.

కాలము విలువైనది. నేడే మనది. రేపు మనదిగాదు. ఆశ్రమములో పలు తావుల వ్రాయబడిన సూక్తులను జూడుడు! **క్షణములను వ్యర్థము జేయువారు జీవితమునంతను వ్యర్థము జేయుదురు.** ప్రియమైన ఆత్మస్వరూపులారా! ఒక్క నిమిషము నిమీళిత నేత్రులై మీ విలువైన కాలమును మీరు యెటుల గడపుచున్నదియు స్వీయపరీక్ష జేసుకొని, నేటినుండియు ప్రతి క్షణము ఆత్మానందములోను, స్వార్థ రహితమైన సేవలోను గడుపుచు, దీపము ఆరిపోకముందే తరించుటకు గమ్యస్థానము చేరుటకు, కృతనిశ్చయులయ్యెదరుగాక! వ్యర్థమైన మాటలతో, నిరుపయోగమైన ఆలోచనలతో, అధోగతి పాలుగాక, విశ్వప్రేమతో నిండి స్వార్థరహితమైన సేవ జేయుచు తరింపుడు. మీరెటుల యీ స్వర్ణోత్సవ జ్ఞాపకార్థముగా కృతనిశ్చయములు జేసుకొని, వృద్ధి అగుటకు, ఆశ్రమవృద్ధికి, లోకకళ్యాణమునకు తోడ్పడుటకు కోరుచున్నదియు, మీరు వ్రాసినచో మీ వృద్ధిని విని, నేను ఆనందించెదను. మీ ఆధ్యాత్మికవృద్ధికి నేనుగాని, ఆశ్రమముగాని చేయవలసిన సహాయము, సేవ యున్నయెడల వ్రాయగోరెదను. ఏలనన, మీ వృద్ధియే నావృద్ధి! మీ ఆరోగ్యమే నా ఆరోగ్యము! మీతరింపే నా తరింపు! మీ శాంతియే నా శాంతి! గాన మాటలతో గాక చేతలతో స్వార్థరహితమైన సేవలో మీ అందరకు తోడ్పడగోరెదను. సర్వమత సమ్మతమైన వేదశాస్త్రసారాంశమైనలోక శాంతి ప్రార్థనను స్మరించుచు, శాంతిగీతముతో మన స్వర్ణోత్సవ సందేశమును పూర్తిజేయుదముగాక!

## శా ం తి గీ త ము

ఆకసంబున శాంతి వెలుగుగాక!
స్వర్గధామమున శాంతి ప్రతిష్ఠిత మగునుగాక!
జలములందు శాంతి సుస్థిరం బగుగాక!
పృథ్వియందున శాంతి కీర్తింప బడునుగాక!
సకల వృక్ష లతాగుల్మములయందు శాంతి సతతము ప్రవహించుగాక!
సమస్త చరాచరములు శాంతితో నింపబడునుగాక!
సర్వగృహముల శాంతి వ్యాప్తింపబడుగాక!

శాంతి ఆశ్రమము స్వర్ణోత్సవము మీ అందరకు నూతన శక్తిని, పూర్ణశాంతి నొసంగి బ్రోచుగాక!

## అర్పణ

స్వర్ణోత్సవము సందర్భములో ఆశ్రమమునకు వచ్చిన భక్తవరేణ్యులందరకు
ప్రేమపూర్వకమైన అర్పణ.

లోకాస్సమస్తా స్సుఖినోభవంతు,

ఓం శాంతి, శ్శాంతి, శ్శాంతిః

(శాంతి జనవరి & ఫిబ్రవరి 1967)

# 48. స్వర్ణోత్సవ కృత నిశ్చయములు

దైవముయొక్క, సర్వజ్ఞత్వముతో-సర్వవ్యాపకత్వముతో సర్వశక్తి మంతముతో, స్వర్ణోత్సవం జ్ఞాపకార్థంగా నా హృదయము, మీ హృదయములను స్పర్శించుట కపేక్షించుచున్నది. దైవసన్నిధిని, జీవనజ్యోతి, ప్రేమలతో ఎప్పుడో అనిశ్చయ భవిష్యత్తులో కాకుండ, ఇప్పుడే, ఇచ్చటనే, ప్రస్తుత సజీవక్షణములోనే మీరందరు, దైవసన్నిధిని అనుభవించుచు నాకు సహాయపడగలందులకు కోరుచున్నాను.

1. దైవబిడ్డల సేవానిరతలో గాని, లేక సుదీర్ఘమైన దైవధ్యానములోగాని, నిమగ్నులై యుండులాగున ప్రతి క్షణముకూడ, కాలమును వృథా పుచ్చకుండ, సద్వినియోగం చేయుటకు నేను నిశ్చయించడమైనది.

2. అందరిలోని దైవమును, అందరిలో మాత్రమే కాదు, ప్రపంచమంతలో-ఖనిజములలో-ఉద్భిజ్జములలో-మానవరాజ్యములలో-దైవమును ముఖాముఖీని సందర్శించుటకు నేను నిశ్చయించడమైనది.

3. దైవముయొక్క దివ్యశబ్దమును వినుటకొరకై సమన్మతి కలుపుటకు నిశ్చయించడమైనది. నేనేదైన వినదలచినట్లయిన, నా అంతర మౌనస్థితిలోని బహు మెల్లని శబ్దమును వినెదను. నా కర్ణములు, ప్రాపంచికపు సద్దునకు, సందడికి, మూసికొనియుండి-దైవము యొక్క గోచరాగోచర దివ్యశబ్దములు వినుటకు తెరచుకొని యుండునుగాక!

4. నేను దైవమును గూర్చి మాట్లాడునపుడు మాత్రమే నా నోరు తెరచెదను. ఆయన మాటల కతీతుడు-సంభాషించడు. ఆయన దివ్యదర్శనమే నాకు మంగళప్రదము. నా

జీవితము మాత్రమే కాక అస్తికత్వమంతయు దేవుని సంతానమున కంతకు ఘనాశీర్వాదముగా పరిణమించుగాక! దేవుని శ్లాఘించుటకు మాత్రమే, ప్రస్తుతించుటకు మాత్రమే–ఈ నా నోరు తెరువబడుగాక!

5. దైవము తరంగరహిత నిశ్శబ్దమై యున్నాడు. కాబట్టి ఇంతకు పూర్వము కంటె ఇప్పుడు అధికముగా, నేను నిశ్శబ్దముగా నుండుటకు నిశ్చయించితిని. తగినంత ముఖ్యావ సరము వచ్చినపుడును, నా మాటలు దైవసంతతికి సహాయకారిగా నుండునని తోచినప్పుడు మాత్రమే–నేను మాట్లాడెదను.

6. ఈ స్వర్ణోత్సవ జ్ఞాపకార్థముగా నేను పునర్జన్మను స్వీకరించి, నిరంతర నిస్వార్థ సేవలో–నా జీవితమును ప్రారంభించుటకు, గడుపుటకునిశ్చయించితిని. "పరోపకారార్థం ఇదం శరీరం" అని చెప్పబడెనుగాన ఇంతరులకు సేవజేయుట, జీవించుట–శ్వాసించుట నాకు విధి. ఏలనన–వారందరు నా అభేద్యమైన అంతర్వ్యాప్తమైన జ్యోతియై యున్నారు. అద్వితీయమైన ఒకే పరమాత్మ స్వరూపులై యున్నారు.

7. అంతకును మించి, ఎల్లప్పుడు, సాధ్యమైనంతవరకు తక్కువగా మాట్లాడుటకును–సాధ్యమైనంతవరకు అధికముగా సుదీర్ఘధ్యానములో నిమగ్నుడనై యుండుటకును నిశ్చయించడమైనది.

8. ఎచ్చోట భూమండలమంతయు చేరియున్నదో, ఎచ్చోట ఏ ఒక్క పరమాణువు గాని–సృష్టిలోని ఏ ఇసుమంత సూక్ష్మభాగముగాని–మినహాయింపబడలేదో– ఎచ్చోట ఈ కడు విశాల భూప్రపంచమంతయు ఒక బుడగ పరిణామము గలిగి, నిరంకుశాఖండ సచ్చిదానంద సాగరములో అణగిపోవునో, అట్టి సోహం శ్వాససర్వతోముఖ దివ్య శ్వాసను ఉదయాస్తమయములు–ప్రారంభము మొదలు అంత్యమువరకు తైలధారవలె జపించుటకు నిశ్చయించితిని.

9. లోకశాంతి ప్రార్ధనతో దినమును ప్రారంభించి వేదాంత ప్రార్ధనతో దినమును ముగించుచు మానవాభ్యుదము కొరకై ప్రార్ధనలు సలుపుచుండుటకు నిశ్చయించితిని.

10. నడుమను తెంపులేకుండ ఒక పాత్రనుండి, మరొక పాత్రలో పోయబడిన తైలధారవలె బాహ్యాభ్యంతరములలో దైవసాన్నిధ్యానుభవ సాధన చేయుటకు నిశ్చయించితిని.

11. తేజస్సులో నివసించుటకు, కదలుటకు, కృషి చేయుటకు తుదకు తేజస్సునై పోవుటకు నిశ్చయించితిని. నిశ్చయముగా నేను తేజస్సులో నున్నాను. తేజస్సు నాలో నున్నది. నేను తేజస్సునై యున్నాను.

ఈ దిగువ శాంతి గీతముతో స్వర్ణోత్సవము ముగియుగాక!

స్వర్గములో శాంతి నెలకొనుగాక!

గగనతలమంతయు శాంతి వర్ధిల్లుగాక!

సప్తసముద్రము లంతటను శాంతి శోభిల్లుగాక!

భూమండల మంతయు శాంతి వెల్లువయై పారునుగాక!

గుల్మ లతాదులయందు, వృక్షములయందు, మొక్కలయందు

శాంతి సెలయేళ్ళుగా ప్రవహించునుగాక!

స్వర్గలోక నివాసులందరు శాంతిని ప్రసరింపజేయుదురుగాక!

నలుదిక్కుల శాంతి ఘూర్ణిల్లుగాక!

లోకా స్సమస్తా శాంతిరస్తు ఓం ఓం ఓం.

(శాంతి మార్చి 1967)

## 49. సహజ సమాధి

సమాధి అనేక విధములుగా విభజింపబడినది.

అందు ముఖ్యమైనవి రెండు రకములు

**I సవికల్ప సమాధి II నిర్వికల్ప సమాధి**

సవికల్పము మరల నాలుగు రీతులుగా విభజింపబడినది. ఇప్పుడు మనము సహజ సమాధిని గురించియే విమర్శింతము. సహజమనగా, స్వభావికమైనది, ఏ ప్రయత్నము లేకుండగనే, స్వభావసిద్ధమైన సమాధిని, సహజ సమాధి యందురు.

సమాధి మానవుని జన్మహక్కుగాన కోటిలో వక్కరైనను, యీ సహజసమాధిని అనుభవింపజాలకుండుట విచారకరమైన విషయము.

దీనికి కారణము మాయయే ! మాయ అనగా, యెచ్చటనో బాహ్యమున లేదు. తనలోనే ఉన్నది. అదియే కోరిక, కోరికయే తన జన్మహక్కుయైన దైవమును, మేఘము సూర్యుని మరుగుజేయుచున్నట్లు, అంధకారములో మనుజుని మరుగుజేయుచున్నది. కోరకను జయించుటే మోక్షము. మాయాతీతులదే సహజసమాధి, కొదవసమాధులను అనుభవించుటకు, మానవుడు ప్రయత్నము చేయవలెను. ఎచ్చట ప్రయత్నమున్నదో అచ్చట శ్రమ, దుఃఖము బాధ ఉండియుండును. సహజసమాధిలో యేప్రయత్నమును లేదు.

ఏలనన, అది అద్వితీయము. రెండు గాదు, రెండు ఉన్నచోటనే గదా, మానవుడు రెండవ దానికై ప్రయత్నించవలెను. ఉన్నదొక్కటియైయుండ, అదియే తానైయుండ దేనికొరకై తాను ప్రయత్నించవలెను.

ప్రయత్నములచే, కొని తెచ్చుకొన్న సమాధులు, తాత్కాలికముగా యుండును. అప్రయత్నముగా, స్వభావసిద్ధమైన సమాధి యెప్పటికిని, స్థిరముగా, శాశ్వతముగా, ఒకే రీతిగా ఉండును. ఏలనన, అది క్రొత్తగా తెచ్చిపెట్టుకున్నదిగాదు. అది స్వభావసిద్ధముగా, యెప్పుడును అద్వితీయమై ఉండెడిదిగాన. ఈ సహజ సమాధిని, యెన్నియో జన్మలలో జేసుకొనిన పూర్వజన్మ సుకృతముయొక్క ఫలితముగా, కోటికొక మహనీయుడు అనుభవించుట గలుగుచున్నది. ఈ సమాధిని అనుభవించెడివారికి పగలు, రాత్రి అనెడి వివక్షతగాని, జాగ్రత, స్వప్న, సుషుప్తి, అవస్థలనెడి వివక్షతలుగాని లేవు. వారు ఏకాంతము లోనైనను, జనసమూహములోనైనను ఒకేరీతిగా, నిరతిశయానందమును, సర్వకాలసర్వా వస్థలయందును, అనుభవించుచుందురు. అట్టివారిని, అట్టివారే గ్రహించ గలరు. అనగా సహజ సమాధి గలిగిన పురుషుని, గ్రహించుటకు లేక తెలిసికొనుటకు, సహజసమాధి గుణములు చిహ్నములు గలిగి యుండవలెను. అదియుగాక, మనలోయున్న దానినే యితరు లలో గుర్తించగలమని, అంతర్యమున ఉన్నదే బాహ్యమున గలదని, ధర్మచట్టము జెప్పు చున్నది.

ఈ సహజసమాధి గురించి వెయ్యి వ్రాతలు వ్రాయవచ్చును. అతీతమైన స్థితినుండి విమర్శించినచో వ్రాయుటకేమియు లేవు. రెండే చిన్న విషయములను తీసుకొని, ఈ వ్యాసమును వ్రాయ ప్రయత్నించెదను.

బ్రహ్మము, శక్తి, అనెడి యీ రెండు చిన్నమాటలను, అనుభవముగా గ్రహించిన, సహజసమాధిని బోధపర్చుకొనుటకు సహకారిగా ఉండును. వీటినే పురుషుడు, ప్రకృతి అని జెప్పవచ్చును. బ్రహ్మ లేక పురుషుడు, సాక్షిస్వరూపుడు. తాను సాక్షిస్వరూపముగా యున్న, ప్రకృతి అంతయు, సృష్టి తనకు విలక్షణముగానె యుండును. ప్రకృతి అంతయు, పురుషుని నుండియే వచ్చి మరల పురుషునిలోనే లీనమగుచున్నది.

వ్యక్తమైన బ్రహ్మమే ప్రకృతి, లేక శక్తి, అవ్యక్తమైన బ్రహ్మమే మూలవిరాట్టు పురుషుడు. సహజసమాధిని అనుభవించుటకై ప్రయత్నించుచున్న తత్వవిదులకు, తమలో హెచ్చుతగ్గులు లేక, నిరంతరము–స్థిరముగాయున్న సద్వస్తువును, తెలుసుకొనుటకు విచారణ జేసినచో కొంతవరకు, సహజసమాధిని గ్రహించుటకు సహకారిగా నుండును.

ప్రశ్న : మనుజునిలో, తాను నిద్రపోవుచున్నను, నిద్రపోనిది యెద్ది? తాను యెన్ని

అవస్థలు, చింతలు బాధలలో యున్నను, ధనముతో తులతూగుచున్నను, పేదరికములో బాధపడుచున్నను, ఆరోగ్యముతో విలసిల్లుచున్నను, రోగపీడితుడైయున్నను, పండితుడైనను, పామరుడైనను, ప్రతి మానవునిలో, అహర్నిశములు, హెచ్చుతగ్గులు లేకుండా, క్షణములో కోటవవంతుయైనను, విశ్రమించకుండ ఆడుచున్నది యెద్ది?

సమాధానము : అదియే శ్వాస, సోహం భావన, సర్వకాల సర్వావస్థల యందును అదియే నేను. "తత్వమసి". "ప్రజ్ఞానం బ్రహ్మ" యని కోటినోళ్లతో, అందరిలోను, రాత్రిం బగళ్ళు ఆడుచున్నది.

గాని, మానవుడు, అంధుడై, జడుడై, మంధుడై, తన దగ్గరలోయున్న, తన జన్మహక్కైన, నిత్యమైన, సహజస్థితిని తెలుసుకొనజాలకుండెను.

ఈ శ్వాసను ఏకాగ్రతగా, వెంబడించి, సోహం భావనను గ్రహించిన, కొంతవరకు, సహజ సమాధిని గ్రహించుటకు తోడ్పడును.

ప్రహ్లాదాది భక్తవరేణ్యులు, ఈ సోహం భావన అనుభవముచేతనే

శా. పానీయంబులు ద్రావుచుం గుడుచుచున్ భాషించుచున్ హాసలీ
లానిద్రాదులు సేయుచుం దిరుగుచున్ లక్షించుచున్ సంతత
శ్రీనారాయణ పాదపద్మయుగళీ, చింతామృతా స్వాద సం
ధానుడై మఱిచెన్ సురారిసుతుడే తద్విశ్వమున్ భూవరా.

అని జెప్పబడిన పద్యములోవలె యెన్ని పనులలో, యెన్ని అవస్థలలో యున్నను, సహజసమాధిచే వ్యక్తపరచుచుండిరి.

ఇక పెక్కుమాటలేల? శాశ్వతమైన స్థిరమైన, పరిపూర్ణమైన, ఆనంద మెచ్చుటనైన యున్న అది సహజస్థితియందే గలదు.

కొదువ సమాధులన్నియు ప్రయత్నముచే కొనితెచ్చుకొని నటువంటివి. మత్తుమందువంటి, నిషావస్తువులవంటివని జెప్పవలెను. నిషా వదలగనే, మనుజుడు, తన నిజస్థితిని పొందుచుండెను.

ఒక్క సహజసమాధి మాత్రమే అన్ని మార్పులకును, స్థితిగతులకును, అతీతమై సదా ఒకేరీతిగా, నిరంతరము వెలుంగుచున్నది.

**సహజసమాధి పురుషునకు** "ఇది నేడు జేస్తిని. రేపు దానిని చెయ్యవలెను." అనెడి సంకల్పనలు లేవు. ఏలనన, వ్యక్తి భావన కర్తృత్వమే తనయందు నశించెను. తాను జేసినను జేయకున్నను, అద్వితీయమైన సద్వస్తువు, తన స్వస్వరూపము,

హెచ్చుతగ్గులను మీరి సదా ఒకేరీతిగా సూర్యునివలె–అంతకంటె హెచ్చగు కోటిసూర్యుల ప్రకాశముతో వెలుంగుచున్నది.

మహత్తరమైన, ఆ సద్వస్తువు, ననుభవించెడివారు మాత్రమే, సహజసమాధిని నిరంతరము అనుభవించుచు, బ్రహ్మభావనతో, వృత్తిరహితులై యుందురు.

మరుపుగాని, నిద్రగాని, చివరకు మృత్యువుగూడ వారి సహజస్థితిని అంటజాలదు.

ప్రియమైన పాఠకా! నీ జన్మహక్కుయైన సహజసమాధిని నీకు, అనుభవించవలెనని లేదా! ఇంకను యెన్నాళ్ళు వాసనత్రయమునకు బానిసలై, అనగా దేహవాసన, శాస్త్రవాసన, లోకవాసనలతో నిండి, నీ సహజమైన, ఆత్మవాసనను, మఱచెదవు. నిస్సారమైన దుమ్ములను, యెంత నమిలినను, వాటినుండి సారమును గ్రహించజాలవు. జీవితముయొక్క సారమంతయు, సూక్ష్మముగా నీ చిన్న శ్వాసయందే యిమిడియున్నది. పరమాత్మస్వరూపుడు నీ శ్వాసకు శ్వాసగా వెలుంగుచుండెను.

పనిచేయునపుడు, నీవు శక్తిస్వరూపుడవు, ఏపనియు లేక, స్థిరముగా యున్నప్పుడు నీవు బ్రహ్మస్వరూపుడవు. బ్రహ్మయు, శక్తియు ఒక్కటే! నీవే బ్రహ్మవు. నీవే శక్తివి. నీవే సర్వము. “అయమాత్మా బ్రహ్మ”. “ప్రజ్ఞానం బ్రహ్మ”. “అహం బ్రహ్మాస్మి”. “తత్త్వమసి”. అని నాలుగు వేదముల సారాంశము యీ నాల్గు మహావాక్యములలో జెప్పబడినది. ఈ మహావాక్యముల సారాంశమంతయు సులభముగా, సూక్ష్మముగా, నీ శ్వాసలోయున్న సోహంలో యిమడ్చబడినది. గాన, నీ శ్వాసను ఏకాగ్రముగా వెంబడించవలెను. సోహం భావనను స్థిరము జేసి, ఆరూఢులై నిరంతరము, సహజసమాధిని అనుభవించుచు తరించెదవుగాక!

లోకాస్సమస్తా స్సుఖినోభవంతుః ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

(శాంతి ఆగస్టు 1967)

# 50. స్వప్న భ్రాంతులు

శరీరమిప్పుడు హిమాలయ పర్వతములందలి టెహరీలో యున్నను, మనస్సు మాత్రము వాసనా బలిమిచే తోటపల్లికొండలయందలి శాంత్యాశ్రమము వైపు పరుగెత్తు చుండెను. శరరమున్నచోటనే మనము జీవించుట లేదనియు, మన మనస్సెచ్చట యున్నదో అచ్చటనే జీవించుచుందుమని పెద్దలు చెప్పుదురు.

మనస్సే స్వర్గమును నరకముగాను, నరకమును స్వర్గముగాకూడ చేయుచుండును. తోటపల్లి ఆశ్రమము, అచ్చట చేయబడుచున్న వివిధమైన కార్యక్రమములు, ఆసుపత్రి, గురుకులము, నోరులేని మూగజంతువులు, చెట్టుచేమలు, లతాపుష్పములు వగైరా అన్నిటిని వదలి సుమారు 2000 మైళ్ళు దూరము ప్రయాణముచేసి హిమవత్పర్వతములు చేరితిమి. తత్కాలికముగా నైనను అన్నియు మరువగలుగుటకు ఇది దైవమిచ్చిన మహదవకాశమని తృప్తిచెందుచుంటిని.

ప్రయాణపు బడలికచే, మంచుకొండల సమీపమున నున్నందునను, రొంప దగ్గు కొంచెము లోజ్వరముకూడ యున్నట్లుండెను. నాటి మధ్యాహ్నము టెహరీలో ఎత్తైన పర్వత శిఖరములను చూచుచు పరుండగా కన్నుమూసి తెరచునంతలో చాలకాలము గడిచినట్లుగా కన్నులకు శ్రీ రాజాజీ ప్రత్యక్షమయ్యెను.

అప్పుడు వారితో "నోరులేని మూగజంతువులకు గడ్డిలేదు. అనాధులైన గురుకుల బాలబాలికల పోషణకు ధాన్యము కావలెను. మీరు శ్రమతీసుకొని వెళ్ళిన, మిమ్ముచూచి కొన్ని బళ్ళుగడ్డి, కొన్ని బస్తాల ధాన్యము యిచ్చెదరు" అని చెప్పితిని.

అంతలో కోయిల పాటకు ప్రతిధ్వనిగా నత్యానందముపల్కుచున్న దానికి హఠాత్తుగా మేల్కాంచితిని. స్వప్నదృశ్యము మాయమయ్యెను. గడ్డి, ధాన్యము మున్నగు అవస్థలన్నియు తగ్గిపోయెను. ఆ స్వప్న దృశ్యము ఎంత ప్రత్యక్షముగా యున్నదనగా, చాల తడవు నేనున్నది తోటపల్లిలో గాదు, చల్లని హిమవత్పర్వత సానువులందలి 'టెహరీ' లో నుంటినని మరల మరల జ్ఞప్తికి తెచ్చుకొనవలసివచ్చెను.

ఈమధ్య తోటపల్లియందు వివిధములైన కార్యక్రమములు జరుగుచుండెను. శ్రీ స్వామి రామతీర్థ కళాశాలకై ఏతెంచినవారి నేమి, ఆశ్రమమున అమర్పబడుచున్న నీటికుళాయిల పనులపై ఏతించిన వారి నేమి, విధివిరామములు లేక చూడవలసి వచ్చు చుండెను. శ్రీరాజాజీ "పైపింగు ఇంజనీరుగారు వచ్చిరి. సింబల్‌వద్ద కూర్చుండ పెట్టితిని. ఒక నిమిషము తమ దర్శనము చేసుకొని వెళ్ళెదరట" అని చెప్పుచున్నట్లు భ్రాంతి

పడుచుంటిని. మరొక్కసారి శ్రీరాజాబెన్నయ్య దొరగారి ఆత్మీయులు వచ్చిరి. వారికి బస్సు మించిపోవును శ్రీ రాణీ వారి భవనమువద్ద కూర్చొని పెట్టితిమన్నట్లు వినిపించుచుండెను.

అన్నవరం సత్యన్నారాయణ గుడిలో వ్రతము చేసికొనుటకు భక్తులు రెండు కార్లమీద కాకినాడ నుండి వచ్చిరి. చిన్నపిల్లలు ఏడ్చుచుండిరి. కాన వెంటనే దర్శనము యిప్పించమని తొందర కలిగించుచుందురు. తరుచు మాకుకూడ సత్యనారాయణ ప్రసాదము దొరుకుచుండును.

అది పోష్టు సమయం, పోష్టు ఆలస్యముగా పంపుచుంటిమని పోస్టలు వారు విమర్శిం చుచుండిరి. గాన ఆనాడు చాల తొందరగా వుత్తరములన్నియు పూర్తిచేయు చుంటిమి. అంతలో 3 కార్లు మీద పెండ్లివారు అన్నవరం వెళ్ళుచు, స్వామీజీ దర్శనమునకు వచ్చిరి. వారిని వెంటనే చూడకున్నచో ముహూర్తము దాటిపోవునని క్రింది ఆశ్రమంవారు తొందరచేయగా-పోస్టునకు, పోస్టుమేష్టరునకు ఒక నమస్కారమని, అందరిని సంతృప్తి పరచుటకే కోరుచుందునుగాన, పెండ్లి వారిని ముందుచూచి, సందర్శకుల సందేశము వినిపించి శాంతి ప్రార్ధన స్మరింపజేసి, ప్రసాదములిచ్చి పంపుట జరిగెను.

ఒకనాడు 125 మంది బాలబాలికలతో కొందరు ఉపాధ్యాయులు వనవిహారమునకై వచ్చిరి. వేళ అతిక్రమించినను వారికి వెంటనే దర్శనమిప్పించవలయునని ఆశ్రమవాసులు కోరుచుందురు. విరామము లేకుండగ వచ్చెడి భక్తులందరకు ఇచ్చుటకు తగిన ఆహారపదార్ధములు లేమిచే, వారికి బస్సు దాటిపోయిన ఇబ్బంది పడుదరనెడి అభిప్రాయ ముతో నేను స్నానాదికములు ముగించుకొనక పోయినను, అన్నివేళలందును వచ్చిన భక్తులను సంతృప్తిపరచుటకు కోరుచుందును.

మరియొకరోజున, అది మిట్టమధ్యాహ్నము. ఎండలు హెచ్చుగా నుండి గాలుపు వీచుచుండెను. అయినను ఆశ్రమంనకు గడ్డి, ధాన్యం సంవత్సరచందా లిచ్చెడి ఆశ్రమ భక్తులు స్వామీజీ దర్శనార్థము వచ్చిరి. ఆలస్యమైన బస్సుదాటిపోవునుగాన వెంటనే వారిని చూచుట ముఖ్యమని ఆఫీసునుండి టెలిఫోనుమీద జరూరైన నందేశము వచ్చెను. అట్టి పరిస్థితిలో అనారోగ్యముగా యున్నను, నిరహార దీక్షగా, పనితొందరలోయున్నను-అన్ని పరీక్షలలో నారాయణుడే అతిథి, అభ్యాగతి రూపముగా వచ్చుచుండెనని తలంచి, ధన్యోస్మి అని ఎల్లవేళలందును వచ్చెడి భక్తులను ఆదరించి శాంతి ప్రార్ధన సదా స్మరించుచు తోడ్ప డమని కోరుచు పంపుట జరుగుచుండును.

మరియొక నాడు ఉన్నతోద్యోగియో లేక మంత్రిగారో యై యుండవచ్చును. నన్ను చూచుటకు తొందరపడుచుండెను. నేను స్నానము గదిలో కాలకృత్యములు తీర్చుకొనుట

కొన్ని నిమిషములాలస్యమాయెను. అందుకువారు ఆగ్రహించి తప్పుపట్టిరి. ఆశ్రమ భారము వహించుటంత సులభము కాదుకదా! అన్నిటికంటెను ముఖ్యముగ ఎవరెంత చాకచక్యము కలిగియున్నను అందరిని సంతృప్తి పరచుట అసాధ్యము. తమ అంతరాత్మను సంతృప్తి పరచుకొనిన వారే ధన్యులు. కారులు, జీపులపై యేతించిన మరికొందరు ఉద్యోగులు "స్వామిజీ మీ టైము వృథాచేయము, ఒక్కసారి మిమ్ము దర్శించి వెళ్ళిపోదమని" కబురు చేయుచుందురు. ఈ భౌతిక రూపమును చూచిన, వారికేమి లాభము కలుగును? నాకేమి లాభము కలుగును? ఏవరేయే ఉద్దేశ్యములతో నన్ను చూచుటకు వచ్చినను, వారందరు వ్యర్ధముగా వెళ్ళరాదనియు, కొంచెమైనను వృద్ధిచెంది వెళ్ళవలెనని నా జీవితాశయము. అందుచే వారు తొందరపడుచున్నను వారికి సందర్శకుల సందేశము వినిపించి, శాంతి ప్రార్ధన చేయించి పంపుచుందును. కాలము అమూల్యమైనది. నన్నుచూడ వచ్చెడి వారి వృద్ధిని గోరుచు వారిచే హరేరామ మంత్రమును స్మరింపజేయుచుందును. శాంతి ప్రార్ధనా నంతరము కొంత తడవు మౌనధ్యానము చేయించి, దైవ ప్రసాదమిచ్చి పంపుచుందుము.

**"నీవు సదా దైవములో జీవించుచు, నీ వద్దకు వచ్చెడి వారికి దైవజ్ఞప్తిని కలిగించుచు జీవించుము"** అనునదియే 50 సంవత్సరములనుండి శాంతి ఆశ్రమ ముఖ్యాశయమై యున్నది.

స్వప్నము అనేక రీతులుగా వచ్చుచుండును. ఇంక భ్రాంతులు వర్ణించుటకే అశక్యము. అన్నిటికంటెను ముఖ్యము రజ్జుసర్ప భ్రాంతి వేదాంతులకు వెన్నెముకవంటిది. ఉన్నదొక్కటే, రెండు లేవు. నీవు పామును గుర్తించిన త్రాడులేదు. త్రాడని నిర్ణయించిన పాము లేదు గాన–

ప్రియపాఠకా! సచ్చిదానంద స్వరూపంబైన, అద్వితీయమైన ఆ జ్యోతి స్వరూపమునే స్థిరముచేసుకొని అన్ని భ్రాంతుల నుండి విడివడి తరించెదవు గాక!

ఇంతలో తిరిగి సత్యానందము చేసెడి కోయిల ప్రతిధ్వనికి నా స్వప్న భ్రాంతులన్నింటి నుండియు విడివడి, తోటపల్లిలో గాదు నేనిప్పుడు హిమాలయములలో భగీరధీ తీరముననే యుంటినని 'నిర్ధారణ' గావించికొని ఆనందముతో ధ్యానము చేసుకొనుట ప్రారంభించితిని.

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

లోకాస్సమస్తా స్సుఖినో భవంతు

(శాంతి ఆగస్టు 1968)

# 51. సాధనలు - మంత్రములు

నా చిన్నతనములో శాంతి ఆశ్రమము స్థాపించినప్పుడు అమ్మన్నదాసు అను భక్తుడైన తోటమాలి యుండెడివాడు. అతడు అనేకమైన కీర్తనలు, తత్త్వములు మొదలైనవి పాడెడివాడు. అందరిచే పాడించెడివాడు. అతడిప్పుడు లేకున్నను ఆతడు పాడిన కీర్తనలు, తత్త్వములు ఇప్పటికిని నా చెవులలో, హోరుమని మ్రోగుచున్నట్లే యుండును.

ఇట్టివారిని గురించే మృత్యుంజయుడని చెప్పబడెను. చనిపోయినను, జీవించియున్న వారని చెప్పబడినది. అమ్మన్నదాసు పాడెడి పాటలలో, ముఖ్యముగా రెండు చిన్నకీర్తనలు, నాకు యిప్పటికిని జ్ఞప్తికి వచ్చుటేగాక, నూతనశక్తిని ఆనందమును గల్గించుచుండును. వాటిని మా శాంతి పాఠకులతో, వారి వృద్ధిని కూడ కోరుచు, రాబోయెడి ఆశ్రమ వజ్రోత్సవ జ్ఞాపకార్థము యిచ్చట వ్రాసి అందరితో పంచుకొనుటకు కోరుచుంటిని.

"చావదురా యీ పాము చప్పిటి దెబ్బలకు"

నాకు ఈ కీర్తనంతయు జ్ఞప్తిలేదుగాని, తరింపునకు ఈ రెండు మాటలు చాలునని, తరచు పాడుచుందును.

పాము అనగా, అహంకారమనెడి విషసర్పము. అది చిన్న చిన్న మంత్రములకు, నామజపములకు భజనలకు అంత తేలికగా చావదు. ఈ అహంకారమనెడి మహాశత్రువును, విషసర్పమును, రూపులేకుండ చంపుటకు గట్టిదెబ్బలు, చావా బ్రతుకా అన్నంత పెద్ద ప్రయత్నము చేయవలెను, (అనగా తీవ్రమైన కఠిన సాధనలు కావలెను)

Be dead that ye may live, అని మహనీయులు నుడివియుండిరి.

చావదురా యీ పాము చప్పిడి దెబ్బలకు

How true is the Highest simple Truth! ఈ సూక్ష్మమైన సత్యము ఈ చిన్నసూక్తి ఎంతసత్యమో పాఠకులకే అనుభవము.

తేలికైనను దుర్లభమైనను, ఈ అహంకారమనెడి క్రూరమైన, విషసర్పము చనిపోయినప్పుడే మానవునకు శాంతి, ముక్తి, మోక్షము లభించును మరియొక మార్గము లేనట్లు గానవచ్చుచున్నది.

మూల్యము చెల్లింపక వస్తువు కావలెనన్న వారితో, ఈ లోకము నిండియుండుట విచారకరము. దైవము, దైవమని పరితపించెడి స్వార్థరహితులు దైవములో లీనమగుచుండ-అహం-నేను-నేను అనుచు శరీరములనే పూజించుచు జీవించెడి స్వార్థులు-స్త్రీలైనను, పురుషులైనను, గృహస్థులైనను, సన్యాసులైనను, అధోగతిపాలగుచు మట్టిలోనే కలయుచుండిరి.

ఎంత మేధావంతులైనను, ధనవంతులైనను, తమ తెలివితేటలు, మేధాశక్తితో, తమ ఆంతర్యనివాసియగు దైవము నెవ్వరు మోసపుచ్చలేరు. ఎవరు జల్లిన విత్తనముల ఫలితము వారే అనుభవించుచున్నారు. ఎవరు తీసుకున్న గోతిలో వారే పడుచున్నారు. ఈ పై సత్యముల నెంత త్వరలో గ్రహించిన అంతగా వారు అభివృద్ధియై దేశవృద్ధికి, లోకశాంతికి తోడ్పడిన వారగుదురు.

ఇక రెండవ కాందార్థము-దాని గొప్ప సారాంశమును విమర్శింతము.

ఈ సాధనలన్నియు వీసానికి పనికిరావు

ఏ సాధనలేని సాధనచెప్పెదను

శాంతిని బడయుమా ఓ మనసా!

ఈ మహాసూక్తిగూడ, పూర్తిగా నాకు జ్ఞాపకము లేదు. గాని యిది చాలానిగూఢమైనది, (లోతైనది) గాంభీర్యమైన సత్యముగావున, నా సాధనలలో, ప్రార్ధన ధ్యానాదులలో చాల తోడ్పడెను.

దానినొకమారు పూజ్యశ్రీ చిదానందస్వామీజీతో వారు ఇచ్చుట జన్మదినమునకు వచ్చినప్పుడు, ప్రేమతో వారిటుల ప్రశ్నించిరి.

Swmiji, what is that S A D H A N A which is secret of secrets?

స్వామీజీ రహస్యములకెల్ల రహస్యమైన ఆ మహారహస్యమేదని ప్రశ్నించిరి? శ్రీవారికి నేను నోటితో, చిన్నమాటలతో ఏమియు జెప్పజాలను. మౌనము వహించితిని.

శ్లో॥ దేహో దేవాలయ ప్రోక్తో
జీవో దేవ స్సనాతనః
త్యజే దజ్ఞాన నిర్మాల్యం
సోహం భావేన పూజయేత్

అర్థము : దేహమే దేవాలయము జీవుడే దైవముగాన అజ్ఞానమును నశింపజేసి సోహం భావంతో ప్రతీ శ్వాసతో పూజింపుము.

మన మంత్ర తంత్ర కీర్తనలు వీసానికి పనికిరావా?

ఓం శ్రీరామ

ఓం నమో నారాయణాయ

ఓం నమోభగవతే వాసుదేవాయ

ఓం నమశ్శివాయః ఓం శివాయనమ

ఓం శ్రీరామ జయరామ జయ జయ రామ

మొదలైన మహామంత్రములన్నియు వీసానికి పనికిరావా?

ఆశ్చర్యము–ఆశ్చర్యములకు–ఆశ్చర్యము

శ్లో॥ జ్ఞాతం జ్ఞాతస్య మదునా
ద్రష్టం ద్రష్ఠవ్య మద్భుతం
చిర శ్రాంతం విశ్రాంతోస్మి
చిన్మా త్రానాస్తి కించన

అర్థము : తెలుసుకొనవలసినది తెలుసుకొంటిని, చూడవలసినది జూస్తిని, అద్భుతము! తెలియునప్పుడు ద్వంద్వములతో చాలగ బాధపడితిని, ఇప్పుడు ఆత్మతప్ప మరేదియు లేదుగాన విశ్రాంతిని అనుభవించుచుంటిని.

ఓ వెట్టిమనుజుడా! నీ ఆలోచనలన్నియు ప్రార్ధనగా చేసుకొని, సర్వాంతర్యామి, సర్వజ్ఞుండైన దైవమును అజపగాయత్రితో, మౌనముగా పూజింపుము.

సోహం భావేన పూజయేత్, నిశ్శబ్దముగా విశ్వప్రేమతో, హృదయాంతర్వర్తిని, కోటిసూర్యతేజ ప్రకాశవంతమైన తేజస్వరూపుని పూజింపుడు.

ఈ సాధనలన్నియు వీసానికి పనికిరావు!

ఏ సాధనయులేని సాధన సోహం భావనతో నిశ్శబ్దములో అనుభవించెదముగాక!

ఆశ్రమం పేరునైనను ఈ బాహ్య పనులన్నియు మరచి రాబోయెడి, వజ్రోత్సవ జ్ఞాపకార్థమైనను, మీ ఆత్మ తేజస్సు ననుభవించుచు గమ్యస్థానమును చేరెదరుగాక! మేల్కొనుడు. గమ్యస్థానము చేరెడు వరకు ఆగవలదు. Arise, Awake! Stop Not Until the Goal is reached.

ప్రియమైన శాంతి పాఠకులారా! మౌనాశ్రమం మిమ్ము ఆహ్వానించుచున్నది. సముద్రము ప్రార్థించుచున్నది. ప్రతి కెరటము ఒక ప్రార్ధనయే, మీ జన్మహక్కైన దైవమును ప్రార్ధనలతో, మౌనముగా అనుభవించుడు!

ఓం ! ఓం ! ఓం !

లోకా సమస్థా స్సుఖినో భవంతుః

(శాంతి నవంబరు 1976)

# 52. సిరాబుడ్డిలో సిరా పోయుట

ఆశ్రమవాసులైన శ్రీదాదాజీ B.A., B.Com., LL.B., గారు వారు వాడుచున్న సిరాబుడ్డి (కాళీది) నావద్దకు తీసుకొని వచ్చి దానిలో సిరా పోయుటకు ప్రయత్నించుచుండగా, నేను వారికి తోడ్పడుటకు ప్రయత్నించితిని.

సిరాచుక్కలు పడునని, ఎందుకైనా మంచిదని బైటకు తీసుకొని వెళ్ళి పోయసాగితిని. నా బుడ్డిలో యున్న సిరా అంతయు పోసినను అది నిండలేదు. పైగా చాల సిరా క్రింద కారిపోయెను.

నా సిరాబుడ్డి మూత వెడల్పుగా యున్నందున పైన కారిపోవుచున్నదని తలంచి, మూతి సన్నముగాయున్న పెద్దసీసా తెచ్చి దానినుండి పోయుచున్నను, సిరా అంతయు కారిపోవుచునేయున్నది. శ్రీ దాదాజీగారి చిన్న సిరాబుడ్డిమూత సన్నముగా ఉండుటచే కారుచున్నదని అప్పుడు B.A., B.Com., LL.B., గారినే పోయుమని రెండు సిరాబుడ్డులు వారికి ఇచ్చితిని.

వారు పోసినను సిరాఅంతయు క్రింద ధారవలె కారిపోయెను. అప్పుడు వారు తెచ్చిన సీసాను వారి చేతుల నుండి తీసుకొని దాని మట్టును పరీక్షించగా దానికి, పెద్దకన్నము ఉండెను. B.A., B.Com., LL.B., కన్నమున్న సీసాను, అంతచూడకుండా నావద్దకు తెచ్చి దానిని నింపమనెదరని, నేనెన్నడూతలంచనందున, అనవసరముగా, చాల సిరా క్రింద పారబోసితినని విచారించసాగితిని.

కాని చక్కనైన పాఠము నేను ఈ సంఘటననుండి అనుభవముగా నేర్చుకొంటినని నవ్వువచ్చెను. ఈ చిన్న అనుభవము తీసుకొని నా జీవితములో ఇంతవరకు కన్నములున్న యెన్ని సిరాబుడ్లలో, సిరాను, ఆత్మామృతమును–పోసితినోగదా అని దీర్ఘముగా విమర్శింపదొడగితిని. ప్రవృత్తిపరులకు విషయవాసనలతో కోరికలతో నిండియున్నవారి జీవితములు ఈ కన్నమున్న సిరాబుడ్డివలె యుండునుగదా అని గ్రహించితిని. అట్టివారికి మనమెన్ని బోధలు జేసిన ఎంతగా మార్చుటకు ప్రయాసపడినను, మనబోధలన్నియును స్వార్థమనెడి కన్నములద్వారానో, అహంకారమనెడి రంధ్రములద్వారానో, పోవుచుండును. వృథాశ్రమయు కాలమును వ్యర్థబుచ్చుటేగాని ఇసుమంతయు లాభముండదు. కన్నములున్న సిరాబుడ్లలో సిరాబోయుటకు ప్రయత్నించకుండగ, దైవము మనలను బ్రోచుగాక!

లోకా స్సమస్తా స్సుఖినోభవంతు.

ఓం శాంతి, శ్శాంతి, శ్శాంతిః.

(శాంతి డిశంబరు 1982)

# 53. సూక్ష్మములో - మోక్షము

(మూడు రోజులలో ముక్తి–మోక్షము)

తరించుటకు సూచనలు, నిబంధనములు, నియమములు.

అవతారపురుషులైన శ్రీరామకృష్ణ పరమహంసులవారు యీ కలియుగంలో తరించుటకు, గమ్యస్థానమును చేరుటకు దైవములో లీనమగుటకు 3 రోజులు మాత్రమే చాలునని నుడివియుండిరి. గాని ఖరీదు ఇవ్వకుండా ఏ వస్తువైనను చివరకు మోక్షమైనను రాదుగదా!

ఆశ్రమమునకు వచ్చుచున్న వేలాదివేల భక్తులలో 3 రోజులు వుండగల్గినవారు చాలా అరుదు. అది వినుటకు మీరు ఆశ్చర్యపడెదరు.

కొందరు ప్రేక్షకులు వచ్చినది మొదలు యెంతలో వెళ్ళిపోవుదుమా! అని తమ చేతి గడియారములనే చూచుచుందురు. కొందరు వచ్చిన బస్సులోనే మరల వెళ్ళుటకు కోరుచుందురు. కొందరు దైవతపన గల్గిన భక్తులు నెలలేగాక సంవత్సరాలు ప్రార్ధన, ధ్యానములు ఏకాంతములో చేసుకొని వృద్ధిచెందుచుందురు.

ఒక ప్రవృత్తిపరుడు చాలా భక్తుడేగాని 3 రోజులు ఆశ్రమంలో ఉన్న నా వ్యాపారములు పాడవవా అనెను, "వ్యర్థమైన మూడు రోజులు" అనునొక వ్యాసముగూడా అతని ప్రవృత్తిని గురించి వ్రాయబడెను.

మొన్న అదివారం ప్రార్ధనలో మాయయొక్క గట్టిదనము, ప్రవృత్తియొక్క వ్యామోహమును తెలియచేయుటకు ఒక కథ చెప్పబడెను.

ఒక లోభి అయిన ప్రవృత్తిపరుడు తన అంత్యకాలము సమీపించగ వాని నలుగురి కొడుకులను చూచుటకుకోరి వారిని రమ్మని కబురు చేసెను. నలుగురు తనయులు రాగానే మీరు నలుగురు వచ్చివేసిరి. కొట్టువద్ద ఒక్కరైనను లేకున్న మన గతి అయిన కొట్టు అవస్థ ఏమగునని విలపించుచు వారిని మందలించెనట. ఆహా! డబ్బుయొక్క వ్యామోహము అంత గట్టిగయుండును. మాయ ఎంత చాకచక్యములుగల చదువరులకైననూ దుర్లభముగదా!

మన విలువయిన కాలమును వ్యర్థమయిన మాటలతో ప్రవృత్తిపరులను గూర్చి మాయ ప్రభావము గురించి ఆలోచించుచు కాలమును వ్యర్థ పుచ్చుటకంటె 3 రోజులలో మోక్షమును పొందుట, సూక్ష్మములో మోక్షమును బడయుట ఎటులనో విమర్శించి తెలుసుకొని తరించుటకు ప్రయత్నించెదముగాక!

సూక్ష్మములో మోక్షమును బడయుటకు 3 రోజులలో తరించుటకు నియమములు, సూచనలు గురించి ఇప్పుడు తర్కించి ధ్యానించి వ్రాయుట మంచిది. మంచిదేకాదు ముఖ్యముగూడ.

1. సూక్షమములో మోక్షము బడయుటకు మౌనము చాలా సహకారిగ యుండును.
2. మౌనమేగాక ఆహార నియమములు సాత్వికాహారము తీసుకొనుట చాలా బాగ తోడ్పడును.
3. ప్రవృత్తితో ఇంద్రియములతో బాహ్య ప్రపంచ దృశ్యములు జూచుటకంటె నివృత్తిగ కండ్లుమూసుకొని అంధత్వముతో నివృత్తిగ దైవమును చూచుట చాలా సహాయపడును.
4. అంతా కృష్ణమయం బీజగమంతా కృష్ణమయం. కండ్లు మూసిన, తెరచిన కృష్ణమయం, ఆంతర్యముగ నివృత్తులైయుండుట చాలా తోడ్పడును.
5. మీ సన్నిహితులతోనైన అవసరమయినపుడే మాట్లాడుచూ, ఏది ప్రసంగించిననూ దైవమునుగూర్చే మాట్లాడవలెను.
6. కూర్మము అఖిలవయవములను యీడ్చి ఆంతర్యమునకు తన ఇంద్రియములను తీసుకొని వెళ్ళి నివృత్తిగా చేయునట్లు దైవ పరితాపన గల్గిన యోగులుకూడ ప్రవృత్తికి స్వస్తి చెప్పి నివృత్తిలో ఆనందంచవలెను.
7. దినచర్య 'డైరీ' సాధకులకు చాల తోడ్పడును. అందు తన మొదటి ఆలోచనను, నిద్ర నుండి లేవగానే దైవములో లీనమై యుండవలెనని నిశ్చయించుకొని వ్రాసుకొనవలెను.
8. దైవమునకు వేరే శరీరములేదు. ఈ శరీరమే ఆయనిది. దైవము నాలో పనిచేయుచూ, జూచుచూ, నడచుచూ, కదలుచు, మెదలుచుండెననెడి భావన ముఖ్యావసరము.
9. ఈ పవిత్రమయిన 3 రోజులలో ప్రతి రోజున 108 సార్లు శాంతి ప్రార్ధనను ఏకాగ్రతగ చేయుచు దైవములో లీనమగుటకు ప్రయత్నించవలెను.
10. శాంతి ప్రార్ధన తదితర ప్రార్ధనలేగాక, మహామంత్రమయిన 'సోహం' మంత్రమును–అజప గాయత్రి ప్రతీ శ్వాసలో ఉచ్ఛ్వాస నిశ్వాసములలో గుర్తించి, ధ్యానించుట ముఖ్యావసరము. దైవ పిపాసకులు ఈ సోహం మంత్రమును నోటితో స్మరించుటయేగాక దానిని సాక్షిరూపంగ చూచుచు, నిశ్శబ్దములో లీనమవ్వవలెను.

శ్లో॥ దేహో దేవాలయః ప్రోక్తో జీవో దేవ స్సనాతనః
త్యజే దజ్ఞాననిర్మాల్యం సోఽహంభావేన పూజయేత్

తా॥ దేహము దేవాలయమని చెప్పబడినది. జీవుడు దేవుడైన సదాశివుడే అయివున్నాడు. అజ్ఞానమను నిర్మాల్యమును తొలగించి "సోఽహం" (ఆ పరమాత్మయే నేను) అనుభావముతో (పరమాత్మను) పూజింపవలయును.

శాంతి పాఠకులారా! అరటిపండు వలచి మీ చేతులలో పెట్టబడినది. దానిని తినుటయే మీరు వెంటనే చేయవలసినపని. "దైవము మీకు కావలెనా?" అటులైన ఆయన ఇచ్చటనే మీ శరీరము అంతను నిండియుండెను. మీ నేత్రములలో చూచుచు, మీ హృదయములలో కొట్టుకొనుచు మీ నేత్రములలో ఆడుచుండెను. ఇక తడవు ఎలా? సోహం భావనతో పూజచేయుటయే మీ తడవు.

ది. 10-1-77 7-00 A.M. - ఓం -

(శాంతి జనవరి 1993)

# 54. హింసాకాండ

(కర్మానుభవములు)

మా ప్రయాణములో శాంతి శకటముమీద వచ్చుచుండ, ఒక్క తావున రిక్షాబండిమీద ఇద్దరు మనుష్యులు, కూర్చొని ఒక పెద్దపందిని పట్టుకొని ప్రయాణము చేయుచుండిరి. ఆ దురదృష్టమైన పందిమూతిని త్రాడుతో గట్టిగాబిగించి కట్టివేసిరి. ఎంత విషాదకరమైన స్థితి. ఇది సామాన్యముగా, అన్ని చోట్లలో మనము జూచుచున్న హింసాకాండలో ఒక ఘట్టముగానే యున్నది. కాని, చాలమంది, కండ్లు ఉండియు గ్రుడ్డిగానే యుందురు. మూతులు కట్టబడిన పందులను, ఇద్దరు మనుష్యులు కర్రకు వ్రేలాడగట్టి వాటి కాళ్ళను మీదకు, మూతులను క్రిందకు భూమివైపునకు ఉంచి మోసుకొనిపోవుచున్న, విచారమైన దృశ్యమును యెన్నడైనను జూచితిరా? ఆపందులు అట్టి క్రూరమైన అవస్థలు బాధలు పడుటకు,ఏ దుష్కర్మను, క్రిందటి జన్మలో జేసుకొన్నవోగదా యని, యెన్నడైనను మీలో, మీరు విమర్శించితిరా?

అట్టి క్రూరమైన, విషాదకరమైన భరింపశక్యముగాని, బాధలు, అవస్థలు, మనకు లేకుండుట, మనపూర్వజన్మ సుకృతమేకదా. మనము వెనుకటి జన్మలో జేసుకొన్న మంచికర్మలచేతనే, సుకృతముచేతనే, దుర్లభమైన మానవజన్మను పొంది యిప్పుడు, బాధలకు బదులు అన్ని సౌఖ్యములతో నిండియుంటిమి గదా! దుర్లభమైన, మానవజన్మను పొందియు దానిని దుర్వినియోగము జేయుచు పందులవలె, బురదలోపొర్లుచు, చివరకు

బంధములచే, కాళ్ళు నోరుగూడ బంధింపబడి, జీవితములను, గడపవలసివచ్చిన వారి, ప్రవృత్తి జీవితములు విషాదకరములుగదా!

రిక్షాలలోను, బండ్లమీద, కాళ్ళుమూతులు, కట్టబడి తీసుకొని వెళ్ళబడుచున్న పందుల విషాదస్థితిని, కర్రకుకట్టబడి శిరస్సును అనగా త్రాడుతో బిగింపబడిన మూతిని, భూమివైపు వ్రేలాడబడుచు, ఉక్కిరిబిక్కిరిగా అవస్థపడుచున్న యీ వరాహముల విచారకరమైన దుస్థితినిగాంచియైనను, ప్రవృత్తితో విషయవాసనలతో గడపుచున్న మానవులందరును. ప్రవృత్తి నుండి నివృత్తికి మేల్కొనెదరుగాక! ప్రవృత్తిపరుల జీవితములు విషాదకరము. కాళ్ళు తాళ్ళకు కట్టబడి బాధతో వ్రేలాడుచున్న జీవితములే. దేహవాసన అనెడి ఊబిలో పడియున్న వరాహములు కొన్ని, శాస్త్రవాసనలనెడి బురదలో తృప్తిపడియున్న వరాహములు కొన్ని, లోకవాసన యనెడి మాయలో మునింగియున్న వరాహములు మరికొన్ని లెక్కకు మీరి యుండుట విచారకరము.

మోక్షము, నిత్యశాంతి అన్నివాసనలకు అతీతముగా యున్నవారిదే!

ఒక పందియు, ఒక ఆవును యీ క్రింది రీతిగా సంభాషించుకొనుచుండెనట.

పంది :- నా జీవితమంతను, మానవకోటికి అర్పించి జీవించుచుంటిని. నేను చనిపోగానే నా మాంసమును, రక్తమును మానవులు వాడెదరు. నాచర్మమును గూడ వాడెదరు. నా కొవ్వునుగూడ వాడెదరు. నేను అన్ని రీతులగాను మానవులకు ఉపయోగంగాయున్నను నన్ను చాలహీనముగా జూచెదరేల? నిన్ను మానవులు యెంతయో గౌరతగా, పూజ్యభావనతో పూజించెదరేల? జెప్పుము. అని ప్రశ్నించెను.

అప్పుడు ఆవు దీర్ఘముగా ఆలోచించి యీ క్రిందిరీతిగా జెప్పెనట.

ఆవు : ఓ ప్రియమైన వరాహమా! నిన్ను హీనతగా జూచుటకు నన్ను పూజ్యభావనతో గౌరవించుటకు మన ఇద్దరిలో ఒక్కటే తేడాగలదు. అది యెద్దియనగా.

నీవు చనిపోయిన తర్వాత మానవులకు, ఉపయోగపడుచుంటివి. ఇక నేను, జీవించి యుండగనే మానవులకు నిత్యము నా పాలు నిచ్చుచు తోడ్పడుచుంటిని. ఇదియే ముఖ్యకారణమని నా దృఢమైన నమ్మకమని ఆ గోవు చెప్పగా, ఆ పంది కొంత చింతించుచు మరలదాని స్వధర్మమైన బురదలో మునింగి, ఆవు చెప్పిన సత్యవాక్యములను, సలహానుగూడ మరచి తృప్తిపడసాగెను.

ప్రియమైన సోదరీ, సోదర స్వరూపములారా! మీ జీవితములనుగూడ పరీక్షించుకొని జూచుకొనుడు. మీరు జీవించియుండగా మానవకోటికి సేవజేయుచుండిరా? లేక మీతదనంతరమునందు, మీ వీలులలో (wills) మీ ఆస్తులను దానధర్మములు చేయుమని వ్రాయుచుండిరా। మీరే తీవ్రమైన విమర్శనతో జూచుకొనుడు.

మీకు ఇప్పుడే, ఇచ్చటనే, నేడే, మానవసేవ జేయుచు, పూజ్యభావనతో, గౌరతతో నుండి జీవించవలెనన్న ఆవువలె, మీ సేవను జీవించియుండగనే జేయుడు. వరాహమువలె యుండవలెనన్న జీవించియుండగా పిల్లికైనా భిక్షము పెట్టకుండగా మీ ఆస్తులను, మీ శరీరములు హఠాత్తుగాపోయినతర్వాత, మీ పేరున దానధర్మములు చేయమని, మీ వారసులను కోరకుడు. కొందరు దీపముండగనే మేల్కొనక హఠాత్తుగా శరీరములు వదలుటచే, వారి ఆస్థులు ఏ వీలును వ్రాయనందున వారి సన్నిహితులు, బంధువులు, దెబ్బలాటలతో వాజ్యములతో కోర్టులకు యెక్కి విలువైన ధనమును, తాము తినజాలక, ఇతరులకు పెట్టక, బూడిదపాలుచేయబడుట గూడ మనము జూచుచునే యుంటిమి. అది చాలవిచారకరమైన స్థితిగదా, ఈ సందర్భములో శ్రీనృశింహ శతకములో, మరిఒక్క అనుభవనీయమైన పద్యము జ్ఞప్తికి వచ్చుచున్నది. గాన దాని నిచ్చుట మా పాఠకుల ఉప యోగార్థమై పొందుపర్చి మీ అందరి శాంతిని, వృద్ధిని జీవించియుండగనే కోరుచు విరమించగోరుచుంటిని.

సీ॥ వేమారు నీకథల్ వినుచునుండెడి వాఁడు
పరుల ముచ్చట మీఁద భ్రాంతిఁ బడడు
అగణితంబుగ నిన్నుఁ బొగడ నేర్చినవాఁడు
చెడ్డమాటల నోటఁజెప్పఁ బోఁడు
ఆసక్తిచేత నిన్ననుసరించెడి వాఁడు
ధన మదాంధుల వెంటఁ దగులఁ బోడు
సంతసంబున నిన్ను స్మరణఁ జేసెడివాఁడు
చెలఁగి నీచుల పేర్లు దలంప బోఁడు.

తే॥ నిన్ను నమ్మిన భక్తుఁడు నిశ్చయముగ
గోరి చిల్లరదైవముల్ గొల్వఁ బోడు
భూషణ వికాస శ్రీధర్మ పుర నివాస
దుష్ట సంహార నరసింహ దురితదూర.

లోకాస్సమస్తా స్సుఖినోభవంతు

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః !

(శాంతి జూలై 1962)